

'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 73

మంగళవారం 28-11-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



డేవిస్ కప్ విజేత ఇటలీ

స్పెయిన్‌లో జరిగిన టెన్నిస్ టోర్నీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాపై విజయం - 12లో



కార్ల ధరలకు రెక్కలు!

జాబితాలో మారుతీ, టాటా మోటార్స్, ఎంఅండ్‌ఎం, ఆడి ఇండియా - 13లో



గుజరాత్‌లో అకాల వర్షాలు

గుజరాత్‌లో అకాల వర్షాలు కురుస్తున్నాయి. వివిధ ప్రాంతాల్లో పిడుగులు పడటంతో 20 మంది వరకు చనిపోయారు.

వివరాలు 6లో ▸



'కాల్పుల విరమణ' పొడిగింపు

కాల్పుల విరమణ ఒప్పందాన్ని మరో రెండు రోజులపాటు పొడిగించడానికి ఇజ్రాయెల్, హమాస్ అంగీకరించాయి.

వివరాలు 6లో ▸



ఇమ్రాన్‌కు ఎదురు దెబ్బ

అల్-ఖదీర్ ట్రస్టు అవినీతి కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

వివరాలు 6లో ▸



'ప్రాఫెట్ సాంగ్'కు బుకర్ ప్రైజ్

ఐర్లాండ్ రచయిత పాల్ లించ్ రాసిన 'ప్రాఫెట్ సాంగ్' పుస్తకానికి ప్రతిష్టాత్మక బుకర్ ప్రైజ్–2023 లభించింది.

వివరాలు 6లో ▸

దిక్కుతోచని 'దేశం'

సీఎం జగన్ జనాదరణ చూసి చంద్రబాబు గ్యాంగ్‌లో కంగారు

హామీలన్నీ అమలు చేసి, అన్ని వర్గాలకు చేరువైన ముఖ్యమంత్రి

- సామాజిక సాధికార యాత్ర, వై ఏపీ నీడ్స్ జగన్‌కు జనం నీరాజనం
- ప్రజల ఆశీర్వాదంతో 175 స్థానాల్లో విజయానికి వైఎస్సార్‌సీపీ అడుగులు
- టీడీపీ గెలిచిన 23 స్థానాల్లోనూ బలమైన అభ్యర్థులను బరిలోకి దించుతున్న వైఎస్సార్‌సీపీ
- ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ ఖాయమంటున్న సర్వేలు
- వచ్చే ఎన్నికల్లో 2019 కంటే ఘోర పరాజయం తప్పదని పసుపుదండు ఆందోళన
- తెలుగుదేశం–జనసేన పొత్తుకు జనంలో కనిపించని స్పందన
- దీంతో ఓటమికి ఇప్పటి నుంచే సాకులు వెతుక్కుంటున్న టీడీపీ బ్యాచ్
- ఓట్లు తొలగిస్తున్నారంటూ పచ్చమీడియా విషపు రాతలు
- వాటిని పట్టుకుని రాద్ధాంతం చేస్తున్న బాబు, లోకేశ్, పవన్, పురందేశ్వరి



సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజల్లో విశ్వసనీయత సంపాదించినప్పుడే వారి ఆశీస్సులు కోరే హక్కు మనకు ఉంటుందని నమ్మి ఆ మార్గంలో పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోంది. వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రకు జనం బ్రహ్మరథం పడుతుండటం.. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఇంటింటా నీరాజనాలు పలుకుతుండటమే అందుకు తార్కాణం. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని టైమ్స్ నౌ వంటి పలు జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేల్లో కూడా వెల్లడయింది. దీంతో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. 2019 ఎన్నికల కంటే ఘోరంగా వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ ఓడిపోవడం ఖాయమని అగ్రనేతలకు అర్థమైంది. అందుకే ఉనికినైనా కాపాడుకోవడానికి పసుపుదండు విశ్వప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలోనే పచ్చ మీడియా నిత్యం ప్రభుత్వంపై దుష్ప్రచారానికి ఒడిగడుతోంది. అబద్ధాలను రోజూ పుంఖానుపుంఖాలుగా అచ్చేస్తోంది. టీడీపీ మద్దతుదారులను

మిగతా 3వ పేజీలో ▶

తాడిపత్రిలో సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



జన ప్రభంజనం

తాడిపత్రి, ఎచ్చెర్లలో సామాజిక సాధికార యాత్రలకు పోటెత్తిన బడుగు, బలహీన వర్గాల ప్రజలు

2 లో

- అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు
- ప్రభుత్వ సహకారంతో తాము సాధించిన అభివృద్ధిని వివరించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- ' మళ్లీ రావాలి జగన్ – మళ్లీ కావాలి జగన్' అంటూ హోరెత్తిన నినాదాలు

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేత కొమ్మారెడ్డి చలమారెడ్డి



పల్నాడు జిల్లాకు చెందిన టీడీపీ సీనియర్ నేత, మాచర్ల నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కొమ్మారెడ్డి చలమారెడ్డి సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

వివరాలు 2లో ▸

వ్యోమగామినవుతా



రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో తిరుపతికి చెందిన ఓ విద్యార్థిని వ్యోమగామి కావాలన్న తన కలను నెరవేర్చుకునే దిశగా ఓ అడుగు ముందుకేసింది. 'నాసా' అందిస్తున్న ఐఎఎస్‌పీ కోర్సును విజయవంతంగా పూర్తి చేసింది. ఈ అరుదైన అవకాశాన్ని ఉపయోగించుకునేందుకు సాయం చేసిన జగన్ ప్రభుత్వానికి రుణపడి ఉంటానని జోషిత పేర్కొంది.

వివరాలు 14లో ▸

శ్రీవారిని దర్శించుకున్న ప్రధాని మోదీ

2 లో

140 కోట్ల మంది భారతీయులు సంతోషంగా ఉండాలని శ్రీవారిని వేడుకున్నా: ప్రధానమంత్రి



తిరుమలలో శ్రీవారి ధ్వజస్తంభానికి మొక్కుతున్న ప్రధాని మోదీ

కాంతులీననున్న కొత్త సబ్‌స్టేషన్లు



- రాష్ట్ర విద్యుత్ రంగ చరిత్రలోనే తొలిసారిగా ఒకేరోజు 28 కేంద్రాలకు శ్రీకారం
- నేడు వర్చువల్ విధానంలో 16 సబ్‌స్టేషన్లకు సీఎం జగన్ శంకుస్థాపన, 12 సబ్‌స్టేషన్లకు ప్రారంభోత్సవం
- రూ.3,100 కోట్ల వ్యయంతో వీటిని ఏర్పాటు చేస్తున్న ఏపీ ట్రాన్స్‌కో
- కడపలో 750 మెగావాట్లు, అనంతపురంలో 100 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల నిర్మాణానికీ శంకుస్థాపన
- ఈ రెండు ప్రాజెక్టుల వల్ల 1,700 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

5 లో

ఫ్యాక్ట్‌చెక్

మేలెంచినా కీడెంచుతారా!?

- రైతులకు మంచి చేసే ప్రతిపాదనలపైనా రామోజీ విషం
- ఆర్థికశాఖ అభ్యంతరాలకూ వక్రభాష్యమా?
- ఫైల్ ఇంకా ఆర్థిక శాఖ పరిశీలనలోనే ఉంది కదా..
- అయినా సీఎంఓ ఒత్తిడితో ఆమోదం అని పచ్చి అబద్ధాన్ని అచ్చేస్తారా?.. ఇందులో వైఎస్సార్‌సీపీ నేతలకు ఎలా లబ్ధి చేకూరుతుంది?
- పేదల ఇళ్లకు 'మినహాయింపు'లను ఉచిత ఇసుకతో ఎలా పోలుస్తారు?
- పేదలు, రైతులకు మేలు చేసే అంశంపై 'ఈనాడు' రాజకీయం

13 లో

గంతలు కట్టుకొని 'గుంతల కథ'

చంద్రబాబు కోసం కళ్లు మూసుకొని అబద్ధాల కథనాలు

ప్రజలు అనుభవిస్తున్న చక్కటి రోడ్లు 'ఈనాడు'కు కనిపించవు

రోడ్లకు టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో పెట్టిన ఖర్చు రూ.23,792.19 కోట్లు

వైఎస్సార్‌సీపీ నాలుగేళ్లలోనే వెచ్చించింది రూ.42,236.28 కోట్లు

- వివరాలు 10లో

గిరులు.. తరులు.. భక్తమహోర్మురులై..

- ఘనంగా సత్యదేవుని గిరి ప్రదక్షిణ
- స్వామివారి వెంటన మహాప్రవాహంలా కదలిన భక్తులు
- 2 లక్షల మందికి పైగా రాక



గిరి ప్రదక్షిణలో భక్తజనసందోహం

అన్నవరం: కొండ ఎక్కి తన దర్శనానికి రాలేని భక్తుల కోసం.. తన గిరులపై జన్మ ఎత్తిన వృక్షాలు, పక్షులు, జంతువుల పాపాలు తొలగించేందుకు.. నిత్యం తనను పవిత్ర జలాలతో అభిషేకించే పంపా నదికి.. తన దర్శన భాగ్యం కలిగించేందుకు దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీ దేవితో కలసి స్వయంగా ఆ రత్నగిరి వాసుడు సత్యదేవుడే కదిలాడు. లక్షలాదిగా భక్తులు వెంట రాగా.. పౌర్ణమి పర్వదినం కలసి వచ్చిన కార్తిక సోమవారం నిర్వహించిన సత్యదేవుని గిరి ప్రదక్షిణ నభూతో.. అన్న రీతిలో సాగింది. రాష్ట్రం నలుమూలల నుంచీ రెండు లక్షల మందికి పైగా భక్తులు తరలిరావడంతో.. అన్నవరంలో ఆధ్యాత్మిక తరంగం ఎగసిపడింది. సుమారు ఐదు గంటల పాటు సాగిన ఈ గిరి ప్రదక్షిణ 11 కిలోమీటర్ల మేర సాగింది. రత్నగిరి తొలి పావంచా నుంచి, కార్యక్రమం ముగిసిన పంపా ఘాట్ వరకూ 11 కిలోమీటర్ల మేరా గిరి ప్రదక్షిణ మార్గం ఇసుక వేస్తే రాలని రీతిలో మహాభక్తజన ప్రవాహాన్ని తలపించింది. స్వామి, అమ్మవారి పల్లకీ పంపా ఘాట్‌కు చేరిన తరువాత కూడా రెండు గంటల వరకూ భక్తులు వస్తూనే ఉన్నారు. ఒకవైపు పంపా నది, మరోవైపు పచ్చని కొండల నుంచి వచ్చే చల్లని గాలితో గిరి ప్రదక్షిణ ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగింది. స్వామివారి పల్లకీకి ఇరువైపులా చెరో మూడు కిలోమీటర్ల మేర భక్తులు 'సత్యనారాయణ, లక్ష్మీనారాయణ' అంటూ స్వామివారి నామాన్ని భక్తితో జపిస్తూ ముందుకు సాగారు.

ప్రదక్షిణ జరిగిందిలా..

గిరి ప్రదక్షిణలో పాల్గొనేందుకు వేలాదిగా భక్తులు ఉదయం ఆరు గంటలకే చేరుకోవడంతో తొలి పావంచా వద్ద తీవ్ర రద్దీ ఏర్పడింది. ఉదయం 7.30 గంటలకు సత్యదేవుడు, అమ్మవార్లను మేళతాళాల నడుమ రత్నగిరి నుంచి కొండ దిగువన ఉన్న తొలి పావంచా వద్దకు పల్లకీ మీద ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్ర మోహన్, అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు కొబ్బరి కాయలు కొట్టి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. అయ్యప్ప దీక్షధారులు, సత్యస్వాముల భజనలు, కోలాట నృత్యాలు, మహిళల భక్తిగీతాలాపనల నడుమ.. ముందు పల్లకీ మీద సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులు.. ఆ వెనుక సత్యరథం, భక్తులు తరలిరాగా గిరి ప్రదక్షిణ కోలాహలంగా ఆరంభమైంది.

అన్నవరం మెయిన్ రోడ్డు మీదుగా బెండపూడి సమీపంలోని పుష్కర కాలువ వద్దకు ఉదయం 10 గంటలకు చేరుకున్న సత్యదేవునికి వేలాదిగా భక్తులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి పుష్కర కాలువ వెంబడి పంపా తీరం వరకూ గిరి ప్రదక్షిణ సాగింది. మధ్యలో మూడుచోట్ల స్వామి, అమ్మవార్లకు భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఆ ప్రదేశాల్లో పల్లకీలో ఉన్న స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పండితులు పూజలు చేశారు. ఉదయం 11.30 గంటలకు గిరి ప్రదక్షిణ పంపా ఘాట్‌కు చేరిన తర్వాత స్వామి, అమ్మవార్లకు పండితులు ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా రత్నగిరికి చేర్చారు. కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్, దేవస్థానం వేద పండితులు యనమంద్ర శర్మ, గంగాధరభట్ల గంగబాబు, ముష్టి పురుషోత్తం అవధాని, చిట్టి శివ ఘనపాఠి, సంతోష్ ఘనపాఠి, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, ఇతర అర్చకస్వాములు, సిబ్బంది పాల్గొన్నారు.



సిరీస్ విజయమే లక్ష్యంగా..

గువాహటి వేదికగా ఆస్ట్రేలియాతో మంగళవారం జరిగే మూడో టి20 మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా టీమిండియా బరిలోకి దిగుతోంది. మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సిరీస్‌ను 3–0తో కైవసం చేసుకోవాలని భావిస్తోంది. మరోవైపు ఆస్ట్రేలియా ఈ సిరీస్‌లో నిలవాలంటే కచ్చితంగా గెలవాల్సిన పరిస్థితిలో ఉంది.

12 లో

అంబేడ్కర్ స్మృతివనం చరిత్రాత్మకం


సామాజిక న్యాయ స్ఫూర్తికి ఇది ప్రతిబింబం

- రాజ్యాంగ ఔన్నత్యం, ప్రజాస్వామ్య విలువలకు ప్రేరణ
- విజయవాడలోని స్వరాజ్ మైదానంలో అంబేడ్కర్ స్మృతివనం నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమీక్ష
- ప్రారంభించే నాటికి ఒక్క పని కూడా పెండింగ్ ఉండకూడదని ఆదేశం
- జనవరి 24 నాటికి ప్రారంభించేలా పనులు పూర్తిచేస్తామని అధికారుల వెల్లడి

13 లో



"అంబేడ్కర్ స్మృతివనం నిర్మాణం చరిత్రాత్మకమైనది. ఇది అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు. సామాజిక న్యాయ స్ఫూర్తికి ప్రతిబింబంగా నిలిచే ప్రాజెక్టు ఇది. రాజ్యాంగ ఔన్నత్యం, ప్రజాస్వామ్య విలువలకు ప్రేరణగా నిలిచే గొప్ప కట్టడం ఇది. నిర్దేశించుకున్న గడువులోగా అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం నిర్మాణ పనులు పూర్తిచేయాలి." - సీఎం వైఎస్ జగన్



శరవేగంగా సొరంగం డ్రిల్లింగ్ పనులు

ఉత్తరాఖండ్‌లోని సిల్‌క్యారా సొరంగంలో చిక్కుకున్న 41 మంది కార్మికులను కాపాడేందుకు కొండపై భాగంలో మొదలెట్టిన డ్రిల్లింగ్ శరవేగంగా కొనసాగుతోంది. 86 మీటర్ల లోతు తవ్వాల్సి ఉండగా 32 మీటర్ల మేర డ్రిల్లింగ్ పూర్తయిందని జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ తెలిపింది.

- వివరాలు 6లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2019లో ఎన్నికలకు ముందు ప్రకటించిన మేనిఫెస్టోను.. ఎన్నికల్లో గెలిచి, ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన క్షణం నుంచే మనసా వాచా ఆచరణలోకి తీసుకురావటం మొదలుపెట్టారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఆడిన మాట తప్పలేదు. ఆరంభించిన ఏ పథకాన్నీ ఆపలేదు. ఫలితంగా రాష్ట్రంలో కోట్లాది మందికి నవరత్న పథకాలు అండగా నిలిచాయి. చిన్నారులు మొదలు పండు ముదుసలి వరకు అందరూ ఆనందంగా జీవించేలా వనరులు సమకూరుతున్నాయి. కనీస అవసరాలైన కూడు, గూడు, ఆరోగ్యానికి ధోకా లేదనే విషయం ఊరూరా కళ్లకు కడుతోంది. పేదల జీవిత కాల కల అయిన 'సొంతిల్లు' సాకారం కావడంతో కొత్తగా ఊళ్లకు ఊళ్లే వెలుస్తుండటం కనిపిస్తోంది. అక్కచెల్లెమ్మలు సొంత కాళ్లపై నిలబడేలా చేయూత, ఆసరా అండగా నిలుస్తోంది. పేదింటి పిల్లలకు పెద్ద చదువులు.. విదేశీ విశ్వవిద్యాలయాల్లో సైతం చదివేందుకు రాచబాట సిద్ధమైపోయింది. అన్నదాతకు వ్యవసాయం పండుగగా మారింది. వెరసి నవరత్నాల వెలుగులు ప్రతి ఊళ్లోనూ ప్రసరిస్తున్నాయి. సీఎం వైఎస్ జగన్ తపన, తాపత్రయం, ఆకాంక్ష ఫలించిన తీరు లబ్ధిదారుల మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఆరోగ్యశ్రీ లేకుంటే ఏమయ్యేదాన్నో!



మేము ప్రకాశం జిల్లా బేస్తవారిపేటలోని బీజీ కాలనీలో ఉంటున్నాం. గతంలో చేనేత పని చేస్తూ జీవించేవాళ్లం. నాకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. ముగ్గురికీ వివాహమైంది. ప్రైవేటు బస్సులో క్లీనర్‌గా పనిచేసే నా కుమారుడు వెంకటేశ్వర్లుకు అనారోగ్య సమస్యలు తలెత్తి కాలు తీసేయాల్సి వచ్చింది. చెట్టంత కొడుక్కు కాలు తీసేయడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉండిపోయాం. కుటుంబం రోడ్డున పడిపోయింది. చివరికి కుటుంబ భారం మొత్తాన్నీ నేనూ, నా కోడలు సునీత మోస్తున్నాం. ఏదోలా సంసారాన్ని నెట్టుకొస్తున్న సమయంలో నాకు రెండేళ్ల కిందట తీవ్రంగా సుస్తీ చేసింది. గుండె ఆపరేషన్ చేయించాలని వైద్యులు చెప్పారు. దీంతో నేను వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు వెళ్లాను. అక్కడ వాళ్లు ఆపరేషన్ ఖర్చు రూ.5 లక్షలవుతుందన్నారు. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితుల్లో ఆపరేషన్ కోసం రూ.5 లక్షలు ఎక్కడి నుంచి తేగలను? నేను మరింత కుంగిపోయాను. నాకేమైనా జరిగితే అంగవైకల్యంతో ఉన్న నా కుమారుడి గతి ఏమవుతుందోనని మరింత బెంగ పట్టుకుంది. ఆ సమయంలో ఆరోగ్య శ్రీ నాకు కొండంత ధైర్యాన్నిచ్చింది. ఉచితంగా ఆపరేషన్ చేశారు. ఇప్పుడు నేను ఆరోగ్యంగా ఉన్నా. ప్రభుత్వం కల్పించిన చేయూత, ఆసరా, వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాలు నాకూ వర్తించాయి. మూడు విడతలుగా చేయూత రూ.56,250 వచ్చింది. వైఎస్సార్ ఆసరా కింద రూ.31,800 లబ్ధి చేకూరింది. నేతన్న నేస్తంలో భాగంగా రూ.72 వేలు వచ్చాయి. డబ్బులతో చిల్లర కొట్టు పెట్టుకున్నాను. పచ్చళ్లు తయారు చేసి అమ్ముతున్నా. నెలకు రూ.20 వేల ఆదాయం వస్తోంది.

– తిరుపతమ్మ
(పి.హనుమంతరెడ్డి, విలేకరి, బేస్తవారిపేట)

రుణమాఫీతో ఆర్థిక ఆసరా



మేము విశాఖపట్నం నగరంలోని అక్కయ్యపాలెం అబిద్‌నగర్ కాలనీలో ఉంటున్నాము. గత ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చినా చెయ్యలేదు. కానీ జగనన్న ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసి నాలాంటి పేద కుటుంబాలకు ఆర్థికంగా ఆసరా కల్పించారు. నేను, నా భర్త, ఇద్దరు పిల్లలతో బతుకుదెరువుకోసం సాలూరు నుంచి విశాఖకు వలస వచ్చాము. అబిద్‌నగర్‌లో నా భర్త అపార్టుమెంట్ వాచ్‌మేన్‌గా పని చేస్తున్నాడు. ఇద్దరు పిల్లల్లో ఒకరిని ఐటీఐ, మరొకరిని ఇంటర్ చదివిస్తున్నాము. 2014 నుంచి 44వ వార్డు బిస్మిల్లా ఎంపీఎస్ గ్రూప్‌లో సభ్యురాలుగా కొనసాగుతున్నాను. అప్పట్లో గ్రూప్‌లో ఒకొక్కరికి రూ.50 వేల చొప్పున డ్వాక్రా రుణం ఇచ్చారు. అందులో కొంత వరకు నెలనెలా కట్టాను. సీఎం జగన్ నవరత్నాల పథకాల్లో భాగంగా వైఎస్సార్ ఆసరా పథకం కింద 2019 ఏప్రిల్ నాటికి ఉన్న డ్వాక్రా రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తున్నట్టు ప్రకటించారు. ఆ వార్త విన్నాక చాలా సంతోషం కలిగింది. ఆసరా పథకం వల్ల నాకు రూ.25,465 వరకు రుణ మాఫీ అయ్యింది. విడతకు రూ.6,366 చొప్పున మూడు విడతల రుణం మాఫీ అయ్యింది. వాచ్‌మేన్‌గా మాకు ఆదాయం అంతంత మాత్రమే. అటువంటి సమయంలో ఆసరా పథకం కింద రుణమాఫీ జరగడం మా కుటుంబానికి చాలా వరకు ఆర్థిక భారం తప్పింది. ఐదు నెలల కిందట మళ్లీ మా గ్రూపునకు ఏడున్నర లక్షల రుణం మంజూరైంది. ఒక్కో సభ్యురాలికి రూ.75 వేల రుణం లభించింది. సున్నా వడ్డీ కింద రూ.2,539 నాలుగు విడతలుగా జమ అయింది. కరోనా సమయంలో పనులు లేక, ఆదాయం లేక ఇంటి పట్టున ఉంటున్న సమయంలో సున్నా వడ్డీ జమ కావడంతో మా కుటుంబాన్ని ఆర్థికంగా చాలా ఆదుకుంది.

– ఎస్.రవణమ్మ, డ్వాక్రా సభ్యురాలు
(బి.అనితా రాజేష్, విలేకరి, సీతంపేట, విశాఖపట్నం)

అప్పుచేసే బాధ తప్పింది



మాది అనకాపల్లి జిల్లా చోడవరం మండలం పీఎస్‌పేట గ్రామం. మా కుటుంబం పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తోంది. మా తాత, తండ్రుల నుంచి వ్యవసాయమే జీవనాధారం. మా పొలాల పక్కనే పెద్దేరు నది పారుతుండటంతో నీటికి ఇబ్బంది లేదు. అందుకే వరి, చెరకు పంటలు వేస్తుంటాము. నాకు ఒకటిన్నర ఎకరం పొలం ఉంది. ఏటా 70 సెంట్లలో వరి, 80 సెంట్లలో చెరకు వేస్తుంటాను. ఈ ఏడాది కూడా వరి, చెరకు పంటలు వేశాను. వరికి ఉడుపుల నుంచి కోతలు వరకు సుమారు రూ.10 వేల వరకు ఖర్చవుతుంది. ఈ మొత్తం ఖర్చు అంతా నేనే భరించాల్సి వచ్చేది. అప్పు చేసి పంటకు పెట్టుబడి పెట్టేవాడిని. ఒక్కోసారి తుపాన్లు వచ్చినప్పుడు పంట పూర్తిగా నష్టపోయి పెట్టుబడి కూడా వచ్చేది కాదు. ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దయవల్ల నాలుగేళ్లుగా వ్యవసాయానికి పెట్టుబడి సాయంగా ఏటా రూ.13,500 చొప్పున అందుతోంది. ఈ సొమ్ము ప్రభుత్వం ఇవ్వడం వల్ల నాకు అప్పులు చేసే బాధ తప్పింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ మొదలై ఇప్పుడు వరి పంట వెన్ను దశలో ఉంది. ఇది పెట్టుబడులు పెట్టే అదును. ఈ సమయంలో రైతు భరోసా కింద మొదటి విడతగా రూ.4 వేలు ఇటీవలే నా ఖాతాలో పడ్డాయి. ఇప్పుడు పొలానికి ఎరువులు, మందులు, కలుపు పనులు చేయించాల్సి ఉంది. ఈ రైతు భరోసా డబ్బులు నాకే కాదు రైతులందరికీ ఎంతో ఉపయోగపడ్డాయి.

– గొలగాని ఎరుకునాయుడు
(కొప్పాక భాస్కర్‌రావు, విలేకరి, చోడవరం)

తాడిపత్రిలో జనహోరు

- సామాజిక సాధికార బస్సు యాత్రకు పోటెత్తిన బడుగు, బలహీన వర్గాల ప్రజలు
- జనపత్రిగా మారిన తాడిపత్రి
- 'మళ్లీ రావాలి జగన్–కావాలి జగన్' అంటూ సభలో హోరెత్తిన నినాదాలు



అనంతపురం జిల్లా తాడిపత్రి సామాజిక సాధికార సభకు తరలివచ్చిన అశేష జనవాహినిలో ఓ భాగం

అనంతపురం ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందించిన చేయూతతో సాధికారత సాధించిన బడుగు, బలహీన వర్గాలు సోమవారం అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో 'సామాజిక సాధికార బస్సు యాత్ర' చేశాయి. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో తాడిపత్రి జనపత్రిగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రధాన రోడ్డు వేలాది ప్రజలతో కిక్కిరిసింది. ముందుగా పట్టణంలోని కూరగాయల కొత్త మార్కెట్ ఎదురుగా ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిరావుపూలే విగ్రహాన్ని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి కారుమూరు నాగేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం భగత్‌సింగ్ నగర్ నుంచి ప్రారంభమైన బస్సు యాత్ర సీబీ రోడ్డు మీదుగా వైఎస్సార్ సర్కిల్ వరకు సాగింది. మధ్యలో సిద్దిబాషా దర్గాలో ప్రార్థనలు చేశారు. దారిపొడవునా బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అనంతరం తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో వేలాదిమంది పాల్గొన్నారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకుంటున్న చర్యలను ప్రజాప్రతినిధులు, నేతలు వివరించినప్పుడు ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. 'మళ్లీ రావాలి జగన్ – కావాలి జగన్' అంటూ నినాదాలతో హోరెత్తించారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు మాకే ఉంది : మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

నాలుగున్నరేళ్లలో సామాజిక న్యాయం చేసి నిరూపించిన సీఎం వైఎస్ జగన్ అని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు. బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు వైఎస్సార్‌సీపీ నేతలకే ఉందన్నారు. సామాజిక న్యాయం జరగాలని, పేదవాడు పేదవాడిగానే ఉండిపోకూడదని, పేదల కుటుంబాల్లోనూ డాక్టర్లు, ఇంజినీర్లు కావాలని సీఎం వైఎస్ జగన్ పూర్తిస్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చారని తెలిపారు. సీఎం జగన్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ దూసుకుపోతోందని అన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పల్లకీ మోసిన జగన్‌ను మళ్లీ గెలిపిద్దాం: మంత్రి ఉషశ్రీచరణ్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పల్లకీ మోశారని, మరోసారి ఆయన్నే ముఖ్యమంత్రిని చేసుకోవాలని మంత్రి ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. బడుగు, బలహీన వర్గాలను గుర్తించి రాజకీయ ప్రాధాన్యత ఇచ్చిన గొప్ప వ్యక్తి వైఎస్ జగన్ అని చెప్పారు. 139 బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు, బీసీల్లో పుట్టాం అని గర్వంగా చెప్పుకునేలా చేశారని తెలిపారు. సీఎం జగన్ అగ్రకులంలో పుట్టినా బీసీ కుల గణనకు శ్రీకారం చుట్టారని కొనియాడారు.

సామాజిక న్యాయం చేసిన సీఎం జగన్ : ఎంపీ తలారి రంగయ్య

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని రంగాల్లో అత్యధిక ప్రాధాన్యం కల్పించి, సామాజిక న్యాయం చేసిన సీఎం జగన్ అని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య చెప్పారు. రాయలసీమలో మొత్తం 8 ఎంపీ స్థానాలు ఉంటే 5 స్థానాలు బీసీ, ఎస్సీలకు ఇచ్చారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున బీసీ, ఎస్సీలకు ఏ పార్టీ టికెట్లు ఇవ్వలేదన్నారు.

రాష్ట్రానికి జగన్ అవసరం చాలా ఉంది: ఎంపీ నందిగం సురేష్

పేదలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఈ రాష్ట్రానికి ఉందని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ చెప్పారు. సీఎం జగన్ అతి సామాన్యమైన వ్యక్తులను పైసా ఖర్చు లేకుండా ఎంపీలుగా చేశారని, వారిలో తాను ఒకడినని అన్నారు.

సీఎం జగన్‌ను గుండెల్లో పెట్టుకుంటాం: ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను గుండెల్లో పెట్టుకుంటామని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ చెప్పారు. ఈ వర్గాలను సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా నిలబెట్టేందుకు సీఎం జగన్ అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

సాధికారతను చాటిన ఎచ్చెర్ల

- సామాజిక సాధికార యాత్రలో జన ప్రభంజనం
- అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు
- తాము సాధించిన అభివృద్ధిని వివరించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు



శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల సామాజిక సాధికార సభకు తరలివచ్చిన అశేష జనసందోహంలో ఓ భాగం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఎచ్చెర్ల ప్రజలు సామాజిక సాధికారతను ఎలుగెత్తి చాటారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన అండదండలతో సాధించిన అభివృద్ధిని వివరిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు నియోజకవర్గమంతా కలియదిరిగారు. సోమవారం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలో జరిగిన వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్ర ఆద్యంతం పండుగ వాతావరణంలో జరిగింది. రణస్థలం నుంచి చిలకపాలెం – పొందూరు రోడ్డు వరకు 15 కిలోమీటర్లు సాగిన బస్సు యాత్రకు జనం బ్రహ్మరథం పట్టారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జై జగన్ అంటూ యువత నినాదాలతో హోరెత్తించారు. నియోజకవర్గంలోని రణస్థలం, లావేరు, జి.సిగడాం, ఎచ్చెర్ల మండలాల నుంచి బడుగు, బలహీన వర్గాల ప్రజలు వెల్లువలా తరలివచ్చారు. అనంతరం చిలకపాలెంలో జరిగిన బహిరంగ సభకు ఇసకేస్తే రాలనంతగా ప్రజలు హాజరయ్యారు.

అన్ని కులాలకు సమాన హక్కులు కల్పిస్తున్న సీఎం జగన్: స్పీకర్ తమ్మినేని సీతారాం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి రోజు నుంచే రాష్ట్రంలో అన్ని కులాలకు సమాన హక్కులు కల్పిస్తున్నారని అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం చెప్పారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వంటి కులాలకు జరుగుతున్న అన్యాయాలను గుర్తించి, వారికి రాజ్యాధికారాన్ని, సంపదను అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 139 కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటికి చైర్మన్లను, 700 మంది డైరెక్టర్లను నియమించారన్నారు. అనేక పథకాలు, అంతర్జాతీయ స్థాయి విద్య, అధునాతన వైద్యాన్ని అందిస్తున్నారని వివరించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అక్కున చేర్చుకున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ అని మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పారు. కరోనా సమయంలో గుజరాత్‌కు వలస వెళ్లిన 4,500 మంది మత్స్యకారులను ప్రత్యేక బస్సుల్లో సురక్షితంగా జిల్లాకు తెచ్చామని, 24 మంది మత్స్యకారులను పాకిస్థాన్ నుంచి విడిపించామని చెప్పారు. బీసీలు జడ్జీలుగా ఉండకూడదని కేంద్ర న్యాయ శాఖకు లేఖ రాసిన ఘనత చంద్రబాబుదన్నారు. ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలను అవహేళన చేసిన చంద్రబాబుకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న పవన్ అప్పట్లో చంద్రబాబు పాలనను ఎందుకు విమర్శించలేదని ప్రశ్నించారు.

జగనన్న బలం చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పరిపాలన వికేంద్రీకరణ ద్వారా సుపరిపాలన సాధ్యమవుతుందన్నారు. దేశానికి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఆదర్శంగా నిలిచాయన్నారు.

తన పని తీరు నచ్చితేనే ఓటు వేయమని అడగగలిగే ఏకైక సీఎం వైఎస్ జగన్ అని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. సీఎం జగన్ అన్ని కులాలకు న్యాయం జరిగేలా ఉప ముఖ్యమంత్రులు, మంత్రి పదవులు, నామినేటెడ్ పదవులను ఇచ్చారని తెలిపారు. సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశ చరిత్రలో ఎన్నడూ లేవని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తెలిపారు. కులం, మతం, ప్రాంతం, లంచం, వివక్షకు తావు లేకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ప్రయోజనాలు అందాయన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు మాత్రమే అసంతృప్తిగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యేలు కంబాల జోగులు, రెడ్డి శాంతి, బడ్డుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, వరుదు కల్యాణి, నర్తు రామారావు, పెనుమత్స సురేష్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, మాజీ ఎమ్మెల్యే మీసాల నీలకంఠం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు పెంచారు: మంత్రి ధర్మాన

సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. సీఎం జగన్ విశాఖను రాజధాని చేయాలనుకుంటుంటే టీడీపీ మాత్రం అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తోందని విమర్శించారు. విశాఖను రాజధాని చేస్తే ఇక్కడ ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.



సాధికార యాత్రలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీవారిని దర్శించుకున్న ప్రధాని మోదీ

సాక్షి, తిరుపతి: ప్రధాని నరేంద్రమోదీ సోమవారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనార్థం ప్రధాని మోదీ ఆదివారం రాత్రి తిరుమలకు చేరుకున్న విషయం తెలిసిందే. ప్రధానమంత్రి సోమవారం ఉదయం 9 గంటలకు మహాద్వారం వద్దకు చేరుకోగా, అర్చకులు, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి, వేదపండితులు ఆలయ మర్యాదలతో వేదమంత్రోచ్ఛారణ నడుమ ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. మహాద్వారం నుంచి ఆలయంలోనికి ప్రవేశించిన ప్రధాని ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకున్నారు. అనంతరం బంగారు వాకిలి ద్వారా గర్భగుడిలోకి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారి వైభవం, ప్రాశస్త్యం గురించి ప్రధానికి ఆలయ ప్రధాన అర్చకులు వివరించారు. ఆలయ జీయర్లు శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించారు. అనంతరం వకుళామాతను ప్రధాని దర్శించుకున్నారు. అక్కడి నుంచి విమాన ప్రాకారం మీదుగా విమాన వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని హుండీలో కానుకలు సమర్పించారు. ఆ తర్వాత వెండివాకిలి మీదుగా వెలుపలకు వచ్చిన ప్రధాని ధ్వజస్తంభాన్ని మొక్కారు. అనంతరం రంగనాయక మండపంలో ప్రధానికి వేద పండితులు ఆశీర్వచనం పలకగా, భూమన కరుణాకరరెడ్డి, ధర్మారెడ్డి తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, టీటీడీ 2024 క్యాలెండర్, డైరీ, పంచగవ్యాలను అందజేశారు. అక్కడి నుంచి అతిథి గృహానికి చేరుకున్న ప్రధాని కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం అల్పాహారాన్ని స్వీకరించారు. ప్రధాని నరేంద్రమోదీ శ్రీవారిని దర్శించుకోవడం ఇది నాలుగోసారి. కాగా, తిరుమల శ్రీవారి దర్శనం సందర్భంగా 140 కోట్ల మంది భారతీయులకు మంచి ఆరోగ్యం, శ్రేయస్సు, అభివృద్ధి కలగాలని తిరుమల వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రార్థించానని మోదీ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో వెల్లడించారు.



ప్రధాని మోదీకి తీర్థప్రసాదాలు అందిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

ప్రధానికి సాదర వీడ్కోలు

శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ రోడ్డుమార్గాన రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరివెళ్లారు. విమానాశ్రయంలో మోదీకి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, తిరుపతి జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి వీడ్కోలు పలికారు.

నేడు నెల్లిమర్ల, కైకలూరులో సామాజిక సాధికార యాత్ర

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను సాధికారత దిశగా నడిపించిన వైనాన్ని, వారికి చేసిన మేలును వివరించడానికి వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర మంగళవారం విజయనగరం జిల్లాలో నెల్లిమర్ల, ఏలూరు జిల్లాలో కైకలూరు నియోజకవర్గాల్లో జరుగుతుంది.

ఆర్థిక శాఖలో డేటా విశ్లేషణ యూనిట్

- ఆర్థిక శాఖ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: ఆదాయార్జన శాఖల్లో రాబడి లీకేజీలను గుర్తించడం, రాబడి పెంచే మార్గాలను గుర్తించడమే లక్ష్యంగా ఆర్థిక శాఖలో డేటా విశ్లేషణ యూనిట్(డీఏయూ)ను ఏర్పాటు చేస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ ఉత్తర్వులిచ్చారు. ఆంధ్రప్రదేశ్ సెంటర్ ఫర్ ఫైనాన్సియల్ సిస్టమ్ అండ్ సర్వీసెస్ పరిధిలో డీఏయూ పనిచేస్తుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. డేటా విశ్లేషణ యూనిట్‌కు అవసరమైన ఆయా రంగాల్లో అనుభవం గల వారిని డేటా విశ్లేషణకు బృందంగా నియమించాల్సిందిగా పేర్కొన్నారు. తొలుత ఆదాయార్జన శాఖలైన వాణిజ్య పన్నులు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, రవాణా తదితర శాఖల్లో డేటా విశ్లేషణ ద్వారా రాబడి లీకేజీలను గుర్తించి వాటిని అరికట్టడంతో పాటు రాబడి మార్గాలను గుర్తించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా ప్రజాధనాన్ని ఖర్చు చేస్తోంది. అనవసరమైన వ్యయాలను గుర్తించడంతో పాటు.. చేస్తున్న వ్యయం ద్వారా మెరుగైన ఫలితాలు వచ్చేలా డేటా విశ్లేషణ చేసి మరీ ఈ యూనిట్ సూచిస్తుంది. ఇతర శాఖల కోరిక మేరకు ఆయా శాఖల డేటా విశ్లేషణలనూ చేపడుతుంది. డేటా విశ్లేషణ యూనిట్‌కు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన సలహా కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, ఇద్దరు కార్యదర్శులను సీఎస్ నామినేట్ చేస్తారు. ముగ్గురు నిపుణులను సభ్యులుగా నియమిస్తారు. ఈ కమిటీ డేటా విశ్లేషణ యూనిట్‌కు వ్యూహాత్మక ఉన్నతస్థాయి మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. ఆర్థిక శాఖ కార్యదర్శి అధ్యక్షతన కార్యనిర్వాహక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఏ ఏ ప్రాజెక్టులను చేపట్టాలో డేటా విశ్లేషణ యూనిట్‌కు సూచిస్తుంది.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ సీనియర్ నేత కొమ్మారెడ్డి చలమారెడ్డి



కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: పల్నాడు జిల్లాకు చెందిన టీడీపీ సీనియర్ నేత, మాచర్ల నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కొమ్మారెడ్డి చలమారెడ్డి సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. చలమారెడ్డికి సీఎం వైఎస్ జగన్ కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయనతోపాటు టీడీపీ నేతలు కె.శ్రీనివాసరెడ్డి, కె.రామచంద్రారెడ్డి, కె.వెంకటేశ్వరరెడ్డి, కె.షణ్ముక్‌రెడ్డి, వి.శంకర్ కూడా సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఐఐటీఎఫ్‌లో ఏపీ పెవిలియన్‌కు కాంస్య పతకం

- అవార్డు అందుకున్న అధికారులు



సాక్షి, న్యూఢిల్లీ: ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫేర్ – 2023 (ఐఐటీఎఫ్)లో ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌కు కాంస్య పతకం లభించింది. ఈ నెల 14 నుంచి ఢిల్లీ ప్రగతి మైదాన్‌లో జరుగుతున్న ఈ అంతర్జాతీయ వాణిజ్య సదస్సు సోమవారం ముగిసింది. ఇందులో ఏపీ పెవిలియన్ మూడో స్థానం సాధించింది. పెవిలియన్ డైరెక్టర్ ఎం. సుధాకర్, ఏపీ భవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్ హిమాన్షు కౌశిక్‌లతో కలసి ఏపీ పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ జి.ఎస్.రావు ఈ అవార్డును అందుకున్నారు. ట్రేడ్ ఫేర్‌లో ఏపీకి చెందిన స్టాల్స్ చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న 'వసుధైక కుటుంబం' థీమ్

'వసుధైక కుటుంబం' థీమ్‌తో వాణిజ్యం, మౌలిక వసతుల కల్పన, పురోగతి, నైపుణ్యం, ఆర్థిక సామర్థ్యం ప్రతిబింబించేలా ఏపీలో తయారయ్యే ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శనలో ఉంచారు. 12 ప్రభుత్వ, 18 ప్రైవేటు స్టాల్స్ ఏర్పాటు చేశారు. రాష్ట్రం నుంచి వివిధ దేశాలకు ఎగుమతయ్యే ఉత్పత్తుల వివరాలు, వివిధ రంగాల్లో ప్రగతి, ప్రభుత్వ పాలసీలు సైతం సందర్శకులను ఆకట్టుకునేలా ప్రదర్శనలో ఉంచారు. పరిశ్రమల శాఖ, వాణిజ్య ఎగుమతుల శాఖ, మౌలిక సదుపాయాల కల్పన సంస్థ, మారిటైం బోర్డు, పర్యాటక శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ఆప్కో, గిరిజన కార్పొరేషన్, లేపాక్షి వంటివి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రైవేటు రంగం నుంచి చెక్క బొమ్మలు, ఉదయగిరి కట్లెరీ, పచ్చళ్లు, ఇంట్లో తయారు చేసిన ఆహార పదార్థాలు, మామిడి తాండ్ర, మంగళగిరి చీరలు, నర్సాపురం లేస్, ఏలూరు తివాచీలు, ఆత్రేయపురం పూతరేకులు, పెడన కలంకారీ, శ్రీకాళహస్తి పెన్ కలంకారీ, నిమ్మలకుంట తోలుబొమ్మలు, వివిధ రకాల చీరల స్టాల్స్ ఏర్పాటుచేశారు. ఈ ప్రదర్శనలో పాల్గొనడం ద్వారా తమ ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో ఆదరణ రావడంతో పాటు అమ్మకాల కోసం బల్క్ ఆర్డర్లు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

నాడు–నేడును ప్రతిబింబించేలా..

'నాడు–నేడు' కార్యక్రమాన్ని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామ, వార్డు సచివాలయాలు, ఇంగ్లిష్ మీడియం స్కూల్స్, పశు వైద్యశాల, పాడి పరిశ్రమ, రైతు భరోసా కేంద్రాలు వంటివి ఏర్పాటు చేశారు. వీటి వద్ద సందర్శకులు సెల్ఫీలు తీసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. మరో పక్క ఫిషింగ్ హార్బర్, పారిశ్రామిక వాడలు, ఓడ రేవులు వంటి నమూనాలు ఆకట్టుకున్నాయి.

క్లుప్తంగా...

బీటెక్ రవి రిమాండ్ పొడిగింపు

కడప అర్బన్: టీడీపీ మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి అలియాస్ బీటెక్ రవి రిమాండ్ గడువును డిసెంబర్ 11 వరకు పొడిగిస్తూ సోమవారం కడపలోని జిల్లా కోర్టు ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీచేశారు. వల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో ఈ నెల 14న అరెస్టయిన బీటెక్ రవిని అదేరోజు రాత్రి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా, 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ క్రమంలో సోమవారం ఆయనను పోలీసులు కడప కోర్టులో హాజరుపరిచారు. ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ మరో 14 రోజులపాటు రిమాండ్‌ను పొడిగించారు. కాగా, బెయిల్ పిటిషన్‌పై జరగాల్సిన విచారణ మంగళవారానికి వాయిదా పడింది.

అంతర్వేది రథం ఘటనపై కొనసాగుతున్న దర్యాప్తు


రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత



ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది దేవస్థానం రథం దగ్ధం ఘటనలో దర్యాప్తు కొనసాగుతోందని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత చెప్పారు. సోమవారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని పశు వైద్యశాల భవనం ప్రారంభోత్సవం కోసం వచ్చిన ఆమె... టీడీపీ నేత లోకేశ్ చేసిన ఆరోపణలపై స్పందించారు. అంతర్వేది దేవస్థానం రథం దగ్ధం కేసులో నిందితులను అరెస్టు చేయలేదనడాన్ని ఖండిస్తూ దీనిపై లోతుగా దర్యాప్తు జరుగుతోందని వివరించారు. భక్తుల మనోభావాలకు భంగం కలగకుండా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం చొరవ తీసుకుని.. కొత్త రథం తయారు చేయించి ఇచ్చిన సంగతిని గుర్తుచేశారు. యువగళం పాదయాత్ర ముక్కలు.. చెక్కలుగా సాగుతుందని ఎద్దేవా చేశారు. ఎటువంటి అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని ఆమె చెప్పారు.

బాబు పాపాలు ప్రక్షాళన

ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



తిరుపతి సిటీ: గతంలో చంద్రబాబు ప్రభుత్వం చేసిన పాపాలను ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ ప్రక్షాళన చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు 2014 నుంచి 2019 వరకు ఒక రూపాయి చెల్లించి ఇళ్లు కట్టుకోండని ప్రజలను మభ్యపెట్టి మోసం చేశారని దుయ్యబట్టారు. ఈ విషయాన్ని తాను 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో వివరించగా.. మానవతా దృక్పథంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల బడుగు బలహీన వర్గాలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ఇళ్లను మంజూరు చేశారన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల ముందు చంద్రబాబు పసుపు-కుంకుమ పేరుతో పథకాన్ని సృష్టించి మహిళలను మోసం చేశారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో బాబు హామీలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమాన్ని నిర్వహించి అందరి మన్ననలు పొందుతున్నామని వివరించారు.

చంద్రబాబు సచ్ఛీలుడని కోర్టు చెప్పలేదు..

చంద్రబాబుపై ఎంపీ భరత్ ఫైర్



ఆల్కాట్‌తోట(రాజమహేంద్రవరం రూరల్): స్కిల్ స్కాం కేసులో ఏసీబీ కోర్టు అన్ని విషయాలను పరిశీలించి.. తప్పు జరిగిందని నిర్ధారించుకున్నాకే చంద్రబాబుకు జ్యుడీషియల్ రిమాండ్ విధించిందని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ స్పష్టం చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. న్యాయస్థానాలేమీ చంద్రబాబు సచ్ఛీలుడని బెయిల్ ఇవ్వలేదని, స్కిల్ స్కాం జరిగింది కాబట్టే సెంట్రల్ జైలులో 52 రోజులు రిమాండ్‌లో ఉన్నారని తెలిపారు. స్కిల్ స్కామ్ జరగలేదని స్పష్టంగా ఎక్కడా చంద్రబాబు తరపు న్యాయవాదులు కానీ, చంద్రబాబు.. లోకేశ్ గానీ చెప్పడం లేదన్నారు. చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో ప్రజాధనం రూ.375 కోట్లను అడ్డదార్లలో ఇంటికి సూట్ కేసుల ద్వారా రప్పించుకున్నది వాస్తవం కాదా.. అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో తామేమీ ఒప్పందం చేసుకోలేదని సీమెన్స్ కంపెనీ స్పష్టంగా చెప్పిందన్నారు. యువగళం పాదయాత్ర గురించి ప్రస్తావిస్తూ ఎందుకు చేస్తున్నారో.. ఎందుకు మానేశారో... తిరిగి ఇప్పుడు ఎందుకు చేస్తున్నారో లోకేశ్‌కే క్లారిటీ లేదని, ప్రజల నుంచి స్పందన శూన్యమని భరత్‌రామ్ చెప్పారు.

మంత్రి వేణుకు స్వల్ప అస్వస్థత

సాక్షి, అమరావతి: బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సోమవారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఆయన విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందారు. కోలుకున్న ఆయన అనంతరం మరిన్ని వైద్య పరీక్షల కోసం తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రిలో చేరారు. మంగళవారం ఉదయం వైద్య పరీక్షల అనంతరం డాక్టర్ సలహా మేరకు ఆస్పత్రి నుంచి మంత్రి వేణు డిశ్చార్జ్ కానున్నారు. మంత్రి ఆరోగ్యంపై సీఎం వైఎస్ జగన్ ఫోన్ చేసి ఆరా తీశారు.

దిక్కుతోచని 'దేశం'

▶ మొదటి పేజీ తరువాయి

ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారంటూ పచ్చమీడియా శోకర్తాలు పెడుతుంటే.. ఆ కథనాలు పట్టుకుని లోకేశ్, పవన్ కళ్యాణ్, చంద్రబాబు వదినైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సన్నాయినొక్కులు నొక్కడం నిత్యకృత్యమైంది.

జనం ఎత్తిన జెండా..

విభజన నేపథ్యంలో 2014లో జరిగిన ఎన్నికల్లో 650 హామీలు ఇస్తూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో అమలు బాధ్యత తనదంటూ జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నమ్మబలికారు. ఆ ఎన్నికల్లో ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడి, కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ఏ ఒక్క హామీని సంపూర్ణంగా అమలు చేసిన దాఖలాలు లేవు. వాటిపై ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనన్న భయంతో అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే మేనిఫెస్టోను టీడీపీ వెబ్‌సైట్ నుంచి చంద్రబాబు మాయం చేయించారు. ఇదే అంశాన్ని ఎత్తిచూపుతూ ప్రజలతో మమేకమవుతూ ప్రజాసంకల్ప పాదయాత్రను అప్పట్లో వైఎస్ జగన్ చేశారు. పాదయాత్రలో ప్రజలు చెప్పిన అంశాలు, తాను గుర్తించిన సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తూ కేవలం రెండు పేజీలతో కూడిన మేనిఫెస్టోను 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ విడుదల చేశారు. ఆ ఎన్నికల్లో 50 శాతం ఓట్లు సాధించి, 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాలను చేజిక్కించుకోవడం ద్వారా వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయాన్ని నమోదుచేసింది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 95 శాతం.. ఇప్పటికి 99.5 శాతం హామీలు అమలు చేశారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను 87 శాతం కుటుంబాలకు అందించారు. డీబీటీ ద్వారా రూ. 2.40 లక్షల కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ. 1.70 లక్షల కోట్లు వెరసి మొత్తం రూ. 4.10 లక్షల కోట్ల మేర ప్రజలకు ప్రయోజనం చేకూర్చారు. వికేంద్రీకరణ, సంస్కరణల ద్వారా విప్లవాత్మక పరిపాలనను అందిస్తుండటంతో ప్రజలు వైఎస్సార్‌సీపీ వెంట నడుస్తున్నారు. 2019 ఎన్నికల తర్వాత జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ రికార్డు స్థాయి విజయాలు సాధించడమే అందుకు తార్కాణం.

నిత్యం ప్రజలతో మమేకమవుతూ..

ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ ప్రజాసమస్యల పరిష్కారమే పరమావధిగా పోరాటం చేసిన వైఎస్సార్‌సీపీ.. అధికారంలోకి వచ్చాక కూడా నిత్యం జనంతో మమేకమవుతోంది. సంక్షేమాభివృద్ధి ద్వారా ప్రతి ఇంటికీ చేసిన మంచిని చాటిచెప్పడానికి గతేడాది మే 11న 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ఇంటింటికీ



వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని చెప్పి.. ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తూ.. ఆశీర్వదించాలని కోరుతున్నారు. ఇంటింటికీ చేసిన మంచిని చెప్పడానికి ఈ ఏడాది ఏప్రిల్ 7న 'జగనన్నే మా భవిష్యత్తు' పేరుతో చేపట్టిన కార్యక్రమం ద్వారా 1.45 కోట్ల కుటుంబాలతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మమేకమాయ్యాయి. ఇందులో 80 శాతం కుటుంబాలు సీఎం వైఎస్ జగన్ పరిపాలకు మద్దతు పలుకుతూ 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ పీపుల్స్ సర్వేలో తమ అభిప్రాయాన్ని వెల్లడించాయి. నాలుగున్నరేళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిన మంచిని వివరించడానికి గత నెల 26 నుంచి చేపట్టిన సామాజిక సాధికార యాత్ర ఇప్పటికి 59 నియోజకవర్గాల్లో పూర్తయింది. ప్రతి నియోజకవర్గంలోనూ వేలాదిగా ప్రజలు తరలివచ్చి వైఎస్ జగన్ పాలనకు మద్దతు ఇస్తున్నారు.

వై ఏపీ నీడ్స్ జగన్

నాలుగున్నరేళ్లలో సాధించిన విప్లవాత్మక మార్పులను వివరించడానికి ఈనెల 9 నుంచి చేపట్టిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమానికి ఇంటింటా జనం నీరాజనాలు పలుకుతున్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలంటే జగనే రావాలి.. జగనే కావాలి అంటూ నినదిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం యూనిట్‌గా ప్రతి ఇంటి తలుపు తట్టి.. 2014-19లో చంద్రబాబు చేస్తానని చెప్పి ఎగ్గొట్టినవి, జగన్ చెప్పినవి చేశారా లేదా అనేది గృహసారథులు ప్రజలకు వివరిస్తున్నారు. ఇప్పటికి 30 లక్షల ఇళ్లు టచ్ చేశారు. 6,800 సచివాలయాల పరిధిలో పూర్తి చేశారు. ఇంటింటా జగన్‌కు జనం జై కొడుతున్నారు. మీకు మంచి చేస్తేనే నన్ను ఆశీర్వదించండి అని జగన్ స్పష్టంగా చెప్తున్నారు కాబట్టే ప్రజల నుంచి స్పందన లభిస్తోంది. మీ గ్రామానికి ఇంత చేశామని చెప్పగలిగిన ధైర్యం గతంలో ఎవరూ చేయలేదు.

ఉగ్రవాదం కంటే నీచమైన స్థాయికి..

తెలుగుదేశం ఉనికి కాపాడటానికి ఎల్లో మీడియా రంగంలోకి దిగి నిత్యం ప్రభుత్వంపై విషం చిమ్ముతోంది. సంక్షేమ పథకాల వల్ల అర్హత ఉన్న 87 శాతం కుటుంబాలు లబ్ధి పొందుతుంటే వాటి గురించి పట్టించుకోని పచ్చ పత్రికలు.. సంక్షేమ పథకాలు అందడం లేదంటూ దుష్ప్రచారం చేస్తున్నాయి. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి వద్దే ప్రజలకు వైద్య సేవలు అందిస్తుండటం వల్ల బోధనాసుపత్రుల్లో ఓపీలు తగ్గితే దానిపైనా తప్పుడు కథనాలు రాశాయి. అంటే ఆస్పత్రులన్నీ కళకళలాడాలని కోరుకుంటున్నారా? ఒకప్పుడు ఎరువుల కోసం కిలోమీటర్ల మేర క్యూలలో రైతులు నిలబడేవారు. ఇప్పుడు ఆ క్యూలే కనిపించడం లేదంటూ రాస్తే ఇక వారిని ఏమనాలి? ఉగ్రవాదం స్థాయిని దాటి అత్యంత నీచమైన స్థాయికి దిగజారారు. వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్రకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, అగ్రవర్ణ పేదలు వేలాదిగా హాజరవుతుంటే.. దాన్ని జీర్ణించుకోలేని పచ్చ పత్రికలు సభ ప్రారంభానికి ముందు, పూర్తయిన తర్వాత ఫొటోలు తీసి ఖాళీ కుర్చీలంటూ తప్పుడు కథనాలు అచ్చేస్తున్నాయి. ఎన్నికలు దగ్గర పడే కొద్దీ విషప్రచారం ఊపందుకుని రోజూ అబద్ధపు రాతలు రాస్తున్నారు.

175 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా..

వచ్చే ఎన్నికల్లో 175 శాసనసభ స్థానాల్లో పోటీకి నిలబెట్టేందుకు టీడీపీకి అభ్యర్థులు దొరకని పరిస్థితి ఏర్పడింది. మరోపక్క 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ వ్యూహాలు రచిస్తోంది. ఈ విషయంలో సీఎం వైఎస్ జగన్ కూడా ప్రత్యేక దృష్టి పెట్టారు. 2019 ఎన్నికల్లో టీడీపీ గెలిచిన 23 స్థానాలనూ కైవసం చేసుకోవడానికి అక్కడ బలమైన అభ్యర్థులను, అవసరమైతే మంత్రులను బరిలోకి దించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే కునారిల్లిపోయిన టీడీపీ ఉనికిని కాపాడుకోవడానికి అడ్డమైన దారులు తొక్కుతోంది. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ముసుగును తొలగించి.. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కలిసి పోటీ చేస్తాయని ప్రకటించారు. ఆ పొత్తుపై జనస్పందన కన్పించలేదు. ఉమ్మడి మేనిఫెస్టో పేరుతో రెండు పార్టీల నేతలు ఆడుతున్న నాటకాలు రక్తికట్టడం లేదు. 2019 కంటే ఘోరంగా ఓడిపోవడం ఖాయమని, అది పార్టీ ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చుతుందని చంద్రబాబు నేతృత్వంలోని పసుపుదండు ఆందోళన చెందుతోంది. దీంతో ఓటమికి ఇప్పటి నుంచే టీడీపీ బ్యాచ్ సాకులు వెతుక్కుంటోంది.

నైరాశ్యంలో తమ్ముళ్లు..

అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ దోచుకో.. పంచుకో.. తినుకో పద్ధతిలో ప్రజాధనాన్ని లూటీ చేశారు. ఆ కుంభకోణాల్లో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు ఇటీవలే జైలుకెళ్లి వచ్చారు. స్కిల్ స్కాం కేసులో రూ. 371 కోట్లు దోచేశారని పక్కా ఆధారాలతో తేల్చిన సీఐడీ ఆయన్ను అరెస్టు చేసింది. ఏసీబీ కోర్టు రిమాండ్‌పై జైలుకు పంపింది. తనను జైలుకు పంపితే సానుభూతి వస్తుందన్న చంద్రబాబు అంచనాలు తప్పాయి. వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ తప్పించుకు తిరుగుతున్న చంద్రబాబును జైలుకు పంపడంతో ఇప్పటికైనా న్యాయం గెలిచిందనే భావన ప్రజల్లో వ్యక్తమవడంతో ఆపార్టీ శ్రేణులను నైరాశ్యంలోకి నెట్టింది.

ఓర్వలేకే ప్రభుత్వంపై టన్నుల కొద్దీ విషం

- పచ్చ మీడియాపై సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజం
- సంక్షేమ పథకాలతో సీఎం జగన్‌కు ప్రజల్లో ఆదరణ
- దాన్ని చూసి జీర్ణించుకోలేకే అభూతకల్పనలు అచ్చేస్తున్న రామోజీ
- పచ్చ పత్రికల మాయతో ఊహల్లో విహరిస్తున్న చంద్రబాబు
- వచ్చే ఎన్నికల్లో టీడీపీ భూస్థాపితం కావడం తథ్యం



సాక్షి, అమరావతి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రభుత్వంపై పచ్చ మీడియా విషం చిమ్ముతోందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. మీడియా ముసుగేసుకుని రోజూ టన్నుల కొద్దీ కథనాలు అచ్చేస్తున్న రెండు పచ్చ పత్రికలను నమ్మవద్దంటూ ప్రజలకు సూచించారు. ఉగ్రవాదం కంటే నీచమైన స్థాయికి పచ్చ పత్రికలు దిగజారిపోయాయని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, లోకేశ్, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణలపై విరుచుకుపడ్డారు. సెప్టిక్ ట్యాంక్‌లో చేపలు పట్టే స్థాయికి దిగజారి అభూతకల్పనలతో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్న ఆ పత్రికలను చూసి చంద్రబాబు ఊహల్లో విహరిస్తున్నారంటూ దెప్పిపొడిచారు. ప్రభుత్వంపై తాము చేస్తున్న విషప్రచారాన్ని బలవంతంగానైనా ప్రజలపై రుద్దేందుకు ఈనాడు పత్రికను రామోజీరావు కొంత మందికి ఉచితంగా వేస్తున్నారని.. ఆ పత్రిక మిగతా పాఠకులు తమకు కూడా ఉచితంగా వేయాలని డిమాండ్ చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని ప్రజలు భూస్థాపితం చేయడం.. వైఎస్సార్‌సీపీని మరోసారి తిరుగులేని ఆధిక్యంతో గెలిపించడం ఖాయమన్నారు. మీడియాతో మాట్లాడుతూ సజ్జల ఇంకా ఏమన్నారంటే...

మీ పార్టీ వారికి సంక్షేమం ఆగిందా..

సీఎం వైఎస్ జగన్ మేనిఫెస్టో హామీల్లో ఇప్పటికి 99.5 శాతం అమలు చేశారు. చంద్రబాబులా హామీలు ఇచ్చి తర్వాత అమలు చేయకుండా పారిపోయే పద్ధతిని మార్చేశారు. అర్హత ఉన్న టీడీపీ వారికి ఒక్కరికైనా సంక్షేమ పథకాలు ఆగాయా? అని చంద్రబాబు, రామోజీ, రాధాకృష్ణ, పవన్‌లను ప్రశ్నిస్తున్నా. గతంలో జన్మభూమి కమిటీల ద్వారా దోచుకున్నారేగానీ ప్రజలకు టీడీపీ సర్కార్ చేసిందేమీ లేదు. టీడీపీ హయాంలోని వంద పథకాలను ఆపేశారని రెండు పచ్చ పత్రికల్లో దుష్ప్రచారం చేస్తున్నారు. అప్పట్లో ఏవైనా పథకాలు అమలు చేసి ఉంటే కదా మేం ఆపడానికి?

ఉచిత ఇసుకైతే జరిమానా ఎందుకు?

చంద్రబాబు హయాంలో ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేశారు. ఆ విధానంలో కేవలం ట్రాన్స్‌పోర్ట్ చార్జీలే వసూలు చేయాలి. మరి పెద్ద పెద్ద బిల్డర్లకు ఇసుక ఎవరిచ్చారు? ఆనాడు చంద్రబాబు ఇంటి పక్కనే డ్రెడ్జర్లు, జేసీబీలు, క్రేన్లు పెట్టి ఇసుకను తరలించడం రాష్ట్రమంతా చూసింది. ఉచితమే అయితే దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ఎమ్మార్వో వనజాక్షిపై దాడి ఎందుకు చేశాడు? ఎన్జీటీ ఎందుకు చంద్రబాబు సర్కార్‌కు రూ. వంద కోట్ల పెనాల్టీ వేసింది? అప్పట్లో వాటిపై ఒక్క కథనమైనా పచ్చ పత్రికలు రాశాయా?. ఇప్పుడు అత్యంత పారదర్శకంగా.. రివర్స్ టెండరింగ్ విధానంలో టెండర్లు నిర్వహిస్తూ ఇసుక తవ్వకాలను అప్పగిస్తున్నాం. పచ్చళ్ల వ్యాపారం చేసే రామోజీరావును కూడా ఈ టెండర్లలో పాల్గొనమని చాలా సార్లు చెప్పాం. అయినా.. ఇసుక తవ్వకాలపై తప్పుడు కథనాలు అచ్చేస్తూనే ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, అగ్రవర్ణ పేదలు వేలాదిగా హాజరవుతున్న.. వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్రలపైనా విషం చిమ్ముతున్నారు. వాళ్లు రాస్తున్న అబద్ధపు రాతలపై రోజూ ఫ్యాక్ట్ చెక్ ద్వారా నిజమేంటో ప్రజలకు చెబుతున్నాం.

దోపిడీ దొంగ చంద్రబాబు హీరోలా కనిపిస్తున్నాడా?

చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు టెండర్ల వ్యవస్థను నీరుగార్చి.. 4.95 శాతం అధిక ధరలకు కాంట్రాక్టర్లకు కట్టబెట్టి భారీ ఎత్తున కమిషన్లు వసూలు చేసుకున్నారు. పోలవరంలో ట్రాన్స్‌ట్రాయ్‌కు ఇంప్రెస్ట్ అమౌంట్ పేరుతో రూ. 250 కోట్లు, బ్యాంకు గ్యారెంటీలు, మొబిలైజేషన్ అడ్వాన్సు పేరుతో రూ. 700 కోట్లు ఇచ్చేశారు. ఆ తర్వాత నవయుగకు నామినేషన్‌పై రూ. 3 వేల కోట్లు పనులు అప్పగించారు. చేయని పనులకు రూ. 106 కోట్లు బిల్లులు చెల్లించారు. ఆఖరకు మజ్జిగ టెండర్‌ను కూడా హెరిటేజ్ పేరుతో కొట్టేశారు. అలాగే చంద్రన్న కానుకలో చెడిపోయిన నెయ్యిని సరఫరా చేసిన హెరిటేజ్‌కు రూ. కోట్లు కట్టబెట్టారు కదా. ప్రస్తుత ప్రభుత్వం జగనన్న ఇళ్ల పథకానికి సిమెంట్ ధరలు తగ్గించి, లబ్ధిదారులకు మేలు చేసింది. దానిలో భాగంగా అన్ని సిమెంట్ కంపెనీలతోపాటు భారతి సిమెంట్స్ కూడా తక్కువ ధరకు సిమెంటును లబ్ధిదారులకు అందించింది. మరుగుదొడ్ల నిర్మాణంలో పసుపు రంగు వేయడం నుంచి నీరు-చెట్టు వరకూ అడ్డంగా దోచేసిన చంద్రబాబు.. రామోజీ, రాధాకృష్ణలకు హీరోలా కనిపిస్తున్నాడు. చంద్రబాబు, దత్తపుత్రుడు, ఉత్తపుత్రుడు రాష్ట్రంలో కాపురం ఉండరు. రామోజీ, రాధాకృష్ణ కూడా పక్క రాష్ట్రంలోనే ఉంటారు. కానీ పెత్తనం ఇక్కడ చేయాలనుకుంటారు. వీళ్ల వ్యాపారాలు బాగుండాలి. రాజకీయం చేయాలి.. రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకోవాలనేదే వారి కోరిక.

జోకర్ మళ్లీ వచ్చాడని జనం భావిస్తున్నారు

లోకేశ్ మళ్లీ పాదయాత్రను మొదలు పెట్టి.. భయాన్ని పరిచయం చేస్తానంటున్నాడు. మీ నాన్న అరెస్టయిన రోజు ఏడ్చుకుంటూ ఢిల్లీ వెళ్లి ఇన్నాళ్లు ఎందుకు దాక్కున్నావ్ లోకేశ్? అసలు భయం, భయపడటం అనే ప్రశ్న రాజకీయాల్లో ఎందుకొస్తుంది? జగన్ పరిపాలనలో ఎత్తి చూపడానికి లోపమంటూ ఏమీ లేదు. ఇక లోకేశ్‌కు బూతులు తప్ప ఏమొస్తాయి? నవ్వుకోడానికి ఒక జోకర్ దూరం అయ్యాడని జనం అనుకున్నారు.. ఇప్పుడు మళ్లీ వచ్చాడు.

'నారాయణ'లో రాసలీలలు!

- కర్నూలు జిల్లాలో వీడియోల కలకలం
- అక్కడ పనిచేసే కొందరు మహిళలతో తన కార్యాలయంలోనే కోర్ డీన్ కామక్రీడలు
- ఆ వ్యవహారాలను స్పై కెమెరాతో రికార్డు చేసి.. డీన్‌ను బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఉద్యోగులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన డీన్ లింగేశ్వరరెడ్డి

కర్నూలు సిటీ: ఇప్పటి వరకూ నారాయణ విద్యా సంస్థల్లో ఒత్తిడితో విద్యార్థుల ఆత్మహత్యలు, సరైన భోజనం, సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్న ఘటనలే వెలుగు చూశాయి. తాజాగా ఉద్యోగి రాసలీలల వీడియోలు కలకలం సృష్టిస్తున్నాయి. నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ లింగేశ్వరరెడ్డి అక్కడ పనిచేసే కొందరు మహిళలతో జరిపిన రాసక్రీడల వీడియోల వ్యవహారం చర్చనీయాంశమైంది. నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ లింగేశ్వరరెడ్డి.. జూనియర్ కాలేజీల విభాగాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో తన కార్యాలయంలోనే అక్కడి మహిళలతో ఆయన సాగిస్తున్న సరస సల్లాపాలను గమనించిన అక్కడ పని చేసే గోపీకృష్ణ, నజీర్ అనే ఉద్యోగులు ఆ గదిలో స్పై కెమెరాలు అమర్చారు. ఇందులో పదుల సంఖ్యలో రాసలీలల వీడియోలు రికార్డయ్యాయి. గోపీకృష్ణ, నజీర్‌లు ఆ వీడియోలను డీన్ లింగేశ్వరరెడ్డి వాట్సాప్‌కు పంపగా.. వారిని రాజీకి పిలిపించి ఒక ఇల్లు, రెండు విలువైన ప్లాట్లు వారి పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. అంతేగాక వారి వేతనాలు కూడా పెంచేందుకు హామీ ఇచ్చారు.

మరికొంత మంది బ్లాక్‌మెయిల్

తర్వాత ఆ వీడియోలు ఓ ఉద్యోగి ద్వారా నబీ రసూల్ అనే వ్యక్తికి చేరాయి. ఇతను చంద్రశేఖరరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి అనేవారికి వీడియోలను పంపడంతో వారు లింగేశ్వరరెడ్డి వద్ద డబ్బులు డిమాండ్ చేశారు. వీరితోనూ రాజీకి వెళ్లి పెద్ద మొత్తంలో నగదు ఒప్పందం చేసుకున్నారు. కొంత డబ్బులు ఇచ్చి, మిగిలిన మొత్తం ఇవ్వకపోవడంతో తిరిగి వీళ్లు ఈ వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బ్లాక్ మెయిల్ చేయసాగారు. దీంతో ఇంకెంతమంది ఇలా బ్లాక్ మెయిల్ చేస్తారోనని భయంతో లింగేశ్వరరెడ్డి స్పందనలో ఎస్పీకి వినతి పత్రం ఇచ్చారు. దీంతో తాలూకా పోలీస్ స్టేషన్‌కు బ్లాక్‌మెయిలర్స్‌ను పిలిపించి సెల్‌ఫోన్‌లు తీసుకుని వారి దగ్గర ఉన్న వీడియోలను డిలీట్ చేయించి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఆయన ఆస్తులను కూడా తిరిగి అతని పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. నిందితులను కర్నూలు రూరల్ తహసీల్దార్ ఎదుట హాజరు పరిచి బైండోవర్ కేసు నమోదు చేయించారు. తనను బ్లాక్ మెయిల్ చేసిన ఉద్యోగులను కోర్ డీన్ హైదరాబాద్‌కు బదిలీ చేయించారు. తనను కొందరు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని లింగేశ్వరరెడ్డి స్పందనలో ఫిర్యాదు చేయడంతో విచారించి నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు కర్నూలు ఎస్పీ కృష్ణకాంత్ చెప్పారు. బాధితులు వచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేస్తే ఆ దిశగా కూడా చర్యలు తీసుకుంటామన్నారు.


బాబు, కొల్లు రవీంద్ర పిటిషన్లపై తీర్పు రిజర్వ్

ఉత్తర్వులు జారీ చేసిన న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు

సాక్షి అమరావతి: మద్యం కుంభకోణానికి సంబంధించి నమోదు చేసిన కేసులో నిందితులైన మాజీ సీఎం నారా చంద్రబాబు, మాజీ మంత్రి కొల్లు రవీంద్రలపై తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని సీఐడీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. అలాగే, సీఐడీ నమోదు చేసిన కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ చంద్రబాబు, కొల్లు రవీంద్ర దాఖలు చేసిన వ్యాజ్యాల్లో హైకోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తమ పార్టీ నేతల డిస్టిలరీలు, బార్లకు ఆయాచిత లబ్ధి చేకూర్చారని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని బేవరేజస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి సీఐడీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి సీఎం చంద్రబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తదితరులను నిందితులుగా పేర్కొంటూ సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసును కొట్టేయాలంటూ చంద్రబాబు, రవీంద్ర హైకోర్టులో వేర్వేరుగా ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ మల్లికార్జునరావు విచారణ చేస్తున్నారు. వాస్తవానికి ఈ వ్యాజ్యాల్లో గత వారమే ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. రాతపూర్వక వాదనల సమర్పణ నిమిత్తం విచారణ సోమవారానికి వాయిదా వేశారు. అందులో భాగంగా ఈ వ్యాజ్యాలు మరోసారి విచారణకు వచ్చాయి. సీఐడీ తరపున ఏజీ శ్రీరామ్ స్పందిస్తూ రాతపూర్వక వాదనలు దాఖలు చేశామన్నారు. పిటిషనర్ల తరపు న్యాయవాది ప్రణతి స్పందిస్తూ తాము కూడా రాతపూర్వక వాదనలు దాఖలు చేశామన్నారు. అనంతరం న్యాయమూర్తి తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు చంద్రబాబు, రవీంద్రలపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశించారు. తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించారు.

తోక పార్టీలను తరిమికొడతాం

1,156వ రోజు దీక్షలో బహుజన నేతలు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: అవినీతి అనకొండ చంద్రబాబు నాయుడుకు వత్తాసు పలుకుతున్న తోక పార్టీలను తరిమి కొడతామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 1,156వ రోజుకు చేరాయి. నాయకులు మాట్లాడుతూ అమరావతి పేరుతో చంద్రబాబు ప్రజాధనం దోచేస్తే చూస్తూ ఊరుకోవాలా... అని ప్రశ్నించారు. నాయకులు ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, పులి దాసు, పెరికే వరప్రసాద్, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం జరభద్రం

వాతావరణంలో వచ్చిన మార్పులు, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. లేదంటే సీజనల్ వ్యాధుల బారిన పడి అనారోగ్యం పాలవుతారని వైద్యాధికారులు చెబుతున్నారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు అప్రమత్తతే ఆరోగ్యరక్ష అని సూచిస్తున్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి
సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
శుభ్రతతోనే వ్యాధులు దరిచేరవంటున్న వైద్యాధికారులు



నెల్లూరు నగరంలో ప్రజల ఆరోగ్య పరిస్థితులపై తెలుసుకుంటున్న వైద్యసిబ్బంది(ఫైల్)

నెల్లూరు సిటీ: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. వాతావరణ మార్పుల కారణంగా ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడడం ద్వారా ఆస్పత్రుల వద్ద రోగుల తాకిడి పెరిగింది. ముఖ్యంగా జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులు, గొంతు నొప్పులతో రోగులు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించి వైద్యం చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. జ్వరం, జలుబుతో రోజుల తరబడి జాప్యం చేయడం మంచిది కాదని చెబుతున్నారు.


వాతావరణంలో మార్పులే కారణం

ఈ ఏడాది వర్షాలు కొంత ఆలస్యంగా వచ్చినప్పటికీ వాతావరణంలో మార్పుల కారణంగా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆస్పత్రుల వద్ద ఓపీల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం వాతావరణంలో టైఫాయిడ్, మలేరియా, డెంగీ, కామెర్లు, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. కలుషిత నీరు తాగడం ద్వారా టైఫాయిడ్, డయేరియా, దోమకాటు వల్ల మలేరియా, డెంగీ వంటి జ్వరాలు వ్యాప్తి చెందుతాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో వైద్యారోగ్యశాఖ అధికారులు ఇప్పటికే అప్రమత్తమై సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహిస్తున్నారు. వైద్యారోగ్యశాఖ, కార్పొరేషన్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇళ్ల వద్ద కొబ్బరిబోండాలు, రోళ్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువుల్లో నీరు నిల్వ చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యపరీక్షలు, చికిత్సలు చేయడంతోపాటు ఉచితంగా మందులు కూడా అందజేస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- చేతులను తరచూ సబ్బుతో శుభ్రం చేసుకోవాలి
- ఇళ్లలోకి దోమలు రాకుండా కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలి
- దోమతెరలు వినియోగించాలి
- ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- ఆహారం, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి.
- కాచి చల్లార్చిన నీరు తాగాలి
- వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి

క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం



వర్షాకాలం నేపథ్యంలో దోమలు వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. మలేరియా, డెంగీ తదితర జ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నాం. క్షేత్రస్థాయిలో వైద్యారోగ్యశాఖ అధికారులు, ఏఎన్‌ఎంలు, సచివాలయ కార్యదర్శులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు దరిచేరవు.

– పెంచలయ్య, డీఎంహెచ్‌ఓ



కాంతిని ఏది ప్రసరింపజేయలేదో అది
తన చీకటిని తనే సృష్టించుకుంటుంది.
– మార్కస్ అరీలియస్

సాక్షి
మంగళవారం, 28 నవంబర్ 2023

రైట్...రైట్!

ఉదారవాదులూ, వామపక్షవాదులూ 'గత కాలమె మేలు వచ్చు కాలము కంటెన్...' అనుకోక తప్పని సమయం వచ్చినట్టుంది. మొన్న అర్జెంటీనాలో, ఇప్పుడు నెదర్లాండ్స్‌లో జరిగిన ఎన్నికల్లో మితవాద నేతలు విజయకేతనాలు ఎగరేయటం...యూరప్ ఖండంలోని చాలాచోట్ల నానాటికీ మితవాద పార్టీలకు ఆదరణ పెరుగుతుండటం ప్రపంచం 'కుడి'వైపు మళ్లుతున్న సూచనలు అందిస్తున్నాయి. దక్షిణ అమెరికాలోని అర్జెంటీనాలో ఇటీవల తీవ్ర మితవాద పక్ష నేత జేవియర్ మిలీ వామపక్ష నేత సెర్జియా మాసాను ఓడించి దేశాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సెంట్రల్ బ్యాంకు మూసివేత, స్థానిక కరెన్సీ పెసో రద్దు ఆయనగారి వాగ్దానాలు. దేశ సాంఘిక, ఆర్థిక విధానాలను ధ్వంసం చేసి నవ అర్జెంటీనా నిర్మించటమే తన ధ్యేయమని చెప్పుకొన్నారు. తాజాగా నెదర్లాండ్స్‌లో తీవ్ర మితవాద పక్షమైన పార్టీ ఫర్ ఫ్రీడమ్ (పీవీవీ) 37 స్థానాలు గెల్చుకుని అతి పెద్ద పార్టీగా అవతరించింది. 150 స్థానాలున్న దిగువ సభలో ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 76 స్థానాలకు దూరంలోనే వున్నా ఆ పార్టీ నేత గీర్ట్ వైల్డర్స్ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి ప్రయత్నాలు మొదలెట్టింది. అయితే పీవీవీ ప్రవచించే ఇస్లాం వ్యతిరేకత అక్కడ రాజ్యాంగ విరుద్ధం కావటంవల్ల ప్రధాన స్రవంతి పార్టీలు ప్రభుత్వంలో చేరేందుకు నిరాకరిస్తున్నాయి. మసీదుల మూత, ఖురాన్ నిషేధం, ముస్లిం దేశాల నుంచి వలసలు అరికట్టడం వైల్డర్స్ వాగ్దానాలు.

రెండో ప్రపంచ యుద్ధానంతరం పశ్చిమ యూరప్‌లో మితవాద పక్షాలకు కాలం చెల్లి, ఉదారవాద పార్టీల ఆధిక్యతే సాగింది. ఒక్క ఇటలీలోని సోషల్ మూవ్‌మెంట్ పార్టీ (ఎంఎస్‌ఐ)కి తప్ప ఎక్కడా మితవాదులకు ఆదరణ దొరకలేదు. 1955–80 మధ్య అక్కడక్కడ మితవాద పార్టీలు తలెత్తి కొద్దో గొప్పో స్థానాలు గెల్చుకున్న ఉదంతాలున్నా అవి ఒకటి రెండు దఫాలకు మించి నిలబడలేకపోయాయి. 1956లో ఫ్రాన్స్‌లో యూనియన్ అండ్ ఫ్రెంచ్ ఫ్రెటర్నిటీ (యూఎఫ్ఎఫ్) 13 శాతం ఓట్లు గెల్చుకుని, 52 స్థానాలు సాధించినా చాలా త్వరగానే కనుమరుగయింది. అంతవరకూ దుందుడుకువాదులుగా పేరుబడిన అతి మితవాద పక్షాలు 1980–2000 మధ్య అంతక్రితంతో పోలిస్తే ఎంతోకొంత మెరుగయ్యాయి. ఆస్ట్రియాలో ఫ్రీడమ్ పార్టీ (ఎఫ్‌పీ), నెదర్లాండ్స్‌లో సెంటర్ పార్టీ (సీపీ) ఓటర్లను ఆకట్టుకోవటం మొదలెట్టాయి. అయితే ఉదారవాద పార్టీలు, వామపక్ష పార్టీల తరహాలో వీటికి నిర్దిష్టమైన సిద్ధాంతమేమీ ఉండదు. స్థానికత, జనాకర్షణ, అవినీతి, పెరుగుతున్న నేరాలు, వలసలు, ముస్లింలపై వ్యతిరేత వంటివే ఈ పార్టీలకు ఊపిరి. 1980కి ముందు ఒక శాతం అంతకన్నా తక్కువ ఓట్లు మాత్రమే రాబట్టుకునే మితవాదులు 2010 నాటికి 10 శాతం ఓట్లు తెచ్చుకునే స్థితికి ఎదిగారు. ఒక్క ఆస్ట్రియా దీనికి మినహాయింపు. అక్కడ తీవ్ర మితవాద ఫ్రీడమ్ పార్టీ (ఎఫ్‌పీ) 1999లో 27 శాతం ఓట్లు సాధించి కూటమి ప్రభుత్వంలో చేరింది. ఈ పరిణామం యూరప్‌కు మింగుడుపడలేదు. ఆ దేశంపై పలు ఆంక్షలు సాధించటంతోపాటు చాలా దేశాలు అక్కడికి దౌత్య పర్యటనలు మానుకున్నాయి. 2019లో ఎఫ్‌పీ నేత అవినీతి ఆధారాలతోసహా బట్టబయలు కావటంతో దానికి ఆదరణ సన్నగిల్లింది. కానీ మొన్న ఫిబ్రవరిలో జరిగిన ప్రాంతీయ ఎన్నికల్లో అది 24 శాతం ఓట్లతో బలం పుంజుకుంది. వేరే దేశాల్లో కూడా మితవాదులకు ఆదరణ పెరుగుతున్న దాఖలాలు కనబడుతూనే వున్నాయి. స్పెయిన్, బెల్జియం, ఇటలీ, జర్మనీ తదితర దేశాలు ఇందుకు ఉదాహరణ. ఈ ఏడాది మొదట్లో ఇటలీలో నియో ఫాసిస్ట్ పార్టీగా ముద్రపడిన ఎంఎస్‌ఐ అధికారం చేజిక్కించుకోగా, నిరుడు ఫ్రాన్స్ అధ్యక్ష ఎన్నికల్లో అతి మితవాది మెరిన్ లీ పెన్ రెండో స్థానంలో నిలిచి ఆశ్చర్యపరిచారు. ఆమె పార్టీ దిగువ సభలో భారీగా స్థానాలు గెల్చుకుంది. జర్మనీలో నియో నాజీ పార్టీ ఏఎఫ్‌డీ ప్రస్తుతానికైతే ద్వితీయ స్థానంలో ఉంది. ఒక్క పోలాండ్ ఇందుకు మినహాయింపు. అక్కడ 2019 ఎన్నికల్లో 43.6 శాతం ఓట్లతో అధికారాన్ని చేజిక్కించుకున్న మితవాద లా అండ్ జస్టిస్ పార్టీ (పీఐఎస్)ని మొన్న అక్టోబర్ ఎన్నికల్లో అధికారంలో నుంచి దించలేకపోయినా, ఆ పార్టీ ఆధిక్యతను 35 శాతానికి తగ్గించటంలో ఉదారవాద పార్టీలు విజయం సాధించాయి.

నెదర్లాండ్స్‌లో వైల్డర్స్ సాధించిన ఆధిక్యత సహజంగానే యూరప్ అంతటా రాజకీయ ప్రకంపనలకు కారణమైంది. ఎందుకంటే ఇంతవరకూ నెదర్లాండ్స్‌లో ఏ మితవాద పార్టీ 20 శాతం దాటి ఓట్లు సాధించలేదు. తొలిసారి వైల్డర్స్ 23.6 శాతం ఓట్లు గెల్చుకున్నారు. అంతేకాదు... ఇటలీ మితవాద నేత మెలొని, ఫ్రాన్స్ మితవాద నేత మెరైన్ లీ పెన్ మాదిరి తన తీవ్రవాద భావాలను కాస్తయినా సవరించుకోలేదు. అధికారంలోకి రాగానే ఈయూలో ఉండాలా వద్దా అనే అంశంపై రిఫరెండమ్ నిర్వహిస్తానని వైల్డర్స్ హామీ ఇచ్చారు. ఇది ఆచరణలో సాధ్యమా కాదా అన్న సంగతలావుంచి వర్తమాన స్థితిగతుల నుంచి గట్టెక్కటం ఎలాగో తెలియక అన్ని దేశాల్లోనూ పాలకులు తలలు పట్టుకుంటున్నారు. ఒకపక్క ఉక్రెయిన్ నుంచి రోజూ వేలాదిమంది శరణార్థులు వస్తున్నారు. పశ్చిమాసియా, ఆఫ్రికా ఖండ దేశాల నుంచి సైతం నిత్యం వలసలుంటున్నాయి. ఇందుకు ఈయూనే తప్పుబట్టాలి. వివిధ దేశాల్లో మంటరాజుకోవటానికి కారణమవుతున్న అమెరికా వైఖరిని నిలువరించకపోగా దానికి సహకారం అందించటమే వలసలు పెరగటానికి కారణం. అశాంతితో దహించుకుపోతున్న దేశాలను వదిలి సహజంగానే జనం సురక్షిత ప్రాంతాలు వెదుక్కుంటారు. ఇతరత్రా విషయాలెలావున్నా వలసలపై ఓటర్లలో ఉన్న భయాందోళనలకు పరిష్కారం వెదకటంలో ప్రధాన స్రవంతి పార్టీలు విఫలమైతే అన్నిచోట్లా రాగలకాలంలో అతి మితవాద పక్షాలదే పైచేయి అవుతుంది.

సైన్యం నీడలోనే... 'ఆపద్ధర్మం'

విశ్లేషణ



వివేక్ కట్జూ

పాకిస్తాన్‌లో ఏ ప్రభుత్వం ఉన్నా దానిపై సైన్యం ప్రభావం తప్పకుండా ఉంటుందనేది మరోసారి నిరూపితమయ్యింది. ఆపద్ధర్మ ప్రధాన మంత్రి అన్వర్ ఉల్ హఖ్ కాకర్ అచ్చంగా ఒక ఎన్నికైన ప్రధానమంత్రిలా సైన్యానికి అనుగుణంగా వ్యవహరించడం ఇందుకు తాజా ఉదాహరణ. ఇటీవల 'మార్గల్లా డైలాగ్'లో పాల్గొని దీర్ఘకాలిక ప్రభుత్వాధినేత లాగా 'ముసురుకుంటున్న భద్రతా సవాళ్లు' అనే అంశంపై ప్రసంగించారు. చైనా ఎదుగుదలను అరికట్టే విషయంలో పశ్చిమ దేశాల విధానం విఫలమైందనీ, మరోవైపు, పాకిస్తాన్ 'అంతిమ–ప్రత్యర్థి' భారతదేశం ఈ సంఘర్షణను ప్రోత్సహించిందనీ ఆయన ఆరోపించారు. పాకిస్తాన్‌లో ఎవరూ ఆయన మాటలను విమర్శించడం లేదు. కారణం ఆయన సైన్యం ఏం కోరుకుంటున్నదో అదే చేస్తున్నారు కనుక!

పాకిస్తాన్ ఆపద్ధర్మ ప్రధాన మంత్రి అన్వర్ ఉల్ హఖ్ కాకర్, ఆ దేశంలో ఈ తాత్కాలిక పదవిని నిర్వహిస్తున్న ఎనిమిదో నేత. తాత్కాలిక ప్రధానమంత్రులూ, వారు సారథ్యం వహించే ప్రభుత్వాల పని ఏమిటంటే... ప్రభుత్వ యంత్రాంగంతో పనిచేయిస్తూ, రాజ్యాంగబద్ధంగా నిర్దేశించిన వ్యవధిలో ఎన్నికలను నిర్వహించడంలో ఎన్నికల కమిషన్‌కు సహాయం చేయడం!

తన పూర్వ ఆపద్ధర్మ ప్రధానుల మాదిరిగా కాకుండా, దేశ పాలనా వ్యవస్థకు చేరువగా ఉన్న కాకర్, ఎన్నుకోబడిన నాయకుడిగా తనను తాను ప్రదర్శించుకుంటున్నారు. అంతర్జాతీయ సమావేశాలకు హాజరవుతున్నారు. దీర్ఘకాలిక విధాన నిర్ణయాలు తీసుకుంటున్నారు. పైగా, చారిత్రక రాజకీయ ప్రక్రియలపై తన అవగాహనను వ్యక్తపరుస్తున్నారు. ఆ విధంగా ఆయన తన పరిమితులను దాటుతున్నారు. కానీ పాకిస్తాన్‌లో ఎవరూ దానిని ఎత్తి చూపడం లేదు. ఇందుకు కారణం ఆయన సైన్యం ఏం కోరుకుంటున్నదో అదే చేస్తున్నారు కనుక. మే 9 నాటి అవాంతరాల తర్వాత, పాకిస్తానీ రాజకీయ నాయకులు లేదా వ్యాఖ్యాతలెవరూ, ఆగ్రహంతో ఉన్న ఆర్మీ చీఫ్ జనరల్ సయ్యద్ ఆసిమ్ మునీర్‌ను నిజంగానే అతిక్రమించడానికి సాహసించడం లేదు.

ఇస్లామాబాద్ పాలసీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐపీఆర్ఐ) నవంబర్ 15న నిర్వహించిన 'మార్గల్లా డైలాగ్'లో కాకర్ ప్రసంగించారు. ఈ సంభాషణ థీమ్ ఏమిటంటే, 'ముసురుకుంటున్న భద్రతా సవాళ్లు'. ఐపీఆర్ఐ అనేది పాకిస్తాన్ ప్రధాన మంత్రి కార్యాలయానికి అనుబంధంగా ఉన్న జాతీయ భద్రతా విభాగం (ఎన్ఎస్‌డీ)కి చెందిన మేధావుల బృందం. భారతదేశంపై ముఖ్యంగా ఐపీఆర్ఐ నిర్వహించిన కార్యక్రమంలో కాకర్ చేసిన వ్యాఖ్యలు, భారతదేశంపై పాకిస్తాన్ అధికార వ్యవస్థ ప్రస్తుత ఆలోచనకు ప్రతిబింబం కావు. అందువల్ల, భారత రాజకీయ, భద్రతా వర్గాలను పరిగణనలోకి తీసుకోవడంలో పాకిస్తాన్ తన పూర్వపు ప్రాధాన్యాన్ని ప్రస్తుతం కొద్దిగా కోల్పోయినప్పటికీ, కాకర్ వ్యాఖ్యలను విస్మరించలేము. ముఖ్యంగా పాకిస్తానీ దౌత్య వేత్తలు, భద్రతా విశ్లేషకులు ఇప్పుడు ఈ అభిప్రాయాలకు సంబంధించి పాశ్చాత్య దేశాలతో సహా వారి సంభాషణకర్తలను ఒత్తిడి చేయవలసి ఉంటుంది.

చైనా ఎదుగుదలను అరికట్టే విషయంలో పశ్చిమ దేశాల విధానం విఫలమైందని అంచనా వేస్తూ, చైనా–పాశ్చాత్య ఘర్షణ నుండి పాకిస్తాన్ ఇక ఎటువంటి ప్రయోజనాన్ని పొందలేదని కాకర్ నొక్కి చెప్పారు. మరోవైపు, పాకిస్తాన్ 'అంతిమ–ప్రత్యర్థి' భారతదేశం ఈ సంఘర్షణను ప్రోత్సహించిందని ఆయన అన్నారు. విస్తారమైన జనాభా కారణంగా చైనాను అదుపు చేయడంలో సహాయపడటానికి భారత్ తనను తాను 'ముఖ్య పాత్రధారి'గా ప్రతిపాదించుకుంటోం



పాకిస్తాన్ ఆపద్ధర్మ ప్రధాని అన్వర్ ఉల్ హఖ్ కాకర్

దని అన్నారు. సాంకేతికత బదిలీలు, పెట్టుబడులు, ఇతర 'ప్రయోజనాలు' పొందేందుకు 'భారతదేశం పశ్చిమార్ధ గోళంతో సరసాలాడుతోంది' అని ఆయన వ్యాఖ్యానించారు. పాశ్చాత్య దేశాలు జనాభా కారణంగా చైనాతో పోటీలో భారతదేశాన్ని ఆకర్షణీయంగా భావిస్తే, దాదాపు 1.4 బిలియన్ల జనాభా ఉన్న ఆఫ్రికా ఖండాన్ని లేదా యాభై కోట్ల మంది జనాభా ఉన్న 'ది ఎకనామిక్ కో–ఆపరేషన్ ఆర్గనైజేషన్' (ఈసీఓ)ను ఎందుకు పరిగణించలేదని కాకర్ ఆశ్చర్యపోయారు.

ఇక కశ్మీర్ విషయానికి వస్తే, కాకర్ 2019 ఆగస్టు నాటి రాజ్యాంగ మార్పుల విషయానికి వెళ్లలేదు. అయితే కశ్మీరీ ప్రజలకు చేసిన వాగ్దానాలను విస్మరించడంలో అంతర్జాతీయ సమాజానివి 'ద్వంద్వ ప్రమాణాలు' అని ఆయన ఆరోపించారు. కశ్మీర్ సమస్యకు పరిష్కారం చూపడం భారత్ లేదా పాకిస్తాన్ పని కాదనీ, కశ్మీరీలు తమ భవిష్యత్తును ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా తామే నిర్ణయించుకోవాలనీ ఆయన అన్నారు. ఏ 'వలసవాదం' కూడా శాశ్వతంగా ఉనికిలో ఉండదని, ఎంత కాలం పట్టినా దాని అంతానికి కూడా ఒక రోజంటూ ఉంటుందని ఆయన తన చారిత్రక అవగాహనను చాటుకున్నారు. ఈ అన్ని అంశాల్లో, కాకర్ జమ్మూ కశ్మీర్ సమస్యపై పాకిస్తాన్ ప్రామాణిక వైఖరిని మాత్రమే పేర్కొన్నారు.

భారత్–చైనా ఆర్థిక, వాణిజ్య సంబంధాలపై పాక్‌కు ఎలాంటి అభ్యంతరం లేదని కాకర్ పేర్కొన్నారు. భారత్‌తో అనుసంధానతను విస్తరించడానికి లేదా వాణిజ్యం చేయడానికి పాకిస్తాన్ విముఖంగా లేదనీ, అయితే వివాదాస్పద అంశాలు ప్రతిబంధకంగా ఉన్నాయనీ ఆయన అభిప్రాయపడ్డారు. భారత్, పాకిస్తాన్‌ల వాణిజ్యం 'గౌరవప్రదంగా' జరగాలని, యాచించడం ఒక ఎంపిక కాదని కూడా ఆయన వ్యాఖ్యానించారు. భారతదేశ ఆర్థిక వృద్ధిని గమనించిన కాకర్, భారతదేశం 8–10 శాతం వృద్ధి రేటును సాధించాలనుకుంటే, దానికి చౌకైన ఇంధన సరఫరా అవసరమన్నారు. మధ్య ఆసియా నుండి వచ్చే సరఫరాలను భారతదేశం విస్మరించలేదని సూచించారు. ఆ దేశాలు భారత్‌కు చమురును పాకిస్తాన్ మీదుగా రవాణా చేయవలసి ఉంటుందని ఆయన చెప్పకుండా వదిలేశారు. ఇంధన భద్రత కోసం సెంట్రల్ ఆసియన్ ఏజెన్సీ లేదా సహజ వాయువును లేదా చమురును తీసుకువచ్చే ఇరాన్ పైప్‌లైన్‌లు భారత్ పరిశీలనలో నిజంగా లేవని పాకిస్తాన్ విశ్లేషకులు ఇప్పటికీ అర్థం చేసుకోకపోవడమే విచిత్రం.

భారతదేశం అతి గర్వం అనే 'హుబ్రిస్ వ్యాధి'తో బాధపడుతోందనీ, కానీ చరిత్ర ఎప్పుడూ వైఫల్యంతో ముగుస్తుందనీ కాకర్ ఆరోపించారు. ఇస్లామిక్ రాడికలిజంపై దృష్టి సారించిన అంతర్జాతీయ సమాజం హిందుత్వ ప్రమాదాలను ఎందుకు విస్మరించిందని కాకర్ ఆశ్చర్యపోతూ, కెనడియన్ అనుభవం చూపినట్లుగా, పశ్చిమార్ధగోళంలో 'స్లీపర్ సెల్స్' అని పేర్కొన్న భారతీయ డయాస్పోరాలోని ఆర్ఎస్ఎస్ మద్దతుదారులతో దానిని ముడిపెట్టారు. అయితే హిందూ మతంతో పాకిస్తాన్‌కు ఎలాంటి సమస్యా లేదని ఆయన పేర్కొన్నారు. కానీ జిన్నా, వాస్తవానికి చేసింది అదే మరి. అది విభజనపై ఆయన పట్టుబట్టడానికి దోహదపడింది. కాకర్ 1937 తదుపరి జిన్నా గురించి చదవాలి.

భారతదేశంపై కాకర్ చేసిన వ్యాఖ్యలు 'అంతిమ–ప్రత్యర్థి' పట్ల పాకిస్తాన్‌కు ఉన్న అంతులేని శత్రుత్వాన్నీ, భారతదేశం ఎదుగుదల పట్ల దాని అసూయనూ చూపుతున్నాయి. భారత్‌తో వ్యాపారం చేయడం వల్ల పాకిస్తాన్ ప్రయోజనాలను పొందుతుందని పాక్ అధికారిక వ్యవస్థ గ్రహించిందనీ, అయితే 'కశ్మీర్ ఉచ్చు' దానిని హేతుబద్ధంగా వ్యవహరించకుండా నిరోధిస్తున్నదనీ కూడా ఆ వ్యాఖ్యలు నిరూపించాయి. మూడు దశాబ్దాలు, అంతకంటే ఎక్కువ కాలం భారతదేశానికి వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ప్రాయోజితం చేయడం అనేది పాకిస్తాన్‌లో భయంకరమైన ఆర్థిక పరిస్థితికి దారితీసింది. దీన్నుంచి బయటపడటానికి ఏకైక మార్గం ఏమిటంటే దాని 'ప్రత్యర్థి'తో ఆర్థిక వాణిజ్య సంబంధాలను ఏర్పరచుకోవడమే! అయితే సైన్యం అలా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు కాకర్ వ్యాఖ్యలు ఎటువంటి సూచనా చేయడం లేదు.

ఈలోగా, గతం నుండి పక్కకు వైదొలుగుతూ, కొంతమంది పాకిస్తాన్ మాజీ క్రికెట్ దిగ్గజాలు భారత క్రికెట్ గురించి మంచిగా మాట్లాడుతున్నారని గమనించడం కొత్తగా ఉంది. ముఖ్యంగా భారతదేశంలో క్రికెట్ ఆటను పెంపొందించే విధానాన్ని వారు ప్రశంసించారు. కానీ అలాంటి మనోభావాలు భారతదేశంపై పాక్ సైన్యం ఎత్తుగడల విషయంలో ఎటువంటి తేడానూ ప్రదర్శించవు.

వ్యాసకర్త విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

బాధాకర అధ్యాయం



రంగూన్ నుంచి 1948లో బయటికి గెంటబడ్డ తెలుగు జనాల్లో మా తాతయ్య కూడా ఉన్నారు. 1948, తర్వాత 1964లో బర్మా వదలాల్సి వచ్చిన తెలుగు–తమిళ జనప్రవాహపు సంగతి, ఆధునిక భారత చరిత్రలో మరిచిపోయిన అధ్యాయం.

– కిరణ్ కుమార్ కర్లపు, కస్టమ్స్ అధికారి

ఎంత ఘోరం



కూలిన సొరంగంలో 41 మంది చిక్కుకుని 16 రోజులైంది. ఉతికిన బట్టలు పంపడానికి లేదు. ఆరు అంగుళాల పైపు నుంచి పంపగలిగేది పరిమిత ఆహారమే. చలికాలం వస్తోంది. ఇప్పటివరకూ ఎవరినీ దీనికి బాధ్యుల్ని చేయలేదు. ఆస్ట్రేలియన్ నిపుణుడు క్రిస్మస్ వరకు వాళ్లు బయటికి వస్తారంటున్నారు. దానికి ఇంకా నెల రోజులుంది!

– రీతూపర్ణా ఛటర్జీ, జర్నలిస్ట్

స్ఫూర్తి ప్రదాతలు



26/11 ముంబయి దాడుల హీరోలు, బాధితులను గుర్తుచేసుకుంటున్నాను. విపత్కాలంలో వారు చూపిన ధైర్యం, త్యాగాలు మనకు స్ఫూర్తిని ఇస్తూనే ఉంటాయి.

– శుభ్‌మన్ గిల్, క్రికెటర్

అప్పుడే!



నేపాల్‌లో తిరిగి రాచరిక వ్యవస్థనూ, దేశానికి ఇదివరకు ఉన్న హిందూ రాజ్యపు హోదానూ పునరుద్ధరించాలని నిరసనలు వెలువెత్తుతుండటం గమనార్హం.

– అన్మోల్ సక్సేనా, జర్నలిస్ట్

అదే ముఖ్యం



ఢిల్లీలో జరిగే ప్రతి సంభాషణ– అది ట్రాఫిక్, ఆరోగ్యం, ఆహారం, ఫిట్‌నెస్, పార్టీలు, రాజకీయాలు వేటిమీదైనా కావొచ్చు– చివరికి ఏక్యూఐ (వాయు నాణ్యతా సూచీ) వైపు మరలుతుంది.

– పర్మీందర్ సింగ్, వ్యాపారవేత్త

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

సాహసోపేత నిర్ణయం!

ఆంధ్ర రాష్ట్రంలో 153 బీసీ కులాలు, వాటికి అనుబంధంగా మరో 145 ఉప కులాలు... మొత్తం 298 కులాలు ఉన్నాయి. దేశ, రాష్ట్ర ప్రగతిలో వీరిది అగ్రభాగం. అయితే వీరికి దక్కే ఫలాలు మాత్రం 20 శాతమే. అంటే జనాభాలో 80 శాతంగా ఉన్న బహుజనులకు 20 శాతం, 20 శాతంగా ఉన్న పెత్తందారీ వర్గానికి 80 శాతం లబ్ధి చేకూరుతున్నది. అందువల్లే దేశంలో తారతమ్యాలు పెరిగిపోయి, వర్గ పోరుకు దారితీసి, దరిద్ర దేశంగా మారిపోయింది. ఈ కులాలకు సంపూర్ణ న్యాయం జరగాలంటే కులగణన అవశ్యం. దానివల్లే స్వావలంబన సాధ్యం.

ఎన్నో కులాలూ, ఉపకులాలకు ఇంత వరకు జనాభా నిష్పత్తికి అనుగుణంగా న్యాయం జరగలేదు. స్వాతంత్ర్యానంతరం ఇప్పటివరకు చట్టసభలలో ప్రాతినిధ్యం లేదనేది నిష్ఠురసత్యం. ఉదాహరణకు గంగపుత్ర జాతికి సంబంధించి 14 ఉపకులాలు ఉన్నాయి. వాటిలో కేవలం 6 కులాలకు మాత్రమే ప్రాతినిధ్యం ఉన్నట్లు తెలుస్తుంది. ఇలా తక్కువ జనాభా కలిగిన కులాల జనాభా లెక్కలు ప్రభుత్వం దగ్గర లేకపోవడం వల్ల, ఇటు సంక్షేమం, అభివృద్ధి. అటు రాజకీయ ప్రయోజనాలు పొందలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

జగన్ చీకటిలో చిరు దీపంలా, అధికారం చేపట్టిన తర్వాత ప్రధానమైన 153 కులాలకు 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి, 56 మంది చైర్మన్‌లను 672 మంది డైరెక్టర్లను నియమించి చరిత్రలో మొదటిసారిగా బహుజనులకు, రాష్ట్ర వ్యాప్త రాజకీయ ప్రాధాన్యాన్ని కలిగించినారు. అంతేకాకుండా ప్రభుత్వ, పార్టీ పదవుల్లో 80 శాతం రిజర్వేషన్ కల్పించినారు. అయితే అన్ని కులాలవారూ జనాభా దామాషా ప్రకారం అవకాశాలు పొందినప్పుడే సామాజిక న్యాయం చేకూరినట్లు అవుతుంది. అందుకే కులాల వారీగా జనాభా గణన చేయడానికి పూనుకున్నారాయన. ఇది ఎంతో సాహసోపేతమైన నిర్ణయం. ఇప్పటివరకు ఏవైతే ఎక్కువ జనాభా కలిగిన బీసీ కులాలు ఉన్నాయో వాటికి మాత్రమే అన్ని ప్రయోజనాలు కలిగాయి.

దీని వెనుక కూడా కుట్ర దాగి ఉన్నది, దీనివల్ల బీసీ కులాలలోనే పోటీ తత్వాన్ని పెంచి, రాజకీయంగా అడ్డంగా చీల్చి, బలహీనం చేసే కుట్ర అది. కానీ తక్కువ జనాభా కలిగిన కులాలు గెలుపు ఓటముల దగ్గర తమ ప్రతాపాన్ని చూపించి, అనేక నియోజకవర్గాలలో ఓడించిన సందర్భాలు మరువరాదు. ఇది రాజకీయ పార్టీలకు కూడా నష్టమే. ఇంతకాలం తక్కువ జనాభా కలిగిన కులాలు 'అందని ద్రాక్ష పండు పుల్లన' అని సరిపెట్టుకొని బ్రతుకుతున్నాయి. కారణం వాటి కులగణన లేకపోవడమే. కులగణన చేయడం ద్వారా జల్లెడ బట్టి వారి వారి జనాభా ప్రాతిపదికన స్వావలంబన కలుగజేయడానికీ, ఐక్యతను చాటడానికీ కులగణన ఎంతగానో తోడ్పడుతుంది.

యావత్ సమాజం పెత్తందారుల గుప్పెట్లో ఉన్న నేటి తరుణంలో జగన్ ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం వల్ల పెత్తందార్లకు నిద్ర పట్టడం లేదు. అందుకే కుట్రలకు తెరలేపి అనేక రకాలుగా అబద్ధాలు, అర్ధసత్యాలను ప్రచారం చేస్తున్నారు. దీనిని బహుజనులందరూ గమనించి నడవాలి. జగన్ మోహన్ రెడ్డి లాంటి సంస్కరణ వాదులకు అండగా నిలబడాలి. అప్పుడే బహుజనుల కల సాకారం అవుతుంది. సంస్కరణలు సాధ్యమవుతాయి. పెత్తందారులు పలాయనం చిత్తగిస్తారు, సమసమాజ స్థాపనకు అడుగులు పడతాయి.

– కె.వి. రమణ
డైరెక్టర్, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్

బర్రెలక్క... ఎన్నికల వ్యవస్థ నైతిక చిహ్నం!

అభిప్రాయం



కంచ ఐలయ్య షెపర్డ్

బర్రెలక్క అసలు పేరు శిరీష. 25 సంవత్సరాల ప్రాయంలో ఉన్న ఈమె నిరుద్యోగి. దక్షిణ తెలంగాణలోని కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పేద బాలికలలోకెల్లా నిరుపేద. నిరుద్యోగ యువతకు ప్రతినిధిగా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలబడిన ఈమె, తెలంగాణ రాష్ట్రంలో ఓ సరికొత్త ఎన్నికల సంస్కృతినీ, నైతికతనూ సృష్టిస్తోంది. ఆమెకు సోషల్ మీడియా నుంచి భారీ మద్దతు ఉంది. తెలంగాణ నుండి, రాష్ట్రం వెలుపల నుండి కూడా ఆమె పోటీ చేస్తున్న నియోజకవర్గానికి చేరుకున్న వారు, ఆమెకు మద్దతుగా నిలబడటమే కాకుండా, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నుండి పోటీ చేస్తున్న ముగ్గురు సంపన్నులైన అభ్యర్థులను వణికిస్తున్నారు.

స్పష్టతతో కూడిన ఆమె ప్రసంగాలు ప్రజానీకాన్ని, మీడియాను ఆకర్షించే మంచి కమ్యూనికేటివ్ సామర్థ్యాలను కలిగి ఉన్నాయి. నామినేషన్ ఉపసంహరించుకోవాలని బెదిరించినా, పాఠశాలకు వెళ్లే ఆమె తమ్ముడిపై దాడి చేసినా ఆమె చలించలేదు. పోటీ చేసి, ఓటర్లకు నిజాలు చెప్పే హక్కు పట్ల ఆమెకున్న నిబద్ధత రాష్ట్రంలోనే కాకుండా, బహుశా దేశంలోనే సరికొత్త ఒరవడిని సృష్టిస్తోంది.

ఈ పేద యువతి అధికార పార్టీలోని అత్యంత బలహీనమైన కోణాన్ని ఎత్తి చూపింది. వసతి లేని హైదరాబాద్ నగరంలో నివసిస్తూ, అప్పుగా తీసుకున్న డబ్బును కోచింగ్ సెంటర్ల కోసం ఖర్చు చేయడం గురించిన తన కష్టాలను ఆమె వివరిస్తోంది. గ్రూప్–1 పరీక్షకు సిద్ధమవుతున్నప్పుడు, ఆమె చాలా రోజులపాటు రహదారులపై ఉండే కొన్ని ఉచిత భోజన కేంద్రాలకు వెళ్లి ఆరగించింది. లేదా, దేవాలయాల్లోని ప్రసాదాలతో కడుపు నింపుకొంది. అయినా సరే ఆమె కష్టపడి చదివింది, పరీక్షలు రాసింది. కానీ ఆ పరీక్షలను ఏదో ఒక సాకు చెప్పి రద్దు చేయడంతో హతాశురాలైంది. అందుకే ఇప్పుడు ఉద్యోగార్హత వయసు మీరిపోతున్న 40 లక్షల నిరుద్యోగుల కోసం తాను పోరాడుతానని పదేపదే చెబుతోంది.

ఆమె పట్టభద్రురాలు. పనిచేసి బతికే తల్లీ, ఇద్దరు తమ్ముళ్లూ ఉన్నారు. ఆమె తండ్రి తాగుబోతుగా మారి, భార్యకు కూడా చెప్పకుండా ఇంటి నుండి వెళ్లిపోయాడు. పైగా కుటుంబానికి ఉన్న కేవలం 10 గుంటల భూమిని కూడా అమ్మేశాడు. 'మా నాన్న ఆ భూమిని మా అమ్మకు, పిల్లలకు చెప్పకుండా ఎవరికో అప్పగించా'రని ఆమె చెబుతోంది. భూమిని స్వాధీనం చేసుకునేందుకు ఇప్పుడు మార్గం లేదు. 'నేను నా భూమిని తిరిగి పొందడానికి ప్రజల కాళ్లు పట్టుకుని వేడుకుంటూ వెళ్తాను. మా భూమిని ధరణి, తాగుబోతు తండ్రి మింగేశారు' అని ఒక టీవీ ఇంటర్వ్యూలో చెప్పింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు బర్రెలక్కకు 15 ఏళ్లు. కొత్త రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగంలో చేరి, తన తల్లికి సహాయం చేయాలనే ఆశతో పాఠశాల విద్యార్థిగా ఉన్న సమయంలోనే ఆమె రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో పాల్గొంది. అనేక ప్రభుత్వ సర్వీస్ పరీక్షలు రాసి, అగ్రశ్రేణి రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్ అయిన గ్రూప్–1 నుండి కానిస్టేబుల్ స్థాయి ఉద్యోగం వరకూ రాసిన అన్ని పరీక్షల్లో అర్హత సాధించింది. కానీ



ప్రతిసారీ పేపర్ లీక్ అయిందనో, ఇతర సమస్యలతోనో ఉద్యోగంలోకి ఆమె ఎంపిక వాయిదా పడింది. లేదా ఇప్పటికే రాసిన పరీక్షలను రద్దు చేశారు.

దాంతో తన కుటుంబ భవిష్యత్తు గురించి ఆమె ఏమీ పాలుపోని స్థితిలో ఉండిపోయింది. ఆమె తన ఫోన్‌లో వీడియోలు చేయడం నేర్చుకుంది. వాటిని తన Instagram @ barrelakkaలో పోస్ట్ చేయడం ప్రారంభించింది. ''హాయ్ ఫ్రెండ్స్, నేను మీ బర్రెలక్క. ఎంత కష్టపడి చదివినా, ఏ డిగ్రీలు చదివినా తెలంగాణలో ఉద్యోగాలు ఇవ్వరు. అందుకే అమ్మ తీవ్ర ప్రయత్నంతో నాలుగు బర్రెలు కొన్నాను. ఇప్పుడు నేను పొలాల్లో నా బర్రెలతో ఉన్నాను'' అంటూ ఒక వీడియోను పోస్ట్ చేసింది. ఆ వీడియో వైరల్‌గా మారింది. ఆమె ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేస్తోందని, ఐపీసీ సెక్షన్ 505 (2) కింద ఉన్నతాధికారుల దన్నుతో ఆమెపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు చుట్టూ పరిగెత్తేలా చేశారు. దీంతో ఆమె జీవితం మరింత దుర్భరంగా మారింది.

ఈ పోరాట క్రమంలో, 2023లో రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు రావడంతో ఆమెకు కాస్త ప్రాణమొచ్చినట్లయింది. మనుగడ కోసం పోరాటంలో చివరి ప్రయత్నంగా, ఆమె కొల్లాపూర్ నియోజకవర్గానికి నామినేషన్ దాఖలు చేసింది. ఆమె నామినేషన్ ఎన్నికల పరిశీలనలో గట్టెక్కుతుందని ఏ పెద్ద రాజకీయ నాయకుడూ ఊహించలేదు. ఉద్యోగ పరీక్షల్లో ఆమె జవాబు పత్రాలు పనికిరాకుండా పోయినట్లుగా, ఆమె నామినేషన్ కూడా అయిపోతుందని వారు భావించారు. కానీ ఆమె నామినేషన్ తిరస్కరణకు గురికాలేదు. ఆమెకు విజిల్ గుర్తు ఇచ్చారు.

నేను ఈ కథనాన్ని రాస్తున్నప్పుడు, రోడ్డు పక్కన పడుకుంటూ ఉన్న ఆమెకు తోడుగా ఉండటానికి చిన్న మొత్తాలు పట్టుకుని వచ్చిన మద్దతుదారులతో, ఆమెను ఇష్టపడే వారితో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం మొదలైంది. యూట్యూబ్ ఛానెళ్లు ఆమెను అనుసరిస్తున్నాయి. పాటల రచయితలు, గాయకులు చాలా శక్తిమంతమైన పాటల వీడియోలను తయారు చేసి అప్‌లోడ్ చేస్తున్నారు. నేను నవంబర్ 25న ఆమెతో ఉన్నాను. వందలాది మంది నిరుద్యోగ యువకులు ప్రచారంలో ఆమె వెంట ఉన్నారు. రెండు రాష్ట్రాల నుంచి ఎన్నో కార్లు వచ్చి నిలిచాయి. వాళ్లు 'బర్రెలక్కకు ఓటేద్దాం, ఈల గుర్తుకు ఓటేద్దాం, నిరుద్యోగ యువత జీవితాలను కాపాడుదాం' అని నినదిస్తున్నారు. ఆమె ప్రచారం చుట్టూ ఉన్న వాతావరణం ఈ ఎన్నికలలో ఒక నవజాత నైతిక శక్తిని చూపించింది. తెలంగాణ ఎన్నికల్లో కొత్త వాతావరణాన్ని సృష్టించిన ఆమె కచ్చితంగా నైతిక రాజకీయ పోరాట యోధురాలుగా మారింది. ఈ ఎన్నికల్లో ఆమె గెలిచినా, ఓడినా అది వేరే విషయం. కానీ యువతకు ముందుకెళ్లాల్సిన ఒక దిశను ఆమె చూపుతోంది.

ఆమె కుటుంబ భద్రత విషయంలో రాష్ట్రప్రభుత్వం, ఎన్నికల సంఘం పక్కదారి పడుతున్నందున, బర్రెలక్కకు రక్షణ కల్పించాలని కోరుతూ న్యాయవాదులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఆమె అసాధారణమైన ధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని ప్రదర్శించినందున ఆ బలహీనమైన పేద యువతిని సంపన్నులు ఏదైనా చేయగలరేమోననే భయం అలముకుని ఉంది. హైకోర్టు కూడా ఆమెకు రక్షణ కల్పించమని సంబంధిత అధికార్లను ఆదేశించింది కూడా!

సహస్రాబ్దాలుగా ఈ దేశంలో ఉన్న గేదె పాలను తలపిస్తూ 'బఫెలో సిస్టర్' అని పేరుపెట్టుకున్న బర్రెలక్క భావి జీవితానికి గొప్ప ఆశాకిరణం.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.పాడ్యమి ప.1.38 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** రోహిణి ప.1.53 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:**రా.7.38 నుండి 9.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.26 నుండి 9.14 వరకు, తదుపరి రా.10.31 నుండి 11.19 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.43 నుండి 12.17 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.15, **సూర్యాస్తమయం:** 5.20.

క్లుప్తంగా...

వైభవంగా కార్తీక పౌర్ణమి గరుడసేవ



గరుడ వాహనంపై మలయప్ప స్వామి

తిరుమల: తిరుమలలో కార్తీక పౌర్ణమి గరుడ సేవ సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామి వారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

సుంకేసుల నుంచి శ్రీశైలం డ్యామ్‌కు వరద

శ్రీశైలంప్రాజెక్ట్: సుంకేసుల జలాశయం నుంచి సోమవారం శ్రీశైలం డ్యామ్‌కు 1,824 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం నుంచి సోమవారం వరకు శ్రీశైలం నుంచి దిగువ ప్రాంతాలకు 3,736 క్యూసెక్కుల నీరు విడుదలైంది. హంద్రీనీవా సుజల స్రవంతికి 1,013 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 245 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 60.3340 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్ నీటిమట్టం 839 అడుగులకు చేరుకుంది.

45 పట్టణాల్లో జియో ఎయిర్ ఫైబర్ సేవలు

జియో ఏపీ ఈవోఎం మహేష్ కుమార్

సాక్షి, అమరావతి: రిలయన్స్ జియో హై స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ ఇంటిగ్రేటెడ్ ఎండ్ టు ఎండ్ సొల్యూషన్స్ అయిన జియో ఎయిర్‌ఫైబర్ సేవలను రాష్ట్రంలో ప్రవేశపెట్టింది. ఆప్టికల్ ఫైబర్ సేవలు అందుబాటులో లేని వారికి కూడా హైస్పీడ్ బ్రాడ్ బ్యాండ్ సేవలను అందించే విధంగా ఎయిర్ ఫైబర్ సేవలను రాష్ట్రంలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు రిలయన్స్ జియో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలోని 45 పట్టణాల్లో ఈ సేవలను అందిస్తున్నట్లు జియో ఏపీ ఈవోఎం మహేష్ కుమార్ పేర్కొన్నారు. 30 ఎంబీపీఎస్ స్పీడ్‌తో రూ.599కే అపరిమిత డేటాను, 100 ఎంబీపీఎస్ స్పీడ్‌తో అపరిమిత డేటాను రూ.899, రూ.1,199లకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ప్యాకేజీలో 550కుపైగా డిజిటల్ టీవీ చానల్స్, ప్రముఖ ఓటీటీ చానల్స్‌ను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 60008-60008 నంబర్‌కు కాల్ చేయడం కానీ www.jio.comలో లాగిన్ కావాల్సిందిగా కోరారు.

రామేశ్వరం రైలుకు తప్పిన ప్రమాదం

- పి.కొత్తకోట వద్ద విరిగిన రైలు పట్టా



పూతలపట్టు మండలం పి.కొత్తకోట వద్ద విరిగిన రైలు పట్టా

యాదమరి (చిత్తూరు జిల్లా): చిత్తూరు జిల్లా పూతలపట్టు మండల పరిధిలోని రైల్వే కీ మెన్ అప్రమత్తం కావడంతో రామేశ్వరం రైలుకు పెనుప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు-తిరుపతి రైల్వే ట్రాక్‌లో పూతలపట్టు మండలంలోని పి.కొత్తకోట వద్ద రైలు పట్టా విరిగిపోయింది. ఈ విషయాన్ని రైల్వే కీ మెన్ సుజిత్ ఉదయం 9.15 గంటలకు గుర్తించారు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వెంటనే అక్కడకు చేరుకుని పట్టాకు వెల్డింగ్ చేపట్టారు. ఇదే సమయంలో రామేశ్వరం నుంచి తిరుపతికి వెళ్లే రైలు వెళ్లాల్సి ఉంది. అధికారులు ఆ రైలు డ్రైవర్‌కు ముందస్తు సమాచారం ఇచ్చి అరగంట పాటు నిలిపివేశారు. పట్టాకు వెల్డింగ్ పనులు పూర్తి కాగానే రైలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి పంపారు.

స్టీల్‌ప్లాంట్‌కు ఈఈపీసీ స్టార్ పెర్ఫార్మర్ అవార్డులు



మార్కెటింగ్ అధికారులను అభినందిస్తున్న సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ మొహంతి

ఉక్కునగరం (విశాఖ జిల్లా): స్టీల్ ప్లాంట్‌కు 2019-20, 2020-21 ఆర్థిక సంవత్సరాల్లో స్టార్ పెర్ఫార్మర్ అవార్డులు లభించాయి. ఇంజినీరింగ్ ఎగుమతి ప్రమోషన్ కౌన్సిల్ (ఈఈపీసీ) ఆధ్వర్యంలో అంతర్జాతీయ వాణిజ్యంలో, విజయవంతమైన ఎగుమతిలో ప్రతిభ కనబరిచే సంస్థలకు ఏటా అవార్డులను అందజేస్తుంటారు. 2019-20లో రూ.1,623 కోట్లు, 2020-21లో రూ.3,941 కోట్ల విలువైన ఉత్పత్తులను స్టీల్‌ప్లాంట్ ఎగుమతి చేసింది. ఈ నేపథ్యంలో ప్రాథమిక ఇనుము, ఉక్కు ఎగుమతిలో భారీ పరిశ్రమల కేటగిరీలో స్టీల్‌ప్లాంట్‌కు ఈ అవార్డులను ప్రకటించారు. జమ్ము, కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ (కమర్షియల్) డీకే మొహంతిలు మార్కెటింగ్ అధికారులను అభినందించారు.

కాంతులీననున్న కొత్త సబ్‌స్టేషన్లు

నేడు వర్చువల్ విధానంలో 16 సబ్‌స్టేషన్లకు సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన, 12 సబ్‌స్టేషన్లకు ప్రారంభోత్సవం

సాక్షి, అమరావతి : అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా రానున్న రోజుల్లో ఏపీ గణనీయమైన వృద్ధి, పట్టణీకరణ జరిగే క్రమంలో ఎదురయ్యే విద్యుత్ డిమాండ్‌ను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. భవిష్యత్తులో నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు వీలుగా విద్యుత్ రంగం బలోపేతంపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా.. రాష్ట్ర విద్యుత్ రంగ చరిత్రలో తొలిసారిగా ఒకేసారి 28 సబ్‌స్టేషన్లకు ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ ట్రాన్స్‌కో) శ్రీకారం చుడుతోంది. వీటిలో 16 సబ్‌స్టేషన్ల శంకుస్థాపన, 12 సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం వర్చువల్ విధానంలో చేయనున్నారు. రూ.3,100 కోట్ల వ్యయంతో కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప, సత్యసాయి, ప్రకాశం, గుంటూరు, ఏలూరు, పశ్చిమ గోదావరి, కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, పల్నాడు, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, అన్నమయ్య జిల్లాల పరిధిలోని 28 ప్రాంతాల్లో 132/33 కేవీ, 220/132 కేవీ, 400/220 కేవీ, 400/132 కేవీ సామర్థ్యాలతో ఈ సబ్‌స్టేషన్లు ఏర్పాటవుతున్నాయి.

రెండు సోలార్ ప్రాజెక్టులు కూడా..

ఇవికాక.. కడపలో 750 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు, అనంతపురంలో 100 మెగావాట్ల మరో సోలార్ ప్రాజెక్టు నిర్మాణానికి కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. కడప జిల్లా మైలవరం మండలంలో 1,000 మెగావాట్ల సోలార్ పార్కు అభివృద్ధికి కేంద్ర పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ



(ఎంఎన్ఆర్ఈ) ఆమోదం తెలిపింది. ఇందులో 250 మెగావాట్లను 2020 ఫిబ్రవరి 8న ప్రారంభించారు. మిగిలిన 750 మెగావాట్లను సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ) ద్వారా అభివృద్ధి చేయనున్నారు. ఈ 750 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టుకు రూ.3 వేల కోట్లు పెట్టుబడి అవుతుందని అంచనా. ఏడాదిలో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి 1,500 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ ప్లాంట్ ఏటా 1,500 మిలియన్ యూనిట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీనిద్వారా సంవత్సరానికి 12 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించవచ్చని అంచనా. అలాగే.. శ్రీ సత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లోని ఎన్.పీ.కుంట, గాలివీడు గ్రామాల వద్ద 1,500 మెగావాట్ల సోలార్ పార్క్‌కు ఎంఎన్ఆర్ఈ ఆమోదం తెలిపింది. వివిధ సోలార్ పవర్ డెవలపర్లు 1,400 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్రాజెక్టులను ఇప్పటికే పూర్తిచేశారు. మిగిలిన 100 మెగావాట్ల కోసం, హెచ్‌పీసీఎల్ ముందుకొచ్చింది. ఈ సోలార్ ప్రాజెక్టుకు రూ.400 కోట్లు పెట్టుబడి అంచనా వేయగా, ఏడాది నిర్మాణ కాలంలో 200 మందికి ఉపాధి లభించనుంది. ఈ ప్లాంట్ ఏటా 200 మిలియన్ యూనిట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. తద్వారా ఏటా 1.6 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించవచ్చు.

గడువులోగా ప్రాజెక్టులు పూర్తి

విద్యుత్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిర్ణీత సమయానికి పూర్తి చేసేందుకు పక్కాగా ప్రణాళికలు రూపొందించాలని విద్యుత్ సంస్థలను ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కె. విజయానంద్ ఆదేశించారు. సీఎం కార్యక్రమం ఏర్పాట్లపై విద్యుత్ సౌధలో సోమవారం ఆయన అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి, అందుకు తగ్గట్లుగా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి రాష్ట్ర విద్యుత్ సంస్థలు సిద్ధంగా ఉన్నాయన్నారు. సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అందించిన సహాయ సహకారాలతోనే వినియోగదారులకు 24 గంటలూ నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు ఇవ్వగలుగుతున్నామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జెన్‌కో ఎండీ, ట్రాన్స్‌కో జేఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ జేఎండీ బి. మల్లారెడ్డి, డిస్కంల సీఎండీలు ఐ. పృథ్వీతేజ్, జె. పద్మజనార్ధనరెడ్డి, కె. సంతోషరావు, ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ ఎండీ, సీఈఓ కమలాకర్ బాబు, డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీశైలంలో లక్ష దీపోత్సవం



శ్రీశైలంటెంపుల్: కార్తీకమాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలో ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం, పుష్కరిణి హారతి కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్ద కొలువుంచి పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు, పుష్కరిణికి దశవిధ హారతులిచ్చారు. పుష్కరిణి ప్రాంగణమంతా లక్ష దీపాలను ఏర్పాటు చేసి వెలిగించారు. పౌర్ణమి ఘడియలు మధ్యాహ్నం వరకు ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో డి.పెద్దిరాజు దంపతులు పాల్గొన్నారు.

వరాహ పుష్కరిణికి పుణ్యనదీ హారతి



నక్షత్ర హారతి ఇస్తున్న అర్చకుడు, చిత్రంలో స్వరూపానందేంద్ర సరస్వతి

సింహాచలం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానానికి చెందిన వరాహ పుష్కరిణికి పుణ్యనదీ హారతి (గంగా హారతి) కార్యక్రమం విశేషంగా నిర్వహించారు. కొండదిగువ దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో నుంచి స్వామివారి ఉత్సవమూర్తులను తిరువీధిగా తీసుకెళ్లి వరాహ పుష్కరిణి వద్ద వేదికపై ఉంచారు. సింహాద్రినాథుడి నిజ, నిత్య రూపాల నమూనాను ఏర్పాటు చేశారు. స్వామివార్లకు ద్వయ హారతి, కుంభహారతి, నక్షత్ర హారతులను ఇచ్చారు. అనంతరం ఎనిమిది మంది అర్చకులు ఒకేసారి వరాహ పుష్కరిణికి నక్షత్ర హారతి కార్యక్రమం నిర్వహించారు. విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

భక్తజన సంద్రంగా రత్నగిరి

సత్యదేవుని దర్శించిన లక్షన్నర మంది భక్తులు • గిరిప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు

అన్నవరం: కార్తీక పౌర్ణమి, రెండో సోమవారం కలిసి రావడంతో కాకినాడ జిల్లా అన్నవరంలోని రత్నగిరిపై సత్యదేవుని ఆలయం భక్తజన సంద్రంగా మారింది. రికార్డు స్థాయిలో సుమారు లక్షన్నర మంది భక్తులు సత్యదేవుని దర్శించారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది. ఈ కార్తీక మాసంలో రికార్డు స్థాయిలో సోమవారం 15 వేలకు పైగా సత్యదేవుని వ్రతాలు ఆచరించారు. ఒక దశలో వ్రతాలు నిర్వహించలేక మూడు గంటలు వ్రతాల టికెట్లు నిలిపివేశారు. సోమవారం అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.1.50 కోట్లు ఆదాయం వచ్చినట్లు అంచనా. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో రామచంద్రమోహన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కాగా, ఉదయం 8 గంటలకు ప్రారంభమైన సత్యదేవుని గిరిప్రదక్షిణ 12 గంటల వరకు సుమారు 11 కిలోమీటర్ల మేర కొనసాగింది. రెండు లక్షల మంది భక్తులు గిరిప్రదక్షిణ చేశారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్ గిరిప్రదక్షణలో పాల్గొన్నారు.



సత్యదేవుని గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

'కార్తీక' చంద్రుడు

శరత్కాల వెన్నెల్లో..
నిర్మల ఆకాశంలో..కార్తీక
పౌర్ణమి శోభతో నిండుచంద్రుడు
మెరిసిపోయాడు.భక్తిభావంతో
ప్రజలు పరవశించిపోయారు.
విజయవాడ నగరంలో
సోమవారం రాత్రి కనువిందు
చేసిన చంద్రబింబాన్ని
సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



అండమాన్ సముద్రంలో అల్పపీడనం!

- 29కి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా మార్పు
- ఒకటో తేదీకి తుపానుగా బలపడే అవకాశం

సాక్షి, విశాఖపట్నం: మలక్కా జలసంధి పరిసర ప్రాంతాలకు ఆనుకుని దక్షిణ అండమాన్ సముద్రంలో సోమవారం ఉదయం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ బుధవారం (29వ తేదీ) నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా మారనుంది. అనంతరం వాయవ్య దిశగా కదులుతూ అదే ప్రాంతంలో 30న తీవ్ర వాయుగుండంగానూ, డిసెంబర్ ఒకటో తేదీకి తుపానుగానూ బలపడనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ప్రస్తుతం ఉన్న వెదర్ మోడల్స్ ప్రకారం తుపాను కదలికను సూచించే సైక్లోన్ ట్రాక్ ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు మాత్రమే ఉంది. సాధారణంగా అల్పపీడనం ఏర్పడిన తర్వాత వాయుగుండం/తుపానుగా బలపడే అవకాశాలున్నప్పుడు సైక్లోన్ ట్రాక్‌ను బట్టి అది పయనించే దిశను తెలియజేస్తారు. కానీ రానున్న తుపాను గమ్యం పశ్చిమ మధ్య బంగాళాఖాతం చేరువ వరకే సూచిస్తోంది. ప్రస్తుతం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సముద్ర ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండి చల్లని వాతావరణం కొనసాగుతోంది. ఈ పరిస్థితి ఉన్నప్పుడు తుపానులేర్పడితే



అవి బలపడే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. అయితే అందుకు భిన్నంగా సముద్ర ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటే మరింత బలపడేందుకు దోహదపడతాయని వీరు పేర్కొంటున్నారు. కాగా పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం గానీ, వాయుగుండం గానీ, తుపాను గానీ ఏర్పడితే ఆ ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పైనే అధికంగా ఉంటుంది. అందువల్ల రానున్న తుపాను ప్రభావం మన రాష్ట్రంపై ఏ మేరకు ఉంటుందన్నది పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించాక బలపడుతుందా? బలహీన పడుతుందా? అన్న దానిపై ఆధారపడి ఉంటుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దీనిపై రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని ఐఎండీ అధికారులు చెబుతున్నారు. మరోవైపు రానున్న మూడు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

2 నుంచి పీఎల్‌జీఏ వార్షికోత్సవాలు

సీపీఐ మావోయిస్టు పార్టీ ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్

జి.మాడుగుల (అల్లూరి సీతారామరాజు జిల్లా): ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పీఎల్‌జీఏ) 23వ వార్షికోత్సవాలను డిసెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు ఏవోబీ జోన్ వ్యాప్తంగా విప్లవోత్సాహంతో జరుపుకుందామంటూ సీపీఐ మావోయిస్టు పార్టీ ఆంధ్ర-ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ సోమవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. భారత విప్లవోద్యమ నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న విప్లవ ప్రతీఘాతుక చర్యలకు నిరసనగా 2000 సంవత్సరం డిసెంబర్ 2న పీఎల్‌జీఏ పురుడు పోసుకుందని తెలిపారు. ప్రజల్లో ఓ వర్గాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడంలో భాగంగా ప్రభుత్వాలు అనేక బూటకపు సంస్కరణలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యమానికి మద్దతు ప్రకటిస్తున్న అనేకమంది హక్కుల కార్యకర్తలు, మేధావులు, విద్యార్థులపై అర్బన్ నక్సల్స్ పేరుతో దాడులు చేయిస్తూ, భయోత్పాతాన్ని సృష్టిస్తున్నారని తెలిపారు. మైనింగ్ మాఫియాకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలకు మద్దతు ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. వాకపల్లి గ్రామ మహిళలు గత 16 సంవత్సరాలుగా కొనసాగిస్తున్న న్యాయమైన పోరాటానికి మావోయిస్టు పార్టీ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

చిన్నారి అపహరణ

- ఒంగోలులో తల్లిదండ్రులను ఏమార్చి తీసుకెళ్లిన మహిళ, పురుషుడు
- గాలిస్తున్న ప్రత్యేక పోలీస్ బృందం




దేవరకొండ నిరీక్ష

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలో తొమ్మిది నెలల వయసు గల చిన్నారిని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గుడ్లూరుకు చెందిన దేవరకొండ ఆనంద్, రజినీ దంపతులు బాతులు కాసుకుంటూ సంచార జీవితాన్ని సాగిస్తున్నారు. ఆనంద్, రజినీ తమ కుమార్తె నిరీక్ష (9 నెలలు)ను తీసుకుని 15 రోజుల కిందట ఒంగోలు వచ్చి నగరంలోని కొప్పోలు రోడ్డులో రైల్వే ఫ్లై ఓవర్‌కు సమీపంలో గుడారం ఏర్పాటు చేసుకుని బాతులను దొడ్డిలో పెట్టుకుని జీవిస్తున్నారు. యథావిధిగా ఆదివారం రాత్రి గుడారం బయట మంచాలు వేసుకుని పడుకున్నారు. వారివద్దకు 11గంటల సమయంలో స్కూటీపై ఒక మహిళ, పురుషుడు వచ్చి తాగేందుకు మంచినీళ్లు అడిగారు. దీంతో చిన్నారి నిరీక్ష పక్కన పడుకుని ఉన్న రజినీ లేచి మంచినీళ్లు తెచ్చేందుకు గుడారం లోపలికి వెళ్లింది. వెంటనే మంచంపై ఉన్న చిన్నారి నిరీక్షను తీసుకుని స్కూటీపై వచ్చినవారు ఉడాయించారు. మంచినీళ్లు తీసుకుని బయటకు వచ్చిన రజినీ... మంచం మీద బిడ్డ లేకపోవటాన్ని గమనించి కేకలు వేసింది. వెంటనే ఆనంద్ లేచి స్కూటీ వెళ్లిన మార్గంలో పరుగుతీశాడు. అయినా వారు కనిపించలేదు. దీంతో ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో నిరీక్ష తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. తాలూకా సీఐ వి.భక్తవత్సలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలిక కోసం గాలించేందుకు ఎస్పీ మలికాగర్గ్ ప్రత్యేక పోలీసు బృందాన్ని నియమించారు. ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామి రెడ్డి నేతృత్వంలో బాలిక కోసం ప్రత్యేక పోలీస్ బృందం ముమ్మరంగా గాలిస్తోంది.

సీఎం హామీల సత్వర అమలుకు చర్యలు తీసుకోండి

సంబంధిత అధికారులకు సీఎస్ ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సీఎం హామీలపై సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆయా శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. సీఎం జగన్ జిల్లాల పర్యటనల సందర్భంగా, వివిధ బహిరంగ సభల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు సహా వివిధ ప్రజా ప్రతినిధుల లేఖలకు సీఎం స్పందించి ఇచ్చిన హామీలు, ఇతర సందర్భాల్లోనూ ఇచ్చిన హామీల అమలుకు సంబంధించి ఇప్పటి వరకూ తీసుకున్న చర్యలపై సమీక్షించారు. మొత్తం 443 సీఎం హామీలకు గాను ఇప్పటికే 123 హామీలకు పైగా పరిష్కరించారు. ఇంకా 224 వివిధ శాఖాధిపతుల స్థాయిలో ప్రోగ్రెస్‌లో ఉండగా, 24 అంశాలకు సంబంధించి స్టేటస్ అప్డేట్ చేయాల్సి ఉంది. ఆర్థిక అంశాలకు సంబంధించి 72 హామీలు ఆ శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని సీఎస్ తెలిపారు. శాఖల వారీగా ఆయన సమీక్షించారు. వాటిని వెంటనే అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, టీఆర్ అండ్ బీ కార్యదర్శి ప్రద్యుమ్న, సీఎంవో కార్యదర్శి ఆర్.ముత్యాల రాజు, సీఎంవో అదనపు కార్యదర్శి భరత్ గుప్త, గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మిశా తదితరులు పాల్గొన్నారు. అలాగే వీడియో లింక్ ద్వారా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సాక్షి సాగుబడికి అవార్డు



భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ, న్యూట్రిహబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సోమవారం జరిగిన చిరుధాన్యాల అంతర్జాతీయ సమ్మేళనంలో 'పోషక్ అనాజ్' పురస్కారం అందుకుంటున్న సాక్షి సాగుబడి ఇన్‌చార్జి పంతంగి రాంబాబు

ఎలుగుబంటి దాడిలో యానిమల్ కీపర్ మృతి

విశాఖ ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో ఘోరం

ఆరిలోవ (విశాఖ తూర్పు): ఓ ఎలుగుబంటి దాడిలో యానిమల్ కీపర్ ప్రాణాలు కోల్పోయిన ఘటన విశాఖ ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో సోమవారం చోటు చేసుకుంది. జూ క్యూరేటర్ నందనీ సలారియా వివరాలను వెల్లడించారు. జూలో జిహ్వాన్ పేరు గల సుమారు 12 ఏళ్ల మగ హిమాలియన్ బ్లాక్ బేర్ (ఎలుగుబంటి)ను మణిపూర్ రాష్ట్రం ఐజ్వాల్ జూ నుంచి ఏడాది క్రితం విశాఖ జూకి తీసుకొచ్చారు. విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం బూర్జివలస గ్రామానికి చెందిన బనవరపు నగేష్‌బాబు (23) ఎలుగుబంటి ఎన్‌క్లోజర్ వద్ద యానిమల్ కీపర్‌గా కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 9 గంటల సమయంలో ఎలుగుబంటిని డే క్రాల్‌లోకి విడిచిపెట్టడానికి వెళ్లాడు. నైట్ క్రాల్‌లో ఉన్న ఎలుగుబంటిని లిఫ్టెట్ డోర్ తెలిచి డే క్రాల్ (సందర్శకులు చూసే ఎన్‌క్లోజర్)లోకి విడిచిపెట్టాడు. మళ్లీ ఆ డోర్ మూయడం మరిచిపోయి నైట్‌క్రాల్‌ను శుభ్రం చేస్తున్నాడు. దీంతో ఎలుగుబంటి డే క్రాల్ నుంచి మళ్లీ నైట్ క్రాల్‌లోకి ప్రవేశించి నగేష్ ముఖం, గుండెపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. దీంతో నగేష్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. సెక్యూరిటీ గార్డు ద్వారా విషయం తెలుసుకున్న జూనియర్ డాక్టర్ వెంటనే క్యూరేటర్‌కు విషయం తెలియజేశారు. దీంతో క్యూరేటర్ ఆదేశాలతో జూ రెస్క్యూ బృందం, సిబ్బంది కలసి ఎలుగుబంటిని డే క్రాల్‌లోకి తరలించారు. నైట్ క్రాల్‌లో పడి ఉన్న నగేష్ మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. జూ అధికారులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా నగేష్ ..భవానీమాల ధరించారు. ఎరుపు రంగు బట్టలకు ప్రతిస్పందించి ఎలుగుబంటి దాడి చేసిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, నగేష్ కుటుంబానికి నష్టపరిహారంగా ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. దీంతో పాటు పీఎఫ్ డబ్బులు కూడా తక్షణమే వచ్చేటట్లు కృషి చేస్తామన్నారు.

నకిలీ బంగారంతో రూ 2.71 కోట్లకు టోకరా

గుంటూరు రూరల్: గుంటూరు నగర శివారులోని ఒక బ్యాంకు బ్రాంచిలో భారీ మోసం బయటపడింది. కొందరు వ్యక్తులు నకిలీ బంగారం తాకట్టు పెట్టి రుణాలు పొందినట్టు వెల్లడైంది. ఇందులో బ్యాంకు అప్రైజర్ ప్రమేయం కూడా ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ వ్యవహారం బయటపడకుండా కొందరు అధికారులు నిజమైన బంగారం తాకట్టు పెట్టిన వారికి వారు వడ్డీతో కలిపి చెల్లించాల్సిన మొత్తం కంటే ఎక్కువ కట్టాలని నోటీసులు పంపడం, ఆడిట్‌లో అసలు విషయాలు వెలుగుచూడటంతో మొత్తం గుట్టంతా రట్టయింది. మొత్తం 107 మంది నకిలీ బంగారంతో రుణాలు పొందినట్లు వెల్లడైంది. నిజమైన బంగారంతో రుణాలు పొందిన ఖాతాదారులు బ్యాంకుకు వచ్చి ఎక్కువ మొత్తానికి ఎందుకు నోటీసులు ఇచ్చారని ప్రశ్నించినందుకు వారిని కూడా ఇబ్బంది పెట్టినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంపై ఆడిట్ ధికారులు, బ్యాంక్ అధికారులు గుంటూరు నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం నల్లపాడు సీఐ రాంబాబు వెల్లడించిన వివరాల ప్రకారం.. గుంటూరు – అమరావతి రోడ్డు గోరంట్ల గ్రామంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలో ఆడిట్ నిర్వహిస్తుండగా వెండి వస్తువులకు బంగారు పూత పూసి బంగారు వస్తువులుగా చూపి పలువురు కోట్ల రూపాయలు రుణాలు పొందారని బ్యాంక్ ఇంటర్నల్ అధికారి అనిల్ డెకాటె, బ్యాంక్ రీజినల్ మేనేజర్ ధనరాజ్ ఫిర్యాదు చేశారు. 2021 జనవరి 29 నుంచి 2023 నవంబరు 16 వరకు ఆడిట్ నిర్వహించగా 107 ఖాతాలలో నకిలీ బంగారంతో రుణాలు పొందినట్లు గుర్తించారు. వీటిలో దాదాపు 100 ఖాతాలలో నకిలీ బంగారం పెట్టి రుణం పొందే సమయంలో రీ అప్రైజల్ కూడా నిర్వహించలేదని గుర్తించారు. ఈ విధంగా నకిలీ బంగారంతో రూ.2.71 కోట్లు బ్యాంకుకు టోకరా వేసినట్లు తేలిందన్నారు. లోన్ అప్లికేషన్స్, అప్రైజల్ తదితర పరిశీలనలు చేయకుండా రుణాలు ఇచ్చినట్లు గుర్తించారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. నిజమైన బంగారంతో రుణాలు పొందిన పలువురు ఖాతాదారులకు వారు తీసుకున్న రుణం కంటే రెండు రెట్లకు నోటీసులు రావడంతో వారంతా కూడా పోలీసులను ఆశ్రయిస్తున్నట్లు సమాచారం.

బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ మరణంపై అనుమానాలు

సాక్షి, పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసనాయక్ మరణంపై ఆయన కుటుంబసభ్యులు, బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శ్రీనివాసనాయక్ ఈనెల 22వ తేదీ రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. విచారణ చేస్తున్న సమయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి తప్పించుకుని ఓ వ్యక్తి తెచ్చిన బైక్‌పై పారిపోయారు. 25వ తేదీన చెన్నైలోని లాడ్జిలో శ్రీనివాసనాయక్ ఆత్మహత్య చేసుకొని మరణించినట్లు తెలిసింది. అయితే ఆయన్ని హత్య చేసి ఉంటారని.. సమగ్ర దర్యాప్తు చేసి వాస్తవాలు నిగ్గు తేల్చాలని కుటుంబ సభ్యులు, గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పెనుకొండ మండలం గోనిపేటలో శ్రీనివాసనాయక్ మృతదేహంతో ధర్నా నిర్వహించారు. పెనుకొండ డీఎస్పీ హుస్సేన్‌పీరా సర్దిచెప్పడంతో పరిస్థితి నియంత్రణలోకి వచ్చింది. అనంతరం శ్రీనివాసనాయక్ మృతదేహానికి గోనిపేటలో అంత్యక్రియలు పూర్తి చేశారు. కుటుంబ సభ్యులు, బంధువులు మీడియాతో మాట్లాడుతూ.. శ్రీనివాసనాయక్ మృతిపై సీఐడీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే మనోహర్‌ను విచారించాలని కోరారు. శ్రీనివాసనాయక్ ఫోన్ నుంచి మనోహర్‌కు ఎక్కువసార్లు కాల్స్ వెళ్లినట్లు తెలిసిందన్నారు. అలాగే లాడ్జిలో బాబావలి పేరుతో గది బుక్ చేసి ఉందని.. అతను ఎవరో తేల్చాలని కోరారు.

క్లుప్తంగా...

'ప్రొఫెట్ సాంగ్' పుస్తకానికి బుకర్ ప్రైజ్

ఐర్లాండ్ రచయిత పాల్ లించ్‌కు ప్రతిష్టాత్మక బహుమతి



లండన్: ఐర్లాండ్ రచయిత పాల్ లించ్ రాసిన 'ప్రొఫెట్ సాంగ్' పుస్తకానికి ప్రతిష్టాత్మక బుకర్ ప్రైజ్–2023 లభించింది. లండన్‌కు చెందిన భారత సంతతి రచయిత చేతన మారూ రాసిన తొలి నవల 'వెస్టర్న్ లేన్' సైతం ఈ బహుమతి కోసం పోటీ పడగా, ప్రొఫెట్ సాంగ్ విజేతగా నిలిచింది. తాజాగా లండన్‌లో బహుమతి ప్రదానోత్సవం జరిగింది. 46 ఏళ్ల పాల్ లించ్ బుకర్ ప్రైజ్ అందుకున్నారు. ఈ బహుమతి కింద ఆయనకు రూ.52,64,932 నగదు లభించింది. దిగజారుతున్న ప్రజాస్వామ్య విలువలు, పెరిగిపోతున్న నిరంకుశత్వం, ప్రబలుతున్న అశాంతి, వలసల సంక్షోభం.. వంటి పరిస్థితుల్లో ఐర్లాండ్‌లో తన కుటుంబాన్ని రక్షించుకోవడానికి ఓ మహిళ చేసిన పోరాటాన్ని 'ప్రొఫెట్ సాంగ్' నవలలో పాల్ లించ్ హృద్యంగా చిత్రీకరించారు. కెన్యాలో జన్మించి లండన్‌లో స్థిరపడిన భారత సంతతి రచయిత చేతన మారూ రాసిన 'వెస్టర్న్ లేన్' నవల టాప్–6లో నిలిచింది.

భారత రాయబారిపై ఖలిస్తానీ వాదుల దూషణలు

న్యూయార్క్: గురుపూరబ్ పర్వదినం సందర్భంగా ప్రార్థనల్లో పాల్గొనేందుకు అమెరికాలోని న్యూయార్క్‌లో ఉన్న గురుద్వారాకు వెళ్లిన భారత రాయబారి తరన్‌జీత్ సింగ్ సంధుపై ఖలిస్తానీ వాదులు నోరుపారేసుకున్నారు. లాంగ్ ఐలాండ్‌లో హిక్స్‌విల్లే గురుద్వారాకు వెళ్లిన సంధుకు ఘన స్వాగతం లభించింది. ఇది జీర్ణించుకోలేని ఖలిస్తానీ వాదులు ఆయన్ను దూషించారు. కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య ఘటనపై ఆయనపై పలు ప్రశ్నలు సంధిస్తూ పెద్దగా కేకలు వేశారు. స్థానిక సిక్కు సమాజ సభ్యులు సంధుకు రక్షణగా నిలిచి, ఖలిస్తానీ వాదులను బయటకు పంపించారు.

సింగర్ ఎల్లీ మంగట్ హత్యకు కుట్ర.. అర్షదీప్ ముఠా సభ్యుల అరెస్ట్

న్యూఢిల్లీ: ఢిల్లీలోని మయూర్ విహార్‌లో సోమవారం ఉదయం జరిగిన స్వల్ప ఎదురుకాల్పుల అనంతరం గ్యాంగ్‌స్టర్ అర్షదీప్ సింగ్ ముఠాకు చెందిన ఇద్దరు షార్ప్‌షూటర్లను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరిని రాజ్‌ప్రీత్ సింగ్(25), వీరేంద్ర సింగ్(22)గా గుర్తించారు. పంజాబీ గాయకుడు ఎల్లీ మంగట్‌ను చంపేందుకు వీరు పథక రచన చేసినట్లు వెల్లడించారు. ఎన్‌కౌంటర్ సమయంలో అయిదు రౌండ్ల వరకు తుపాకీ కాల్పులు జరపగా, రెండు బుల్లెట్లు పోలీసు అధికారి బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్‌ను తాకాయన్నారు. ప్రతిగా పోలీసులు ఆరు రౌండ్ల వరకు జరిపిన కాల్పుల్లో వీరేంద్ర సింగ్ కుడి కాలికి గాయమైంది. ఎన్‌కౌంటర్ అనంతరం నిందితులిద్దరినీ ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించామన్నారు. వీరి నుంచి రెండు రివాల్వర్లు, ఒక హ్యాండ్ గ్రెనేడ్, చోరీ చేసిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పొగాకు ఉత్పత్తులపై ఆంక్షలు ఎత్తేస్తాం

న్యూజిలాండ్ నూతన ప్రధాని లక్సాన్ వెల్లడి

వెల్లింగ్టన్: ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా పొగాకు వాడకంపై గత ప్రభుత్వం తీసుకువచ్చిన నియంత్రణలను తొలగిస్తామని న్యూజిలాండ్ నూతన ప్రధాని క్రిస్టొఫర్ లక్సాన్ చెప్పారు. మాజీ వ్యాపారవేత్త, నేషనల్ పార్టీ నేత అయిన లక్సాన్‌తో సోమవారం గవర్నర్ జనరల్ సిండీ కిరో ప్రధానిగా ప్రమాణం చేయించారు. గత నెలలో జరిగిన ఎన్నికల్లో నేషనల్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకుంది. మరో రెండు పార్టీలతో కలిసి తాజాగా సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రమాణ స్వీకారం అనంతరం క్రిస్టొఫర్ మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం గత ఏడాది పొగాకు వినియోగంపై తీసుకువచ్చిన నియంత్రణలను తొలగిస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకు ఏదేశంలోనూ లేని విధంగా సిగరెట్లలో నికొటిన్ స్థాయిలను తగ్గించడం, యువతపై జీవిత కాల ధూమపాన నిషేధం, సిగరెట్ విక్రేతల తగ్గింపు వంటివి అప్పటి ప్రభుత్వం ప్రకటించిన చర్యల్లో ఉన్నాయి.

వందేభారత్ రైలుపై రాళ్ల దాడి

భువనేశ్వర్: రూర్కెలా–పూరి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుపై కొందరు ఆకతాయిలు రాళ్లు రువ్వినట్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. మేరామండలి, బుద్ధపంక్ రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని పేర్కొంది. ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లోని ఒక కిటికీ రాళ్ల తాకిడికి దెబ్బతిందని తెలిపింది.

ఇమ్రాన్ ఖాన్‌కు ఎదురు దెబ్బ

ఇస్లామాబాద్: అల్–ఖదీర్ ట్రస్టు అవినీతి కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. రహస్య పత్రాల లీకేజీ కేసులో రావల్పిండిలోని అడియాలా జైలులో ఉన్న ఇమ్రాన్‌ను నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో(ఎన్‌ఏబీ) అల్–ఖదీర్ ట్రస్ట్ కేసులో ఈ నెల 14న అదుపులోకి తీసుకుంది. రూ.2 వేల కోట్లు మేర అవకతవకలు జరిగినట్లు ఆరోపిస్తున్న ఈ కేసులో ఇమ్రాన్‌ను కస్టడీకివ్వాలన్న ఎన్‌ఏబీ వాదనను జడ్జి తోసిపుచ్చుతూ 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.

మన ఆస్ట్రోశాట్ గ్రేట్!

అంతర్జాతీయ ప్రశంసలు

అంతరిక్షంలో పేలుడును 600వ సారి గుర్తించింది!

అంతరిక్షంలో జరిగిన అతి శక్తిమంతమైన గామా కిరణ పేలుడు (గామా రే బర్స్ట్–జీఆర్బీ)ను ఇస్రో ఆస్ట్రోశాట్ టెలిస్కోప్ తాజాగా మరోసారి గుర్తించింది. జీఆర్బీ 231122బి గా పిలుస్తున్న ఇది ఆస్ట్రోశాట్ గుర్తించిన 600వ పేలుడు కావడం విశేషం. ఇస్రో టెలిస్కోప్ సాధించిన ఈ ఘనతపై అంతర్జాతీయ అంతరిక్ష సమాజంలో సంభ్రమాశ్చర్యాలు వ్యక్తమవుతున్నాయి. ఈ జీఆర్బీలను అంతరిక్షంలో సంభవించే అత్యంత శక్తిమంతమైన పేలుళ్లుగా చెబుతారు. ఇవి తరచూ కృష్ణబిలాల ఆవిర్భావానికి దారితీస్తుంటాయి. అతి తక్కువ వ్యవధిలోనే, అంటే కొన్ని మిల్లీ సెకన్ల నుంచి నిమిషాల్లోపే అపరిమితమైన శక్తిని వెదజల్లడం ఈ జీఆర్బీల ప్రత్యేకత. ఈ సందర్భంగా అంతరిక్షంలో పరుచుకునే వెలుతురు మిరుమిట్లు గొలిపే స్థాయిలో ఉంటుంది. ఈ పేలుళ్లను లోతుగా అధ్యయనం చేయగలిగితే విశ్వచాలనాన్ని నియంత్రించే మౌలిక భౌతిక నియమాలను మరింతగా అర్థం చేసుకునే ఆస్కారముంటుంది.

దుమ్ము రేపుతున్న ఆస్ట్రోశాట్


2015 సెప్టెంబర్లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయోగించిన తొలి మల్టీ వేవ్ లెంగ్త్ అంతరిక్ష టెలిస్కోపే ఆస్ట్రోశాట్. నాటినుంచి భారత అంతరిక్ష పరిశోధనలకు మూలస్తంభంగా నిలిచింది. ఇది గరిష్ఠంగా ఐదేళ్ల పాటు పని చేస్తుందని అంచనా వేశారు. కానీ ఎనిమిదేళ్లు దాటినా ఇప్పటికీ అద్భుతంగా పని చేస్తూ ఇస్రో సామర్థ్యానికి తిరుగులేని ప్రతీకగా నిలిచింది. అంతరిక్షంలో సంభవించే అరుదైన దృగ్విషయాలైన గామా పేలుళ్లను ఆస్ట్రోశాట్ ఇట్టే ఒడిసిపడుతూ పలు అంతర్జాతీయ పరిశోధనలకు ఆలంబనగా నిలిచింది. అదిప్పటిదాకా ఏకంగా 600 జీఆర్బీలను గుర్తించడం నిజంగా గొప్ప విషయమేనని నాసా సైంటిస్టులు అంటున్నారు. ఆస్ట్రోశాట్‌లోని కాడ్మియం జింక్ టెల్యూరైడ్ ఇమేజర్ (సీజెడ్‌టీఐ)దే ఈ ఘనతలో ప్రధాన పాత్ర అని ఐఐటీ బాంబే పరిశోధకులు వివరించారు. హై ఎనర్జీ, వైడ్ ఫీల్డ్ ఇమేజింగ్ సీజెడ్‌టీఐ ప్రత్యేకత.



త్వరలో తెరపైకి 'దక్ష'...

ఆస్ట్రోశాట్ సాధిస్తున్న ఘనతలు నిజంగా సాటిలేనివని ఐఐటీ బాంబే ప్రొఫెసర్ వరుణ్ భలేరావ్ అన్నారు. ఈ స్ఫూర్తితో అంతరక్ష రంగంలో ఇస్రో కృషిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అత్యాధునిక జీఆర్బీ టెలిస్కోప్ దక్షను తయారు చేయనున్నట్టు వెల్లడించారు. పలు ప్రతిష్టాత్మక సంస్థలు సంయుక్తంగా ఈ మిషన్‌లో పాల్గొంటాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న అన్ని జీఆర్బీ టెలిస్కోప్‌ల్లోకెల్లా దక్ష అత్యంత అధునాతనంగా ఉండనుందని వివరించారు. - సాక్షి, నేషనల్ డెస్క్

300 ఏళ్లలో 200 కోట్లకు!



జన విస్ఫోటనంతో ప్రపంచమంతా అల్లాడుతోంది. గతేడాది ఈ సమయానికే ప్రపంచ జనాభా 800 కోట్లు దాటేసింది. అదే ఊపులో మరో 30 నుంచి 50 ఏళ్లలోపే ఏకంగా వెయ్యి కోట్లకు చేరుతుందని అంచనా. మరి ఆ తర్వాత? అలా పెరుగుతూనే పోతుందా? పెరగకపోగా, బాగా తగ్గుముఖం పడుతుందట. ఎంతగా అంటే, ఓ 300 ఏళ్ల తర్వాత ప్రపంచ జనాభా మొత్తం కలిపి 200 కోట్లకు పరిమితమైపోతుందని తాజా అధ్యయనం ఒకటి చెబుతోంది! ఇంకా మాట్లాడితే అంతకంటే భారీగా తగ్గినా ఆశ్చర్యం లేదంటోంది. కారణమేమిటో తెలుసా? ప్రాకృతిక విపత్తులను కుంటున్నారా? కాదు. ప్రపంచవ్యాప్తంగా సంతానోత్పత్తి రేటు శరవేగంగా తగ్గిపోతుండటమే! ఈ జాబితాలోని దేశాల్లో భారత్ కూడా ముందు వరుసలో ఉండటం విశేషం...

- సాక్షి, నేషనల్ డెస్క్


గత 200 ఏళ్లుగా ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుతూ వచ్చింది. ముఖ్యంగా 1950లో 250 కోట్లకు అటూ ఇటుగా ఉన్నది కాస్తా ఈ 70 ఏళ్లలో ఏకంగా మూడింతలైందన్నది ఐరాస అంచనా! మరి ముందు జనాభా పెరుగుదల తీరుతెన్నులు ఎలా ఉండొచ్చు? ఈ ఆసక్తికర అంశంపై యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ పాపులేషన్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన ప్రఖ్యాత ఆర్థిక వేత్త డీన్ స్పియర్స్ లోతైన అధ్యయనం చేశారు. జనాభా ఊహాతీతంగా తగ్గిపోవడం ఖాయమని తేల్చారు. ''2080 నుంచే ఈ ధోరణి మొదలవుతుంది. క్రమంగా ఊపందుకుంటుంది. అలా మరో 300 ఏళ్లలోపే ప్రపంచ జనాభా 200 కోట్లకు పరిమితమైపోతుంది. ఇంకా మాట్లాడితే అంతకంటే కూడా తగ్గుతుంది'' అని బల్ల గుద్ది చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా పునరుత్పత్తి రేటు (టోటల్ ఫెర్టిలిటీ రేట్–టీఎఫ్‌ఆర్)లో క్రమంగా వస్తున్న నమోదవుతున్న తగ్గుదలను ఆధారంగా స్పియర్స్ ఈ నిర్ధారణకు వచ్చారు. పలు దేశాల్లో జనాభా పెరుగుదల రేటు బాగా తగ్గుముఖమే ఇందుకు రుజువని ఆయన చెబుతున్నారు. ఐరాస అంచనాలు కూడా స్పియర్స్ వాదనను బలపరిచేలానే ఉన్నాయి. 2010లో 700 కోట్లున్న ప్రపంచ జనాభా 2022లో 800 కోట్లకు చేరింది. అంటే 12 ఏళ్లు పట్టింది. కానీ 900 కోట్లకు చేరేందుకు 15 ఏళ్లు పడుతుందని ఐరాస పేర్కొంది. అంటే 100 కోట్లు పెరిగేందుకు మూడేళ్లు ఎక్కువ సమయం పట్టనుంది!

ఏమిటీ టీఎఫ్‌ఆర్...?

ప్రతి మహిళ తన పునరుత్పత్తి సామర్థ్యం ముగిసే దాకా జీవించి, ఇతరత్రా పరిస్థితులన్నీ సానుకూలంగా ఉంటే కనగలిగిన పిల్లల సంఖ్యే టీఎఫ్‌ఆర్. జనాభాలో పెరుగుదల నమోదు కావాలంటే ఇది కనీసం 2 కంటే ఎంతో కొంత ఎక్కువగా ఉండాలి. ప్రస్తుతం గ్లోబల్ టీఎఫ్‌ఆర్ 2.1గా ఉంది. 2026కల్లా ఇది 2కు తగ్గుతుందని అంచనా. అక్కణ్నుంచి స్థిరంగా తగ్గుతూ 2081 నాటికి ఏకంగా 1.4కు పడిపోనుంది. భారత్ విషయమే తీసుకుంటే, 2020 నాటికి టీఎఫ్‌ఆర్ 2కు దిగొచ్చింది. ప్రస్తుతం 1.8కి తగ్గిందని అంచనా. ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఉన్న దేశాల్లో చాలా వరకు టీఆఎఫ్‌ఆర్ ఇప్పటికే 2 కంటే దిగువకు వచ్చేసింది. గ్లోబల్ టీఎఫ్‌ఆర్ ముందు ఏ 1.5 దగ్గరో స్థిరపడుతుందని, అంతకంటే తగ్గదని భావించినా జనాభా నానాటికీ తగ్గడమే తప్ప పెరిగే ప్రసక్తే ఉండదన్నది స్పియర్స్ అంచనా. ఆయన అధ్యయనంలో వెల్లడైన విశేషాలు...

- ప్రపంచవ్యాప్తంగా 5 కోట్ల పై చిలుకు జనాభా ఉన్న 29 దేశాల్లో 2022 నాటికే 20 దేశాల్లో పునరుత్పత్తి రేటు (టీఎఫ్‌ఆర్) 2 కంటే తగ్గింది.
- జనాభాపరంగా పెద్ద దేశాల్లో టీఎఫ్‌ఆర్ 2కు పైగా ఉండేవాటి సంఖ్య 2050కల్లా 3కు తగ్గుతుంది. అవి కాంగో, నైజీరియా, టాంజానియా.
- 2081 నాటికి అన్ని దేశాల్లోనూ టీఆఎఫ్‌ఆర్ 2 కంటే తగ్గిపోతుంది.
- జననాల విషయంలో ప్రపంచంలో అగ్ర స్థానం భారత్‌దే. దేశంలో ఏటా 2 కోట్ల జననాలు నమోదవుతున్నాయి. ఈ శతాబ్దాంతానికల్లా అది ఏకంగా నాలుగో వంతుకు, అంటే 50 లక్షల లోపుకు తగ్గనుంది.
- చైనాలో 85 లక్షలుగా ఉన్న వార్షిక జననాల సంఖ్య కేవలం శతాబ్దాంతానికి 12 లక్షలకు పరిమితం కానుంది.
- ఒకసారి తగ్గుముఖం పట్టాక జనాభా మళ్లీ పెరగాలంటే గ్లోబల్ టీఎఫ్‌ఆర్ 2 కంటే పెరగాలి. కానీ అందుకు అవకాశాలు చాలా స్వల్పం. ఎందుకంటే చరిత్రలో ఇప్పటిదాకా ఏ దేశంలోనూ అలా జరగలేదు.
- ఏ దేశంలో చూసినా ఒక్క సంతానంతోనే సరిపెట్టుకుంటున్న వారు పెరుగుతున్నారు.

పునరుత్పత్తి రేటు-2022



చాలా రాష్ట్రాల్లో తగ్గిన పునరుత్పత్తి రేటు

మన దేశంలో చూసుకుంటే 40 ఏళ్ల క్రితం కేరళ మినహా అన్ని రాష్ట్రాల్లోనూ పునరుత్పత్తి రేటు కనీసం 3 నుంచి 5 దాకా ఉండేది. ఇప్పుడది విపరీతంగా తగ్గిపోయింది. హరియాణానే తీసుకుంటే 5 నుంచి ఏకంగా 2కు తగ్గింది! ఇప్పుడు పునరుత్పత్తి రేటు 2 కంటే ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు బిహార్ (3), మధ్యప్రదేశ్ (2.6), యూపీ (2.7), రాజస్థాన్ (2.4), అస్సాం (2.1) మాత్రమే. పశ్చిమబెంగాల్, తమిళనాడుల్లో 1.4 శాతం, మహారాష్ట్ర, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, కేరళల్లో 1.5, కర్ణాటకలో 1.6, ఒడిశాలో టీఎఫ్‌ఆర్ 1.8గా ఉంది.

- జీవన శైలి, ఆహారపుటలవాట్ల వంటి కారణాలతో పిల్లలు పుట్టని దంపతుల సంఖ్యా పెరుగుతోంది.

శరవేగంగా డ్రిల్లింగ్

నిట్టనిలువుగా కొండపైన 36 మీటర్ల మేర డ్రిల్లింగ్

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లోని సిల్‌క్యారా సొరంగంలో చిక్కుకున్న 41 మంది కార్మికులను కాపాడేందుకు కొండపై భాగంలో మొదలెట్టిన డ్రిల్లింగ్ శరవేగంగా కొనసాగుతోంది. 86 మీటర్ల లోతు తవ్వాల్సి ఉండగా 36 మీటర్ల మేర డ్రిల్లింగ్ పూర్తయిందని జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ(ఎన్‌డీఎంఏ) అధికారులు సోమవారం తెలిపారు. శిథిలాల గుండా భారీ ఆగర్ డ్రిల్లింగ్ మెషీన్ తవ్వుతున్నపుడు రాడ్లు అడ్డుతగిలి మెషీన్ ధ్వంసమవడం తెల్సిందే. దీంతో 800 మిల్లీమీటర్ల వ్యాసమున్న స్టీల్ పైపు నుంచి డ్రిల్లింగ్ మెషీన్ బ్లేడ్లను తొలగించి అదే మార్గంలో దూరి కార్మికులు మ్యాన్యువల్‌గా రంధ్రం చేయనున్నారు.



నిలువు డ్రిల్లింగ్ చేపడుతున్న యంత్రం

ఏమిటీ ర్యాట్-హోల్ పద్ధతి?

మేఘాలయలో ఈ పద్ధతి చాలా ఫేమస్. అక్రమ బొగ్గు గనుల్లో ఈ విధానంలోనే బొగ్గు తవ్వేస్తారు. ముందుగా గని ఉపరితలంపై మనిషి దూరేంత చిన్న రంధ్రం చేసి అందులోకి వెళ్లి సమాంతరంగా చిన్న చిన్న రంధ్రాలు చేస్తూ బొగ్గుపొరలను తొలుస్తారు. '' మేం పదేళ్లుగా ఇదే వృత్తిలో ఉన్నాం. కార్మికులను కాపాడేందుకు పనిచేయడం ఇదే తొలిసారి. ఇక్కడ 800 మిల్లీమీటర్ల పైపులోంచి వెళ్లి పనిచేయాలి. మేం 600 మిల్లీమీటర్ల పైపులో కూడా దూరి పనిచేశాం. చిన్న గడ్డపార, పార, చిన్న తట్ట వెంట తీసుకెళ్లి చిన్న చిన్న రంధ్రాలు చేస్తూ శిథిలాలను తొలగిస్తాం. 12 మీటర్లలో కేవలం మట్టి ఉంటే పని 24 గంటల్లో పూర్తి అవుతుంది. ఒకవేళ గట్టి రాళ్లు ఉంటే 36 గంటలకుపైనే పడుతుంది. వంతుకు ఇద్దరు చొప్పున ఆరుగురం తవ్వేస్తాం'' అని కార్మికులు వెల్లడించారు. ఈ మార్గంలో ఇంకా 8.15 మీటర్లమేర బ్లేడ్ల ముక్కలను తొలగించాల్సిఉంది. ఆ తర్వాతే మ్యాన్యువల్ డ్రిల్లింగ్ మొదలవుతుంది. మరోవైపు, కొండపైనుంచి నిట్టనిలువుగా డ్రిల్లింగ్ పూర్తయ్యాక రంధ్రంలోకి 1.2 మీటర్ల వ్యాసమున్న పైపులను అమర్చి దాని ద్వారా కార్మికులను పైకి లాగుతారు.

రంగంలోకి 'ర్యాట్-హోల్' మైనింగ్ కార్మికులు

ఈ పని పూర్తిచేసేందుకు 'ర్యాట్–హోల్' మైనింగ్‌లో సిద్ధహస్తులైన కార్మికులను రప్పించారు. వీరు 800 మిల్లీమీటర్ల వ్యాసమున్న పైపు గుండా లోపలికి దూరి శిథిలాలకు రంధ్రం చేస్తూ ముందుకు కదలనున్నారు. ఇలా 12 మీటర్ల మేర డ్రిల్లింగ్ చేయాలి. యూపీలోని ఝాన్సీకి చెందిన కార్మికులు ఇప్పటికే ఘటనాస్థలికి చేరుకున్నారు. ఝాన్సీకి చెందిన పర్సాదీ లోధీ, విపిన్ రాజ్‌పుత్ తదితరులను ఈ పనికి పురమాయించారు.

త్వరలోనే ప్రిడేటర్ డ్రోన్ల ఒప్పందం

న్యూఢిల్లీ: ఎక్కువసేపు గాల్లో చక్కర్లు కొడుతూ క్షిపణులతో దాడి చేయగల అత్యాధునిక ఎంక్యూ–9బీ ప్రిడేటర్ రకం 31 సాయుధ డ్రోన్ల కొనుగోలుకు సంబంధించి అమెరికాతో భారత్ వచ్చే ఏడాది మార్చికల్లా ఒప్పందాన్ని ఖరారుచేసుకోనుంది. కొనుగోలు కోసం భారత్ పంపిన 'అభ్యర్థన లేఖ'ను అమెరికా రక్షణ శాఖ ఆమోదించిన నేపథ్యంలో త్వరలోనే అమెరికా, భారత ఉన్నతాధికారులు తుది దశ చర్చలు జరపనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. చైనా, పాకిస్తాన్ సరిహద్దుల్లో గగనతలంలో నిరంతర నిఘా, మెరుపు దాడుల కోసం ఈ డ్రోన్లను భారత్ వినియోగించనుంది. ఈ భారీ డ్రోన్ సరిహద్దులతోపాటు శత్రు దేశాల సైనిక వాహనాలపై నిఘాతోపాటు వాటిని వెంటాడి క్షిపణులతో దాడిచేయగలదు. ఏకబిగిన 35 గంటలపాటు గాల్లోనే ఉండగలదు. 450 కేజీల బరువైన బాంబులు అమర్చిన క్షిపణులను మోసుకెళ్లగలదు. ఇంతటి అత్యాధునికమైన డ్రోన్లను త్రివిధ దళాల్లో దశలవారీగా ప్రవేశపెట్టాలని భారత్ తలపోస్తోంది. అందులోభాగంగానే ఈ డీల్ కుదుర్చుకుంటోంది. అమెరికా రక్షణరంగ దిగ్గజ సంస్థ జనరల్ ఆటమిక్స్ ఈ డ్రోన్లను తయారుచేస్తోంది. 31 డ్రోన్లకు మొత్తంగా రూ.25,000 కోట్లు అవుతుందని అంచనా. అయితే ఒక్కో డ్రోన్‌ను ఎంతకు కొనాలనే ధర, ఇతరత్రా విషయాలు ఇంకా ఖరారుకాలేదు. తుది చర్చల్లో వీటిపై నిర్ణయాలు తీసుకునే వీలుంది. డ్రోన్ల కొనుగోలుకు సంబంధించిన తొలి అనుమతిని లోని రక్షణరంగ కొనుగోళ్ల మండలి ఆమోదించిన విషయం విదితమే.

'విరమణ' మరో రెండు రోజులు

- ఒప్పందం పొడిగింపునకు ఇజ్రాయెల్, హమాస్ అంగీకారం
- నిత్యం అదనంగా 10 మంది బందీలను విడుదల చేయనున్న హమాస్

ఖాన్ యూనిస్/టెల్ అవీవ్: ఇజ్రాయెల్–హమాస్ మిలిటెంట్ల మధ్య కుదిరిన నాలుగు రోజుల కాల్పుల విరమణ ఒప్పందం సోమవారం ముగిసింది. ఒప్పందంలో భాగంగా మిలిటెంట్లు ఇప్పటిదాకా మూడు విడతల్లో మొత్తం 58 మంది బందీలను విడుదల చేశారు. ఇజ్రాయెల్ అధికారులు 117 మంది పాలస్తీనియన్ ఖైదీలను జైలు నుంచి విడిచిపెట్టారు. నాలుగో విడత కింద స్థానిక కాలమానం ప్రకారం సోమవారం అర్ధరాత్రి తర్వాత మరికొంత మంది బందీలను హమాస్ విడుదల చేయనున్నట్లు తెలిసింది. దీనిపై సంబంధిత బందీల కుటుంబ సభ్యులకు ఇజ్రాయెల్ అధికారులు సమాచారం ఇచ్చారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని మరో రెండు రోజులపాటు పొడిగించడానికి ఇజ్రాయెల్, హమాస్ అంగీకరించాయని ఖతార్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి సోమవారం వెల్లడించారు. ఒప్పందం పొడిగింపు అమల్లో ఉన్నన్ని రోజులు నిత్యం అదనంగా 10 మంది చొప్పున బందీలను హమాస్ వదిలేయాల్సి ఉంటుంది. ఈ మేరకు ఇరుపక్షాలు ముందుగానే ఒక అవగాహనకు వచ్చాయి. ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించే విషయంలో ఈజిప్టు, ఖతార్ ప్రత్యేకంగా చొరవ తీసుకున్నాయి.

ఇజ్రాయెల్‌లో ఎలాన్ మస్క్ పర్యటన

సోషల్ మీడియాలో యూదు వ్యతిరేక పోస్టులు పెట్టి విమర్శల పాలైన 'ఎక్స్' అధినేత ఎలాన్ మస్క్ సోమవారం ఇజ్రాయెల్‌లో పర్యటించారు. అక్టోబర్ 7న హమాస్ దాడిలో ధ్వంసమైన కిబుట్జ్ పట్టణాన్ని దర్శించారు. అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మస్క్ వెంట ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు కూడా ఉన్నారు.

గుజరాత్‌లో అకాల వర్షాలు.. పిడుగుపాట్లకు 20 మంది బలి

అహ్మదాబాద్: గుజరాత్ వ్యాప్తంగా ఆదివారం అకాల వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పిడుగులు పడిన ఘటనల్లో 20 మంది వరకు చనిపోయినట్లు రాష్ట్ర అత్యవసర విభాగం తెలిపింది. దహోడ్ జిల్లాలో నలుగురు, భరూచ్‌లో ముగ్గురు, అహ్మదాబాద్, అమ్రేలీ, బనస్కాంత, బోటడ్, ఖేడా, మెహ్సానా, పంచ్‌మహల్, సబర్కాంత, సూరత్, సురేంద్రనగర్, దేవ్‌భూమి ద్వారకల్లో ఒక్కొక్కరి చొప్పున మృతి చెందారని ఒక అధికారి చెప్పారు. రాష్ట్రంలోని 252 తాలుకాలను గాను 234 చోట్ల ఆదివారం వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయని, సౌరాష్ట్ర ప్రాంతంలోని సెరామిక్ పరిశ్రమలు మూతపడ్డాయని చెప్పారు. వచ్చే 24 గంటల్లో రాష్ట్రానికి మరింత వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

జామెట్రీ కంపాస్‌తో 108 సార్లు దాడి

నాలుగో తరగతి విద్యార్థి పట్ల పాశవికంగా ప్రవర్తించిన ముగ్గురు తోటి విద్యార్థులు

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థులు తోటి విద్యార్థి పట్ల అమానుషంగా ప్రవర్తించారు. జామెట్రీ కంపాస్‌తో విచక్షణారహితంగా 108 సార్లు దాడి చేసి గాయపరిచారు. నవంబర్ 24వ తేదీన ఇండోర్ నగరంలోని ఏరోడ్రోమ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాఠశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. విద్యార్థుల దాడి ఘటనపై చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(డబ్ల్యూసీ) తీవ్రంగా స్పందించింది. ఘటనపై వెంటనే తమకు నివేదిక సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. '' గొడవ సందర్భంగానే చిన్నారులు ఇలా ప్రవర్తించారని వార్తలొచ్చాయి. నిందితులైన విద్యార్థులకు హింసాత్మకమైన సన్నివేశాలున్న వీడియో గేమ్స్ ఆడే అలవాటు ఉందా? నాలుగో తరగతి విద్యార్థుల్లో ఇంతటి హింసాప్రవృత్తి ఎలా సాధ్యం? దీనికి కారణాలేంటి? ఆ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తాం. పోలీసుల నివేదిక కోరాం '' అని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ పల్లవి చెప్పారు. '' మా అబ్బాయి రక్తమోడుతూ ఇంటికొచ్చాడు. అసలేం జరిగిందో తెలీడం లేదు. తరగతి గదిలోని సీసీటీవీ ఫుటేజీ ఇచ్చేందుకు స్కూల్ యాజమాన్యం ఒప్పుకోవడం లేదు. వారు బహుశా తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారేమో'' అని బాధిత విద్యార్థి తండ్రి వాపోయాడు. '' బాధిత విద్యార్థి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నాం. నిందితులైన విద్యార్థుల వయసు పదేళ్లలోపే. సంబంధిత చట్టాల ప్రకారం కేసు దర్యాప్తు జరుగుతోంది'' అని నగర అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ వివేక్ సింగ్ చౌహాన్ చెప్పారు. ''కొంతకాలంగా స్కూలు చిన్నారుల్లో నేర ప్రవృత్తి పెరిగిపోతోంది. దీనిపై అందరూ, ముఖ్యంగా తల్లిదండ్రులు దృష్టి పెట్టాల్సిన అవసరముంది'' అని ఆయన అభిప్రాయపడ్డారు.

భారతీయ యాసను వెక్కిరించిన కానిస్టేబుల్

బ్రిటన్‌లో మరో జాత్యహంకార ఘటన

లండన్: ఫిర్యాదు చేసేందుకు ఫోన్ చేసిన ఒక మహిళ భారతీయ యాసను వెక్కిరించిన పోలీస్ కానిస్టేబుల్‌ను బ్రిటన్ క్రమశిక్షణా ట్రిబ్యూనల్ విధుల నుంచి తప్పించింది. గత ఏడాది నవంబర్ 29వ తేదీ జరిగిన ఘటన తాలూకు కేసులో పోలీసు ప్యాట్రిక్ హ్యారిసన్‌ను దోషిగా తేలుస్తూ లండన్‌లోని ట్రిబ్యూనల్ తీర్పుచెప్పింది. గత నెలలో తీర్పువెలువగా వివరాలు తాజాగా బహిర్గతమయ్యాయి. వెస్ట్ యార్క్‌షైర్ పోలీస్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేసే ప్యాట్రిక్ ఘటన జరిగిన రోజు లండన్‌లోని ఫోర్స్ కాల్‌సెంటర్‌లో విధుల్లో ఉన్నాడు. తనపై ఒకరు విద్వేష నేరానికి పాల్పడ్డారంటూ ఒక మహిళ ఈ కాల్ సెంటర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదుచేసింది. ఫిర్యాదును పట్టించుకోకుండా ప్యాట్రిక్ ఆమె మాట్లాడే భారతీయ యాసను వెక్కిరించడం మొదలెట్టాడు. అసలది విద్వేష నేరమని ఎందుకు అనుకుంటున్నావ్? అని భారతీయ యాసను అనుకరిస్తూ వెటకారంగా మాట్లాడాడు. ఫోన్ కట్‌చేశాక ఆమె ఫిర్యాదుచేస్తుందేమోనని భయపడ్డాడు. ఆమెకు వేరే నంబర్ నుంచి ఫోన్ చేసి ఆమె ఏం అనుకుందోనని ఆరాతీశాడు. ప్యాట్రిక్ చర్యతో విసిగిపోయిన ఆమె 'టెల్ మామా'కు ఫిర్యాదుచేసింది. బ్రిటన్‌లో ముస్లింవ్యతిరేక ఘటనలపై ప్రభుత్వం 'టెల్ మామా(ఎంఏఎంఏ–మెజరింగ్ యాంటీ ముస్లిం అటాక్స్) ప్రాజెక్ట కింద చర్యలు తీసుకుంటోంది. ఈ ఉదంతంలో ప్యాట్రిక్ వైఖరిని ట్రిబ్యూనల్ తీవ్రంగా తప్పుబట్టింది. '15 ఏళ్లపాటు విధుల్లో ఉంటూ కూడా అధికారం, హోదాను మరిచి మహిళతో అనుచితంగా మాట్లాడాడు. ఈయన వైఖరితో ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకం, విశ్వాసం తగ్గిపోతాయి. ఇది మొత్తం పోలీసు వ్యవస్థకే అప్రతిష్ట. జాతి వివక్ష, ఇస్లామోఫోబియా దేశవ్యాప్తంగా పోలీసుల్లో గూడుకట్టుకోవడం ఆందోళనకరం'' అని ట్రిబ్యూనల్ ఆగ్రహం వ్యక్తంచేసింది. అతడిని విధుల నుంచి తప్పించింది.

పిల్లల వ్యక్తిగత డేటాను తస్కరించిన 'మెటా'

ఫేస్‌బుక్, ఇన్‌స్టా మాతృ సంస్థపై అమెరికా కోర్టులో 33 రాష్ట్రాల దావా

శాన్‌ఫ్రాన్సిస్కో: సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల మాతృసంస్థ 'మెటా'పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 13 ఏళ్లలోపు పిల్లల వ్యక్తిగత సమాచారాన్ని మెటా సేకరించిందని, ఎక్కువ సమయం తమ సామాజిక మాధ్యమాల వేదికల్లోనే వారు గడిపేలా ఒక బిజినెస్ మోడల్‌ను రూపొందించిందని అమెరికాలోని పలు రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి. పిల్లల డేటాను తస్కరించేలా ఉద్దేశపూర్వకంగానే తమ సోషల్ మీడియా వేదికల్లో మెటా మార్పులు చేసిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మెటా సంస్థ నిర్వాకంపై గత నెలలో 33 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ కోర్టులో దావా వేశారు. ఈ సంగతి తాజాగా బయటకు వచ్చింది. యుక్త వయసులో ఉన్నవారిని సోషల్ మీడియా సైట్లవైపు ఆకర్షించడానికి, ప్రలోభాలకు గురిచేయడానికి మెటా ప్రయత్నిస్తోందని వారు ఆరోపించారు. 13 ఏళ్ల కంటే తక్కువ వయసున్న లక్షల మంది యూజర్ల వ్యక్తిగత సమాచారాన్ని వారి తల్లిదండ్రుల అనుమతి లేకుండానే ఇన్‌స్టాగ్రామ్ సేకరించిందని, ఇలా చేయడం చట్టవిరుద్ధమేనని తమ దావాలో పేర్కొన్నారు. చిన్నారుల గోప్యతను కాపాడడానికి ఉద్దేశించిన చట్టాలను మెటా పాటించలేదని ఆరోపించాయి. తమపై వచ్చిన ఆరోపణలపై మెటా యాజమాన్యం స్పందించింది. 13 ఏళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లలు సోషల్ మీడియా వేదికల్లో ఖాతాలు తెరవడానికి అనుమతి లేదని వెల్లడించింది. ఒకవేళ అలాంటి ఖాతాలు ఉంటే తొలగిస్తామని ప్రకటించింది. సోషల్ మీడియా వేదికలు యూజర్ల వ్యక్తిగత సమాచారాన్ని తస్కరిస్తున్నాయని ఏళ్లుగా ఆరోపణలు వస్తున్న సంగతి తెలిసిందే. తాజా వార్తలతో వాటికి మరింత బలం సమకూరిందని అభిప్రాయపడుతున్నారు.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
మంగళవారం : 28 : నవంబర్ : 2023

నేటి నుంచి ప్రతి 7 నిమిషాలకు మెట్రో రైలు

కొరుక్కుపేట: రద్దీని నివారించేందుకు గాను మంగళవారం నుంచి మెట్రో రైల్ నిర్వాహకులు 9 నిమిషాల వ్యవధిలో కాకుండా 7 నిమిషాల వ్యవధిలోనే మెట్రో రైళ్లను నడపనుంది. దీంతో ప్రయాణికుల వేచి ఉండే సమయం తగ్గనుంది. దీన్ని ప్రయాణికులు స్వాగతించారు. ఈ చెన్నై మెట్రో రైల్ కార్పొరేషన్ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంటూ .. మెట్రో రైలు ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ గణనీయంగా పెరుగుతోంది. రైళ్ల సంఖ్యను దష్టిలో ఉంచుకుని, ప్రయాణికుల నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు, ఇతర సమయాల్లో 9 నిమిషాల వ్యవధిలో నడిచే మెట్రో రైలు సర్వీసులు రెండు మార్గాల్లో సోమవారం నుంచి 7 నిమిషాల వ్యవధిలోనే నడపనున్నాం. తద్వారా మెట్రో రైలు కోసం వేచి ఉండే సమయం తగ్గుతుందని పేర్కొంది.

న్యూస్‌రీల్

లారీని ఢీకొన్న వ్యాన్

- 17 మంది విద్యార్థులకు తీవ్ర గాయాలు

తిరువొత్తియూరు: నాగర్ కోవిల్‌లో జరిగిన క్రీడా పోటీల్లో పాల్గొని వేలూరుకు తిరిగి వస్తున్న విద్యార్థుల వ్యాను రామనత్తం వద్ద నిలబడి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 17 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. వివరాలు.. వేలూరు జిల్లా ఆర్కాడు ప్రాంతానికి చెందిన క్రీడా మైదానం శిక్షణ పాఠశాలలో 17 మంది నాగర్ కోయిల్‌లో గత 24, 25 తేదీల్లో జరిగిన క్రీడా పోటీల్లో పాల్గొని తిరిగి ఓ వ్యాన్‌లో సొంత ఊరికి సోమవారం ఉదయం తిరిగి బయలుదేరారు. కడలూరు జిల్లా రామనత్తం సమీపంలోని తిరుచి – చెన్నై జాతీయ రహదారిలో తెల్లవారు జామున 5 గంటల సమయంలో వీరు ప్రయాణిస్తున్న వ్యాన్ రోడ్డు పక్కన నిలబడి ఉన్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో వ్యాన్ తీవ్రంగా దెబ్బతింది. అందులో ప్రయాణిస్తున్న 17 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. రామనత్తం పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకొని గాయపడిన విద్యార్థులను వేంబూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో సుబ్బరాయన్ (60), విద్యార్థులు దిలీపన్ (9), మోహన్ (6), సంద్రో మెర్లిన్ (14), నందేష్ (15), కోచ్ స్నేహ (24) పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం తిరుచ్చి ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. ఈమేరకు రామనాథం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక ప్రతిభావంతుల జనగణన ర్యాలీ



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ కలైసెల్వి

కాంచీపురం(పళ్లిపట్టు): ప్రత్యేక ప్రతిభావంతుల జనగణన అవగాహన ర్యాలీని సోమవారం కలెక్టర్ కలైసెల్వి జెండా ఊపి ప్రారంభించారు. కాంచీపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక ప్రతిభావంతుల కోసం అమలు చేస్తున్న టీఎన్ రైట్స్ ప్రాజెక్ట్ ద్వారా జనగణ నకు సంబంధించి త్రీవీలర్ అవగాహన ర్యాలీని కలెక్టర్ కలైసెల్వి ప్రారంభించారు. అదే సమయంలో జనగణనకు సంబంధించి సంతకాల సేకరణ ఉద్యమానికి సైతం శ్రీకారం చుట్టారు. అదే సమయంలో ప్రత్యేక ప్రతిభావంతులకు సంబంధించి జనగణన చేపట్టేందుకు సంబంధించి కరపత్రాలు పంపిణీ చేశారు. సహాయ కలెక్టర్ సంగీత, ప్రత్యేక ప్రతిభావంతుల శాఖ అధికారి మలర్‌విళి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉలిబండ రిజర్వ్ ఫారెస్ట్‌లో ఏనుగు మృతి

అన్నానగర్: క్రిష్ణగిరి జిల్లా తెన్ కణికోట్టై సమీపంలోని జవలగిరి అటవీ ప్రాంతం ఉలిబండ రిజర్వ్ ఫారెస్ట్‌లో ఆడ ఏనుగు సోమవారం ఉదయం ప్రసవిస్తూ మరణించింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి.. గున ఏనుగును రక్షించారు. ఏనుగు కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించామని, నివేదిక వచ్చిన తర్వాత మృతికి సంబంధించిన సమాచారం వెల్లడిస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

శ్రీలంక నుంచి శరణార్థుల రాక

కొరుక్కుపేట: శ్రీలంకలోని జాఫ్నా తోల్‌పురం పక్కనే ఉన్న సుజీపురం ప్రాంతానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు సోమవారం తెల్లవారుజామున బోటులో రామనాథపురం జిల్లా ధనుష్కోడి బీచ్‌కు వచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి బీచ్‌లో వారిని మండపం మెరైన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం మండపంలోని శరణార్థి శిబిరానికి తరలించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

రూ.2,500 కోట్ల విలువైన భూమి స్వాధీనం

కొరుక్కుపేట: సెయింట్ థామస్ మౌంట్, పల్లావరం కంటోన్మెంట్ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆధీనంలోని అనేక ఎకరాల భూమిని పలువురు వ్యక్తులు, కంపెనీలు ఆక్రమించుకుని ఎన్నో ఏళ్లుగా భవనాలు కట్టుకుని నడుపుతున్నట్లు చెంగల్‌పట్టు కలెక్టర్‌కు ఫిర్యాదులందాయి. దీంతో ఆక్రమణదారులకు నోటీసులు పంపారు. కోర్టులో కేసు కూడా వేశారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు స్థలాలను గత ఆగస్టు నుంచి పల్లావరం తహసీల్దార్ నేతృత్వంలో పోలీసుల సహకారంతో రెవెన్యూశాఖ స్వాధీన చర్యలను ప్రారంభించింది. ఇందులో భాగంగా ఆక్రమణల ప్రాంతంలో ఉన్న భవనాలను సీజ్ చేశారు. అనంతరం జేసీబీలతో ఆక్రమిత భవనాలను కూల్చివేశారు. వీటిలో ప్రైవేట్ బ్యాంకులు, ఐటీ ఇన్‌స్టిట్యూట్‌లు, స్పోర్ట్స్ క్లబ్‌లు, వాణిజ్య భవనాలు, సెయింట్ థామస్ మౌంట్‌లోని వ్యాపార దుకాణాలు, వాణిజ్య సంస్థలు ఉన్నాయి. అయితే సెయింట్ థామస్ మౌంట్ ప్రాంతంలో ఆక్రమణకు గురైనట్లు చెబుతున్న కొన్ని చోట్ల మాత్రం తమ వద్ద 300 ఏళ్ల కిందటి పట్టాలు, భూమి లీజులు ఉన్నాయని కొందరు చెబుతున్నారు. అటువంటి పత్రం అధికారుల వద్ద అందుబాటులో లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వాధికారులు, దేవదాయ శాఖ అధికారులు భవనాలను తొలగించి సుమారు రూ.2,500 కోట్ల విలువైన భూమిని స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు.

దేశంలో సామాజిక న్యాయం అనే దీపాన్ని వెలిగించిన మహోన్నత నాయకుడు మాజీ ప్రధాని వీపీ సింగ్ అని సీఎం స్టాలిన్ ప్రశంసించారు. చెన్నై రాజధాని కళాశాల ఆవరణలో సింగ్ నిలువెత్తు విగ్రహాన్ని సోమవారం ప్రతిష్టించారు. దీన్ని ఆవిష్కరించిన స్టాలిన్.. వీపీసింగ్‌ను ఆదర్శంగా తీసుకుని దేశంలో కులగణన చేపట్టాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

- రాజధాని కళాశాలలో మాజీ ప్రధాని విగ్రహ ప్రతిష్ట
- ఆవిష్కరించిన సీఎం ఎంకే స్టాలిన్
- హాజరైన వీపీ సింగ్ కుటుంబ సభ్యులు



వీపీ సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం ఎంకే స్టాలిన్, చిత్రంలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ తదితరులు

సామాజిక న్యాయప్రదాత వీపీ సింగ్

సాక్షి, చెన్నై: మాజీ ప్రధాని వీపీ సింగ్‌కు చెన్నై రాజధాని కళాశాల ఆవరణలో నిలువెత్తు భారీ విగ్రహాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. మెరీనా తీరం వైపు చూస్తున్నట్టుగా సిద్ధం చేసిన ఈ విగ్రహాన్ని వీపీ సింగ్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం సీఎం ఎంకే స్టాలిన్ ఆవిష్కరించారు. ప్రధాన మంత్రిగా కేవలం 11 నెలల కాలం పదవిలో ఉన్నా, దేశంలో సామాజిక న్యాయం దీపాన్ని వెలిగించి వీపీ సింగ్ అందరి మన్ననలు పొందారని కొనియాడారు. వివరాలు.. మాజీ పీఎం విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ అలియాస్ వీపీ సింగ్‌కు తమిళనాడుతో ఉన్న అనుబంధం పార్టీలకు అతీతమైంది. ఈ విషయాన్ని గుర్తు చేస్తూ కావేరి జల వివాదంలో మధ్యవర్తిత్వ కమిటీ ఏర్పాటుకు ఆయన చేసిన కృషికి గుర్తింపుగా చెన్నైలో ఆయన నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేస్తామని ఇటీవల అసెంబ్లీలో సీఎం స్టాలిన్ ప్రకటించారు. దీనిని కార్యరూపంలోకి తెస్తూ తమిళనాడు సమాచార శాఖ నేతృత్వంలో రూ. 52.20 లక్షల వ్యయంతో వీపీసింగ్ విగ్రహాన్ని సిద్ధం చేశారు. ఈ విగ్రహావిష్కరణ వేడుక సోమవారం ఉదయం జరిగింది. వీపీసింగ్ సతీమణి సీతాకుమారి, కుమారుడు అజయ్ సింగ్‌తో పాటు ఇతర కుటుంబ సభ్యులను, ఉత్తర ప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్‌ను ఈ వేడుకకు ఆహ్వానించారు. వీరి సమక్షంలో బ్రహ్మాండ విగ్రహాన్ని సీఎం ఎంకే స్టాలిన్ ఆవిష్కరించారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన వీపీ సింగ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ మంత్రి దురై మురుగన్, ఉన్నత విద్యా శాఖమంత్రి పొన్ముడి, సమాచార శాఖ మంత్రి స్వామినాథన్ , క్రీడల శాఖ మంత్రి ఉదయ నిధి స్టాలిన్, రహదారుల శాఖ మంత్రి ఏవీ వేలు, సీఎస్ శివదాస్ మీన, సమాచార శాఖ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, కార్యదర్శి సెల్వరాజ్, డైరెక్టర్ టీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న సీఎం స్టాలిన్

కలైవానర్ అరంగంలో వేడుక

రాజధాని కళాశాలలో భారీ విగ్రహ ఆవిష్కరణ అనంతరం వాలాజా రోడ్డులోని కలైవానర్ అరంగంలో వీపీ సింగ్‌ను స్మరించుకుంటూ భారీ వేడుక జరిగింది. ఈ వేడుకకు వీపీ సింగ్ కుటుంబ సభ్యులతో పాటు ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్, సీపీఐ నేత ముత్తరసన్, ఎండీఎంకే నేత వైగో, ఇండియన్ యూనియన్ ముస్లింగ్ లీగ్ నేత ఖాదర్ మొహిద్దీన్, వీసీకే నేత తిరుమావళవన్ హాజరయ్యారు. ఈ వేడుకలో సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ, చెన్నై మెరీనా బీచ్ రోడ్డులోని 150 ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన రాజధాని కళాశాలలో వీపీ సింగ్‌కు విగ్రహం ఏర్పాటు అనేది సామాజిక న్యాయానికి ప్రతీక అని ప్రకటించారు. 11 నెలలు ప్రధాని పదవిలో ఉన్నా, ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని మండల్ కమిషన్ సిఫారసులపై దృష్టి పెట్టిన ఆయన సామాజిక న్యాయం లక్ష్యంగా శ్రమించారని కొనియాడారు. ఉద్యోగాల్లో గిరిజనులకు ప్రత్యేక రిజర్వేషన్లు, వెనుకబడిన సామాజిక వర్గానికి జనాభా సంఖ్య ఆధారంగా రిజర్వేషన్లు కల్పించారని వివరించారు. భగవంతుని సృష్టిలో అందరూ సమానమే అని తమ దివంగత నేత కరుణానిధి రాసిన కవితను ఈసందర్భంగా స్టాలిన్ గుర్తుచేస్తూ ఉద్వేగానికి గురయ్యారు. వీపీ సింగ్‌కు మాతృభూమి ఉత్తరప్రదేశ్ అని, తమిళనాడు ఆయనకు తండ్రి లాంటి రాష్ట్రం అని పేర్కొంటూ (దివంగత ద్రవిడ సిద్ధాంతకర్త పెరియార్ సామాజిక న్యాయానికి ప్రతీకగా ఉన్న ఈ గడ్డలో) వీపీ సింగ్‌కు ఇదే తొలి విగ్రహం అని ప్రకటించారు. వీపీ సింగ్‌కు తమిళనాడులో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తన రక్త సంబంధీకులు నివసించే రాష్ట్రంగా తమిళనాడును ఆయన భావించే వారని గుర్తు చేశారు. అందుకే కావేరి జల వివాదంలో మధ్యవర్తిత్వ కమిటీ ఏర్పాటు, శ్రీలంకతో ఎదురైన సమస్య పరిష్కారంలో ఆయన కీలక పాత్ర పోషించడమే కాదు, దివంగత నేత కరుణానిధి సలహాలు, సూచనలు అనుసరించే వారని గుర్తు చేశారు.

దేశవ్యాప్తంగా కులగణన నినాదం

చెన్నై విమానాశ్రయం స్వదేశీ టెర్మినల్‌కు కామరాజర్, విదేశీ టెర్మినల్‌కు అన్నా పేర్లు పెట్టాలిన కోరగానే, తక్షణం స్పందించిన వ్యక్తి వీపీ సింగ్ అని స్టాలిన్ కొనియాడారు. తమిళనాడుపై ఎంతో అభిమానం కలిగిన ఆ నేతను స్మరిస్తూ నిలువెత్తు విగ్రహం ప్రతిష్టించడం ఆనందంగా ఉందన్నారు. రక్త సంబంధీకులు మాత్రమే వీపీ సింగ్‌కు కుటుంబ సభ్యులు కాదని, తామంతా ఆయన కుటుంబమే అని ప్రకటించారు. ఆయన సేవలను స్మరించుకునే విధంగా తమిళనాడులో సామాజిక న్యాయం సాధన దిశగా ముందుకెళ్తున్నామని, ఇందుకోసం పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేశామని వివరించారు. సామాజిక న్యాయం అన్నది రాష్ట్రాల సమస్య కాదని, దీనికి పరిష్కారంగా కులగణన జరగాల్సిందేనని డిమాండ్ చేశారు. జనాభా లెక్కింపుతో పాటు దేశవ్యాప్తంగా కులగణనపై కేంద్రం దృష్టి పెట్టాలని కోరారు. ఇందుకోసం అన్ని పార్టీల ఎంపీలతో పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వీపీ సింగ్ అస్తమించి ఉండవచ్చని, అయితే ఆయన వెలిగించిన సామాజిక న్యాయం అనే దీపాన్ని ఆర్పడం ఎవరితరం కాదన్నారు. ఆయన్ని ఎవరు మరిచినా తమిళనాడు మాత్రం మరవబోదని, ద్రవిడ మోడల్ ప్రభుత్వంలో ఆయన చిరస్మరణీయుడు అని కొనియాడారు. కాగా, ఈకార్యక్రమానికి హాజరైన నేతలు, ప్రముఖులకు వీపి సింగ్ ప్రతిమలను స్టాలిన్ కానుకగా అందజేశారు.

తొలుత రాష్ట్రంలో కుల గణన చేపట్టండి

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో కులగణన చేపట్టాలని ప్రభుత్వాన్ని బీజేపీ, పీఎంకే డీఎంకే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. మాజీ ప్రధాని వీపీ సింగ్ విగ్రహావిష్కరణ వేడుకలో జాతీయ స్థాయిలో కుల గణనకు సీఎం స్టాలిన్ డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో బీజేపీ నేతలు, పీఎంకే నేతలు రాష్ట్రంలో కుల గణన నినాదాన్ని అందుకున్నారు. కేంద్ర మంత్రి ఎల్. మురుగన్ స్పందిస్తూ రాష్ట్రంలో కుల గణన జరపకుండా జాతీయ స్థాయిలో డిమాండ్ చేయడం ఏమిటని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కులగణన విషయంలో ప్రభుత్వం నాటకాలు ఆడుతోందని విమర్శించారు. పీఎంకే వ్యవస్థాపకుడు రాందాసు స్పందిస్తూ, రాష్ట్రంలో కులగణన జరపాలని ఆది నుంచి తాము డిమాండ్ చేస్తూ వస్తున్నామని గుర్తుచేశారు.

డెంగీ విజృంభణ

- రాష్ట్రంలో కొత్త వైరస్ కలవరం

సాక్షి, చెన్నై : రాష్ట్రంలోని పుదుకోట్టై, మదురై జిల్లాలో డెంగీ విజృంభిస్తోంది. దీనికి తోడు కొత్త రకం వైరస్ కలకలం రేపుతోంది. కేంద్రం నుంచి వచ్చిన ఆదేశాలతో రాష్ట్ర ఆరోగ్య శాఖ వర్గాలు ముందు జాగ్రత్త చర్యలపై దృష్టి పెట్టాయి. వివరాలు.. రాష్ట్రంలో ఈశాన్య రుతు పవనాలు విస్తరించిన విషయం తెలిసిందే. వర్షాలకు తోడు మారిన వాతావరణంతో సీజన్ జ్వరాలు స్వైర విహారం చేస్తున్నాయి. జ్వరం, జలుబు, దగ్గుతో బాధ పడుతున్న వారి సంఖ్య అధికంగా ఉంది. ప్రభుత్వం ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేటు క్లినిక్‌లలో జ్వరాలతో క్యూ కడుతున్న వారు ఎక్కువగానే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో పుదుకోట్టై, మదురై జిల్లాలో డెంగీ కేసులు అధికం కావడం కలవరం రేపుతోంది. పుదుకోట్టైలో సోమవారం ఒక్క రోజే 60 డెంగీ కేసులు నమోదయ్యాయి. మదురైలోనూ కేసులు పెరుగుతుండడంతో అధికారులు అలర్ట్ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను అప్రమత్తం చేయడానికి సిద్ధమవుతున్నారు. అదే సమయంలో చైనాలో కొత్త రకం వైరస్ విజృంభణ నేపథ్యంలో కేంద్రం నుంచి వచ్చిన ఆదేశాలతో ఆరోగ్య శాఖ మరింత అప్రమత్తమైంది. సోమవారం ఆరోగ్య శాఖ అధికారులు సమావేశమయ్యారు. జిల్లాల కలెక్టర్లు ముందు జాగ్రత్తలు చేపట్టాలని, జిల్లా ఆరోగ్య అధికారులు అన్ని ఆస్పత్రులలో తనిఖీలు చేయాలని, అన్ని రకాల మందులు పూర్తి స్థాయిలో నిల్వ ఉన్నాయా? అని పరిశీలించే విధంగా ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రజలను అప్రమత్తంచేసే దిశగా మాస్కల వాడకం గురించి అధికారికంగా ప్రకటనకు అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో పెరుగుతున్న డెంగీ కేసుల కట్టడికి చర్యలు విస్తృతం చేయాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

అప్పీల్ పిటిషన్ వాయిదాకు వినతి

- సుప్రీంకోర్టుకు పన్నీరు లేఖ
- పళణి శిబిరం అభ్యంతరం
- నేడు విచారణ సాగేనా?

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే సర్వసభ్య సమావేశం వ్యవహారంలో పన్నీరు దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్ మంగళవారం విచారణకు రానుంది. ఈ నేపథ్యంలో వారం పాటు పిటిషన్ విచారణను వాయిదా వేయాలని పన్నీరు సెల్వం సుప్రీంకోర్టు రిజిస్ట్రార్‌ను ఆశ్రయించడాన్ని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి శిబిరం తీవ్రంగా వ్యతిరేకించింది. అన్నాడీఎంకేను కైవసం చేసుకోవడం కోసం మాజీ సీఎంలు పళణి స్వామి, పన్నీరు సెల్వం మధ్య పెద్ద సమరమే జరుగుతోన్న విషయం తెలిసిందే. న్యాయ పోరాటంలో కోర్టు తీర్పులు, ఎన్నికల కమిషన్ ఉత్తర్వులతో పళణి స్వామికి అనుకూలంగా మారాయి. దీంతో అన్నాడీఎంకేను పళణి స్వామి పూర్తిగా తన గుప్పెట్లోకి తెచ్చుకున్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పగ్గాలు చేపట్టి బలోపేతం దిశగా పళణి స్వామి వ్యూహాలు రచిస్తున్నారు. అదే సమయంలో అన్నాడీఎంకే సర్వ సభ్య సమావేశం, తీర్మానాలకు వ్యతిరేకంగా పన్నీరు సెల్వం దాఖలు చేసిన పిటిషన్ రూపంలో ఏదైనా చిక్కులు ఎదురయ్యేనా అన్న ఉత్కంఠకు తెర పడే విధంగా గత నెల తీర్పు వెలువడింది. ఇందులోనూ పళణి స్వామి విజయం సాధించారు. ఇదే ఊపుతో బీజేపీ కూటమికి కటీఫ్ చెప్పి, రాష్ట్రంలో ప్రత్యేక కూటమి దిశగా పళని అడుగులు వేస్తున్నారు. ఈ సమయంలో పన్నీరు సెల్వం ఈ తీర్పును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో అప్పీల్ పిటిషన్ దాఖలు చేశారు. పట్టువదలని విక్రమార్కుడి వలే న్యాయ పోరాటాలను విస్తృతం చేశారు. ఈ అప్పీలు పిటిషన్ మంగళవారం విచారణకు రానుంది. ఈ సమయంలో పిటిషన్ విచారణను వారం రోజులు వాయిదా వేయాలని పన్నీరు సెల్వం కోర్టుకు విన్నవించారు. సుప్రీం కోర్టు రిజిస్ట్రార్‌ను ఆయన తరఫు న్యాయవాది గౌతం శివశంకర్ సోమవారం సంప్రదించి విచారణ వాయిదాకు విన్నవించారు. ఇందుకు సంబంధించిన లేఖను సమర్పించారు. వ్యక్తిగత కారణాల దృష్ట్యా, పిటిషన్ విచారణను వారం రోజులు వాయిదా వేయాలని విన్నవించారు. న్యాయమూర్తుల కోర్టు సమయాన్ని వృథా చేయకూడదనే ఉద్దేశంతో ముందుగా ఈ విజ్ఞప్తి లేఖ సమర్పించినట్టు పేర్కొన్నారు.



పళని, పన్నీరు

తిరస్కరించండి..

అదే సమయంలో పళణి స్వామి తరఫున మరో లేఖ రిజిస్ట్రార్‌కు సమర్పించారు. అన్నాడీఎంకే వ్యవహారంలో విచారణను జాప్యం చేయడమే లక్ష్యంగా పన్నీరు సెల్వం ప్రయత్నాలు చేస్తున్నారని అందులో పేర్కొన్నారు. ఇప్పటికే కింది కోర్టులలో అన్నాడీఎంకేకు సంబంధించిన కేసుల విచారణలు ఉన్నత న్యాయ స్థానం ఇచ్చే ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నాయని, అన్ని విచారణలను జాప్యం చేయడానికి ఈ వాయిదా లేఖను సమర్పిస్తున్నారని, దీనిని తిరస్కరించాలని కోరారు. ఈ దృష్ట్యా, మంగళవారం పిటిషన్ విచారణకు వస్తుందా..? లేదా..? అన్నది ఉత్కంఠగా మారింది.

ఇసుక స్కాం.. 4,700 కోట్లు

- కోర్టుకు ఈడీ నివేదిక

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో ఇసుక తవ్వకాల ద్వారా రూ. 4, 700 కోట్ల మేరకు అక్రమార్జన చేతులు మారినట్లు కోర్టుకు సోమవారం ఈడీ ఓ నివేదికను సమర్పించింది. వివరాలు.. రాష్ట్రంలో ఇటీవల కాలంగా డీఎంకే పాలకులు, వారికి అనుబంధ సంస్థలు, కాంట్రాక్టర్లను టార్గెట్‌చేసిన ఐటీ, ఈడీ సోదాలు విస్తృతంగా జరుగుతున్న విషయం తెలిసిందే. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం నేతృత్వంలో వైగై, తామర భరణి, కావేరి తదితర నదీ తీరాలలోని ఇసుక క్వారీలను తమ గుప్పెట్లో ఉంచుకుని రాజ్యమేలుతున్న ఇసుకాసురుల భరతం పట్టేందుకు సెప్టెంబరు, అక్టోబరు, నవంబర్ నెలలో ఈడీ సోదాలు జరిగాయి. రాష్ట్రంలో క్వారీలు నీటిపారుదల శాఖ పర్యవేక్షణలో ఉండటంతో ఆ శాఖకు చెందిన ప్రధాన ఇంజనీరింగ్ అధికారి ముత్తయ్యను విచారణ పరిధిలోకి ఈడీ తీసుకొచ్చింది. ఆయన వద్ద ఇప్పటికే రెండు మూడు రోజుల పాటు విచారణ సాగింది. అదే సమయంలో పది జిల్లాల కలెక్టర్లను విచారించాలని ఈడీ నిర్ణయించింది. ఇందుకు సమన్లు కూడా జారీచేసింది. దీనిని వ్యతిరేకిస్తూ రాష్ట్రప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. పలువురు అధికారులు దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో ఖనిజ సంపదల వ్యవహారాలు ఈడీ విచారణ పరిధిలో లేదని, కలెక్టర్లను విచారించే అధికారం కూడా లేదని వాదన వినిపించారు. ఇందుకు వివరణ ఇస్తూ సోమవారం హైకోర్టులో ఈడీ తరఫున ఓ నివేదికను సమర్పించారు. ఇసుక అక్రమార్జనలో రూ. 4,700 కోట్ల మేరకు నగదు చేతులు మారినట్టు విచారణలో వెలుగు చూసినట్టు అందులో వివరించారు. ఈ వ్యవహారంలో ప్రాథమిక సమాచారం ఇవ్వాలని కోరగా తమిళనాడు డీజీపీ నిరాకరించారని పేర్కొన్నారు. చట్ట విరుద్ధంగా నగదు బదిలీలు ఈ వ్యవహారంలో జరిగి ఉన్నాయని, మనీ లాండరింగ్ మేరకు ఈ అంశంపై విచారించే అధికారుల తమకు ఉందని ఆ నివేదికలో ఈడీ పేర్కొనడం గమనార్హం.



ఇసుక తవ్వకాలు

టార్గెట్ దురై మురుగన్?

తాజాగా ఈడీ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి దురై మురుగన్‌ను టార్గెట్ చేయడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలువురు మంత్రులను పలు కేసులలో టార్గెట్ చేసిన ఈడీ, ప్రస్తుతం దురై మురుగన్ పీఏ ఉమాపతిని ఈ కేసు పరిధిలోకి తీసుకు రావడం గమనార్హం. జిల్లాల కలెక్టర్లకు సమన్ల వ్యవహారం పిటిషన్ వాదనల అనంతరం వాయిదా పడగానే ఈడీ తరఫున అప్పీల్ పిటిషన్ దాఖలైంది. ఇందులో దురై మురుగన్ పీఏ ఉమాపతిని టార్గెట్ చేశారు. తాము ఇసుక అక్రమ తవ్వకాలు వ్యవహారంలో పలువురు కిందిస్థాయి అధికారులను విచారించామని, ఉన్నాధికారుల మౌఖిక ఆదేశాలకు కట్టుబడి తాము మౌనం వహించినట్టు వారు వాంగ్మూలం ఇచ్చినట్టు పేర్కొన్నారు. అలాగే నీటి పారుదల శాఖలో ఉన్నతాధికారిగా ఉన్న ఒకరు మంత్రి పీఏ ఆజ్ఞను ధిక్కరించి మరీ తమ విచారణకు వచ్చారని వివరించారు. పలువురు అధికారులు సమగ్ర వివరాలు ఇచ్చారని, భద్రత దృష్ట్యా, వారి వివరాలను కోర్టుకు తెలియజేయలేకున్నట్టు పేర్కొన్నారు. రూ. 3,900 కోట్ల మేరకు ఇసుక వ్యాపారం జరిగితే, కేవలం రూ. 36 కోట్లకే లెక్కలు ఉన్నట్టు, మొత్తంగా ఈ వ్యవహారంలో రూ. 4,730 కోట్ల మేరకు అక్రమాలు జరిగినట్టు పిటిషన్‌లో వివరించారు. విచారణకు వచ్చేందుకు, సహకరించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నా, వారిని నిర్బంధిస్తున్నారని పిటిషన్ ద్వారా కోర్టుకు ఈడీ తీసుకు రావడం గమనార్హం.

డిప్యూటీగా ఉదయనిధి?

సాక్షి, చెన్నై: డీఎంకే వారసుడు ఉదయ నిధి స్టాలిన్ సోమవారం 46వ వసంతంలోకి అడుగు పెట్టారు. ఇదే సమయంలో ఆయనకు డిప్యూటీ సీఎం పదవి అప్పగించాలనే నినాదం తెర మీదకు వచ్చింది. డిసెంబరులో జరిగే యువజన మహానాడు అనంతరం ఆయనకు ప్రమోషన్ ఖాయం అనే ప్రచారం విస్తృతంగా సాగుతోంది. వివరాలు.. రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి, డీఎంకే యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఉదయ నిధి స్టాలిన్ జన్మదినాన్ని డీఎంకే యువజన విభాగం వాడవాడలా సేవా కార్యక్రమాలతో ఘనంగా జరుపుకున్నాయి. ఉదయాన్నే తండ్రి, సీఎం స్టాలిన్, తల్లి దుర్గా ఆశీస్సులను ఉదయ నిధి అందుకున్నారు. అదే సమయంలో డీఎంకే యూత్ నేతృత్వంలో ఉదయ నిధి కోసం ఎంగల్ అన్న (మా అన్న)పేరిట ఓ పాటల సీడీని సిద్ధం చేసింది. అలాగే ఉదయ నిధి నటించి విజయవంతమైన మామన్నన్ చిత్రంలోని ఓ పాట ఆధారంగా మరో ప్రత్యేక గీతాన్ని సిద్ధం చేశారు. వీటిని మంత్రి అన్బిల్ మహేశ్ విడుదల చేశారు. ఇక రానున్న లోక్‌సభ ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా ఉదయ నిధి సేవలను మరింత విస్తృతంగా ఉపయోగించుకునేందుకు వీలుగా ఆయనకు ప్రమోషన్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం ఊపందుకుంది.

తండ్రి బాటలోనే..

తన తండ్రి, పార్టీ అధినేత కరుణానిధి వారసుడిగా డీఎంకే రాజకీయాల్లో ఎంకే స్టాలిన్ చక్రం తిప్పిన విషయం తెలిసిందే. తండ్రి సీఎంగా ఉన్న కాలంలో ఆయన డిప్యూటీ సీఎంగా అధికార వ్యవహారాల్లో దూసుకెళ్లారు. తండ్రి మరణంతో డీఎంకే పగ్గాలు చేపట్టి ప్రస్తుతం సీఎంగా ద్రవిడ మోడల్ పాలన నినాదంతో ముందుకెళ్తున్నారు. అదే సమయంలో తన వారసుడు ఉదయ నిధి స్టాలిన్‌ను సైతం రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో సినీ నటుడిగా డీఎంకే రాజకీయాల్లోకి వచ్చిన ఉదయ నిధి ప్రజాకర్షణలో ఫలితం సాధించారు. 2021 లోక్ సభ ఎన్నికలలో తండ్రి స్టాలిన్‌తో సమానంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రచారంలో దూసుకెళ్లడమే కాదు, చేపాక్కం ట్రిప్లికేన్ నియోజకవర్గం నుంచి తొలిసారిగా ఎమ్మెల్యే అయ్యారు. పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పగ్గాలు అందుకున్నారు. ఏడాది తర్వాత ఆయనకు మంత్రి పదవి అప్పగించాలని పలువురు సీనియర్లు నినాదించడంతో క్రీడల శాఖను కేటాయించారు. ప్రస్తుతం డిప్యూటీ నినాదం తెర మీదకు వచ్చిన నేపథ్యంలో ప్రమోషన్ ఉంటుందా..? లేదా..? అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది.



కరుణానిధి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఉదయనిధి స్టాలిన్

క్లుప్తంగా

కొండ చిలువ పట్టివేత

అన్నానగర్: శివగంగై జిల్లా సింగంపునరి సమీపంలోని మాగాంగ్ కండన్ కోవిల్‌పట్టిలో కొండచిలువ సంచరిస్తున్నట్లు స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సోమవారం సమాచారం అందించారు. స్టేషన్ ఆఫీసర్ ప్రకాష్ నేతృత్వంలోని సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పొదల్లో దాగి ఉన్న 5 అడుగుల కొండ చిలువను సజీవంగా పట్టుకున్నారు. అదే విధంగా సింగంపునరి–సుక్కాంబట్టి రహదారి వద్ద 10 అడుగుల పొడవున్న పర్వత పామును పట్టుకున్నారు. అనంతరం పాములను అటవీశాఖ అధికారులకు అప్పగించారు.

గ్రీవెన్స్ డేలో సహాయకాల పంపిణీ

కాంచీపురం (పళ్లిపట్టు) : కాంచీపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజా సంబంధాల కేంద్రంలో సోమవారం జిల్లా కలెక్టర్ కలైసెల్వి అధ్యక్షతన నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో జిల్లా వ్యాప్తంగా నుంచి ప్రజలు పాల్గొని తమ సమస్యలు, సహాయకాలు కోసం 230 మంది అర్జీలు అందజేశారు. వాటిపట్ల అధికారులు పరిశీలన చేపట్టి అర్హులైన వారికి వెంటనే కలెక్టర్ సర్టిఫికెట్లతో పాటు సహాయకాలు అందజేశారు. ప్రత్యేకంగా ప్రత్యేక ప్రతిభావంతులకు వైకల్యాన్ని గుర్తించి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై అవగాహన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

వేలూరు: విద్యార్థులు ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల జరిగే నష్టాలపై అవగాహన కలిగి ఉండాలని విల్లీస్ ఎంటర్‌ప్రైజెస్ ఎగ్జిక్యూటివ్ ఎబినేసర్ జేషువా అన్నారు. వేలూరు జిల్లా కాట్పాడిలోని అగ్జిలియమ్ కళాశాలలో విల్లీస్ ఎంటర్‌ప్రైజెస్, పర్యావరణ శాఖ సంయుక్తంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎలక్ట్రానిక్ వస్తువులను దగ్ధం చేయడం, వాటి పొగను పీల్చడం వల్ల ఆరోగ్య సమస్యలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పచ్చదనం పెంపొందించాలన్నారు. అప్పుడు ఆరోగ్య జీవనం సాధ్యమన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జయశాంతి, ఆర్గనైజర్ సాదు, సుందర్ సింగ్, పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత ఐసీఎఫ్ జట్టు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ఐసీఎఫ్ జట్టు విజేతగా నిలిచింది. తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ విజేత జట్టుకు ట్రోఫీ అందజేశారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి దళపతి వినాయకం మహిళల డిగ్రీ కళాశాలలో తిరువళ్లూరు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు జరిగాయి. వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి కుప్పుస్వామి, కోశాధికారి భారతి, ఉపాధ్యక్షుడు ప్రభు ఏర్పాట్లను పర్యవేక్షించారు. తిరువళ్లూరు, కాంచీపురం, చెన్నై, రాణిపేట, వేలూరు జిల్లాల నుంచి 50కు పైగా జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. రెండు రోజుల పాటు విద్యుత్ కాంతుల్లో నిర్వహించిన పోటీల్లో ఆదివారం రాత్రి ఐసీఎఫ్–ఎస్ఆర్ఎం జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. రసవత్తరంగా సాగిన ఆటలో ఐసీఎఫ్ జట్టు విజయం సాధించింది. ఆ జట్టుకు తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ ట్రోఫీతో పాటు జ్ఞాపికలు, నగదు బహుమతి పంపిణీ చేశారు. రన్నరప్‌గా నిలిచిన ఎస్ఆర్ఎం జట్టుకు పీకాక్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకిరణ్ మెమెంటో అందజేశారు. వాలీబాల్ పోటీల స్పాన్సర్‌గా దళపతి విద్యా సంస్థలు, పీకాక్ హాస్పిటల్ వ్యవహరించాయి. దళపతి విద్యాసంస్థల కరస్పాండెంట్ బాలాజీ, మున్సిపల్ కౌన్సిలర్ అశోక్‌కుమార్, న్యాయవాదులు కిషోర్‌రెడ్డి, శ్రీనివాసన్ పాల్గొన్నారు.

నాన్ ముదల్వాన్ వెబ్‌సైట్ అభివృద్ధికి చర్యలు

కొరుక్కుపేట: ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యంతో తమిళనాడు ప్రభుత్వం నాన్ ముదల్వాన్ వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తమిళనాడుకు చెందిన పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని మరింత ప్రోత్సహించేందుకు గత ఏడాది మార్చి 1న తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ముదల్వాన్ అనే పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తారు. వ్యక్తిగత నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి తక్కువ ఫీజుతో నైపుణ్య శిక్షణ, సిలబస్‌తో కూడిన నైపుణ్య శిక్షణ, టెక్నికల్ సబ్జెక్టులు, పోటీ పరీక్షలకు కోచింగ్, భాషా నైపుణ్యాల శిక్షణ, ఉన్నత విద్య కోసం వ్యక్తిత్వ శిక్షణ, ప్రవేశ పరీక్ష శిక్షణ వంటి వివిధ శిక్షణలు ఇస్తారు. అంతే కాకుండా ఈ కార్యక్రమం ద్వారా చదువు పూర్తి చేసుకున్న యువతీయువకులకు వారి ఎంపిక ప్రకారం ఉపాధి పొందేందుకు స్వల్పకాలిక శిక్షణ కూడా అందజేస్తారు. ఏటా 10 లక్షల మందికి పైగా శిక్షణ ఇస్తారు. ఈ ప్రాజెక్ట్ పనితీరును మెరుగుపరచడానికి ఒక ప్రైవేట్ కంపెనీకి బాధ్యతలు అప్పగించారు.

ఉపాధ్యాయురాలిపై కేసు నమోదు

తిరువొత్తియూరు: హోంవర్క్ చేయలేదని విద్యార్థిని బెత్తంతో కొట్టడంతో గాయపడి ఆస్పత్రి పాలయ్యాడు. దీంతో ఉపాధ్యాయురాలిపై కేసు నమోదు చేశారు. తూత్తుకుడి జిల్లా కలుగుమలై, తిరుమాలిగై వీధికి చెందిన రెమెల (49) కలుగుమలై ఆర్సీ సొసైటీ మహోన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. పాఠశాలలో తెన్‌కాశి జిల్లా కలపన్నకొలంకు చెందిన బాలుడు(13) చదువుతున్నాడు. ఈ నెల 22వ తేదీ పాఠశాలకు వెళ్లాడు. ఆ సమయంలో తరగతి గదిలో ఉపాధ్యాయురాలు రెమెల హోమ్‌వర్క్ నోట్‌బుక్ చూపమని కోరింది. విద్యార్థి హోంవర్క్ చేయలేదు. హోంవర్క్ నోట్ బుక్ తీసుకుని రాలేదు. దీంతో బాలుడిని ఉపాధ్యాయురాలు బెత్తంతో కొట్టారు. గాయపడిన బాలుడిని చికిత్స కోసం కోవిల్‌పట్టి ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. బాలుడు తల్లిదండ్రులు కలుగుమలై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఉపాధ్యాయురాలిపై కేసు నమోదు చేశారు.

• కీలక ఒప్పందం

యూనివర్సిటీ ఆఫ్ ఏరోనాటిక్స్ ఆస్ట్రోనాటిక్స్ అండ్ ఏవియేషన్(ఐఏఏఏ)– సీమాట్స్‌ల మధ్య అకడమిక్, రీసెర్చ్ ల్యాండ్ స్కేప్ అభివృద్ధి, కొత్త ఆవిష్కరణలు, నైపుణ్యాల అభివృద్ధి, వర్క్ షాపులు, శిక్షణ తదితర అంశాలకు సంబంధించిన అవగాహన ఒప్పందం సోమవారం జరిగింది. స్థానికంగా ఈ ఒప్పందాలపై సీమాట్స్ చాన్స్‌లర్ ఎన్ఎం వీరయ్యన్, ఐఏఏఏ ప్రతినిధులు డాక్టర్ఎస్ రాజ మురుగన్, సీఎస్ కరుణాకరన్‌లు సంతకాలు చేశారు. - సాక్షి, చెన్నై



ప్రత్యేక రైలు సర్వీసు పొడిగింపు

కొరుక్కుపేట: దక్షిణాది జిల్లాల నుంచి చెన్నై సహా ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం సదరన్ రైల్వేలోని మధురై డివిజన్ పండుగల సీజన్‌లో ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. నాగర్‌కోయిల్ నుంచి తిరునల్వేలి మీదుగా చెన్నై తాంబరం ప్రత్యేక రైలును ప్రకటించారు. ఈ రైలు ఈ నెలాఖరు వరకు నడుస్తుందని ఇప్పటికే ప్రకటించారు. ఈ రైలుకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. దీంతో జనవరి వరకు పొడిగించారు. రైలు (06012) డిసెంబర్ 3, 10, 17, 24, 31 తేదీలు, జనవరిలో 7, 14, 21, 28 తేదీల్లో నాగర్‌కోవిల్ నుంచి సాయంత్రం 4.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం చెన్నైకు చేరుకుంటుంది. అలాగే తిరుగు ప్రయాణంలో (06011) తాంబరం నుంచి డిసెంబర్ 4, 11, 18, 25.. జనవరి 1, 8, 15, 22, 29 తేదీల్లో ఉదయం 8.05 గంటలకు బయలుదేరి, అదే రోజు రాత్రి 8.45 గంటలకు నాగర్‌కోయిల్ చేరుకుంటుంది.

పిల్లనివ్వలేదని ఆత్మహత్య

అన్నానగర్: మేనమామ కుమార్తెను ఇచ్చి వివాహం చేయలేదనే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పొన్నమరావతి కామరాజ్ నగర్‌కు చెందిన సెల్వరాజ్ కుమారుడు కలయరసన్ (35) ఫొటోగ్రాఫర్. ఇతను పాత మంగళంపట్టికి చెందిన తన మేనమామ కుమార్తెను ప్రేమిస్తున్నాడు. దీంతో కలయరసన్ తల్లి వెళ్లి తన కుమారుడికి పెళ్లి చేయాలని కోరింది. అందుకు ఆమె అన్న, వదిన వ్యతిరేకించారు. ఈ విషయం తెలుసుకున్న కలయరసన్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పొన్నమరావతి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొన్నమరావతి ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



సీడీని ఆవిష్కరిస్తున్న సినీ నటి రాధిక

వేలూరు: మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం సంతోషంగా ఉంటుందని సినీనటి రాధిక అన్నారు. వేలూరు శ్రీపురం బంగారుగుడి ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీనారాయణి ఆసుపత్రిలో ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఆసుపత్రి డైరెక్టర్ బాలాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫాస్ట్‌పుడ్‌లకు అలవాటు పడకుండా సంప్రదాయ ఆహారాన్నే తీసుకోవాలన్నారు. అప్పుడు మధుమేహం నుంచి బయట పడవచ్చన్నారు. మనం ఇంటి ముందున్న వేప చెట్టును నిర్లక్ష్యంగా చూస్తుంటామని.. అదే వేప ఆకును ఉపయోగించి ఇతర దేశాల్లో మధుమేహవ్యాధికి మందుగా వాడుతున్నారని తెలిపారు. మనం అధికంగా రుచి, కారం, ఉప్పుకే అలవాటు పడుతున్నామని.. అయితే చేదుకు అధికంగా ప్రాధాన్యత ఇవ్వబోమన్నారు. ప్రతి ఒక్కరూ చేదు రుచికి కూడా అలవాటు పడాలన్నారు. ముఖ్యంగా ఇంటిలోని మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండగలరని తెలిపారు. మహిళలు తరచూ వైద్య పరీక్షలు చేసుకోవడం మంచిదన్నారు. ఇటీవల కాలంలో విద్యార్థులు అధికంగా సెల్‌ఫోన్‌లకు బానిసగా మారుతున్నారని.. వాటి నుంచి బయటపడాలన్నారు. యుక్త వయస్సులో ఆకర్షణకు లొంగిపోతే జీవితం నాశనం అవుతుందని సూచించారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి జీవితంలో స్థిరపడాలన్నారు. అనంతరం మధుమేహ వ్యాధికి సంబంధించిన సీడీని ఆవిష్కరించారు. డివైన్ క్యాప్ డైరెక్టర్ శ్రీకాంత్, ఆస్పత్రి సూపరింటెండెంట్ గీతాయణి పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్



ఆర్కేపేటలో రోడ్డుపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

తిరుత్తణి: తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట యూనియన్‌లోని కదన నగరం పంచాయతీ రాజవూరు గ్రామంలో 30కి పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఊరి దారిలో 70 ఏళ్ల నాటి శ్రీకృష్ణ భజన మందిరం ఉంది. గుడి ముందు రోడ్డు మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తే చాలని కోరికతో ఆలయం ఎదురుగా ఉన్న వీధిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు మొదట్లో అభ్యంతరం తెలపలేదు. అయితే కాలం గడిచే కొద్దీ గుడి విస్తరిస్తుండడంతో రోడ్డు పక్కనే ఉన్న ఇళ్లలో నివాసం ఉండే వారు, గ్రామస్తులు అటువైపు వెళ్లడానికి ఇబ్బంది పడేవారు. గ్రామంలోని శ్రీకృష్ణ ఆలయానికి మరమ్మతులు చేపట్టి గోపురం నిర్మించి రోడ్డు వెడల్పు చేసి 40 ఏళ్ల దాటిన ట్రాన్స్ ఫార్మర్ వల్ల పెద్ద ప్రమాదం జరగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. అయితే విద్యుత్ బోర్డు అధికారులు మాత్రం ట్రాన్స్‌ఫార్మర్‌ను డబ్బులు చెల్లిస్తేనే మార్చుతామని చెబుతున్నారని, ఆర్కే పేట అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు ఫిర్యాదు చేయగా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. తిరుత్తణి ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని విద్యుత్ బోర్డు అధికారులకు సూచించారని.. అయితనా జాప్యం జరుగుతోందని వాపోయారు. వర్షాకాలం కావడంతో ట్రాన్స్‌ఫార్మర్ వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని, తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి

అన్నానగర్: తిరుచ్చిలో విద్యుత్ షాక్‌తో మూడేళ్ల బాలుడు మృతిచెందాడు. గోపి మేళా వీధికి చెందిన అరుల్‌రాజ్ కుమారుడు మగిల్ మిత్రన్ (3) వారం క్రితం కుటుంబంతో తిరుచ్చిలోని పాలక్కరై కీళపుదూర్‌లోని తన తాత ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు మగిల్ మిత్రన్ ఆ ప్రాంతంలో కింద పడి ఉన్న విద్యుత్ తీగను తొక్కాడు. విద్యుదాఘాతానికి గురై స్పృహతప్పి పడిపోయాడు. బాలుడిని తిరుచ్చి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్టు తెలిపారు. ఈ ఘటనపై పాలక్కరై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన పాలక్కరైలో తీవ్ర విషాదాన్ని నింపింది.





యానిమల్ చిత్రం యూనిట్

యానిమల్‌తో మంచి అనుభూతి కలిగింది

తమిళ సినిమా: శాండిల్ వుడ్ నుంచి బాలీవుడ్ వరకు ఎగబాకిన బ్యూటీ రష్మిక మందన్న. తాజాగా ఈమె రన్‌బీర్ కపూర్‌తో జతకట్టిన హిందీ చిత్రం యానిమల్. టాలీవుడ్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని భూషణ్ కుమార్ కిషన్ కుమార్ టీ.సిరీస్, మురాత్ కెడాని సినీవన్ స్టూడియోస్, ప్రణవ్ రెడ్డి వంగ భద్రకాళి పిక్చర్స్ సంస్థలు కలిసి నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని డిసెంబర్ ఒకటో తేదీ తమిళం, హిందీ, తెలుగు, కన్నడ, మలయాళం తదితర భాషల్లో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్రవర్గాలు ఆదివారం చెన్నైలోని వీఆర్‌మాల్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో నటి రష్మిక మందన్న, రన్‌బీర్‌తో పాటు చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. రష్మిక మాట్లాడుతూ.. ఈ చిత్రంలో నటించడం తనకు సరికొత్త అనుభవం ఇచ్చిందని పేర్కొన్నారు. తానుగా కథలను వెతుక్కుంటూ వెళ్లనని, వచ్చిన కథలను విని నచ్చిన వాటిని అంగీకరిస్తానని చెప్పారు. అనిమల్ చాలా ఇన్టెంసస్ కథా చిత్రమని చెప్పారు. కచ్చితంగా అందరికీ నచ్చుతుందన్నారు. తమిళం, తెలుగు, హిందీ ఇండస్ట్రీలకు మధ్య పెద్దగా తేడా లేదని తెలిపారు. తాను ఇప్పటివరకు చేసిన చిత్రాల్లో చాలా బలమైన పాత్రను ఈ చిత్రంలో చేసినట్లు చెప్పారు. ఎలాంటి ఛాయలు లేని ఒరిజినల్ పాత్రను పోషించినట్లు పేర్కొన్నారు. నటుడు రన్‌బీర్ కపూర్‌తో కలిసి నటించడం చాలా మంచి అనుభవంగా పేర్కొన్నారు. చిత్ర కథానాయకుడు మాట్లాడుతూ.. చెన్నై అంటే తనకు చాలా ఇష్టమన్నారు. ఈ చిత్రం ప్రారంభానికి ముందు దర్శకుడు సందీప్ రెడ్డి వంగ కథ గురించి తెలుపుతూ ఇది రీమేక్ కాదనీ ఇన్టెంసస్‌తో కూడిన ఒరిజినల్ కథ అని చెప్పారన్నారు. ఇంతకుముందు తల్లి కొడుకుల అనుబంధంతో చాలా చిత్రాలు వచ్చాయని, అయితే యానిమల్ తండ్రి కొడుకుల మధ్య అనుబంధాన్ని చూపించే కథా చిత్రంగా ఉంటుందని చెప్పారు.

కోలీవుడ్ టాక్స్

తమిళ సినిమా: నటి సమంత పేరు మరోసారి వార్తల్లో నానుతోంది. మయోసైటిస్ అనే అరుదైన వ్యాధికి గురికావడం నటనకు గ్యాప్ తీసుకున్న విషయం తెలిసిందే. అయితే ఆ వ్యాధికి వైద్య చికిత్స పొందుతూనే తరచూ తన ఫొటోలను, ఇతర విషయాలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ వార్తల్లో ఉండే ప్రయత్నం చేస్తున్నారు. ఈమె గురించి తాజాగా ఒక సంచలన వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. నటుడు నాగచైతన్య ప్రేమ వివాహం చేసుకొని, ఆ తర్వాత మనస్పర్థల కారణంగా విడిపోయిన సమంత మళ్లీ పెళ్లి చేసుకోవడం ఇష్టం లేకపోవడంతో ఇద్దరు పిల్లలను దత్తత తీసుకోవాలి అని నిర్ణయించుకునట్లు టాక్‌స్ప్రెడ్ అవుతోంది. ఇందులో వాస్తవం ఎంత అన్నది తెలియాల్సి ఉన్నది. దీనిపై సమంత గానీ, ఆమె వర్గం గానీ నోరు విప్పడంలేదు. ఈ విషయాన్ని పక్కన పెడితే నటి సమంత తాజాగా ఒక స్టేట్‌మెంట్ తన ఎక్స్ మీడియాలో పోస్ట్ చేసింది. మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి నటి జ్యోతిక జంటగా నటించిన కాదల్ ది కోర్ అనే మలయాళం చిత్రం గురించి సమంత చాలా గొప్పగా పేర్కొంది. ఈ నెల 23వ తేదీన తెరపైకి వచ్చిన ఈ చిత్రాన్ని మమ్ముట్టి కంపెనీ నిర్మించడం విశేషం. విశేష ఆదరణ పొందుతున్న కాదల్ ది కోర్ చిత్రాన్ని చూసిన సమంత ఈ చిత్రం ఈ ఏడు ఉత్తమ చిత్రంగా ప్రశంసల వర్షం కురిపిస్తోంది.. తన హీరో మమ్ముట్టి అని అంది.. ౹౹ మమ్ముట్టి సార్ మీరే నా హీరో. మీ నటన నుంచి చాలా కాలం నేను బయట పడలేదు౹౹ అని పేర్కొంది. మీరు ఏదైనా మంచి చేయాలనుకుంటే కాదల్ ది కోర్ చిత్రాన్ని చూడండి అని సమంత చెప్పిన విషయం ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.



నటి సమంత

అన్నపూరణిలో కొత్త నయన్‌ను చూస్తారు

తమిళ సినిమా: లేడీ సూపర్‌స్టార్ నయనతార చిత్రంలో నటిస్తున్నారంటే అందులో కచ్చితంగా ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. అలా ఆమె నటించిన చిత్రం అన్నపూరణి. నటుడు సత్యరాజ్, జయ్, కేఎస్ రవి కుమార్, కుమారి సచ్చు, అచ్యుత్ కుమార్, రెడిన్ కింగ్స్ లీ, రేణుక, కార్తీక్ కుమార్, సురేష్ చక్రవర్తి తదితరులు ముఖ్యపాత్రలు పోషించిన ఈ చిత్రం ద్వారా నీలేష్ కృష్ణ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సత్యన్ సూర్యన్ ఛాయాగ్రహణం, తమన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని డిసెంబర్ ఒకటో తేదీ విడుదలకు సిద్ధమవుతోంది. చిత్రం గురించి దర్శకుడు మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే వంటలపై ఆసక్తి కలిగిన ఒక యువతి ఎలా ఆ రంగంలో విజయం సాధించింది అన్నదే అన్నపూరణి చిత్రమని తెలిపారు. ఆమె కుటుంబం, వారి సామాజికవర్గం పురుషాధిక్యతను ఎదుర్కొని ఎలా తన లక్ష్యాన్ని చేరుకుంది అన్న ఈ చిత్రం కథను కొన్నేళ్ల క్రితమే నయనతారకు వినిపించారన్నారు. ఆమె ఆ సమయంలో యాక్షన్, థ్రిల్లర్, కమర్షియల్ కథా చిత్రాలు అధికంగా చేస్తున్నారని, ఈ కథ వాటికి భిన్నంగా ఉందని చెప్పి నటించడానికి సంసిద్ధత వ్యక్తం చేశారన్నారు. అయితే ప్రస్తుతం తాను అంగీకరించిన చిత్రాలను పూర్తి చేసిన తర్వాతే చిత్రంలో నటించగలనని, అంతవరకు వేచి చూడగలరా అని అడిగారన్నారు. అలా నయనతార కోసం ఎదురు చూసి ఈ చిత్రాన్ని పూర్తి చేశామని చెప్పారు. మానవత్వం, ప్రేమ, ఆత్మవిశ్వాసం గురించి చెప్పే చిత్రంగా అన్నపూరణి కథా చిత్రం ఉంటుందన్నారు. ఇది నయనతార ఇంతకుముందు నటించిన చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుందన్నారు. అంతే కాకుండా నలభీముల గౌరవాన్ని పెంచే చిత్రంగా ఉంటుందని అన్నారు.



దర్శకుడు నీలేష్ కృష్ణ, నయనతార

తెరపైకి తిరుక్కురల్



దర్శక నిర్మాత ఏజే బాలకృష్ణన్

తమిళ సినిమా: తిరువళ్లువర్ రాసిన తిరుక్కురల్ గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇది బైబిల్ తర్వాత ఎక్కువ భాషల్లో అనువాదమైన గ్రంథం అనే చెప్పవచ్చు. మానవ జీవన విధానానికి ఈ తిరుక్కురల్ ఒక మార్గదర్శి. అలాంటి తిరుక్కురల్ ఇప్పుడు సామాన్య ప్రజలకు కూడా దగ్గరయ్యే విధంగా సినిమాగా రూపొందుతోంది. ఇంతకుముందు కామరాజు జీవిత చరిత్రను అదే పేరుతో రమణ కమ్యూనికేషన్ పతాకంపై ఏజే బాలకృష్ణన్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన విషయం తెలిసిందే. ఆ చిత్రం రాష్ట్ర ప్రభుత్వ అవార్డులను గెలుచుకుంది. తాజాగా ఏజే బాలకృష్ణన్ తిరువళ్లువర్ రాసిన తిరుక్కురల్‌ను చిత్రంగా రూపొందించడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీని గురించి ఆయన సోమవారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో జాతిపిత మహాత్మా గాంధీ, తిరుక్కురల్ ద్వారా తిరువళ్లువర్ దేశం గర్వించదగ్గ ప్రముఖులుగా విరాజిల్లుతున్నారన్నారు. అలాంటి తిరువళ్లువర్ రాసిన తిరుక్కురల్‌ను చిత్రంగా రూపొందించాలని భావించినట్లు చెప్పారు. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక వర్గం వివరాలను త్వరలోనే వెల్లడించినట్లు పేర్కొన్నారు. ఈ చిత్రాన్ని తిరుక్కురల్ అనువాదం అయిన అన్ని భాషల్లోనూ విడుదల చేయనున్నట్లు చెప్పారు. రానున్న తిరువళ్లువర్ జయంతి రోజున చిత్ర షూటింగ్ ప్రారంభించనున్నట్లు బాలకృష్ణన్ తెలిపారు.

ముగ్గురు హీరోయిన్లతో అశోక్ సెల్వన్..!



సభానాయగన్ చిత్ర యూనిట్

తమిళ సినిమా: నటుడు అశోక్ సెల్వన్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం సభానాయగన్. ఇందులో నటి మెగా ఆకాష్, కార్తిక మురళీధరన్, చాందిని చౌదరి హీరోయిన్లుగా నిటిస్తున్నారు. సీఎస్ కార్తికేయన్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రాన్ని క్లియర్ వాటర్ పిక్చర్స్ అధినేత అరవింద్ జయబాలన్, జీ సినిమా అధినేత అయ్యప్పన్ జ్ఞానవేల్, కెప్టెన్ మెగా ఎంటర్‌టైన్‌మెంట్ అధినేత కెప్టెన్ మేఘవానన్ కలిసి నిర్మించారు. లియోన్ జేమ్స్ సంగీతాన్ని, బాలసుబ్రహ్మణ్యం శిష్యుడు దినేష్ పురుషోత్తమన్, ప్రభు రాఘవ్ కలిసి ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రం డిసెంబర్ 15వ తేదీన తెరపైకి రావడానికి ముస్తాబవుతుంది. ఈ సందర్భంగా ఆదివారం చెన్నైలో చిత్ర యూనిట్ నిర్వహించిన మీడియా సమావేశంలో చిత్ర కథానాయకుడు అశోక్ సెల్వన్ మాట్లాడుతూ సభానాయగన్ జాలీగా సాగే క్లీన్ ఎంటర్‌టైన్‌మెంట్ కథాచిత్రంగా ఉంటుందన్నారు. ఈ చిత్రంలో కామెడీ, డాన్స్ కోసం తాను చాలా రిహార్సల్స్ చేసినట్లు చెప్పారు. ఈ రెండు విషయాలు ఈ చిత్రంలో తనకు కొత్తగా అనిపించిందన్నారు. దర్శకులు ఇలాంటి కొత్త అవకాశాలను కల్పించినప్పుడే తమలాంటి నటులు వాటిని సద్వినియోగం చేసుకుంటారని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో ముగ్గురు హీరోయిన్లతో సన్నిహితంగా నటించడం గురించి అడుగుతున్నారని, అయితే అలా నటించడాన్ని తన భార్య కీర్తి తప్పుగా భావించరని పేర్కొన్నారు. తొలిప్రేమ, పాఠశాల, జీవితం వంటివి మరిచిపోలేని అనుభవాలని అవి, మనసులోంచి తొలగించలేనివని అన్నారు. అలాంటి వాటిని మళ్లీ గుర్తు చేసే చిత్రంగా సభానాయగన్ ఉంటుందన్నారు. అంతే కాకుండా మీ మానసిక వేదనలకు ఒక మంచి వైద్యంగా ఈ చిత్రం ఉంటుందన్నారు.

క్లుప్తంగా

క్రీడా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు క్రీడా వస్తువుల పంపిణీ చేస్తున్న డీఎంకే నేతలు

తిరుత్తణి: డీఎంకే యువజన విభాగం కార్యదర్శి, మంత్రి ఉదయనిధి స్టాలిన్ జన్మదినం సందర్భంగా తిరుత్తణి పట్టణ డీఎంకే కార్యదర్శి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు క్రీడా సామగ్రి, నోటుపుస్తకాలు, పెన్నులు, దుస్తులు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జ్యోతినగర్, మురుగప్పనగర్, మల్రిమాను వీధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సహాయకాలు పంపిణీ చేశారు. అలాగే స్థానిక కమల థియేటర్ కూడలి వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సామిరాజ్, నాయకులు శంకర్, గణేశన్, గజేంద్రన్ పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయాలని ఆందోళన

కొరుక్కుపేట: మదురై కలెక్టర్ కార్యాలయం వద్ద మాజీ మంత్రి ఆర్‌బీ ఉదయకుమార్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మేలూరుతో పాటు 58 గ్రామాలకు సాగునీటితో పాటు తిరుమంగళం ప్రధాన కాలువ నుంచి నీరు విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుమంగళం తాలూకాలో పెరియార్–వైగై నీటి పారుదల పథకం కింద, తిరుమంగళం ప్రధాన కాలువ ద్వారా పంట సాగు చేస్తున్నారు. వైగై డ్యాంలో 6 వేల మిలియన్ క్యూబిక్ అడుగుల నీరు ఉండగా, సెప్టెంబర్ 15న తిరుమంగళం ప్రాంతాలకు నీటిని తెరవడం ఆనవాయితీ. మదురై జిల్లాలో గరిష్లేమ్ ద్వారా బెరణి నుంచి కల్లాంద్రి వరకు రెండు సాగులకు సాగునీటి కోసం 45 వేల ఎకరాలు, మేలూరు ఏకదిశ నీటిపారుదల కోసం 83 వేల ఎకరాలు, తిరుమంగళం ఏకదిశ నీటి పారుదల కోసం 19 వేల 300 ఎకరాలకు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం 58 గ్రామాలకు సాగునీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాము కాటుకు విద్యార్థిని మృతి

అన్నానగర్: పాము కాటుతో విద్యార్థిని మృతి చెందిన ఘటన పుదుకోట్టై జిల్లాలో చోటుచేసుకుంది. కరంబకుడి సమీపంలోని మలయూర్‌కు చెందిన రజనీకాంత్ కూతురు సంధ్య (15) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ఆదివారం రాత్రి కుటుంబంతో కలిసి ఇంట్లో పడుకుంది. అర్ధరాత్రి సమయంలో అకస్మాత్తుగా సంధ్య కేకలు పెట్టింది. తల్లిదండ్రులు ప్రశ్నించగా.. తనను ఏదో కాటు వేసిందని చెప్పింది. కొంత సేపటికే సంధ్య శరీరం రంగు మారింది. దిగ్భ్రాంతి చెందిన తల్లిదండ్రులు బాలికను హుటాహుటిన గంధర్వకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తంజావూరు మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. రక్తపరీక్షలు చేయగా సంధ్య పాము కాటుకు గురైందని తేలింది. అయితే అప్పటికే ఆలస్యం కావడంతో బాలిక మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ నాయకుడిపై దాడి

• డీఎంకే మండల కార్యదర్శిపై కేసు

తిరువొత్తియూరు: చెన్నై ట్రిప్లికేన్‌లో ఓటర్ల పేర్ల జాబితాను సేకరించడంలో నిమగ్నమైన బీజేపీ నిర్వాహకులపై దాడి చేసిన డీఎంకే మండల కార్యదర్శిపై కేసు నమోదైంది. వివరాలు.. చెన్నై, ట్రిప్లికేన్ చేపాక్కం శాసనసభ నియోజకవర్గానికి సంబంధించిన 116వ వార్డు అయోధ్య కుప్పం ప్రాంతంలో బీజేపీ కార్యకర్తలు ఓటర్ల జాబితాను సోమవారం తనిఖీ చేశారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన డీఎంకే మండల కార్యదర్శి సుమన్ నేతృత్వంలోని కొందరు బీజేపీ వారిపై దాడి చేశారు. ఈ ఘటనలో సుమన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని రాయపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సమాచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. బాధితుడి ఫిర్యాదు మేరకు మెరీనా పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.

తల్లీబిడ్డ అనుమానాస్పద మృతి

అన్నానగర్: హోసూరులో సోమవారం ఉదయం నీటి తొట్టిలో తల్లి, ఏడాదిన్నర చిన్నారి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. కృష్ణగిరి జిల్లా హోసూరు తోరపల్లి అగ్రహారానికి చెందిన మునిరాజ్ అదే ప్రాంతంలోని క్రషర్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య మీనా (25), ఏడాదిన్నర కుమార్తె వైశాలి ఉన్నారు. ఆదివారం కార్తీక దీపం కావడంతో మునిరాజ్ గుడికి వెళ్లాడు. ఆమె తల్లిదండ్రులు కూడా తోటకు వెళ్లారు. అనంతరం మునిరాజ్ చెల్లెలు దీప బట్టలు ఉతికేందుకు తమ్ముడి ఇంటికి వచ్చింది. షంపులో మీనా, పాప వైశాలి మృతదేహాలుగా కనిపించడంతో భయంతో కేకలు వేసింది. స్థానికులు అక్కడికి చేరుకుని హోసూరు టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చిన్నారిని వాటర్ ట్యాంక్‌లో పడేసి మీనా ఆత్మహత్యకు పాల్పడిందా? లేక చిన్నారిని రక్షించే క్రమంలో మీనా మునిగిపోయిందా? లేక హత్యకు గురయ్యారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెన్నైలో.. గుట్కా వేట

• ప్రత్యేక బృందాల సోదాలు



సాక్షి, చెన్నై: గుట్కా విక్రయదారుల భరతం పట్టే విధంగా చెన్నైలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఆహార భద్రతా విభాగం, పోలీసు అధికారులతో కూడిన 20 బృందాలు చెన్నైలో సోమవారం నుంచి దుకాణాల్లో సోదాలు ముమ్మరం చేశాయి.2013లో రాష్ట్రంలో అన్నాడీఎంకే ప్రభుత్వం గుట్కా తదితర పొగాకు వస్తువులను నిషేధించిన విషయం తెలిసిందే. అయితే ఈ నిషేధిత వస్తువులు యథేచ్ఛగా మార్కెట్లో లభిస్తున్నాయని చెప్పవచ్చు. తరచూ పోలీసులు జరిపే తనిఖీల్లో పెద్దఎత్తున గుట్కా పట్టుబడుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి చెన్నైలోకి అధిక సంఖ్యలో నిషేధిత గుట్కా, పాన్‌మసాలలో ప్రవేశిస్తున్నట్టు ఇప్పటికే వెలుగు చూశాయి. కొన్ని చోట్ల పోలీసుల సాయంతోనే ఈ విక్రయాలు జరుగుతున్నట్లు ఆధారాలతో సహా బయటపడ్డాయి. ఈ పరిణామాల నేపథ్యంలో గుట్కా వేటకు ప్రత్యేక బృందాలను నియమిస్తూ చెన్నై పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోర్ ఆదేశాలు ఇచ్చారు. దీంతో తొలి విడతగా గుట్కా వేటకు 20 బృందాలు రంగంలోకి దిగాయి. ఇందులో ఆహార భద్రతా శాఖ అధికారులు, ఇద్దరు పోలీసులు ఉంటారు. వీరు రోజూ దుకాణాల్లో తనిఖీ చేసి గుట్కా ప్యాకెట్లను అధికారులు సీజ్ చేస్తారు. దుకాణ దారులను పోలీసులు కేసు నమోదు చేస్తారు. ఇందుకు సంబంధించిన అధికారులు ఈ బృందాలకు అప్పగించారు. వీరి సోదాలలో 3 కేజీలకు పైగా గుట్కా, పాన్ మసాల వంటి పొగాకు వస్తువులు బయట పడితే దుకాణ దారుడికి తొలుత రూ. 5 వేలు జరిమానా విధిస్తారు. మళ్లీ పట్టుబడితే రూ.10 వేలు, మూడోసారి పట్టుబడితే రూ. 25 వేలు జరిమానతో పాటుగా దుకాణాన్ని సీజ్ చేస్తారు. అలాగే యజమానిని అరెస్టు చేస్తారు. ఈ మేరకు చెన్నైలో అన్ని ప్రాంతాల్లోని చిన్న, పెద్ద దుకాణాల్లో ఈ బృందాలు సోదాలను విస్తృతం చేశాయి.

శ్మశానానికి దారి లేక 3 రోజులు ఇంట్లోనే మృతదేహం

• అధికారుల చొరవతో అంత్యక్రియలు

సాక్షి, చెన్నై: శ్మశానికి వెళ్లే దారిని ఇరువర్గాలు మూసి వేయడంతో ఓ వృద్ధురాలి మృత దేహాన్ని 3 రోజులు ఇంటి వద్దే ఓ కుటుంబం ఉంచింది. అధికారుల చొరవతో సోమవారం సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి. వివరాలు.. ధర్మపురి జిల్లా కీల్ పారై గ్రామంలో వెనుకబడిన సామాజికవర్గం ప్రజలు శ్మశానానికి వెళ్లే మార్గాన్ని మరో రెండు అగ్రవర్ణాలు మూసి వేశాయి. ఈ పరిస్థితుల్లో ఆ గ్రామానికి చెందిన వెనుకబడిన సామాజికవర్గానికి మునియమ్మ (70) వయోభారంతో మరణించింది. చేసేది లేక ఆమెమృత దేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లేందుకు మార్గం లేక, ఇంటిమందే మూడు రోజులు కుటుంబీకులు ఉంచుకోవాల్సి వచ్చింది. ఈ విషయం ధర్మపురి జిల్లా ఎస్పీ స్టీఫన్ దృష్టికి చేరింది. దీంతో ఆయన పోలీసులను రంగంలోకి దించారు. ఆ ఇరు వర్గాలతో చర్చించారు. మూసి వేసిన మార్గాని తెరపించారు. దీంతో మూడు రోజులు తర్వాత సోమవారం సాయంత్రం పోలీసు భద్రత నడుమ ఆ వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలు శ్మశానంలో జరిగింది.

స్నేహితుడి పుట్టిన రోజులో అపశృతి

• మత్తు కోసం వేసుకున్న ఇంజెక్షన్ వికటించి యువకుడి మృతి

అన్నానగర్: చెన్నై చూలై సమీపంలోని తట్టాంగుళంకు చెందిన నందకుమార్ కుమారుడు రాహుల్ (19) చూలైలోని ఓ కళాశాలలో బీఏ 2వ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం రాత్రి తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడానికి వెళ్లాడు. ఆ సమయంలో రాహుల్ సహా నలుగురు స్నేహితులు రాయపేటలోని ఎక్స్‌ప్రెస్ అవెన్యూ ఎదురుగా ఉన్న లాడ్జిలో బస చేశారు. గదిలో నుంచి బయటకు రాగానే రాహుల్ ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే అతడిని రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు రాహుల్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పుట్టినరోజు వేడుక సమయంలో రాహుల్ సహా స్నేహితులు మద్యం సేవించారు. మరింత మత్తు కోసం రాహుల్ మత్తు పొడిని నీటితో కలిపి ఇంజెక్షన్ ద్వారా శరీరంలోకి ఎక్కించుకున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే రాహుల్ చనిపోయినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. కేసు నమోదు చేసి అతని స్నేహితులను విచారిస్తున్నారు.

విభూదికి బదులు రోజా నుదుటిపై జాతీయ జెండా

• హోటల్ ఉద్యోగి దేశభక్తి

కొరుక్కుపేట: కోయంబత్తూరులోని ఓ హోటల్ కార్మికుడు తన నుదుటిపై విభూదికి బదులు జాతీయ జెండాను రోజూ బొట్టుగా పెట్టుకుని కస్టమర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. కోయంబత్తూరులోని గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డులోని ఈ హోటల్‌లో 50 ఏళ్లుగా సుందర్‌రాజ్ (71) సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఎంతో దేశభక్తి కలిగి ఉండే సుందర్ రాజ్ రోజూ దేవుడికి పూజ చేసి విభూదికి బదులుగా జాతీయ జెండాను చిత్రించుకుంటాడు. కేఫ్‌కి వచ్చే కస్టమర్లు ఇది గమనించి అతడిని మెచ్చుకుంటున్నారు. ఈ సందర్భంగా సుందర్‌రాజ్ మాట్లాడుతూ భారతదేశాన్ని దేవుడితో సమానంగా ప్రేమిస్తున్నాను. అందుకే 30 ఏళ్లుగా విభూదికి బదులు జాతీయ జెండానునా నుదుటిపై చిత్రించుకున్నట్లు వెల్లడించారు.



సుందర్ రాజ్

కారు, బైక్ దగ్ధం

తిరువొత్తియూరు: కార్తీక దీపం పండుగ సందర్భంగా ఇంటి ముందు వెలిగించిన దీపం నుంచి నిప్పు అంటుకుని కారు, బైక్ దగ్ధమైంది. తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టి తిరుపతి కాలనీకి చెందిన దీపన్ రాజ్ అదివారం కార్తీక దీపం సందర్భంగా ఇంటి తలుపు వద్ద దీపం వెలిగించారు. కొద్ది నిమిషాలకే గాలికి ఇంటి ముందు నిలిపి ఉంచిన కారు, బైక్‌కు నిప్పు అంటుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కోవిల్‌పట్టి అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు, బైక్ పూర్తిగా దగ్ధమయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

అన్నానగర్: రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతిచెందిన ఘటన ధర్మపురిలో జరిగింది. మాదోంపు ప్రాంతానికి చెందిన బిల్డర్ అరవిందన్ (28), అదే ప్రాంతానికి చెందిన అభినయ(22) పెద్దలను కాదని ఈ ఏడాది జూన్‌లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇద్దరూ కర్ణాటకలోని మైసూర్‌లో స్థిరపడ్డారు. ప్రస్తుతం అభినయ 5 నెలల గర్భిణి. ఈ క్రమంలో అరవిందన్, అభినయ ఆదివారం రాత్రి మైసూరు నుంచి బైక్‌పై ధర్మపురికి బయలుదేరారు. సోమవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో క్రిష్ణగిరి–ధర్మపురి రోడ్డులోని ఫ్లైఓవర్ వద్ద డివైడర్‌ను ఢీకొన్నారు. తీవ్ర గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కృష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

విద్యార్థి గొంతు కోసిన స్నేహితుడు

• పరిస్థితి విషమం

తిరువొత్తియూరు: చిన్న గొడవ కారణంగా ఓ యువకుడు స్నేహితుడి గొంతు కోసిన ఘటన కరూర్‌లో జరిగింది. తిరుచ్చి జిల్లా ముసిరి పార్వతిపురానికి చెందిన పెరియసామి కుమారుడు నితీష్ కుమార్ (21) కరూర్ జిల్లా పులియూరు శెట్టినాడు ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. అదే కళాశాలలో తిరుచ్చి జిల్లా తొట్టియం ప్రాంతం కొలతరస నల్లూరుకు చెందిన ఆర్ముగం కుమారుడు అన్నామలై ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. వీరిద్దరూ కళాశాల బస్సులో వెళ్లి వస్తుంటారు. ఇద్దరూ స్నేహితులు. అయితే హఠాత్తుగా అన్నామలైతో నితీష్ కుమార్ మాట్లాడడం నిలిపివేశాడు. ఈ క్రమంలో శుక్రవారం కళాశాలకు వెళ్తున్న సమయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. శని, ఆదివారం సెలవు కావడంతో అన్నామలై ముసిరి పార్వతీపురంలో ఉన్న నితీష్ కుమార్ ఇంటికి వెళ్లి అతనికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా అతని నుంచి స్పందన రాలేదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఎప్పటిలాగే నితీష్ కుమార్ కళాశాల బస్సు ఎక్కాడు. అన్నామలై పక్కన కూర్చోకుండా మరొక సీట్‌లో కూర్చున్నాడు. ఆగ్రహించిన అన్నామలై వెంట తెచ్చుకున్న కత్తితో నితీష్ కుమార్ గొంతు కోశాడు. ఇది చూసిన సహ విద్యార్థులు భయంతో కేకలు వేశారు. కళాశాల బస్సు డ్రైవర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. గాయపడిన విద్యార్థిని కుళితలై ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుచ్చి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. కుళితలై పోలీసులు అన్నామాలై వద్ద విచారణ చేస్తున్నారు. స్నేహితుల మధ్య ఏర్పడిన గొడవ కారణంగా హత్యా ప్రయత్నం జరిగిందా లేదా ప్రేమ వ్యవహారంలో గొడవలు వచ్చాయా అనే కోణంతో పోలీసులు విచారణ చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వంట పాత్రలు చోరీ

తిరువొత్తియూరు: మరకానం ప్రభుత్వ పాఠశాలలో వంట పాత్రలు చోరీ అయ్యాయి. విల్లుపురం జిల్లా మరకానం యూనియన్ నడుకుప్పం పంచాయతీలో ప్రాథమిక పాఠశాల ఉంది. ఇక్కడ 200 మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులకు పాఠశాల ఆవరణలోనే అల్పాహారం వండడానికి ప్రత్యేక సదుపాయం ఉంది. ఈ క్రమంలో శుక్రవారం ఎప్పటిలాగే విద్యార్థులకు వంట చేసి వంట గదికి తాళం వేసి వెళ్లారు. శని, ఆదివారం సెలవులు కావడంతో సోమవారం ఉదయం పాఠశాల ఆవరణకు వంట వాళ్లు వచ్చారు. విద్యార్థులు అల్పాహారం తీసుకునే గది తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. సిబ్బంది లోపలికి వెళ్లి చూశారు. రాత్రి సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వంట గదిలోకి చొరబడి వంట చేసుకుని తన్న ఆనవాళ్లు కనిపించాయి. తిన్న తర్వాత వంట పాత్రలు, సరుకులు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. ఫిర్యాదు మేరకు మరకానం పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

శత జయంతి వేడుకలు



మాట్లాడుతున్న అమృతకుమార్

తిరుత్తణి: ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ శత జయంతి వేడుకలను తిరుత్తణిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ ప్రారంభించి వందేళ్లు పూర్తికావడంతో తిరుత్తణి అమృతపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తిరుత్తణి, పళ్లిపట్టు డివిజన్లకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. ఆ సంఘం తిరుత్తణి డివిజన్ అధ్యక్షుడు అన్బళగన్, జిల్లా అధ్యక్షుడు వేల్‌మురుగన్, డివిజన్ అధ్యక్షుడు రవి ప్రసంగించారు. ప్రభుత్వ ఉద్యోగుల హక్కుల కోసం సంఘం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

● వృత్తి శిక్షణ



వేళచ్చేరిలోని అన్నావర్సిటీ అనుబంధ గురునానక్ కళాశాలలో సోమవారం విద్యార్థుల కోసం వృత్తి శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం స్కిల్ డెవలప్‌మెంట్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. దీనిని ఐసీటీ అకాడమి సీఈఓ హరిబాలచంద్రన్, ఆ కళాశాల డీన్ డాక్టర్ ఆన్ ఆనంద్, డిప్యూటీ డీన్ ఎం కవిత, ప్రిన్సిపల్ ఎంజీ రఘునాథన్, సలహాదారుడు మార్లిన్ మెరైస్ ప్రారంభించారు. - సాక్షి, చెన్నై

పులల్ జైలులో సిమ్‌కార్డు, సెల్‌ఫోన్ స్వాధీనం

తిరువొత్తియూరు: చెన్నై పులల్ జైలులో శిక్షణ ఖైదీలు 800 ఉన్నారు. ఈ క్రమంలో జైలులో ఖైదీలు సెల్ ఫోన్ ద్వారా రహస్యంగా మాట్లాడుతున్నట్లు తెలిసింది. దీంతో సోమవారం ఉదయం జైలు వార్డెన్లు ఖైదీల బ్యారక్‌లలో తనిఖీలు చేశారు. ఆ సమయంలో ఖైదీల స్నానపు గదిలో సెల్ ఫోను, సిమ్ కార్డు, బ్యాటరీ చార్జర్ ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు దర్యాప్తు చేపట్టారు.

డీ అడిక్షన్ సెంటర్‌లో యువకుడి హత్య

• యజమాని సహా ముగ్గురి అరెస్టు

అన్నానగర్: వలసరవాక్కంలోని మాదకద్రవ్యాల పునరావాస కేంద్రంలో యువకుడిని కొట్టి చంపిన యజమానితో సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నైలోని అదంబాక్కంలో డాక్టర్ అంబేద్కర్ నగర్‌కు చెందిన విజయ్ (27) మద్యానికి బానిస కావడంతో అతని సోదరుడు రాజేష్ చెన్నైలోని వలసరవాక్కం ఓం శక్తి నగర్‌లోని గ్రీన్ లైఫ్ ఫౌండేషన్ డ్రగ్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో సెప్టెంబర్ 12న చేర్పించారు. విజయ్‌ను కలిసేందుకు వెళ్లగా రాజేష్‌కు అనుమతి నిరాకరించారు. ఆదివారం విజయ్ కొన ఊపిరితో కొట్టుమిట్టాడినట్లు తెలుస్తోంది. వెంటనే అక్కడి సిబ్బంది అతడిని కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకుని పునరావాస కేంద్రానికి చేరుకున్న రాజేష్, అతని బంధువులు షాక్‌కు గురయ్యారు. రాజేష్ కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి వెళ్లారు. విజయ్ చేతులు, కాళ్లపై గాయాలు, రక్తం గడ్డకట్టడం చూశాడు. మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ వలసరవాక్కం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు పునరావాస కేంద్రానికి వెళ్లి విచారణ జరిపారు. ఆ తర్వాత సీసీ కెమెరాలను పరిశీలించేందుకు ప్రయత్నించగా రికార్డులు ధ్వంసం చేసినట్లు తెలిసింది. పునరావాస యజమాని వినోద్‌కుమార్, అకౌంటెంట్ క్రూజ్, ఇతని స్నేహితుడు అజయ్‌ను వలసరవాక్కం పోలీస్ స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారణ చేశారు. ముగ్గురు కలిసి విజయ్‌ని హత్య చేసినట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

మెట్రో కార్మికుల అరెస్ట్

తిరువొత్తియూరు: మెట్రో రైలులో మత్తు పదార్థాలు కలిగి ఉన్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై వడపళని నుంచి మెట్రో రైలు రెండో విడత పనులు జరుగుతున్నాయి. ఉత్తరాది రాష్ట్రానికి చెందిన కార్మికులు పనిచేస్తున్నారు. పూందమల్లి వద్ద విధులు నిర్వహిస్తున్న అస్సాం రాష్ట్రానికి చెందిన అనురుల్లా (33), ముజఫర్ రెహ్మాన్ (44) మత్తు పదార్థాలు కలిగి ఉన్నట్లు పూందమల్లి పోలీసులకు సమాచారం అందింది. దీంతో పూందమల్లి బస్‌స్టేషన్ వద్ద మెట్రో రైల్ పని చేస్తున్న ఇద్దరిని తనిఖీ చేయగా రూ. 30 వేల విలువ కలిగిన మెస్ కలైన్ అనే మత్తు పొడిని గుర్తించారు. స్వాధీనం చేసుకుని వారిద్దరిని అరెస్టు చేశారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 13 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 70,350 మంది స్వామివారిని దర్శించుకోగా, 19,500 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.11 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ప్రభుత్వాస్పత్రిలో విద్యుత్‌కు అంతరాయం

• చికిత్స పొందుతున్న మహిళ మృతి

తిరువొత్తియూరు: మైలాడుదురై జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో హఠాత్తుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. కుత్తలం ప్రాంతానికి చెందిన అమరావతి (44) ఊపిరితిత్తుల సమస్య కారణంగా తిరువారూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. శ్వాస తీసుకోవడంలో ఆమెకు ఇబ్బందులు ఏర్పడడంతో ఆక్సిజన్ వెంటిలేటర్ ద్వారా కృత్రిమ శ్వాసను అందిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఆస్పత్రిలోని అత్యవసర విభాగంలో విద్యుత్ కట్ అయింది. వెంటిలేటర్ చార్జ్ డౌన్ అయ్యింది. అది పనిచేయకపోవడంతో ఊపిరాడకుండా అమరావతి మృతి చెందారు. దీనిపై ఆమె బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే అమరావతి మృతి చెందినట్లు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


పళవేర్కాడులో గోడ నిర్మాణానికి అనుమతి

తిరువళ్లూరు: పళవేర్కాడు ముఖ ద్వారం వద్ద గోడ నిర్మాణానికి ఢిల్లీలోని జంతు పరిరక్షణ బోర్డు అనుమతినిచ్చిన నేపథ్యంలో త్వరలోనే గోడ నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. తిరువళ్లూరు జిల్లా పళవేర్కాడులో అతి పెద్ద చెరువు ఉంది. ఈ చెరువుపై ఆధారపడి పలువురు మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు.పళవేర్కాడు వద్ద చెరువు–సముద్రం సంగమించే ప్రాంతమైన ముఖద్వారం నుంచి మత్స్యకారులు చేపల వేటకు వెళుతుంటారు. సుమారు 120 గ్రామలకు చెందిన మత్స్యకారులకు పళవేర్కాడు చెరువు ప్రధాన జీవనాధారం. కాగా రోజూ ఆరు గంటలకు ఒకసారి సముద్రపు నీరు చెరువుకు, తరువాత ఆరు గంటలకు ఒకసారి చెరువు నీరు సముద్రానికి వచ్చిపోతుంటాయి. నీరు రెండువైపులా వచ్చి వెళుతుండడంతో ముఖద్వారం వద్ద ఇసుక భారీగా పేరుకుపోయింది. నీరు రెండువైపులా వెళ్లకపోవడంతో చేపల వేట సాగించడానికి ఇబ్బందికరంగా మారింది. ఇసుకను తొలగించాలని మత్స్యకారులు ఏళ్ల తరబడి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం రూ. 27 కోట్లు విడుదల చేసి గోడ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. ఆరు నెలల క్రితం భూమి పూజ సైతం చేసి పనులను ప్రారంభించారు. అయితే ముఖద్వారం వద్ద గోడ నిర్మాణానికి జంతు పరిరక్షణ బోర్డు, అటవీశాఖ అనుమతి లేకపోవడంతో పనులు ఆగిపోయాయి. బోర్డు అనుమతి కోసం అధికారులు ప్రయత్నాలను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17న ఢిల్లీలో జరిగిన బోర్డు సమావేశంలో పళవేర్కాడులో గోడ నిర్మాణానికి అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. ముఖ ద్వారానికి రెండువైపులా సుమారు 160 మీటర్ల దూరంతో ఒకగోడను, 150 మీటర్ల దూరంతో మరోక గోడను నిర్మించనున్నారు. అయితే గోడల నిర్మాణం జంతువులకు ఇబ్బంది లేకుండా నిర్మించాలని బోర్డు సూచించింది. కాగా ముఖద్వారం పనులు పూర్తయితే చేపల వేటకు ఇబ్బంది లేకుండా ఉంటుందని మత్స్యకారుల ఆశాభవం వ్యక్తం చేశారు.

తమిళగం విజేతలుగా కార్తికేయ రాజా, సుప్రియ



మిస్టర్ తమిళగం విజేతలతో జాన్ అమలన్




మిస్ తమిళగం విజేత సుప్రియా తదితరులు

• విజేతలకు కిరీటాలతో సత్కారం

కొరుక్కుపేట: ఇండియన్ మీడియా వర్క్స్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మిస్టర్ అండ్ మిస్ తమిళగం –2023 గ్రాండ్ ఫైనల్ విజేతలు కార్తికేయ రాజా, సుప్రియాలు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ఇండియన్ మీడియా వర్క్స్ నిర్వాహకులు జాన్ అమలన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అందంతోపాటు వివిధ అంశాల్లో ప్రతిభను చాటుకుంటున్న వారిని ప్రోత్సహించి దేశానికి అందించడమే మా లక్ష్యమని తెలిపారు. ఈ పోటీల ద్వారా వచ్చిన మొత్తంలో కొంత సామాజిక సేవకు అందిస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగా న్యూబ్రిడ్జ్ సెంటర్ ఫర్ స్పెషల్ నీడ్స్ యజమాని ఉన్ని కృష్ణన్‌కు రూ.1,00,000 చెక్కును అందజేశామని అన్నారు. పొల్లాచ్చిలో ఆటిజం అండ్ మెంటల్ రిటార్డేషన్ ఉన్న ప్రత్యేక పిల్లల వైద్య విద్యా ఖర్చుల కోసం నిధులు సేకరించిందన్నారు. పోటీల్లో నటి జనని, రమ్య సుబ్రమణియన్, అష్నా జవేరి, సంచిత శెట్టి, నటుడు విశ్వనాథ్ ఉతప్ప బిగ్ బుల్ అరవింద్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారన్నారు. మిస్టర్ తమిళగం 2023 పోటీల్లో విజేతగా కార్తికేయ రాజా, మొదటి రన్నరప్‌గా విజేష్, 2వ రన్నరప్‌గా బాలకుమార్ నిలిచారు. అలాగే మిస్ తమిళగం 2023 విజేతగా సుప్రియా, మొదటి రన్నరప్‌గా సూరినెడ్డి అనూష, 2వ రన్నరప్‌గా మహన్యా నిలిచినట్లు ప్రకటించారు.

కల్యాణ వెంకన్న పున్నమి గరుడ సేవ



గరుడ వాహనంపై దర్శమిస్తున్న గోవిందుడు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు సోమవారం రాత్రి గరుడవాహనంపై భక్తులను అనుగ్రహించారు. కార్తీక మాసం పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవలో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామివారికి ఊంజల్ సేవ కనుల పండువగా నిర్వహించారు. అనంతరం గోవిందుడు తనకు ప్రీతిపాత్రమైన గరుడునిపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, జమేదారు చిరంజీవి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా...

సింహాద్రి ఎన్టీపీసీకి పీఆర్ఎస్ఐ జాతీయ అవార్డు


అవార్డు అందుకుంటున్న అఖిలేష్ త్రిపాఠి

పరవాడ (పెందుర్తి): శిశు సంరక్షణలో భాగంగా ఉత్తమ సీఎస్సార్ ప్రాజెక్టు విభాగంలో ఎన్టీపీసీ సింహాద్రికి ప్రతిష్టాత్మక పీఆర్ఎస్ఐ జాతీయ అవార్డు–2023 లభించింది. న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన ఇంటర్నేషనల్ పబ్లిక్ రిలేషన్స్ కార్యక్రమంలో ఈ అవార్డును సంస్థ తరఫున ఎగ్జిక్యూటివ్ కార్పొరేట్ కమ్యూనికేషన్ ప్రతినిధి అఖిలేష్ త్రిపాఠి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్ఐ ప్రెసిడెంట్ అజిత్ పాఠక్, ప్రధాన కార్యదర్శి పీఎల్కే మూర్తి పాల్గొన్నారు.

దిగ్విజయంగా జీఎస్టీ కమిషనర్ సైకిల్ యాత్ర


సైకిల్ యాత్ర పూర్తిచేసిన సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి బృందం

సాక్షి, అమరావతి: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి బృందం 200 కిలోమీటర్ల సైకిల్ యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసింది. ఆదివారం విజయవాడ లయోలా కాలేజీ నుంచి ప్రారంభమైన యాత్ర ప్రకాశం జిల్లా మార్టూరు మండలం కొనంకి వరకు సాగింది. అనంతరం తిరిగి సోమవారం విజయవాడకు చేరుకుంది. ఈ సందర్భంగా జీఎస్టీ కమిషనర్ మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలపై అవగాహన కల్పించేందుకు సైకిల్ యాత్ర చేపట్టామన్నారు. ప్రజాప్రయోజన కార్యక్రమాల కోసం తమ శాఖ తరఫున మరిన్ని యాత్రలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అంతకు ముందు జీఎస్టీ కమిషనర్‌ను తోటి ఉద్యోగులు, సిబ్బంది శాలువాతో సత్కరించారు.

క్లాస్‌–4 ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడిగా నాగభూషణం

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌లో నాలుగో తరగతి ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడిగా సి.నాగభూషణం నియమితులయ్యారు. ఈ మేరకు ఆ ఫెడరేషన్ చైర్మన్ కె.వెంకట్రామిరెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈయన ఏపీజీఈఎఫ్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీలో సెక్రటరీగా కూడా కొనసాగనున్నారు.

సెర్ఫ్ సంఘాల బలోపేతానికి కృషి

సెర్ఫ్ సీఈవో ఇంతియాజ్ అహ్మద్

తిరుపతి సిటీ: గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న సంఘాల బలోపేతానికి కృషి చేయాలని సెర్ఫ్ సీఈవో ఇంతియాజ్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో సోమవారం గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ఫ్) ఆధ్వర్యంలో రాయలసీమ, నెల్లూరు జిల్లాల ప్రాజెక్ట్ డైరెక్టర్లు, అధికారులతో పలు అంశాలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సంస్థాగత నిర్మాణంలో భాగంగా మహిళా సంఘాలు, గ్రామ సమైక్య, మండల స్థాయి సంఘాలను బలోపేతం చేయాలని ఆదేశించారు. ఎస్ఆర్ఎల్ కార్యక్రమాలు గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ రుణాలను సభ్యులకు సబ్సిడీ రూపంలో తప్పనిసరిగా ఇప్పించేలా చూడాలన్నారు. స్త్రీ నిధి నిధుల దుర్వినియోగం చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పథక సంచాలకులను ఆదేశించారు. 9జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్‌లు, సెర్ఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డూప్లికేట్ ఓటు తొలగించేటప్పుడు నోటీస్ ఇవ్వాలి

రాష్ట్ర ఓటర్ల జాబితా పరిశీలకుడు శ్యామలరావు


ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న శ్యామలరావు

సాక్షి, విశాఖపట్నం : ఓటర్ల తొలగింపు విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, డూప్లికేట్ ఓట్లను తొలగించే క్రమంలో కచ్చితంగా నోటీసులివ్వాలని రాష్ట్ర ఓటర్ల జాబితా పరిశీలకుడు, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు అధికారులను ఆదేశించారు. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా విశాఖ జిల్లా గాజువాక, పశ్చిమ, ఉత్తర అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటర్ల జాబితాలు, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. మార్పులు, చేర్పులు, తొలగింపు, నోటీసుల జారీ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లు, పోలింగ్ కేంద్రాల నిష్పత్తి, కొత్త ఓటర్ల చేరికలపై ఆరా తీశారు. ఓటర్ల మార్పులు, చేర్పులకు సంబంధించిన ప్రతి రికార్డును పక్కాగా నిర్వహించాలన్నారు.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..


ఏలూరు జిల్లా తిమ్మన్నగూడెంలో లబ్ధిదారులకు బ్రోచర్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు


తిరుపతి జిల్లా కోట–1 సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మురళీధర్



శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దగదర్తిలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ప్రసాద్ నాయుడు


అల్లూరి జిల్లా రాజుపేటలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

చాంపియన్లుగా ఎదగడానికి కలసి అడుగులేద్దాం

ట్వీట్ ద్వారా సీఎం వైఎస్ జగన్ పిలుపు



సాక్షి, అమరావతి: భవిష్యత్తు క్రీడా చాంపియన్లుగా ఎదగడానికి కలసి అడుగులు వేద్దామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గతంలో ఎప్పుడూ లేని అతిపెద్ద క్రీడా టోర్నమెంట్ ఆడుదాం ఆంధ్రాను రాష్ట్రంలో ప్రారంభించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఆడుదాం ఆంధ్రాలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈమేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌కు ఆడుదాం ఆంధ్రా కోసం చిత్రీకరించిన ప్రచార వీడియోను, పేర్లు రిజిస్టర్ చేసుకునేందుకు వెబ్‌సైట్ లింక్‌ను (http://aadudamandhra.ap.gov.in) జతచేశారు. ఆ ట్వీట్‌లో 'గతంలో లేని రాష్ట్ర స్థాయి అతిపెద్ద క్రీడా టోర్నమెంట్ ఆడుదాం ఆంధ్రా ప్రకటించడం పట్ల చాలా థ్రిల్లింగా ఉంది. రాష్ట్రంలోని ప్రతి సచివాలయం పరిధిలో మ్యాచ్‌లు నిర్వహిస్తున్నాం. మన యువతలోని క్రీడా నైపుణ్యాన్ని పెంపొందింపచేయడానికి, వారికి మంచి అవకాశాలు కల్పించడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. దేశానికి తదుపరి క్రీడా చాంపియన్లను అందించడానికి రండి కలసి అడుగులు వేద్దాం.' అని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు.

గంతలు కట్టుకొని 'గుంతల కథ'

వాస్తవాలను పరిశీలించాలన్న ప్రాథమిక సూత్రాన్ని వదిలేసిన ఈనాడు రామోజీ

- చంద్రబాబు కోసం కళ్లు మూసుకొని అబద్ధాల కథనాలు
- ప్రజలు అనుభవిస్తున్న చక్కటి రోడ్లు ఈనాడుకు కనిపించవు
- చంద్రబాబు హయాంలోనే రోడ్లపై తీవ్ర నిర్లక్ష్యం
- అంతంతమాత్రంగా నిధులు వెచ్చింపు
- రోడ్లను తీర్చిదిద్దుతున్న వైఎస్ జగన్ ప్రభుత్వం
- నిర్మాణం, నిర్వహణకు భారీగా నిధుల ఖర్చు
- టీడీపీ ప్రభుత్వం అయిదేళ్లలో పెట్టిన ఖర్చు రూ.23,792.19 కోట్లు
- వైఎస్సార్‌సీపీ నాలుగేళ్లలోనే వెచ్చించింది రూ.42,236.28 కోట్లు



ఏదైనా ఓ కథనం రాయాలంటే క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్న ప్రాథమిక సూత్రాన్ని రామోజీరావు ఎప్పుడో వదిలేశారు. తన అనుంగు చంద్రబాబుకు పీఠం దక్కాలన్న ఒకే లక్ష్యంతో కళ్లు మూసుకొని అవాస్తవాలతో ఈనాడును నింపేస్తున్నారు. నలుగురు నడిచే దారుల పైనా అసత్య కథనాలు వండుతున్నారు. తాము నిత్యం ప్రయాణించే చక్కటి రోడ్డుపై ఇలాంటి వార్త వచ్చిందేమిటని ప్రజలు ఏమనుకుంటారోనన్న కనీస జ్ఞానం లేకుండా అబద్ధం అచ్చేశారు. అస్మదీయుడు చంద్రబాబు రాజకీయ గ్రాఫ్ రోజురోజుకు పడిపోతుండటంతో రామోజీరావు రాతలు కూడా మరింత దిగజారిపోతున్నాయి. రాష్ట్రంలో రోడ్ల నిర్మాణంపై దుష్ప్రచారం చేస్తూ ఈనాడు ఇచ్చిన కథనం ఇందుకు మరో నిదర్శనం. అసలు చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో రోడ్లు అధ్వానంగా మారిపోయాయి. బాబు ప్రభుత్వం రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు ఇచ్చిన నిధులే కాస్తంత. అందులోనూ మామూళ్ల కక్కుర్తి. దీంతో ఏ రోడ్డు చూసినా అధ్వానమే. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ దురవస్థ నుంచి రోడ్లను బయట పడేసింది. అత్యధిక నిధులు వెచ్చిస్తూ రోడ్లను పునరుద్ధరిస్తోంది. ఈ వాస్తవాలను విస్మరించి కళ్లు మూసుకుని పెన్నుతో విషం కక్కుతున్నారు. రాష్ట్రంలో 99 శాతం బాగా ఉన్న రోడ్లను చూడకుండా.. రంధ్రాన్వేషణకు పాల్పడుతూ ఎక్కడో ఒక చోట రోడ్డు కాస్త దెబ్బ తిన్న ఫొటోలతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ వాస్తవం ప్రజలకు తెలుసు. గతంలో అధ్వాన్నంగా ఉన్న తమ ఊరి రోడ్లు ప్రస్తుతం కొత్తగా తయారై హాయిగా ప్రయాణిస్తున్నారు. ప్రజలు గుర్తించిన ఈ వాస్తవాన్ని ఎల్లో సిండికేట్ కళ్లు తెరిపించేందుకు మరోసారి వివరంగా తెలియజేసేందుకే ఈ ఫ్యాక్ట్ చెక్...

– సాక్షి, అమరావతి

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2019 వరకు అయిదేళ్లలో ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, జాతీయ రహదారులకు కలిపి మొత్తం రూ.23,792.19 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో ఈ నాలుగేళ్లలోనే ఏకంగా రూ.42,236.28 కోట్లు వెచ్చించారు. రోడ్ల అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమిది.

బాబు హయాంలోనే రోడ్లు అధ్వాన్నం

చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో రోడ్ల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్న వాస్తవాన్ని రామోజీరావు ఉద్దేశపూర్వకంగా విస్మరించారు. క్రమం తప్పకుండా చేపట్టాల్సిన రోడ్ల మరమ్మతులు, నిర్వహణను టీడీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. రోడ్ల పునరుద్ధరణకు 2017–18లో తీసుకున్న రూ.3 వేల కోట్ల రుణాన్ని కూడా ఎన్నికల ప్రయోజనాల కోసం 'పసుపు–కుంకుమ' పథకానికి మళ్లించారు. దాంతో 2019 నాటికి రాష్ట్రంలో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో భారీ వర్షాలు లేవు. కోవిడ్ పరిస్థితులు కూడా లేవు. అయినా రోడ్ల పనులకు ఏమాత్రం ప్రాధాన్యమివ్వనే లేదు. ఇదిగో ఈ లెక్కలు చూడండి

- టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రోడ్ల నిర్మాణానికి రూ.2,953.81 కోట్లు వెచ్చించింది. అంటే ఏడాదికి సగటున రూ.591 కోట్లు ఖర్చు చేసింది.
- రాష్ట్ర రహదారులు, జిల్లా ప్రధాన రహదారుల పునరుద్ధరణకు రూ.4,325 కోట్లే వెచ్చించింది.
- పంచాయతీరాజ్ రోడ్ల కోసం 3,160.38 మాత్రమే ఖర్చు చేసింది.
- 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో జాతీయ రహదారుల కోసం రూ.13,353 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది.





రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం, నిర్వహణకు టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలు చేసిన ఖర్చు (రూ.కోట్లలో)

పని	టీడీపీ (ఐదేళ్లలో)	వైఎస్సార్‌సీపీ (నాలుగేళ్లలో)
రోడ్ల మరమ్మతులకు..	2,953.81	4,148.59
రాష్ట్ర రహదారులు, జిల్లా ప్రధాన రహదారుల నిర్మాణానికి..	4,325	7,340
పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి	3,160.38	5,443.69
జాతీయ రహదారుల నిర్మాణానికి..	14,353	25,304
మొత్తం	23,792.19	42,236.28

నేడు.. మెరిసే మెత్తటి దారులు

2019లో చంద్రబాబు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ ఘోరంగా ఓడిపోయి.., వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ విజయంతో ప్రజా పాలన వచ్చింది. అప్పటి నుంచి సీఎం వైఎస్ జగన్ ప్రజల సంక్షేమంతోపాటు మౌలిక సదుపాయాల పైనా దృష్టి సారించారు. చంద్రబాబు ప్రభుత్వం హయాంలో అడుగుకో అవస్థలా మారిన రోడ్లను క్రమంగా మెరుగులు దిద్దుతున్నారు. ఉన్న రోడ్లను విశాలంగా చేస్తున్నారు. కొత్త రోడ్లు వేస్తున్నారు. వరుసగా రెండేళ్ల భారీ వర్షాలతో పాటు కోవిడ్ ప్రతికూల పరిస్థితులు ఎదురైనా రోడ్ల పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు దాంతో రాష్ట్రంలో రోడ్లు మెరుగయ్యాయి. ఇందు కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం చేసిన ఖర్చు చూద్దాం..

- 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగేళ్లలోనే రోడ్ల నిర్మాణానికి రూ.4,148.59 కోట్లు వెచ్చించింది. అంటే ఏడాదికి సగటున రూ.951కోట్లు. అంటే బాబు ప్రభుత్వం ఖర్చు చేసిన రూ. 591 కోట్లకంటే చాలా ఎక్కువే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి నాలుగు నెలల్లోనే రూ.346 కోట్లు ఖర్చుపెట్టింది.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో రాష్ట్ర రహదారులు, జిల్లా ప్రధాన రహదారుల నిర్మాణానికి రూ.7,340 కోట్లు ఖర్చుచేసింది.
- పంచాయతీరాజ్ రోడ్ల కోసం 5,443.69 వెచ్చించింది.
- జాతీయ రహదారుల కోసం రూ.25,304 కోట్లు వెచ్చించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కేంద్రానికి పంపిన ప్రతిపాదనలు, నిరంతరం పర్యవేక్షణతోనే ఇది సాధ్యమైంది.
- ఇక రోడ్ల అభివృద్ధి సెస్ ద్వారా వచ్చిన రూ.3 వేల కోట్లను టీడీపీ చేసిన అప్పులు తీర్చడానికే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించాల్సి వచ్చింది. సెస్ ద్వారా వచ్చిన మరో రూ.2 వేల కోట్లకు అదనంగా రూ.2,500 కోట్ల రుణం తీసుకుని మొత్తం రూ.4,500 కోట్లతో 7,600 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించింది.


బాలకృష్ణాపురం రోడ్డు దుస్థితి (నాడు)


అద్దంలా మెరుస్తున్న బాలకృష్ణాపురం రోడ్డు (నేడు)

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గం బుడ్డేపుపేట నుంచి బాలకృష్ణాపురం వరకు 3.22 కిలోమీటర్ల రోడ్డు టీడీపీ ప్రభుత్వంలో పూర్తిగా దెబ్బతిన్నది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆరోడ్డును రూ.74 లక్షలతో పునరుద్ధరించింది.


తొండంబట్టు–సిద్ధాపురం రోడ్డు (నాడు)


తొండంబట్టు–సిద్ధాపురం రోడ్డు (నేడు)

తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాళెం మండలం తొండంబట్టు – సిద్ధాపురం రోడ్డు 5.5 కిలోమీటర్లు టీడీపీ హయాంలో అధ్వానంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.3.75 కోట్లతో ఆ రోడ్డును పునరుద్ధరించి ప్రయాణికుల కష్టాలను తీర్చింది.


గుంతల మయంగా వర్షపు నీటితో నిండి ఉన్న క్రాప రోడ్డు (నాడు)


రూ. 2 కోట్లు వెచ్చించి ఇటీవల నిర్మించిన రోడ్డు (నేడు)

బాపట్ల జిల్లా కొల్లూరు మండలం తెనాలి–రేపల్లె ప్రధాన రహదారి క్రాప అడ్డరోడ్డు నుంచి క్రాప గ్రామం మీదుగా వేమూరు మండలం వెల్లబాడు అడ్డ రోడ్డు వరకు 3.60 కిలోమీటర్ల ఆర్ అండ్ బీ రోడ్డు 30 ఏళ్లగా గుంతల మయంగా మారి ప్రజలు కష్టాలు ఎదుర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 2 కోట్లు వెచ్చించి నూతనంగా రోడ్డు నిర్మించడంతో ప్రజలకు సౌకర్యవంతంగా మారింది.


కోడేరు–నల్లజర్ల రోడ్డు గత పాలకుల హయాంలో గోతులతో ఇలా..


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అద్దంలా ఇలా..

రూ.45 కోట్లతో నాలుగు లేన్ల రోడ్డుగా కోడేరు – నల్లజర్ల రహదారి

ఇది కోడేరు – నల్లజర్ల రోడ్డు (కేఎస్ రోడ్డు). పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గాల్లోని 25 గ్రామాలకు ప్రధాన రహదారి. తూర్పుగోదావరి జిల్లాకు అనుసంధాన రహదారి. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, అనేక ఇంజనీరింగ్ కళాశాలలు, విద్యా సంస్థల బస్సులకు మార్గమది. జంగారెడ్డిగూడెం వెళ్లే బస్సులు, వందల సంఖ్యలో ఇదే మార్గంలో వెళుతుంటాయి. టీడీపీ హయాంలో దీని అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో గుంతలమయంగా మారి, ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉంగుటూరు నియోజకవర్గం చిలకంపాడు నుంచి తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన విశ్వవిద్యాలయం వరకు రెండు లేన్లుగా ఉన్న రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించడానికి రూ.45 కోట్లతో అంచనాలు రూపొందించారు. సెంటర్ డివైడర్‌తో రోడ్డుకిరువైపులా పచ్చదనానికి ప్రాధాన్యతనిస్తూ విశాలంగా నిర్మించారు. ఇప్పుడీ రోడ్డు మీద వాహనాలు ఎటువంటి ఇబ్బంది లేకుండా తిరుగుతున్నాయి.

అధికారంలోకి వచ్చాక కేసులు పెట్టే బాధ్యత నేను తీసుకుంటా

యువగళం పాదయాత్రలో లోకేశ్

రాజోలు/మామిడికుదురు: టీడీపీ, జనసేన పార్టీలు అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. చంద్రబాబు అరెస్ట్‌తో నిలుపుదల చేసిన యువగళం పాదయాత్రను సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా పొదలాడ నుంచి లోకేశ్ మళ్లీ ప్రారంభించారు. అనంతరం తాటిపాకలో బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ చంద్రబాబుపై స్కిల్‌డెవలప్‌మెంట్ కేసుతో పాటు ఫైబర్ గ్రిడ్, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఇసుక, మద్యం కేసులు పెట్టారని.. త్వరలో అన్న క్యాంటీన్‌పై కూడా కేసు పెడతారని వ్యంగ్యంగా అన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేసి చంద్రబాబును 53 రోజుల పాటు జైల్లో పెట్టారని చెప్పారు. హైకోర్టు నిజం నిలబెట్టి.. వ్యవస్థలను మేనేజ్ చేయడం ద్వారానే చంద్రబాబును జైల్లో పెట్టారని బెయిల్ ఆర్డర్‌లో చెప్పిందన్నారు. ఎన్ని కేసులు పెట్టుకుంటారో పెట్టుకోండన్నారు. అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా కేసులు పెట్టే బాధ్యత తాను తీసుకుంటానని లోకేశ్ చెప్పారు.


నగరంలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జనసేన నేతను శాంతింపజేస్తున్న ఎమ్మెల్యే రామానాయుడు

ముగ్గురుంటే రూ.90 వేలంట!

తన ప్రసంగంలో ఎప్పటిలాగే మళ్లీ లోకేశ్ తన అజ్ఞానాన్ని చాటుకున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ ప్రతి నెలా రూ.15 వేల చొప్పున ఇస్తామని ప్రకటించారు. ఏడాదికి బదులు నెలకు అని ప్రకటించడంతో చుట్టూ ఉన్నవాళ్లు నవ్వుకున్నారు. ఇంకో గమ్మత్తయిన విషయం ఏంటంటే.. 'ఇంట్లో ఒక్కరుంటే రూ.15 వేలు, ఇద్దరుంటే రూ.30 వేలు.. ముగ్గురుంటే.. ఎంత? ఎంత? అంటూ సభికులను ప్రశ్నిస్తూ.. ముగ్గురుంటే రూ.90 వేలు ఇవ్వబోతున్నాం' అంటూ ప్రకటించి.. నవ్వులపాలయ్యారు. తరలించిన పార్టీ శ్రేణులు తప్ప స్థానికుల నుంచి పాదయాత్రకు పెద్దగా స్పందన లభించలేదు. దీంతో పాశర్లపూడి వరకు పాదయాత్ర నామమాత్రంగా సాగింది.

జనసేన నేతలకు భంగపాటు

లోకేశ్‌కు గజమాల వేసేందుకు జనసేన కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పంతం నానాజీతో కలిసి ఆ పార్టీ కార్యకర్తలు మామిడికుదురు మండలం నగరం వద్ద వేచి చూస్తుండగా లోకేశ్ సెక్యూరిటీ సిబ్బంది, యువగళం వలంటీర్లు వారిని పక్కకు నెట్టేశారు. నానాజీ పడిపోతుండగా జనసేన కార్యకర్తలు పట్టుకున్నారు. గజమాలతో పాటు కొందరు జనసేన కార్యకర్తలు కిందపడిపోయారు. దీంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రామానాయుడు వారికి సర్దిచెప్పారు. పాశర్లపూడిలో మధ్యాహ్న భోజన విరామం కోసం ఏర్పాటు చేసిన క్యాంపు వద్ద జనసేన నాయకులు లోకేశ్‌ను కలిసేందుకు చేరుకున్నారు. టీడీపీ నాయకులను మాత్రమే లోపలకు పంపడంతో జనసేన నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ టీడీపీ వారితో వాగ్వాదానికి దిగి దుర్భాషలాడారు.

ఢిల్లీలో టీడీపీ అధినేత చంద్రబాబు

సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరు

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కుమారుడి వివాహ రిసెప్షన్‌కు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు తన సతీమణి భువనేశ్వరితో కలసి హాజరయ్యారు. ఢిల్లీలోని ఓ ప్రముఖ హోటల్లో సోమవారం రాత్రి జరిగిన రిసెప్షన్ కార్యక్రమంలో టీడీపీ ఎంపీలు కేశినేని నాని, రామ్మోహన్‌నాయుడు, నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణరాజు, రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్, మాజీ మంత్రి నారాయణ తదితరులతో కలసి ఆయన పాల్గొన్నారు. చంద్రబాబు సోమవారం మధ్యాహ్నం 12.45 గంటలకు హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయల్దేరి 3.40 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన డాక్టర్ జాకీర్ హుస్సేన్ మార్గ్‌లోని 'ది ఒబెరాయ్' హోటల్‌కు చేరుకున్నారు. రాత్రి జరిగిన రిసెప్షన్ వేడుకల్లో పాల్గొన్న చంద్రబాబు.. మంగళవారం సాయంత్రం 4.30 గంటల వరకు ఒబెరాయ్ హోటల్లోనే బస చేస్తారు. అనంతరం హైదరాబాద్‌కు బయల్దేరి వెళతారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో చంద్రబాబు తరఫున లూథ్రా కోర్టుల్లో వాదించిన విషయం తెలిసిందే.

'మెరుపు మెరిసినట్లు ఉంటుందామె నాట్యం.
నాట్యానికి ఆమె చేసే న్యాయం అద్భుతంగా ఉంటుంది.
భారతీయ శాస్త్రీయ నాట్యానికి ఆమె ప్రత్యేకమైన ఆకర్షణ'.
...ఇవన్నీ భావనారెడ్డి నాట్య ప్రతిభకు అందిన ప్రశంసలు.
జాతీయ, అంతర్జాతీయ పత్రికల అక్షర పురస్కారాలు.
ఇప్పుడామె కొత్త నాట్యతరంగాలను సృష్టించే పనిలో ఉన్నారు.



● కూచిపూడి

ఓ విశ్వవ్యాప్త భావన

కూచిపూడి కళాకారిణి భావనారెడ్డి నాట్యాన్ని అధ్యయనం చేశారు, నాట్యంలో పరిశోధన చేశారు. నాట్యాన్ని ప్రదర్శిస్తున్నారు. నాట్యాన్ని భావితరాలకు అందించడానికి శిక్షణనిస్తున్నారు. అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా, సింగపూర్, యూరప్‌దేశాలలో మన కూచిపూడి అడుగులు వేయిస్తున్నారు. చిన్నారులకు కూచిపూడి అభినయ ముద్రలు నేర్పిస్తున్నారు. నాట్యకళాకారిణి నుంచి నాట్యగురువుగా మారి గురుశిష్యపరంపరకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 26వ తేదీన(ఆదివారం) అమెరికా, కాలిఫోర్నియాలో ఆమె శిష్యబృందం ప్రదర్శన ఇచ్చింది. ఈ సందర్భంగా ఆమె సాక్షితో తన అభిప్రాయాలను పంచుకున్నారు.

కళామతల్లి దక్షిణ

''నాట్యం ఎంతగా సాధన చేసినప్పటికీ 'ఇక చాలు' అనే ఆలోచన ఎప్పటికీ రాదు. ఇంకా ఏదో చేయాలనే తపన నేర్చుకున్న అడుగులకు కొత్తదనం అద్దమని పోరుతూనే ఉంటుంది. పౌరాణిక, ఆధ్యాత్మిక, సామాజిక అంశాలను నాట్యం ద్వారా అత్యంత లలితంగా వ్యక్తం చేయగలుగుతాం. అందుకే మన శాస్త్రీయ నాట్యప్రక్రియలు నిత్యనూతనం. తరతరాలుగా కొనసాగుతున్న ఈ కళారూపాన్ని నేను మా తల్లిదండ్రుల నుంచి నేర్చుకున్నాను. దేశవిదేశాల్లో ప్రదర్శనలిచ్చాను. నా వంతు బాధ్యతగా కొత్త తరాలకు శిక్షణనిస్తున్నాను. ఇది నేను నాట్యానికి తిరిగి ఇస్తున్న కళాదక్షిణ.

నాట్యానికి డిజిటల్ వేదిక

కూచిపూడిని విశ్వవ్యాప్తం చేయడానికి లెక్కలేనన్ని ప్రదర్శనలిచ్చాను. కళాభిమానుల అభిమానాన్ని సొంతం చేసుకున్నాను. కోవిడ్ కారణంగా ప్రపంచం స్తంభించి పోయింది. దాంతో నాట్య ప్రదర్శనలు ప్రశ్నార్థక మయ్యాయి. అప్పటికే నిర్ణయమైన కార్యక్రమాలు రద్దయ్యాయి కూడా. కరోనా వైరస్ ప్రదర్శననైతే నిలువరించగలిగింది కానీ నాట్యసాధనను కాదు. నా ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలను చూసి చాలా మంది నాట్యం నేర్పించమని అడిగారు. మన సంప్రదాయాన్ని గతం నుంచి భవిష్యత్తుకు చేర్చే మాధ్యమాలుగా మా కళాకారుల మీద ఎంతో బాధ్యత ఉంటుంది. ఆ బాధ్యతను నిర్వర్తించడానికి మంచి సమయం అనిపించింది. అలా మూడేళ్ల కిందట అమెరికాలో 'ద ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ కూచిపూడి డాన్స్' సంస్థను స్థాపించాను. దాదాపు యాభై మందికి కూచిపూడి నాట్యంలో శిక్షణనిచ్చాను. ఈ ప్రదర్శనలో గణనాట్య, పుష్పాంజలి, జతికట్టు, మండూక శబ్దం, దశావతారాల ప్రదర్శనలో మొత్తం 15 మంది చిన్నారులు పాల్గొన్నారు.

అమ్మ దిద్దిన వ్యక్తిత్వం

నాట్య ప్రక్రియల్లో కాలానుగుణంగా కొద్దిపాటి మార్పులు తోడవుతుంటాయి. కానీ శిక్షణనిచ్చే విధానంలో సంప్రదాయం కొనసాగుతుంది. డాన్స్ క్లాసును నాట్యమందిరంగా గౌరవించడంలో ఎటువంటి మార్పూ ఉండదు. రాజారెడ్డి, రాధారెడ్డి, కౌసల్యారెడ్డి... ఈ ముగ్గురూ కూచిపూడికి ప్రతీకలుగా గుర్తింపు తెచ్చుకున్నారు. వారి బిడ్డలుగా అక్క యామిని, నేను ఆ పరంపరను కొనసాగిస్తున్నాం. నన్ను శిల్పంలా చెక్కడంలో, విలువలతో కూడిన వ్యక్తిగా తీర్చిదిద్దడంలో అమ్మ కౌసల్య కృషిని మాటల్లో వర్ణించలేం. నా భర్త డెనిస్ నిల్సన్‌ది స్వీడన్. ఆయన సంగీతకారుడు. ఇద్దరమూ కళాకారులమే కావడం నా కళాసేవకు మరింతగా దోహదం చేస్తోంది. వారి సొంతదేశం స్వీడన్. మేము అమెరికాలో నివసిస్తున్నాం. మా అబ్బాయికి ఐదు నెలలు. నడకతోపాటు నాట్యం నేర్చుకుంటాడో, మాటలతోపాటు పాటలు నేర్చుకుంటాడో చూడాలి'' అని నవ్విందామె.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి






● ఆదివారం నాడు కాలిఫోర్నియాలో కూచిపూడి నాట్యప్రదర్శన సందర్భంగా జ్యోతి ప్రజ్వలన, చిన్నారుల నాట్య ప్రదర్శన

సక్సెస్ స్టోరీ

యూ ట్యూబ్ తెరుస్తున్న కొత్త ద్వారాలు చూస్తూనే ఉన్నాం. మన దగ్గర ఒక బర్రెలక్క ఉన్నట్టుగానే ఉత్తర ప్రదేశ్‌లో ఒక టీచరక్క ఉంది. ఇంటర్ మాత్రమే చదివిన వ్యవసాయ కూలీ యశోదా లోధి ఇంగ్లిష్ మీద ఆసక్తితో నేర్చుకుంది. 'నాలాగే పల్లెటూరి ఆడవాళ్లు ఇంగ్లిష్ మాట్లాడాలి' అనుకుని ఒకరోజు పొలం పని చేస్తూ, ఇంగ్లిష్ పాఠం వీడియో విడుదల చేసింది. ఇవాళ దాదాపు మూడు లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఆమె ఇంగ్లిష్ పాఠాలను నేర్చుకుంటున్నారు. యశోదా లోధి సక్సెస్ స్టోరీ.

పల్లెటూరోళ్లు ఇంగ్లిష్ మాట్లాడొద్దా?



● యూట్యూబ్‌లో పాఠాలు చెబుతూ...

'కట్ టు ద చేజ్' అంటే ఏమిటి? 'బై ఆల్ మీన్స్' అని ఎప్పుడు ఉపయోగించాలి? 'అకేషనల్లీకి సమ్‌టైమ్స్‌కి తేడా ఏమిటి?'... ఇలాంటి చిన్న చిన్న విషయాల నుంచి మంచినీళ్లు తాగినంత సులభంగా ఇంగ్లిష్ మాట్లాడటం ఎలాగో నేర్పుతోంది ఒక పల్లెటూరి పంతులమ్మ. ఆశ్చర్యం ఏమిటంటే తాను ఒకవైపు నేర్చుకుంటూ మరో వైపు నేర్పుతూ. చదివింది ఇంటర్మీడియట్ మాత్రమే. అది కూడా హిందీ మీడియమ్‌లో. కాని యశోదా లోధి వీడియోలు చూస్తే ఆమె అంత చక్కగా ఇంగ్లిష్ మాట్లాడుతున్నప్పుడు మనమెందుకు మాట్లాడకూడదు అనిపిస్తుంది. అలా అనిపించేలా చేయడమే ఆమె సక్సెస్. ఆమె యూట్యూబ్ చానల్ సక్సెస్.

ఇంగ్లిష్ విత్ దేహాతీ మేడమ్

'దెహాత్' అంటే పల్లెటూరు అని అర్థం. యశోదా లోధి ఉత్తర ప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో సిరాతు నగర్ అనే చిన్న పల్లెటూళ్లో ఉంటోంది. అందుకే తన యూట్యూబ్ చానల్‌కు 'ఇంగ్లిష్ విత్ దెహాతి మేడమ్' అనే పేరు పెట్టుకుంది. ఆమె ఇంగ్లిష్ పాఠాలకు ఇప్పటికి రెండున్నర కోట్ల వ్యూస్ వచ్చాయి. మూడు లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఉన్నారు. అంతే కాదు... ఆమెను చూసిన ధైర్యంతో చాలామంది గృహిణులు ఇంగ్లిష్ ఎంతో కొంత నేర్చుకుని ఆమెతో లైవ్‌లో ఇంగ్లిష్‌లో మాట్లాడుతూ మురిసిపోతుంటారు. ఇంగ్లిష్ మన భాష కాదు, మనం మాట్లాడలేము అనుకునే పల్లెటూరి స్త్రీలకు, గృహిణులకు యశోద గొప్ప ఇన్‌స్పిరేషన్‌గా ఉంది.

300 రూపాయల రోజు కూలి

యశోద కుటుంబం నిరుపేదది. చిన్నప్పటి నుంచి యశోదకు బాగా చదువుకోవాలని ఉండేది. కాని డబ్బులేక అతి కష్టమ్మీద ఇంటర్ వరకు చదివింది. ఆ తర్వాత పెళ్లి చేసుకుంది. భర్త ఎనిమిది వరకు చదివారు. ఆడపడుచులు స్కూలు ముఖం చూడలేదు. అలాంటి ఇంటికి కోడలైంది యశోద. పల్లెలో భర్తతో పాటు బంగాళదుంప చేలలో కూలి పనికి వెళితే రోజుకు రూ. 300 కూలి ఇచ్చేవారు. మరో వైపు భర్తకు ప్రమాదం జరిగి కూలి పని చేయలేని స్థితికి వచ్చాడు. అలాంటి స్థితిలో ఏం చేయాలా... కుటుంబాన్ని ఎలా ఆదుకోవాలా... అని తీవ్రంగా ఆలోచించేది యశోద.



ఒంటి గంట నుంచి మూడు వరకు

పల్లెలో ఇంటి పని, పొలం పని చేసుకుంటూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు వరకు దొరికే ఖాళీలో మాత్రమే యశోద వీడియోలు చేస్తుంది. 'మా ప్రాంతంలో నెలంతా సంపాదిస్తే 9 వేలు వస్తాయి. చాలామంది పిల్లలకు మంచి చదువు లేదు. నేను యూట్యూబ్‌లో బాగా సంపాదించి అందరికీ సాయం చేయాలని, మంచి స్కూల్ నడపాలని కోరిక' అంటుంది యశోద.

గతి మార్చిన స్మార్ట్‌ఫోన్

'2021లో స్మార్ట్‌ఫోన్ కొనడంతో నా జీవితమే మారిపోయింది. అప్పటి వరకూ నాకు ఈమెయిల్ క్రియేట్ చేయడం తెలియదు, యూట్యూబ్ చూడటం తెలియదు. కాని ఫోన్ నుంచి అన్నీ తెలుసుకున్నాను. యూట్యూబ్‌లో మోటివేషనల్ స్పీచ్‌లు వినేదాన్ని. నాకు అలా మోటివేషనల్ స్పీకర్ కావాలని ఉండేది. కాని నా మాతృభాషలో చెప్తే ఎవరు వింటారు? అదీగాక నా మాతృభాష కొద్దిమందికే. అదే ఇంగ్లిష్ నేర్చుకుంటే ప్రపంచంలో ఎవరినైనా చేరవచ్చు అనుకున్నాను. అలా ఇంగ్లిష్ నేర్చుకోవాలని ఇంగ్లిష్ నేర్పించే చానల్స్ చూడసాగాను. నేర్చుకుంటూ వెళ్లాను. అలా నేర్చుకుంటున్నప్పుడే నాకు ఆలోచన వచ్చింది. నాలాగా ఇంగ్లిష్ నేర్చుకోవాలనుకునే పేద మహిళలు, పెద్దగా చదువుకోని మహిళలు ఉంటారు... వారి కోసం ఇంగ్లిష్ పాఠాలు చెప్పాలి అని. నేను ఆశించేదీ, అందరు మహిళలు చేయాలని కోరుకునేదీ ఒక్కటే... భయం లేకుండా ఇంగ్లిష్ మాట్లాడటం. అది కష్టం కాదు. నేను నేర్చుకున్నాను అంటే అందరికీ వస్తుందనే అర్థం' అంటుంది యశోద.

పల్లెటూరి వనితగా ఎప్పుడూ తల మీద చీర కొంగును కప్పుకుని వీడియోలు చేసే యశోదకు చాలామంది ఫ్యాన్స్ ఉన్నారు. ఇప్పుడు ఆమె ఆదాయం కూడా చాలా బాగా ఉంది. ఇది నేటి పల్లెటూరి విజయగాథ.

● రైతులకు శుభవార్త

ఎర్రబంగారం ఇక ఎంతైనా ఎగుమతి!

సాగుబడి
అనూరాధ కార్తె: డిసెంబర్ 2 వరకు
జ్యేష్ఠ కార్తె: 3 నుంచి

- ఎర్ర చందనం ఎగుమతులపై 19 ఏళ్లుగా అమల్లో ఉన్న పరిమితి రద్దు
- రైతులు మధ్యవర్తుల్లేకుండా నేరుగా విదేశాలకు ఎగుమతికి అవకాశం
- ఎగుమతులు ఊపందుకోనున్న నేపథ్యంలో వర్షాధార సాగు విస్తీర్ణం పెరగడానికి అవకాశాలు

ఎర్ర చందనం.. ప్రపంచంలో కేవలం మన దేశంలో మాత్రమే ఉన్న అత్యంత అరుదైన, అత్యంత ఖరీదైన జాతి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో విస్తరించిన తూర్పు కనుమల్లోని అడవుల్లో సహజ సిద్ధంగా ఎర్ర చందనం అనాదిగా పెరుగుతోంది. దీనితోపాటు, కొందరు రైతులు వర్షాధార భూముల్లో ఎర్రచందనం తోటలను చాలా ఏళ్లుగా సాగు చేస్తున్నారు. అంతరించిపోయే ప్రమాదం అంచుల్లో ఉన్న అరుదైన జాతి కావటంతో ఎర్రచందనం కలప ఎగుమతిపై 19 ఏళ్లుగా అంతర్జాతీయంగా పరిమితులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాల కృషి మేరకు ఎర్రచందనం ఎగుమతులపై పరిమితులు ఇటీవలే తొలగిపోయాయి. ఇక ఎంతయినా రైతులు ఎగుమతి చేయొచ్చు. మంచి ధర వచ్చే వరకు నిల్వ చేసుకొని మరీ ఎగుమతి చేసుకోవచ్చు. మెట్ట ప్రాంతాల్లో ఎర్రచందనం సాగు పుంజుకునేందుకు దోహదపడనున్న ఈ తాజా పరిణామంపై ప్రత్యేక కథనం.

అంతర్జాతీయంగా ఆర్థికంగా ముఖ్యమైన చెట్ల జాతుల్లో ఎర్ర చందనం ఒకటి. ఎర్రచందనం చేవ కర్రకు ఔషధ గుణాలు ఉన్నాయి. మన దేశంలోని తూర్పు కనుమలు విస్తరించిన దక్షిణ ప్రాంతంలో సహజ అడువుల్లో విస్తారంగా ఎర్రచందనం చెట్లు ఉన్నాయి. రైతులు కూడా తమ భూముల్లో సాగు చేస్తున్నారు. సుదీర్ఘకాలం పెంచాల్సి రావటం, చెట్లు నరకడానికి, అమ్మకానికి ప్రత్యేక అనుమతులు తీసుకోవాల్సి ఉండటం వంటి పరిమితులు ఉన్నప్పటికీ.. అంతర్జాతీయంగా గిరాకీ, అధిక ధర, మార్కెట్ డిమాండ్‌కు తగినంత సరఫరా లేకపోవటం వల్ల ఎర్రచందనం సాగుకు కొంత మంది రైతులు ఆసక్తి చూపుతూ వచ్చారు. ఎగుమతిపై పరిమితులు ఇటీవల రద్దయిన నేపథ్యంలో ఎర్రచందనం సాగు మరింత పుంజుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నది నిపుణుల మాట.

ఎర్రచందనం చెట్టు కాండం మధ్యలో పెరిగే ఎర్రటి చేవ కర్రను వస్త్రాలు, ఆహారం, ఔషధాల్లో సేంద్రియ రంగు కోసం వాడుతున్నారు. ఖరీదైన ఫర్నీచర్, బొమ్మలు, సంగీత వాయిద్యాల తయారీకి వాడుతున్నారు. షుగర్, చర్మవ్యాధులకు ఆయుర్వేద చికిత్సలో ఉపయోగిస్తున్నారు. అందువల్ల ఎర్ర చందనానికి అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతున్నది. జపాన్, చైనా, ఐరోపా దేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతోంది. అడవుల్లోని ఎర్రచందనం చెట్లను స్మగ్లర్లు గతంలో విచక్షణారహితంగా నరికివేసిన కారణంగా ఈ వృక్ష జాతి అంతరించిపోయే ముప్పును ఎదుర్కొనే దశకు చేరింది. అందువల్ల ఎర్రచందనం జాతిని అంతరించిపోకుండా పరిరక్షించడానికి ప్రత్యేక చర్యలు అవసరమయ్యాయి.

■ 2004 నుంచి ఎగుమతిపై పరిమితులు

జెనీవా కేంద్రంగా పనిచేస్తున్న అంతర్జాతీయ చట్టబద్ధ సంస్థ కన్వెన్షన్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎన్‌డేంజర్డ్ స్పెసీస్ (సిటిఇఎస్ – 'సైట్స్')లో 1976 నుంచి భారత్ సభ్య దేశంగా కొనసాగుతోంది. ఎర్రచందనం దుంగల ఎగుమతిపై 2004లో 'సైట్స్' పూర్తిగా నిషేధించలేదు గానీ, పటిష్టమైన సంరక్షణ చర్యల్లో భాగంగా పరిమితిని విధించింది. ఏటేటా ఈ జాతి చెట్ల స్థితిగతులను పరిశీలించి ఎగుమతి పరిమాణాన్ని సైట్స్ స్థాయీ సంఘం నిర్దేశిస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎర్ర చందనం పరిరక్షణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి ఈ చెట్ల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టింది. మరోవైపు అటవీ భూముల్లో ఎర్రచందనం మొక్కలు నాటడం కూడా జరిగింది. అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతో పాటు గుజరాత్‌లో కూడా కొందరు రైతులు బంజరు భూముల్లో ఎర్రచందనాన్ని దశాబ్దాలుగా సాగు చేస్తున్నారు. అటవీ భూముల్లోని ఎర్రచందనం చెట్లను పరిరక్షించటంతో పాటు రైతుల భూముల్లోనూ సాగు చేస్తుండటంతో ఈ జాతి అంతరించే ముప్పు నుంచి బయటపడింది.



ఎర్రచందనం రైతులకు ప్రయోజనకరం

అంతరించిపోయే ప్రమాదం ఎదుర్కొంటున్న జీవజాతుల పరిరక్షణ చర్యలను జెనీవాలోని 'సైట్స్' అనే అంతర్జాతీయ సంస్థ నియంత్రిస్తూ ఉంటుంది. ఇప్పటి వరకు ఎర్రచందనం దుంగలను ఈ సంస్థ నిర్ణయించే పరిమితి మేరకే ఏటా ఎగుమతి జరుగుతోంది. దీంతో ఆ కోటా కన్నా ఎక్కువ ఎర్రచందనం మన రైతుల దగ్గర ఉన్నా ఎగుమతి చేసే వీలుండేది కాదు. కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల కృషి మేరకు ఎగుమతిపై ఉన్న పరిమాణాత్మక పరిమితిని 'సైట్స్' ఇటీవల రద్దు చేసింది. దీంతో ఎర్ర చందనం ఎగుమతుల నియంత్రణ అంశం మన దేశంలోని 'సైట్స్' ఇండియా అథారిటీ పరిధిలోకి వచ్చింది. ఎర్రచందనం ఎగుమతిదారులు ఇక మీదట సైట్స్ ఇండియా అనుమతి తీసుకుంటే సరిపోతుంది. ఎర్రచందనం సాగు చేసే రైతులకు ఇది ప్రోత్సాహకర పరిణామం. సాగు చేసిన ఎర్రచందనం దుంగలను అప్పటికప్పుడు అమ్మెయ్యాల్సిన అవసరం లేదు. నిల్వ చేసి అయినా మంచి ధరకు రైతులు అమ్ముకునేందుకు అవకాశం ఉంటుంది. ఎర్రచందనం సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

– వై. మధుసూదన్ రెడ్డి,
అటవీ దళాల అధిపతి (పిసిసిఎఫ్),
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం





ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో ఎర్రచందనం ప్రకృతి సిద్ధంగా పెరుగుతున్న అటవీ ప్రాంతం

రాళ్ల భూముల్లో పెరుగుతుంది!

ఎర్రచందనం ఎగుమతిపై పరిమితులు రద్దవటం వల్ల రైతులకు ఇబ్బందులు తొలగిపోతాయి. మధ్యవర్తులపై ఆధారపడకుండా రైతులు నేరుగా ఎగుమతిదారులను సంప్రదించడానికి వీలవుతుంది. ఎర్రచందనం తోటల సాగు విస్తీర్ణం పెరుగుతుంది. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల్లో ఇతరత్రా పంటలు సాగుకు అనువుకాని రాళ్లు రప్పలతో కూడిన మెట్ట భూములు, గుట్టల్లో ఎర్రచందనం చెట్లు పెరుగుతాయి. ఒక సంవత్సరం మొక్కల్ని నీరు పోసి రక్షిస్తే చాలు. తర్వాత వాటికవే పెరుగుతాయి. ఎరువులు అవసరం లేదు. 30 ఏళ్లలో కోతకు వస్తాయి. ఐఎఫ్‌బిలో ఎర్ర చందనం మీద చాలా ఏళ్లుగా పరిశోధనలు చేస్తున్నాం. వన విజ్ఞాన కేంద్రం ద్వారా ప్రతి ఏటా రైతులు, అటవీ సిబ్బంది, విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. ఎర్రచందనం పెంపకం మాన్యువల్, ఎర్రచందనం–ఏగిశ (బిజసాల్) మధ్య వ్యత్యాసాలు, ఎర్రచందనాన్ని ఆశించే చీడపీడలు, నియంత్రణ చర్యలపై కరపత్రాలను విడుదల చేశాం.

– వెంకట్‌రెడ్డి, సంచాలకులు,
అటవీ జీవవైవిధ్య సంస్థ (ఐఎఫ్‌బి),
దూలపల్లి, హైదరాబాద్
director_ifb@icfre.org



■ 19 ఏళ్ల తర్వాత..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నివేదికల ఆధారంగా తాజా పరిస్థితిని నవంబర్ 6–10 తేదీల్లో జెనీవాలో జరిగిన 'సైట్స్' 77వ స్థాయీ సంఘం సమావేశం సమీక్షించి సంతృప్తిని వ్యక్తం చేసింది. మన దేశం నుంచి సైట్స్ మేనేజ్‌మెంట్ అథారిటీ–ఇండియా తరఫున అడిషినల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్ ఎస్.పి. యాదవ్ సారథ్యంలోని ఉన్నతాధికార బృందం ఈ సమావేశంలో పాల్గొని పరిస్థితిని వివరించింది. దీంతో, భారత్ నుంచి ఎర్రచందనం ఎగుమతులపై 19 ఏళ్లుగా అమల్లో ఉన్న పరిమితిని తొలగిస్తూ ఈ సమావేశం నిర్ణయం తీసుకుంది. దీంతో, జెనీవాలోని సైట్స్ స్థాయీ సంఘానికి బదులు.. ఇక మీదట ఎర్రచందనం ఎగుమతుల వ్యవహారాలపై న్యూఢిల్లీలోని సైట్స్ మేనేజ్‌మెంట్ అథారిటీ–ఇండియా నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు కలిగింది.

■ రైతులకు గొప్ప ప్రోత్సాహం

ఎర్రచందనం ఎగుమతిపై పరిమితిని రద్దు చేస్తూ సైట్స్ స్థాయీ సంఘం తీసుకున్న నిర్ణయాన్ని ఇటీవల కేంద్ర పర్యావరణ అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ అధికారికంగా ప్రకటించారు. మన దేశం గత 19 ఏళ్లుగా సైట్స్ నిబంధనలను తూ.చ. తప్పకుండా పాటించటమే కాకుండా ఎర్రచందనం వృక్ష జాతి పరిరక్షణ చర్యలు సమర్ధవంతంగా పాటించినందున సైట్స్ సానుకూల నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. 'ఈ పరిణామం ఎర్రచందనం తోటలు సాగు చేసే రైతులకు గొప్ప ప్రోత్సాహాన్నిస్తుంద'ని ఆయన అన్నారు.

■ ఎర్రచందనం సాగు పద్ధతులు

ఎగుమతిపై పరిమితి తొలగిన నేపథ్యంలో ఎర్రచందనం సాగు పద్ధతులపై రైతుల్లో ఆసక్తి నెలకొంది. హైదరాబాద్ దూలపల్లిలోని అటవీ జీవవైవిధ్య సంస్థ (ఐఎఫ్‌బి) ఎర్రచందనం సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ ఇస్తోంది. గత ఏడాది కరదీపికను వెలువరించింది. ఆ వివరాలు...

ఎర్రచందనం ప్రకృతిసిద్ధంగా తక్కువ నీటి వనరులున్న కొండ ప్రాంతాల్లో పెరుగుతుంది. అంతగా సారవంతం కాని గ్నీస్, క్వార్ట్జైట్, లాటరైట్ లోమ్ నేలలు బాగా అనుకూలం. సారవంతమైన నేలలు, నీటి సదుపాయం ఉన్న నేలలు ఎర్రచందనం సాగుకు అనువైనవి కావు. ఈ నేలల్లో సాగు చేస్తే చెట్లు బాగా ఎత్తుగా, లావుగా పెరుగుతాయి. అయితే, కాండం లోపల చేవదేలడానికి చాలా ఎక్కువ కాలం పడుతుంది. చేవను బట్టే ఎర్రచందనం నాణ్యత, ధర ఆధారపడి ఉంటాయి. పాక్షిక శుష్క ఉష్ణమండలంలోని ఆకురాల్చే అడవులు పెరిగే ప్రాంతం దీనికి అనుకూలం. 700 నుంచి 1200 ఎం.ఎం. మేరకు వార్షిక వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో ఇది పెరుగుతుంది. కనీసం 700 ఎం.ఎం. వర్షం అవసరం. ఏడాదిలో అప్పుడప్పుడూ వర్షాలు పడుతూ ఉండే ప్రాంతాలు ఎర్రచందనం సాగుకు అనుకూలం. అధిక వర్షపాత ప్రాంతాలు అనుకూలం కాదు. పొడి వాతావరణంతో పాటు 26–28 డిగ్రీల సెల్షియస్ (గరిష్ఠంగా 48 డిగ్రీల సెల్షియస్) ఉష్ణోగ్రతలు ఉండాలి. నర్సరీ బెడ్లపై పెంచిన 1–2 ఏళ్ల నారు మొక్కల్ని నాటుకోవాలి. ఎర్ర చందనం గింజలు చాలా తక్కువ శాతం మొలకెత్తుతాయి. అందువల్ల వీటికి బదులు కొందరు ప్రైవేటు నర్సరీ వాళ్లు రైతులకు ఏగిశ మొక్కల్ని ఎర్రచందనం మొక్కలని నమ్మబలికి అంటగడుతూ ఉంటారని, రైతులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏగిశ మొక్కలు కొన్ని సంవత్సరాల వరకు ఎర్రచందనం మాదిరిగానే కనిపిస్తాయట. కాండం కూడా ఎరుపు రంగులోనే ఉంటుంది. కాబట్టి మొక్కలను కొనుగోలు చేసేటప్పుడే రైతులు జాగ్రత్తవహించాలి. అటవీ శాఖ ద్వారా మొక్కల్ని కొనుగోలు చేయటం ఉత్తమం అని ఐఎఫ్‌బి శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

■ 30 ఏళ్లలో చెట్టుకు 59 కిలోల చేవ

అటవీ జీవవైవిధ్య సంస్థ (ఐఎఫ్‌బి) సమాచారం ప్రకారం.. ఎర్రచందనం మొక్కల్ని 3×3 మీటర్ల దూరంలో (హెక్టారుకు 1,111 మొక్కలు) నాటుకోవచ్చు. ఎర్రచందనం చెట్టు కోతకు రావటానికి 30 ఏళ్లు పడుతుందని ఐఎఫ్‌బి నిపుణులు తెలిపారు. నాటిన 20 ఏళ్లకు కాండం లోపలి భాగం (హార్డ్ వుడ్) చేవదేలటం ప్రారంభమవుతుంది. కాండంపై బెరడు కింద తెల్ల చెక్క ఉంటుంది. దాని లోపల ఎర్రగా చేవదేలి ఉంటుంది. ఆ ఎర్రని చేవ గల కర్రే విలువైనది. 30 ఏళ్ల వయసున్న చెట్టు నుంచి 59 కిలోల చేవగల ఎర్రచందనం దుంగ వెలువడుతుంది. పోయిన చెట్లు పోగా 30 ఏళ్లకు హెక్టారుకు కనీసం 275 చెట్లు మిగులుతాయి. ఈ లెక్కన హెక్టారుకు 16.2 మెట్రిక్ టన్నుల బరువైన ఎర్రచందనం లభిస్తుంది. 40 ఏళ్లకు 38 మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని ఐఎఫ్‌బి అంచనా. 2017లో ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ వేలంలో మెట్రిక్ టన్ను ఎర్రచందనం దుంగలు రూ. 27.8 లక్షలకు అమ్ముడయ్యాయి.

– పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



పార్లమెంట్ ఎన్నికల బరిలో షకీబ్

బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్, కెప్టెన్ షకీబ్ అల్ హసన్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెడుతున్నాడు. త్వరలో జరిగే బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో అతను పోటీ చేయనున్నాడు. ప్రస్తుతం అధికారంలో ఉన్న అవామీ లీగ్ తరఫున అతను బరిలోకి దిగుతాడు. తన స్వస్థలమైన మగురా–1 నియోజకవర్గానికి సంబంధించి షకీబ్‌కు టికెట్ ఖరారైంది. జనవరి 7న బంగ్లాలో ఎన్నికలు ఉన్నాయి. ప్రపంచకప్‌లో వేలికి గాయమైన ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్న షకీబ్ మళ్లీ ఎప్పుడు మైదానంలోకి దిగుతాడనేదానిపై స్పష్టత లేదు. ఎన్నికల్లో బిజీగా ఉండే నేపథ్యంలో త్వరలో న్యూజిలాండ్‌తో ఇంటా, బయటా జరిగే వరుస సిరీస్‌లకు అతను అందుబాటులో ఉంటాడా అనేది చెప్పలేదు. షకీబ్‌కు ముందు అతని సహచర ఆటగాడు, మాజీ కెప్టెన్ మష్రఫ్ మొర్తజా గత ఎన్నికల్లో నరైల్ స్థానంనుంచి ఎంపీగా ఎన్నికయ్యాడు. ఈ సారి కూడా అతను మళ్లీ బరిలో నిలిచాడు. మూడు ఫార్మాట్‌లో కలిపి బంగ్లా తరఫున 430 మ్యాచ్‌లు ఆడిన 14,406 పరుగులు చేయడంతో పాటు 690 వికెట్లు తీసిన షకీబ్ ప్రపంచ అత్యుత్తమ ఆల్‌రౌండర్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు.

సిరీస్ విజయమే లక్ష్యంగా...

- 'హ్యాట్రిక్'పై భారత్ దృష్టి
- ఆసీస్‌తో నేడు మూడో టి20
- సమరోత్సాహంతో సూర్య సేన
- ఒత్తిడిలో ఆస్ట్రేలియా
- రా.గం.7 నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో ప్రసారం

గువాహటి: టి20ల్లో వరుసగా రెండు విజయాలతో జోరు మీదున్న భారత జట్టు ఇప్పుడు సిరీస్‌పై కన్నేసింది. మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సిరీస్‌ను 3–0తో ఇక్కడే కైవసం చేసుకోవాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆస్ట్రేలియాతో జరిగే మూడో టి20 మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా టీమిండియా బరిలోకి దిగుతోంది. అటు బ్యాటర్స్, ఇటు బౌలర్స్ ఆధిపత్యం కొనసాగుతుండటంతో ఆతిథ్య జట్టుకు సిరీస్ విజయం ఏమంత కష్టమేమీ కాదు. గత రెండు మ్యాచ్‌ల్లోనూ 200 పైచిలుకు స్కోరు చేసిన భారత్ మళ్లీ గువాహటి ప్రేక్షకులకు అలాంటి మజానే అందించేందుకు సిద్ధమైంది. పైగా ఆల్‌రౌండ్ సామర్థ్యంతో జట్టు సమరోత్సాహంతో ఉంది. ఆస్ట్రేలియా మాత్రం సిరీస్‌లో నిలవాలంటే కచ్చితంగా గెలవాల్సిన పరిస్థితిలో ఉంది. పరాజయాల 'హ్యాట్రిక్' అయితే మాత్రం సిరీస్ చేజార్చుకుంటుంది.

బ్యాటర్స్‌ను ఆపతరమా...

టాపార్డర్ బ్యాటర్స్ అసాధారణ ఫామ్‌లో ఉన్నారు. యశస్వి దూకుడు ఆసీస్‌ను కంగారు పెట్టిస్తోంది. రెండు వరుస అర్ధ సెంచరీలతో ఇషాన్ కిషన్ ప్రత్యర్థి బౌలర్లపై సత్తా చాటగా, రుతురాజ్ కూడా ఫిఫ్టీతో తొలిమ్యాచ్ డకౌట్‌ను మరచిపోయేలా చేశాడు. రింకూ సింగ్ డెత్ ఓవర్లలో ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నాడు. ఇక నిరూపించుకోవాల్సింది, సత్తా చాటుకోవాల్సిన వారు ఎవరైనా ఉన్నారంటే అది హైదరాబాదీ క్రికెటర్ తిలక్ వర్మే! ఎందుకంటే విశ్రాంతిలో ఉన్న శ్రేయస్ అయ్యర్ తదుపరి రెండు మ్యాచ్‌లకు వైస్ కెప్టెన్‌గా బరిలోకి దిగుతున్నాడు. ఈ నేపథ్యంలో అతను తుది జట్టులో ఆడటం ఖాయం కావడంతో బెంచ్‌కు పరిమితమయ్యే పరిస్థితి తిలక్‌కే వస్తుంది. అయితే ఇప్పుడు ఈ మ్యాచ్‌లో మెరుపులు మెరిపిస్తే... ప్రస్తుతానికి పక్కన పెట్టినా టచ్‌లోకి వచ్చిన బ్యాటర్‌గా జట్టు ఎంపికలో ఉంటాడు. ఇక బౌలింగ్ విభాగం కూడా గత మ్యాచ్‌లో మెరుగైంది. కీలకమైన వికెట్లను వరుస విరామాల్లో తీసి మ్యాచ్‌లో పట్టు సాధించింది. ప్రసిధ్‌కృష్ణ, అర్ష్‌దీప్‌లతో పాటు స్పిన్నర్లు రవి బిష్ణోయ్, అక్షర్ పటేల్ రాణిస్తుండటం జట్టుకు కలిసొచ్చే అంశం.



పిచ్–వాతావరణం

బర్సాపరా వికెట్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలం. అయితే గతంలో ఇక్కడే ఆస్ట్రేలియా చేతిలో ఓడిన చేదు అనుభవం భారత్‌కు ఉంది. కానీ పటిష్టమైన దక్షిణాఫ్రికాపై భారీ స్కోరు చేసి గెలిచింది. ప్రస్తుత టీమిండియా ఫామ్‌ను చూస్తే మరో పరుగుల విందు గ్యారంటీ! టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకోవచ్చు.

జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), రుతురాజ్, యశస్వి జైస్వాల్, ఇషాన్ కిషన్, తిలక్‌వర్మ, రింకూ సింగ్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్, ప్రసిధ్ కృష్ణ, ముకేశ్ కుమార్.

ఆస్ట్రేలియా: మాథ్యూ వేడ్ (కెప్టెన్), స్టీవ్ స్మిత్, షార్ట్, జోష్ ఇన్‌గ్లిస్, మ్యాక్స్‌వెల్, టిమ్ డేవిడ్, స్టొయినిస్, ఆడమ్ జంపా, సీన్ అబాట్, నాథన్ ఎలిస్, తన్వీర్ సంఘా.



ఆసీస్ రేసులోకొచ్చేనా...

ఆస్ట్రేలియా తొలి టి20లో 200 పైచిలుకు పరుగులు చేసినా ఓడింది. తర్వాతి మ్యాచ్‌లో 236 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. వరుస పరాజయాలతో ఒత్తిడిలో ఉన్న ఆస్ట్రేలియా గెలిచి నిలవడం సాధ్యమవుతుందా అనేది నేటి మ్యాచ్‌తో తేలుతుంది. గత మ్యాచ్‌లో అనుభవజ్ఞులైన డాషింగ్ బ్యాటర్ మ్యాక్స్‌వెల్, ప్రధాన స్పిన్నర్ ఆడమ్ జంపాలను కూడా బరిలోకి దించినా కంగారూ జట్టుకైతే ఒరిగిందేమీ లేదు. నిలకడ లేని బ్యాటింగ్, నియంత్రణ లేని బౌలింగ్ జట్టు మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. స్మిత్, షార్ట్, ఇన్‌గ్లిస్, టిమ్ డేవిడ్, స్టొయినిస్‌లాంటి మేటి బ్యాటర్లున్నప్పటికీ ఈ సిరీస్‌లో గెలుపు దారిలో మాత్రం ఆసీస్ పడలేకపోతోంది. తప్పక గెలవాల్సిన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిస్తే తప్ప పటిష్టమైన ఆతిథ్య జట్టు జోరుకు కళ్లెం వేయలేదు.

గుజరాత్ కెప్టెన్‌గా గిల్

ఐపీఎల్‌లో తొలిసారి నాయకత్వ బాధ్యతలు

న్యూఢిల్లీ: భారత ఓపెనర్, కెరీర్‌లో మంచి ఫామ్‌తో దూసుకుపోతున్న శుబ్‌మన్ గిల్‌కు మరో మంచి అవకాశం లభించింది. ఐపీఎల్ జట్టు గుజరాత్ టైటాన్స్‌కు అతను కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. హార్దిక్ పాండ్యా ముంబై ఇండియన్స్‌కు వెళ్లిపోవడంతో అతని స్థానంలో గిల్‌ను సారథిగా నియమిస్తున్నట్లు టైటాన్స్ మేనేజ్‌మెంట్ ప్రకటించింది. 'గిల్ తన కెరీర్‌లో మంచి ఎదుగుదలను చూపించాడు. గత రెండేళ్లుగా అతను అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాడు. అతనిలో మంచి నాయకత్వ లక్షణాలను కూడా టీమ్ మేనేజ్‌మెంట్ చూసింది. గిల్ నాయకత్వంలో మా జట్టు మరిన్ని మంచి ఫలితాలు సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని గుజరాత్ టీమ్ డైరెక్టర్ విక్రమ్ సోలంకి వెల్లడించారు. 24 ఏళ్ల గిల్ ఐపీఎల్ కెరీర్ 2018లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో మొదలైంది. నాలుగేళ్లు ఆడిన తర్వాత ఆ జట్టు



గిల్‌ను వదులుకుంది. 2022 సీజన్‌కు ముందు జరిగిన వేలంలో గుజరాత్ టైటాన్స్ గిల్‌ను సొంతం చేసుకుంది. తొలి సీజన్‌లో 16 మ్యాచ్‌లలో 483 పరుగులు చేసిన అతను ఫైనల్లో కీలకమైన 45 పరుగులు సాధించి జట్టు విజయంలో తనదైన పాత్ర పోషించాడు. అయితే తర్వాతి సీజన్‌లో గిల్ చెలరేగిపోయాడు. 3 సెంచరీలు సహా ఏకంగా 893 పరుగులు సాధించాడు. గత ఐదేళ్ల ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో గిల్ టాప్–5లో ఉన్నాడు. విలియమ్సన్, రషీద్, మిల్లర్, వేడ్, షమీలాంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో కూడిన జట్టును గిల్ నడిపించాల్సి ఉంది. గతంలో దేశవాళీ క్రికెట్‌లో దులీప్ ట్రోఫీ, దేవధర్ ట్రోఫీలలో కెప్టెన్‌గా వ్యవహరించిన అనుభవం గిల్‌కు ఉంది. మరో వైపు హార్దిక్ పాండ్యా 2015 వేలం సమయంలో తొలిసారి తన పేరు వచ్చినప్పుడు, ముంబై ఇండియన్స్ తనను రూ. 10 లక్షలకు సొంతం చేసుకున్న వీడియోను పోస్ట్ చేస్తూ 'ఎన్నో చిరస్మరణీయ జ్ఞాపకాలు కదలాడుతున్నాయి. ముంబై..వాంఖెడే..పల్టన్...చాలా బాగుంది. సొంతింటికి తిరిగి వచ్చినట్లుగా ఉంది' అని వ్యాఖ్య జోడించాడు.

ఆంధ్ర, హైదరాబాద్ ఓటమి

విజయ్‌హజారే ట్రోఫీ



జైపూర్: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్‌హజారే ట్రోఫీలో ఆంధ్ర, హైదరాబాద్ జట్లకు పరాజయం ఎదురైంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ 6 వికెట్ల తేడాతో హైదరాబాద్‌పై గెలుపొందింది. హైదరాబాద్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 271 పరుగులు చేసింది. రోహిత్ రాయుడు (130 బంతుల్లో 102; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీ సాధించాడు. ఛత్తీస్‌గఢ్ 48.1 ఓవర్లలో 4 వికెట్లకు 273 పరుగులు సాధించింది. రిషభ్ తివారి (65), సంజీత్ దేశాయ్ (47), అశుతోష్ సింగ్ (45 నాటౌట్), ఏక్‌నాథ్ (43 నాటౌట్) రాణించారు.

చండీగఢ్: మరో మ్యాచ్‌లో అస్సాం 5 వికెట్ల తేడాతో ఆంధ్రను ఓడించింది. ఆంధ్ర 31.5 ఓవర్లలో 112 పరుగులకే కుప్పకూలింది. అశ్విన్ హెబర్ (68 బంతుల్లో 50; 6 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించగా... హనుమ విహారి (23), రికీ భుయ్ (20) విఫలమయ్యారు. ఆంధ్ర ఇన్నింగ్స్‌లో ఐదుగురు 'డకౌట్' కావడం విశేషం. ఆకాశ్ సేన్ గుప్తా (5/20) ఐదు వికెట్లతో ఆంధ్రను దెబ్బ తీశాడు. అస్సాం 24.2 ఓవర్లలో 5 వికెట్లకు 114 పరుగులు చేసి విజయాన్నందుకుంది. కెరీర్‌లో తొలి వన్డే ఆడిన మాధవ్ రాయుడు (4/36) రాణించాడు.

డేవిస్ కప్ విజేత ఇటలీ



ఫైనల్లో ఆస్ట్రేలియాపై విజయం

మలాగా (స్పెయిన్): డేవిస్ కప్‌లో ఇటలీ జట్టు అత్యుత్తమ ప్రదర్శనతో అదరగొట్టింది. టోర్నీ చరిత్రలో రెండో సారి ఆ జట్టు విజేతగా నిలిచింది. 47 ఏళ్ల తర్వాత జట్టు ఖాతాలో ఈ టైటిల్ చేరడం విశేషం. టెన్నిస్‌లో వరల్డ్ కప్‌లాంటి డేవిస్ కప్‌లో చివరిసారిగా 1998లో ఫైనల్ చేరి ఓటమిపాలైన ఇటలీ... పాతికేళ్ల తర్వాత వచ్చిన అవకాశాన్ని వదులుకోలేదు. ఫైనల్లో ఇటలీ 2–0 తేడాతో 28 సార్లు చాంపియన్ ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. 2003లో ఆఖరి టైటిల్ సాధించిన ఆస్ట్రేలియా గత రెండు దశాబ్దాలుగా ప్రయత్నిస్తున్నా మరో ట్రోఫీని సొంతం చేసుకోలేకపోయింది. ఈ సారి కూడా ఆ జట్టు చివరి మెట్టుపై చతికిలపడింది. తొలి మ్యాచ్‌లో ఇటలీ ఆటగాడు మటియో ఆర్నాల్డి 7–5, 2–6, 6–4 స్కోరుతో అలెక్స్ పాపిరిన్‌పై విజయం సాధించాడు. 2 గంటల 27 నిమిషాల పాటు సాగిన ఈ హోరాహోరీ మ్యాచ్‌లో చివరకు 22 ఏళ్ల ఆర్నాల్డిదే పైచేయి అయింది. రెండో పోరులో వరల్డ్ నంబర్ 4 జనిక్ సిన్నర్ స్థాయికితగ్గ ఆటతీరుతో చెలరేగాడు. సిన్నర్ 6–3, 6–0తో అలెక్స్‌ను చిత్తు చేశాడు. 81 నిమిషాల్లోనే ముగిసిన ఆటలో సిన్నర్ 5 ఏస్‌లు కొట్టాడు. సెమీస్‌లో దిగ్గజ ఆటగాడు జొకోవిచ్‌ను ఓడించిన జోరులో ఉన్న సిన్నర్ తుది పోరులోనూ అదే ఫామ్‌ను కొనసాగించాడు.

సినిమా

రీల్స్



● 'యానిమల్' ప్రెస్‌మీట్‌లో ఓ దృశ్యం

జీవితాంతం ఆ బాధ ఉంటుంది

- రణ్‌బీర్ కపూర్

''కొన్నేళ్ల క్రితం మా నాన్నను(రిషీ కపూర్) కోల్పోయా. నా చిన్నప్పుడు నాన్న షూటింగ్స్‌తో బిజీగా ఉండటంతో సరైన సమయాన్ని గడపలేకపోయాను. నాన్నపై నాకు ప్రేమ, గౌరవం ఉంది. కానీ, మా మధ్య స్నేహబంధం లేదు. ఆయనతో ఫ్రెండ్లీగా ఉండి మరెన్నో విషయాలు పంచుకుని ఉంటే బాగుండేదనే బాధ నాకు ఉంది. నా జీవితాంతం ఆ బాధ ఉంటుంది'' అని హీరో రణ్‌బీర్ కపూర్ అన్నారు. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్, రష్మికా మందన్న జంటగా నటించిన చిత్రం 'యానిమల్'. తండ్రీకొడుకుల నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో అనిల్ కపూర్, బాబీ డియోల్, త్రిప్తి దిమ్రీ కీలక పాత్రల్లో నటించారు. భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా నిర్మించిన ఈ చిత్రం డిసెంబర్ 1న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. తెలుగులో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై నిర్మాత 'దిల్' రాజు రిలీజ్ చేస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రణ్‌బీర్ కపూర్ మాట్లాడుతూ–''తెలుగు ప్రేక్షకులంటే నాకెంతో అభిమానం. ఇక్కడ వాళ్లు చూపించే ప్రేమాభిమానం మరో స్థాయిలో ఉంటాయి. సినిమాలు మానేసి నా కుమార్తె రాహా కోసం నా సమయాన్ని కేటాయించాలని ఉంది. కాకపోతే నేనూ నా కలలను సాకారం చేసుకోవాలి కాబట్టి అలా చేయలేను (నవ్వుతూ)'' అన్నారు. సందీప్ రెడ్డి మాట్లాడుతూ–''మహేశ్‌బాబుకు 'యానిమల్' కథ చెప్పలేదు. 'డెవిల్' కథ చెప్పాను. కానీ మా కాంబో కుదరలేదు'' అన్నారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''అన్ని చిత్రాలకు మన దగ్గర టికెట్ రేట్స్ ఎలా ఉంటాయో 'యానిమల్'కి అలానే ఉంటాయి. ఆల్రెడీ అడ్వాన్స్ బుకింగ్ ఓపెన్ చేశాం. అద్భుతమైన స్పందన లభించింది. 'అర్జున్ రెడ్డి'ని మిస్ అయ్యాను. అప్పటి నుంచి సందీప్ సినిమా కోసం ప్రయత్నిస్తున్నాను. భూషణ్‌గారు నన్ను నమ్మి ఈ సినిమా మా చేతిలో పెట్టారు'' అన్నారు. ''ఈ చిత్రంలో నేను రణ్‌బీర్ తండ్రి పాత్ర చేశాను'' అన్నారు అనిల్ కపూర్. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయిన 'డీప్ ఫేక్ వీడియో' గురించి రష్మిక మాట్లాడుతూ – ''ఆ వీడియో చూసినప్పుడు ఇలాంటివాటికి రియాక్ట్ అయితే ఏమనుకుంటారో అనిపించింది. అయితే సినిమా ఇండస్ట్రీకి సంబంధించిన ప్రతి ఒక్కరూ సపోర్ట్ చేయడంతో.. తప్పకుండా స్పందించాలని నిర్ణయించుకున్నాను'' అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత భూషణ్ కుమార్, నటుడు బాబీ డియోల్ మాట్లాడారు.

దిస్ ఈజ్ లేడీ రోజ్..



● కల్యాణ్ రామ్, ఎల్నాజ్ నొరౌజి

కల్యాణ్ రామ్ హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం 'డెవిల్'. 'ది బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్' అనేది ట్యాగ్ లైన్. అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌పై స్వీయ దర్శకత్వంలో అభిషేక్ నామా నిర్మిస్తున్న ఈ చిత్రంలోని 'దిస్ ఈజ్ లేడీ రోజ్..' అంటూ సాగే రెండో పాటను సోమవారం విడుదల చేశారు. చిత్రసంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ స్వరపరచిన ఈ పాటకు శ్రీహర్ష ఇమాని సాహిత్యం అందించగా, రాజకుమారి పాడారు. ఈ పాటలో కల్యాణ్ రామ్‌తో కలిసి బాలీవుడ్ బ్యూటీ ఎల్నాజ్ నొరౌజీ కాలు కదిపారు. ''ప్రేక్షకులకు ఈ పాట ఓ కనువిందులా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్.

ఎలా సహాయపడగలను రాధిక

''చెప్పు రాధిక.. ఏం కావాల నీకు.. నేను నీకు ఎలా సహాయపడగలను రాధిక. ఈసారి నా కొంప ఎట్ల ముంచబోతున్నావు చెప్పు'' అని సిద్ధు చెప్పే డైలాగ్‌తో 'రాధిక..' పాట ఆరంభమవుతుంది. ''రాధిక ఎవరు.. నా పేరు రాధిక కాదు.. నా పేరు లిల్లీ'' అంటుంది అనుపమ. సిద్ధు జొన్నలగడ్డ, నేహా శెట్టి జంటగా రూపొందిన 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్న 'టిల్లు స్క్వేర్'లోని రెండో పాట 'రాధిక..'. మల్లిక్ రామ్ దర్శకత్వంలో శ్రీకరా స్టూడియోస్ సమర్పణలో ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సహనిర్మాతగా సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హీరో సిద్ధు జొన్నలగడ్డ సరసన అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. చిత్ర సంగీతదర్శకుడు రామ్ మిరియాల 'రాధిక..' పాటను స్వరపరచి, పాడారు. ఈ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించారు. 'రాధిక..' పూర్తి పాటను సోమవారం విడుదల చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 9న ఈ చిత్రం రిలీజ్ కానుంది.



● అనుపమా పరమేశ్వరన్, సిద్ధు జొన్నలగడ్డ

ఒక లెజెండ్ జన్మించాడు



● రిషబ్ శెట్టి

రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన 'కాంతార' (2022) చిత్రం పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి ప్రీక్వెల్‌గా 'కాంతారా చాప్టర్ 1' రూపొందుతోంది. రిషబ్ శెట్టి హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్నారు. 'కాంతార' మూవీని నిర్మించిన హోంబలే ఫిల్మ్స్ అధినేత విజయ్ కిరగందూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సోమవారం ఈ మూవీ ఫస్ట్ గ్లింప్స్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. 'కదంబాల పాలన సమయంలో ఒక లెజెండ్ జన్మించాడు' అంటూ పొడవాటి జుట్టు.. నెత్తుటి మరకలు.. చేతిలో త్రిశూలంతో ఆవేశంతో ఉన్న రిషబ్ లుక్‌ని విడుదల చేశారు. డిసెంబర్‌లో ఈ సినిమా చిత్రీకరణను పూర్తి చేయాలనుకుంటున్నారు. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళం, హిందీ.. ఇలా సుమారు ఏడు భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

ప్రేమ.. సందేశం



● అరుణ్ విక్కీరాలా

''కాలింగ్ సహస్ర' చిత్రంలో ట్విస్టులుంటాయి. సినిమా రిలీజ్ తర్వాత ఆ ట్విస్టుల్ని ప్రేక్షకులు రివీల్ చేసినా కూడా అందరూ థియేటర్‌కు వచ్చి చూస్తారు. ఇందులో మంచి ప్రేమకథ, అంతర్లీనంగా సందేశం ఉన్నాయి'' అని దర్శకుడు అరుణ్ విక్కీరాలా అన్నారు. 'సుడిగాలి' సుధీర్, డాలీషా జంటగా స్పందనా పల్లి, శివ బాలాజీ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కాలింగ్ సహస్ర'. విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కాటూరి నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 1న విడుదలవుతోంది. అరుణ్ విక్కీరాలా మాట్లాడుతూ– ''ఈ సినిమాలో కాలింగ్ అనేది ఒక కంపెనీ పేరు. సహస్ర అనేది హీరోయిన్ పాత్ర పేరు. ఇందులో సుధీర్ పాత్ర కొత్తగా ఉంటుంది. షూటింగ్‌లో డాలీషా చేసిన ఓ ఫైట్ సీక్వెన్స్ చూసి ఫైట్ మాస్టరే క్లాప్స్ కొట్టేశాడు. నా తర్వాతి సినిమా షూటింగ్ ప్రారంభమైంది'' అన్నారు.

నా బలం తెలుసుకున్నాను

- నవదీప్



● పంఖురి గిద్వానీ, నవదీప్

''జీవితంలో మనం ఎన్నో చేయాలనుకుంటాం. కానీ, జరిగేది వేరుగా ఉంటుంది. అలా నేను కూడా కొన్ని అనవసరమైన సినిమాలు చేశాను. లాక్‌డౌన్‌లో కొంత విరామం తీసుకుని నా బలం ఏంటో తెలుసుకున్నాను. నా ఆలోచనా విధానానికి, నేను చేయాలనుకుంటున్న సినిమాలకు 'లవ్ మౌళి' దగ్గరగా అనిపించింది'' అని నవదీప్ అన్నారు. అవనీంద్ర దర్శకత్వంలో నవదీప్, పంఖురి గిద్వానీ జంటగా నటించిన చిత్రం 'లవ్ మౌళి'. నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్‌తో కలిసి సీ స్పేస్ సంస్థ నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా అవనీంద్ర మాట్లాడుతూ– ''నా లైఫ్‌లో జరిగిన ప్రేమకు ఫలితమే ఈ సినిమా కథ. ఈ కథకి అందరూ కనెక్ట్ అవుతారు'' అన్నారు. ''ఈ చిత్రంలో ప్రేమ గురించి నిజాయితీగా చెప్పారు'' అన్నారు పంఖురి. ''ఈ మూవీకి సంగీతం, నేపథ్య సంగీతం అందించడం గొప్పగా అనిపించింది'' అన్నారు గోవింద్ వసంత. ''వేటూరిగారి కెరీర్‌లో 'గీతాంజలి' చిత్రంలా నా కెరీర్‌లో 'లవ్ మౌళి' మైలురాయిగా నిలుస్తుంది'' అని రచయిత అనంత్ శ్రీరామ్ అన్నారు.

యాడాడో తిరిగి నన్ను పట్టుకుంది!



● సుధీర్‌బాబు

'అందరూ పవర్ కోసం గన్ పట్టుకుంటారు.. కానీ, ఇది యాడాడో తిరిగి నన్ను పట్టుకుంది' అంటూ సుధీర్ బాబు చెప్పే డైలాగ్‌తో 'హరోం హర' సినిమా టీజర్ ప్రారంభమైంది. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుధీర్ బాబు, మాళవికా శర్మ జంటగా నటించిన చిత్రం 'హరోం హర'. సుమంత్ జి. నాయుడు నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ని పవర్ ఆఫ్ సుబ్రమణ్యం పేరుతో సోమవారం విడుదల చేశారు. తెలుగు టీజర్‌ని ప్రభాస్, మలయాళంలో మమ్ముట్టి, హిందీలో టైగర్ ష్రాఫ్, తమిళంలో విజయ్ సేతుపతి, కన్నడలో సుదీప్ లాంచ్ చేశారు. ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, కెమెరా: అరవింద్ విశ్వనాథన్.


దొంగ.. దేవుడు.. దెయ్యం..

వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'కూర్మ నాయకి'. కె. హర్షవర్ధన్ దర్శకత్వంలో కె. విజితా రావు నిర్మిస్తున్న ఈ సోషియో ఫ్యాంటసీ చిత్రం సోమవారం ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి లౌక్య సాయి కెమెరా స్విచ్ఛాన్ చేయగా, డీవీవీ దానయ్య క్లాప్ ఇచ్చారు. బెక్కం వేణుగోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. తిరువీర్, శ్రీను గవిరెడ్డి స్క్రిప్ట్ అందజేశారు. ''ఒక దొంగ, దేవుడు, దెయ్యం నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు కె. హర్షవర్ధన్. ''ఇది మా తొలి ప్రొడక్షన్'' అని చిత్ర సహనిర్మాతల్లో ఒకరైన మణికాంత్ అన్నారు. ''సరికొత్త కాన్సెప్ట్‌తో రాజీ పడకుండా ఈ సినిమాని నిర్మిస్తున్నాం'' అన్నారు విజితా రావు. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: రామ్, సహ నిర్మాతలు: స్నిగ్ధ మణికాంత్, పూజిత.



● కె. హర్షవర్ధన్, డీవీవీ దానయ్య

ఎవరూ ఊహించలేరు



● మహేశ్ రెడ్డి

''క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా 'అథర్వ' చిత్రం రూపొందింది. హత్య, దోపిడీ సన్నివేశాలతో ఈ కథను అల్లుకున్నాను. వాస్తవ ఘటనలకు కొంచెం ఫిక్షన్ జోడించాను'' అని దర్శకుడు మహేశ్ రెడ్డి అన్నారు. కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'అథర్వ'. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 1న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు మహేశ్ రెడ్డి మాట్లాడుతూ– ''నేనొకసారి క్లూస్ టీమ్ హెడ్ వెంకన్నగారి ఇంటర్వ్యూ చూశాను. క్రైమ్ కేసుని 70 శాతం వరకు క్లూస్ టీమ్ పరిష్కరిస్తుంటుంది. అంత ప్రాధాన్యం ఉన్న క్లూస్ టీమ్ గురించి చెప్పాలని 'అథర్వ' కథ రాశాను. కార్తీక్ రాజు క్లూస్ టీమ్‌లో పని చేస్తుంటాడు. హీరోయిన్ క్రైమ్ రిపోర్టర్. ఈ సినిమా సెకండ్ హాఫ్‌లో ప్రతి పది నిమిషాలకు ఓ ట్విస్ట్ ఉంటుంది. ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్‌ను ఎవరూ ఊహించలేరు'' అన్నారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
28-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)	
సెన్సెక్స్ ▽ 48	65,970
నిఫ్టీ ▽ 8	19,794

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,279	△	29
డోజోన్స్	35,299	▽	91
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,461	▽	28
డాక్స్	15,966	▽	63
షాంఘై	3,032	▽	9
నికాయ్	33,448	▽	178

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.59	84.26
£	బ్రిటన్ పౌండ్	102.86	106.22
€	యూరో	89.39	95.46
¥	జపాన్ ఎన్ (100)	55.58	54.87
AU$	ఆస్ట్రేలియా డాలర్	53.52	55.90
S$	సింగపూర్ డాలర్	54.31	56.78
SAR	సౌదీ రియాల్	21.28	22.90
UAE D	యూఏఈ దిర్హామ్	21.80	23.59
¥	చైనా యువాన్	10.53	12.61

పవన విద్యుత్‌పై సెంబర్‌కార్ప్ పెట్టుబడులు

428 మెగావాట్ల ఆస్తుల కొనుగోలు



న్యూఢిల్లీ: సింగపూర్‌కు చెందిన సెంబర్‌కార్ప్ ఇండస్ట్రీస్ భారత్‌తోపాటు చైనాలో 428 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవన విద్యుత్ ఆస్తులను కొనుగోలు చేసేందుకు ఒప్పందాలు చేసుకుంది. ఇందుకోసం రూ.1,247 కోట్లను ఇన్వెస్ట్ చేయనుంది. సెంబ్‌కార్ప్ భారత్‌లో 18 రాష్ట్రాల్లో కార్యకలాపాలు కలిగి ఉంది. తాజా కొనుగోలుతో సంస్థ నిర్వహణలోని పునరుత్పాదక ఇంధన ఆస్తులు 3.7 గిగావాట్ల సామర్థ్యానికి చేరాయి. ఇందులో 2.25 గిగావాట్ల పవనవిద్యుత్, 1.45 గిగావాట్ల సోలార్ ఆస్తులు ఉన్నాయి. లీప్ గ్రీన్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన 228 మెగావాట్ల పవన విద్యుత్ ఆస్తులను 70 మిలియన్ సింగపూర్ డాలర్లకు, క్వింజు యూనెంగ్‌కు చెందిన 200 మెగావాట్ల ఆస్తులను 130 సింగపూర్ డాలర్లకు కొనుగోలు చేయనున్నట్టు సెంబర్‌కార్ప్ ఇండస్ట్రీస్ తాజాగా ప్రకటించింది. దీంతో లీప్ గ్రీన్ ఎనర్జీకి మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్తాన్ రాష్ట్రాల్లో ఉన్న 228 మెగావాట్ల పవన విద్యుత్ ఆస్తులు సెంబర్ కార్ప్ సొంతం కానున్నాయి. భారత్‌లో వెక్టార్ గ్రీన్‌కు చెందిన 583 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఆస్తులను సైతం గతేడాది ఈ సంస్థ కొనుగోలు చేయడం గమనార్హం.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-11-2023	
విశాఖ	525-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
27-11-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	520-00
వరంగల్	522-00
రిటైల్ ధర	5.80

ఇక అదే రోజు సెటిల్‌మెంట్

స్టాక్ లావాదేవీల్లో వేగానికి శ్రీకారం • మార్చికల్లా అమలు: సెబీ చీఫ్ మాధవి




ముంబై: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ రానున్న(2024) మార్చికల్లా స్టాక్ ఎక్స్ఛేంజీలలో నిర్వహించే లావాదేవీల సెటిల్‌మెంట్‌ను అదే రోజు పూర్తిచేసేందుకు వీలు కల్పించనుంది. ఇప్పటికే లావాదేవీ చేపట్టిన ఒక్క రోజులోనే(టీప్లస్ 1) సెటిల్‌మెంట్ పూర్తవుతోంది. అయితే మార్చికల్లా లావాదేవీ నిర్వహించిన రోజే(టీప్లస్0) సెటిల్‌మెంట్‌కు తెరతీసే లక్ష్యంతో ఉన్నట్లు సెబీ చైర్‌పర్సన్ మాధవీ పురి బచ్ పేర్కొన్నారు. ఆపై మరో 12 నెలల్లోగా లావాదేవీ నమోదైన వెంటనే అప్పటికప్పుడు(ఇన్‌స్టంట్) సెటిల్‌మెంట్‌కు వీలు కల్పించాలని భావిస్తున్నట్లు తెలియజేశారు. వెరసి రియల్‌టైమ్ ప్రాతిపదికన లావాదేవీల పూర్తిని చేపట్టాలని ఆశిస్తున్నట్లు సెబీ బోర్డు సమావేశం తదుపరి విలేకరుల సమావేశంలో మాధవి వెల్లడించారు. స్టాక్ మార్కెట్ లావాదేవీల ఇన్‌స్టంట్ సెటిల్‌మెంట్ ఆలోచనపై మార్కెట్ మేకర్స్ నుంచి ఈ సందర్భంగా సలహాలు, సూచనలను ఆహ్వానిస్తున్నట్లు తెలియజేశారు. కొత్త సెటిల్‌మెంట్‌ను ప్రస్తుత సెటిల్‌మెంట్‌కు సమాంతరంగా అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

కొత్త సెటిల్‌మెంట్‌ను ఐచ్ఛికంగా ఎంపిక చేసుకోవచ్చని మాధవి తెలిపారు. అయితే కొన్ని ఎంపిక చేసిన భారీ ప్రొడక్టులకు మాత్రమే అది కూడా ఆప్షనల్‌గా అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. ఈ ఏడాది జనవరి నుంచి స్టాక్ మార్కెట్ లావాదేవీల సెటిల్‌మెంట్ గడువును టీప్లస్ 2 నుంచి టీప్లస్ 1కు తగ్గించిన సంగతి తెలిసిందే.

కార్ల ధరలకు రెక్కలు!

- జాబితాలో మారుతీ, ఎంఅండ్ఎం, టాటా మోటార్స్, ఆడి ఇండియా
- జనవరి నుంచి అమల్లోకి...



ముంబై: ద్రవ్యోల్బణం, కమోడిటీ ధరలు పెరగడంతో వ్యయ ఒత్తిళ్లు అధికమవుతున్నందున ఆటో కంపెనీలు తమ వాహన ధరలు పెంచేందుకు సిద్ధమయ్యాయి. మారుతీ సుజుకీ, మహీంద్రా–మహీంద్రా, ఆడి ఇండియా, టాటా మోటార్స్ అండ్ మెర్సిడస్ బెంజ్ సంస్థలు తమ కార్ల ధరల్ని వచ్చే ఏడాది జనవరి నుంచి పెంచుతున్నట్లు ప్రకటించాయి. నిర్వహణ, ముడి సరుకుల వ్యయాలు పెరిగిన నేపథ్యంలో ధరలు పెంచాలకుంటున్నామని మారుతీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు. అయితే ధరల పెంపు ఎంతమేర అనేది మాత్రం ఇంకా నిర్ణయించుకోలేదని, కొన్ని మోడళ్లపై ధరల పెంపు గణనీయంగా ఉండొచ్చన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీ వాహన ధరలు 2.4% మేర పెరిగాయి.

- జనవరి 1 నుంచి వాహన ధరలు పెంచుతామని మహీంద్రా అండ్ మహీంద్రా తెలిపింది. ధరల పెంపు ఎంతమేర ఉంటుందనేది త్వరలో ప్రకటిస్తామని పేర్కొంది.
- పెంపు జాబితాలో టాటా మోటార్స్ సైతం చేరింది. వచ్చే ఏడాది తొలి నెల నుంచి ప్యాసింజర్, ఎలక్ట్రిక్ వాహన ధరల్ని పెంచే యోచనలో ఉన్నట్లు కంపెనీ అధికారి ఒకరు తెలిపారు. ఎంతమేర అనేది మాత్రం వెల్లడించలేదు.
- జర్మనీ లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడి ఇండియా కూడా వచ్చే ఏడాది జనవరి నుంచి ధరలు పెంచేందుకు సమాయత్తమవుతోంది. సప్లై చైన్ సంబంధిత ఇన్‌పుట్, నిర్వహణ వ్యయాలు పెరిగిన నేపథ్యంలో వాహన ధరలను రెండు శాతం మేర పెంచుతున్నట్లు తెలిపింది. ''సంస్థతో పాటు డీలర్ల మనుగడ కోసం పెంపు నిర్ణయం తప్పలేదు. కస్టమర్లపై ధరల భారం వీలైనంత తక్కువగా ఉండేలా చూస్తాము'' అని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ దిల్లాన్ తెలిపారు.

జీడీపీ గణాంకాలే దిక్సూచి

- గ్లోబల్ ట్రెండ్‌కూ ప్రాధాన్యం
- ఎఫ్అండ్‌వో ముగింపు ఎఫెక్ట్
- మార్కెట్ల ట్రెండ్‌పై అంచనాలు



న్యూఢిల్లీ: ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లు ప్రధానంగా దేశ ఆర్థిక పురోగతి గణాంకాలపై ఆధారపడి కదిలే వీలుంది. ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికానికి స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) వివరాలు గురువారం(30న) వెల్లడికానున్నాయి. అక్టోబర్ నెలకు మౌలిక సదుపాయాల గణాంకాలు సైతం ఇదే రోజు విడుదలకానున్నాయి. గురునానక్ జయంతి సందర్భంగా సోమవారం మార్కెట్లకు సెలవుకావడంతో ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితంకానుంది. కాగా.. గురువారం నవంబర్ డెరివేటివ్స్ సిరీస్ గడువు ముగియనుంది. శుక్రవారం(డిసెంబర్ 1న) తయారీ రంగ పనితీరు వెల్లడించే నవంబర్ పీఎంఐ ఇండెక్స్ వివరాలు తెలియనున్నాయి. ఈ నేపథ్యంలో మార్కెట్లు ఆటుపోట్లను ఎదుర్కోవచ్చని విశ్లేషకులు అంచనా వేశారు. స్థూల ఆర్థిక గణాంకాలతోపాటు, విదేశీ మార్కెట్లలో నెలకొనే పరిస్థితులకు అనుగుణంగా ట్రెండ్ ఏర్పడే అవకాశమున్నట్లు పేర్కొంటున్నారు.

ఇతర అంశాలూ కీలకమే..


ఆరు ప్రధాన కరెన్సీలతో డాలరు మారకంతోపాటు.. దేశీయంగా రూపాయి కదలికలు సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా పేర్కొన్నారు. గత వారం డాలరుతో మారకంలో రూపాయి సరికొత్త కనిష్టం 83.38వరకూ నీరసించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ముడిచమురు ధరలు, యూఎస్ బాండ్ల ఈల్డ్స్‌కు సైతం ఇన్వెస్టర్లు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు మీనా తెలియజేశారు. నవంబర్ నెలకు వాహన విక్రయ గణాంకాలు వెల్లడికానున్న నేపథ్యంలో వారాంతాన ఆటో రంగ దిగ్గజాలు వెలుగులో నిలిచే వీలున్నట్లు మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ అర్వీందర్ సింగ్ నందా తెలియజేశారు. వీటికితోడు యూఎస్ జీడీపీ, యూఎస్ పీఎంఐ, చమురు నిల్వలు, యూరోజోన్ సీపీఐ తదితర గణాంకాలు కీలకంగా నిలవనున్నట్లు విశ్లేషించారు.

వడ్డీ రేట్ల ప్రభావం

గత వారం దేశీ స్టాక్ మార్కెట్లు స్వల్పంగా బలపడ్డాయి. హెచ్చుతగ్గుల మధ్య నికరంగా సెన్సెక్స్ 175 పాయింట్లు, నిఫ్టీ 63 పాయింట్లు చొప్పున పుంజుకున్నాయి. అయితే విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు) అమ్మకాలు లేదా పెట్టుబడులు ఈ వారం కొంతమేర ప్రభావం చూపనున్నట్లు మీనా పేర్కొన్నారు. యూఎస్‌లో అంచనాలకంటే అధికంగా ద్రవ్యోల్బణం తగ్గడంతో మార్కెట్లలో విశ్వాసం నెలకొననున్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఇది కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు యోచనను అడ్డుకోవచ్చని అభిప్రాయపడ్డారు. దీంతో పదేళ్ల ట్రెజరీ బాండ్ల ఈల్డ్స్ రెండు వారాల క్రితం నమోదైన 5 శాతం నుంచి 4.4 శాతానికి దిగివచ్చాయి. వెరసి దేశీ ఈక్విటీలలో ఎఫ్‌పీఐల అమ్మకాలు నెమ్మదించవచ్చని తెలియజేశారు.

భారత్ వృద్ధి స్పీడ్ 6.4 శాతం

2023-24 అంచనాను 0.4 % పెంచిన ఎస్‌అండ్‌పీ



కొన్ని సంస్థల అంచనా ఇలా..

సంస్థ	2023-24 (వృద్ధి %లో)
ఆర్‌బీఐ	6.5
ప్రపంచబ్యాంక్	6.3
ఐఎంఎఫ్	6.3
ఫిచ్	6.3
ఏడీబీ	6.3
ఓఈసీడీ	6.3
యూబీఎస్	6.3
గోల్డ్‌మన్ శాక్స్	6.2
ఇండియా రేటింగ్స్	6.2
మూడీస్	6.1

న్యూఢిల్లీ: భారత్ 2023–24 స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి అంచనాలను ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ భారీగా 40 బేసిస్ పాయింట్లు (0.4%) పెంచింది. దీనితో ఈ అంచనా 6 శాతం నుంచి 6.4 శాతానికి పెరిగింది. అధిక ఆహార ద్రవ్యోల్బణం, బలహీన ఎగుమతి పరిస్థితులు ఉన్నప్పటికీ దేశీయ ఆర్థిక క్రియాశీలత, డిమాండ్ పటిష్టంగా ఉన్నాయని తన తాజా ఎకనమిక్ అవుట్‌లుక్ ఫర్ ఆసియా పసిఫిక్ నివేదికలో పేర్కొంది. తమ అంచనాల అప్‌గ్రేడ్‌కు ఈ అంశాలు కారణాలుగా వివరించింది. అయితే 2024–25 అంచనాలను మాత్రం క్రితం 6.9 శాతం నుంచి 6.4 శాతానికి తగ్గిస్తున్నట్లు ఎస్‌అండ్‌పీ పేర్కొంది. అధిక బేస్ ఎఫెక్ట్, గ్లోబల్ వృద్ధిపై బలహీన అంచనాలు, వడ్డీరేట్ల పెంపు ప్రతికూలతలు వచ్చే ఆర్థిక సంవత్సరం వృద్ధి తీరుపై ప్రభావం చూపుతాయని అభిప్రాయపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రపంచబ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్), ఏడీబీ, ఫిచ్ అంచనాలకన్నా (6.3 శాతం) ఎస్‌అండ్‌పీ తాజా అంచనాలు కొంచెం అధికంగా ఉండడం గమనార్హం. 2023 మార్చితో ముగిసిన 2022–23 ఆర్థిక సంవత్సరంలో భారత్ వృద్ధి 7.2 శాతంగా నమోదయిన సంగతి తెలిసిందే. కాగా, భారత్‌తో పాటు ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పైన్స్‌లో దేశీయ డిమాండ్ పటిష్టంగా ఉందని ఎస్‌అండ్‌పీ నివేదిక పేర్కొంది.

మేలెంచినా కీడెంచుతారా!?

రైతులకు మంచి చేసే ప్రతిపాదనలపైనా రామోజీ విషం

- ఆర్థికశాఖ అభ్యంతరాలకూ వక్రభాష్యమా?
- ఫైల్ ఇంకా ఆర్థిక శాఖ పరిశీలనలోనే ఉంది కదా..
- అయినా సీఎంఓ ఒత్తిడితో ఆమోదం అని పచ్చి అబద్ధాన్ని అచ్చేస్తారా?
- ఇందులో వైఎస్సార్‌సీపీ నేతలకు ఎలా లబ్ధి చేకూరుతుంది?
- పేదల ఇళ్లకు 'మినహాయింపు'లను ఉచిత ఇసుకతో ఎలా పోలుస్తారు?
- ఉచిత ఇసుక విధానంలో ఎవరికి ఉచితంగా ఇసుక అందింది?
- ఉచితం పేరుతో బాబు హయాంలో రియల్టర్లు, కమర్షియల్ సంస్థలకు మేలు చేశారు
- పేదలు, రైతులకు మేలు చేసే అంశంపై 'ఈనాడు' రాజకీయం
- 'దోపిడీకి రాజమార్గం' పేరుతో మట్టి తవ్వకాలపై 'ఈనాడు' దుర్మార్గపు రాతలు


దోపిడీకి రాజమార్గం
- అక్రమార్కులకు సహకరించేలా ఖనిజ తవ్వకాలకు పలు రుసుముల మినహాయింపు
- వైకాపా నేతలకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వ నిర్ణయం
- గనుల శాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి ప్రతిపాదనను తొలుత వ్యతిరేకించిన ఆర్థిక శాఖ
- ఒత్తిడి తెచ్చి మరీ ఆమోదముద్ర వేయించిన సీఎంఓ

ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి : కుక్క తోక వంకరలాగే ఈనాడు రాతల్లో కూడా అంతకు మించి వంకర్లు ఉంటాయి. ప్రభుత్వానికి సంబంధించిన ఏ విషయాన్నయినా వంకర బుద్ధితో చూడడమే ఇందుకు కారణం. పేదలకు మేలు చేసేందుకు.. వారు కట్టుకునే ఇళ్లను మెరక చేసుకునేందుకు, రైతుల పొలాలకు మట్టి తోలుకునేందుకు మట్టి తరలింపులో మినహాయింపులు ఇవ్వడాన్ని సైతం తప్పన్నట్లు గుండెలు బాదుకుంటోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంచి చేసినా తప్పేనంటూ ఆ పత్రికాధిపతి రామోజీరావు వితండవాద కథనాలను ప్రచురించటం పరిపాటిగా మారింది. ప్రజలకు ఉపయోగపడేలా ఏదైనా మినహాయింపు ఇస్తే తప్పు.. ఇవ్వకపోయినా, ఏం చేయకపోయినా తప్పేనంటూ రెండు నాల్కల ధోరణితో క్షుద్ర రాతలు రాయడం ఆయనకు నిత్యకృత్యంగా మారింది. వైఎస్ జగన్ ప్రభుత్వంపై ఎలాగైనా బురద జల్లి ప్రజల్లో అపోహలు సృష్టించడం, వారికి మేలు జరుగుతుంటే దాన్ని వక్రీకరించి ఏదో జరిగిపోతోందని గగ్గోలు పెట్టడం.. తద్వారా చంద్రబాబును గద్దెనెక్కించాలన్నది ఆయన అసలు లక్ష్యం. ఇందులో భాగమే తాజాగా సోమవారం 'దోపిడీకి రాజమార్గం' అంటూ మట్టి తవ్వకాలపై అతిగా ఊహించుకుంటూ ఎప్పటిలాగే అభూతకల్పనలతో ఓ కథనాన్ని చేతికొచ్చింది ఇష్టానుసారం రాసిపారేసి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు నానా ప్రయాసపడ్డారు. ఈ క్షుద్ర రాతలపై వాస్తవాల 'ఫ్యాక్ట్‌చెక్' ఏమిటంటే..

ఆమోదం పొందని ఫైలుపై సీఎంఓ ఒత్తిడా?

రాష్ట్రంలో పేదలు నిర్మించుకునే ఇళ్లు, రైతుల పొలాలను మెరక చేసుకునేందుకు వీలుగా వారిపై ఎలాంటి భారం లేకుండా చిన్నతరహా ఖనిజాల వినియోగంపై మినహాయింపులకు గనుల శాఖ సదుద్దేశ్యంతో ప్రతిపాదించింది. కానీ, అక్రమార్కులకు సహకరించేలా ఖనిజ తవ్వకాలకు పలు రుసుముల మినహాయింపులు ఇస్తున్నట్లు రామోజీ పెడబొబ్బలు పెట్టారు. వాస్తవానికి ఈ ప్రతిపాదనలు ఇంకా ఆమోదం పొందలేదు. వాటిపై ఆర్థిక శాఖ నుంచి వచ్చిన అభ్యంతరాలకు గనుల శాఖ వివరణ సమర్పించింది. ఆ విషయం ఇంకా ఆర్థిక శాఖ పరిశీలనలోనే ఉంది. ఇంకా ఆమోదం పొందని ఫైలుపై సీఎంఓ ఎలా ఒత్తిడి తెచ్చిందో, దానికి ఆమోదముద్ర ఎవరు వేశారో రామోజీరావుకే తెలియాలి. అయినా.. పేదల ఇళ్లకు 'మినహాయింపు'లను ఉచిత ఇసుకతో ఎలా పోలుస్తారు రామోజీ? అసలు మీ బాబు హయాంలో ఉచితంగా ఇసుక ఎవరికి అందింది? ఆ ముసుగులో చంద్రబాబు బినామీలు, రియల్టర్లు, కమర్షియల్ సంస్థలు, టీడీపీ నేతలకే ఆయన దోచిపెట్టిన బాగోతాలు జగమెరిగినవే కదా..!

పేదలకు మేలు జరుగుతుంది..

నిజానికి.. రాష్ట్రవ్యాప్తంగా పేదలు ఒకొక్కరు 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించుకుంటున్నారు. వీరు తమ సొంత ఇంటి కలను నిజం చేసుకోవాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ లక్షలాది మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. వీరంతా ఇంటిని నిర్మించుకునేందుకు కంకర, గ్రావెల్ వంటి చిన్నతరహా ఖనిజాలను వినియోగించాల్సి ఉంటుంది. దీనిపైన గనుల శాఖ వసూలు చేస్తున్న సీనరేజీ, కన్సిడరేషన్ రుసుం, డీఎంఎఫ్, మెరిట్ వంటి వసూళ్లతో పేదలపై ఆర్థికంగా భారం పడుతుంది. దీని మినహాయింపునకు ప్రభుత్వం అంగీకరిస్తే పేదలకు మేలు జరుగుతుంది. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశాల్లో చర్చించిన తర్వాతే ఈ రుసుం మినహాయింపు కోసం గనుల శాఖ ప్రభుత్వ ఆమోదానికి ప్రతిపాదనలు పంపింది.

ఏటా రైతులు చెరువు మట్టిని వాడుకుంటారు..

ప్రతి ఖరీఫ్ సీజన్‌కు ముందు వేసవిలో రైతులు తమ పొలాల్లో మట్టిని సారవంతం చేసుకోవడం, లోతట్టు భూమిని మెరక చేసుకునేందుకు చెరువు మట్టిని సమీపంలోని పొలాల నుంచి తెచ్చుకుని వాడుకుంటారు. దీనివల్ల తిరిగి పంట వేసుకునే సమయానికి పొలం అనువుగా తయారై మంచి దిగుబడి లభిస్తుంది. తద్వారా రైతు కష్టానికి ఫలితం అందుతుంది. దీనికోసం వినియోగించే మట్టిపై కూడా గనుల శాఖ విధించే రుసుమునకు మినహాయింపులిస్తే రైతులపై ఆర్థిక భారం ఉండదు. ఈ సదుద్దేశంతోనే గనుల శాఖ వ్యవసాయ వినియోగం నిమిత్తం వాడే మట్టిపై మినహాయింపుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. వాస్తవాలిలా ఉంటే.. ఒత్తిడి తెచ్చి మరీ సీఎంఓ ఆమోదముద్ర వేయించుకుందని ఈనాడు అడ్డగోలుగా ఓ కథనాన్ని అచ్చేసింది. ఇలా తప్పుడు కథనాలు ప్రచురించిన ఈనాడు పత్రికపై ఇప్పటికే ప్రభుత్వం పలు పరువు నష్టం దావాలు దాఖలు చేసింది. అయినా సరే.. రామోజీది వంకర బుద్ధి కదా.. వంకర రాతలు కొనసాగిస్తూనే ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు ఎలా లబ్ధి కలుగుతుంది?

ఇక ఈ ప్రతిపాదనల్లో వైఎస్సార్‌సీపీ నేతలకు ఎలా లబ్ధి చేకూరుతుందో రామోజీరావు చెప్పాలి. పేదలు, రైతులకు మేలు చేసేలా నిర్ణయం తీసుకుంటే దానిని రాజకీయ పార్టీలకు ఎలా ఆపాదిస్తారని సాధారణ ప్రజలు మండిపడుతున్నారు. నిజానికి.. ఈ మినహాయింపుల్లేని సమయంలోనూ వీటి ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.70 కోట్ల వరకు మాత్రమే ఆదాయం వస్తుంది. అయినా సరే.. ఈ మినహాయింపులతో ఖజానాకు భారీగా నష్టం జరుగుతుందని రాద్ధాంతం చేయడం చూస్తుంటే పేదలు, రైతులపట్ల రామోజీరావుకు, చంద్రబాబుకు ఉన్న ఏహ్య భావానికి అద్దంపడుతోంది.

ఆర్థిక శాఖకు పూర్తి వివరణ ఇచ్చాం



పేదల ఇళ్లు, రైతుల పొలాలు మెరక చేసుకునేందుకు తరలించే మట్టి విషయంలో మినహాయింపులకు సంబంధించి ఆర్థిక శాఖ సందేహాలు, పరిశీలనలపై పూర్తి వివరణ ఇచ్చాం. గనుల శాఖలో ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలవల్ల ప్రతి జిల్లాకు విజిలెన్స్ స్క్వాడ్ తనిఖీలు, టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదులను స్వీకరిస్తున్నాం. వాటిపై తక్షణ చర్యల ద్వారా మైనింగ్ అక్రమాలను ఎప్పటికప్పుడు అరికడుతున్నాం. పేదలు, రైతులకు ఇచ్చిన ఈ మినహాయింపులను ఎవరైనా దుర్వినియోగం చేస్తే వారిపై కూడా చర్యలు ఉంటాయి. ఈ మినహాయింపులవల్ల మైనింగ్ రెవెన్యూలో తగ్గుదల చాలా పరిమితంగా ఉంటుంది. అక్రమాలకు ఆస్కారంలేదు కాబట్టి ఆర్థికశాఖ నుంచి ఆమోదం లభిస్తుందని భావిస్తున్నాం. ఈ ఫైలుపై గనుల శాఖ పంపిన వివరణను ఆర్థిక శాఖ పరిశీలిస్తోంది. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఈ ఫైలుకు ఎలాంటి ఆమోదం లభించలేదు. అయినా తప్పుడు సమాచారంతో అసత్యాలను పోగేసి ఈనాడు వార్తలు రాయడం దారుణం.

– వీజీ వెంకటరెడ్డి, డైరెక్టర్, గనుల శాఖ

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



అంబేడ్కర్ స్మృతివనం చరిత్రాత్మకం

విజయవాడ స్వరాజ్ మైదానంలో అంబేడ్కర్ స్మృతివనం నిర్మాణ పనులపై సీఎం వైఎస్ జగన్ సమీక్ష

సాక్షి, అమరావతి: ప్రజల మధ్య ఐక్యతను, సుహృద్భావ వాతావరణాన్ని, సామరస్యాన్ని పెంపొందించడంలో అంబేడ్కర్ స్మృతివనం కీలకపాత్ర పోషిస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్ఘాటించారు. స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ (సామాజిక న్యాయానికి చిహ్నం) కాన్సెప్ట్‌గా అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ఏర్పాటుచేస్తున్నామన్నారు. విజయవాడ స్వరాజ్య మైదానంలో జరుగుతున్న అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం నిర్మాణ పనులపై క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. స్మృతివనం, విగ్రహం ప్రారంభించే నాటికి ఏ ఒక్క పని కూడా పెండింగ్‌లో ఉండకూడదని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసే విషయంలో అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అవి..

- ➢ అంబేడ్కర్ స్మృతివనంలో కన్వెన్షన్ సెంటర్ పనులు కూడా పూర్తికావాలి. ఇందులో పక్కాగా మౌలిక సదుపాయాలు కల్పించాలి. దీని నిర్వహణను సమర్థవంతంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.
- ➢ స్మృతివనం ప్రాంగణమంతా పచ్చదనం ఉట్టిపడేలా మంచి ఉద్యానవనాన్ని తీర్చిదిద్దాలి.
- ➢ నడకదారి పొడవునా గ్రీనరీ ఉండేలా చూడాలి.
- ➢ ఈ పనులన్నింటిపైనా నిరంతర పర్యవేక్షణ ఉండాలి.
- ➢ విగ్రహం, స్మృతివనం ప్రారంభించే నాటికి ఏ ఒక్క పని కూడా పెండింగ్ లేకుండా నిర్దేశించుకున్న గడువులోగా కచ్చితంగా పూర్తిచేయాలి.

జనవరి 15 నాటికి పనులు పూర్తిచేస్తాం

అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనాన్ని జనవరి 24న ప్రారంభించేలా ఏర్పాట్లుచేస్తున్నామని, అన్ని పనులను జనవరి 15 నాటికి పూర్తిచేస్తామని సీఎం వైఎస్ జగన్‌కు అధికారులు తెలిపారు. సమీక్ష సందర్భంగా పనుల పురోగతిని అధికారులు వివరించారు. స్మృతివనంలో 81 అడుగుల ఎత్తయిన పీఠంపై 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఉంటుందన్నారు. దీంతోపాటు విజయవాడ కృష్ణలంక ప్రాంతంలో కృష్ణా నదికి నిర్మించిన రక్షణ గోడ పొడవునా 1.2 కిలోమీటర్ల మేర సుందరీకరణ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దానికి ఆనుకుని పార్కు, వాకింగ్ ట్రాక్ పనులు చురుగ్గా జరుగుతున్నాయని కూడా అధికారులు వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి (దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ వై. శ్రీలక్ష్మి, ఏపీఐఐసీ ఎండీ ప్రవీణ్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

స్మృతివనం పనులు పరిశీలించిన మంత్రులు

సమీక్ష సమావేశానంతరం అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం పనులను ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జునతోపాటు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు, ఇతర అధికారులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాల స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని, రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషిచేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో సామాజిక అంతరాలను తొలగించి సమ సమాజ స్థాపనకు కృషిచేస్తున్నారన్నారు. మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు సీఎం జగన్ గొప్ప సంకల్పంతో స్మృతివనాన్ని నిర్మిస్తున్నారన్నారు. రూ.400 కోట్లతో అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం రూపుదిద్దుకుంటోందన్నారు. చివరి దశలో ఉన్న పనులను సత్వరం పూర్తిచేసి ప్రారంభోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా...

ప్రభుత్వ పాఠశాలలు చాలా బాగున్నాయి

'నాడు–నేడు' స్కూళ్లను చూసి ముగ్ధులైన ప్రపంచ బ్యాంక్ బృందం



పేరెంట్స్ కమిటీ సభ్యులతో బ్యాంకు ప్రతినిధులు

సాక్షి, అమరావతి: మనబడి నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దిన తీరును చూసి చాలా బాగున్నాయని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు ముగ్ధులయ్యారు. నాడు–నేడు అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా చూసేందుకు సోమవారం సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు నేతృత్వంలో విజయవాడలోని ఏపీజే అబ్దుల్ కలాం ఉర్దూ మున్సిపల్ హైస్కూల్ (అరండల్‌పేట), వంగవీటి మోహనరంగా మున్సిపల్ ప్రాథమిక పాఠశాల(కృష్ణలంక)ను ఎనిమిది మంది గల ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు నాడు–నేడు పనుల్లో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుల భాగస్వామ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల తల్లిదండ్రుల కమిటీల సభ్యులు ఇచ్చిన సమాధానాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌తో సమావేశమయ్యారు.

ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రానికి జాతీయ పురస్కారం



అవార్డుతో వీరయ్య, ప్రశాంతి

కడప అగ్రికల్చర్: వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడప నగర శివార్లలోని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)కు విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా చిరుధాన్యాలను ప్రోత్సహిస్తున్నందుకు జాతీయ స్థాయి పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌లో న్యూట్రీ హబ్ (భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ) సోమవారం నిర్వహించిన 'అంతర్జాతీయ న్యూట్రీ– సిరియల్స్ సదస్సు–5'లో అవార్డును అందజేసింది. న్యూఢిల్లీకి చెందిన భారత వ్యవసాయ పరిశోధన మండలి సహజ వనరుల యాజమాన్యం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సురేష్‌కుమార్ చౌదరి చేతుల మీదుగా ఊటుకూరు కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, సామాజిక విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంతి ఈ పురస్కారం స్వీకరించారు.

నేటి నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు

సాక్షి, అమరావతి: సమ్మేటివ్ అసెస్‌మెంట్ -1లో ప్రధాన పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 24, 25 తేదీల్లో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు కాంపోజిట్ పేపర్–1, 2 పరీక్షలు పూర్తిచేయగా, మంగళవారం ఒకటి నుంచి 10వ తరగతుల వరకు తెలుగు పరీక్ష నిర్వహించనున్నారు. షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 8వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు 6, 8, 10 తరగతులకు, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు 7, 9 తరగతులకు పరీక్షలు ఉంటాయి. ప్రాథమిక స్థాయిలో 1 నుంచి 5 తరగతులకు డిసెంబర్ 5వ తేదీ వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

వ్యోమగామినవుతా

నాసా ఐఏఎస్‌పీ కోర్సు పూర్తి చేసుకున్న కాలువ జోషితారెడ్డి

- ఏపీ ప్రభుత్వ సాయంతో నా కల నెరవేర్చుకున్నా
- సీఎం జగన్ రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించారు
- ఆయనకు రుణపడి ఉంటా



నాసా సెంటర్‌లో జాతీయ పతాకంతో జోషిత

తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో తిరుపతికి చెందిన ఓ విద్యార్థిని వ్యోమగామి కావాలన్న తన కలను నెరవేర్చుకునే దిశగా ఓ అడుగు ముందుకేసింది. 'నాసా' అందిస్తున్న ఐఏఎస్‌పీ కోర్సును విజయవంతంగా పూర్తి చేసింది. ఔత్సాహిక విద్యార్థులను ప్రోత్సహించేందుకు అమెరికాలోని ఎయిర్ స్పేస్ అండ్ రాకెట్ సెంటర్, నాసా సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నవంబర్ నెలలో ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రాం(ఐఏఎస్‌పీ) అందిస్తోంది. విద్యార్థులకు పది రోజులపాటు వ్యోమగామికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు శిక్షణ ఇస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా 50 మందికే ఈ అవకాశం లభిస్తుంది. ఈ ఏడాది భారత్ నుంచి కేవలం నలుగురే ఎంపికయ్యారు. ఇందులో తిరుపతిలోని మోహన్‌బాబు యూనివర్సిటీలో బీటెక్ ఈసీఈ సెకండియర్ చదువుతున్న కాలువ జోషితారెడ్డికి అవకాశం దక్కింది. కానీ తగినంత ఆర్థిక స్థోమత లేకపోవడంతో.. ఎంపీ మిథున్‌రెడ్డి ద్వారా వైఎస్ జగన్ ప్రభుత్వం దృష్టికి తన సమస్యను తీసుకెళ్లింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి.. రూ.25 లక్షల ఆర్థిక సాయం చేయడంతో జోషితా అమెరికా వెళ్లింది. ఈనెల 11 నుంచి ప్రారంభమైన ఐఏఎస్‌పీ శిక్షణను దిగ్విజయంగా పూర్తి చేసుకుంది. నాసా నుంచి ధ్రువపత్రంతో పాటు శిక్షణలో ప్రతిభ కనబరిచినందుకు యూఎస్ స్పేస్ అండ్ రాకెట్ సెంటర్ ప్రతినిధుల నుంచి బెస్ట్ ట్రైనర్ అవార్డు కూడా అందుకుంది. అమెరికా నుంచి తిరుపతికి వచ్చిన ఆమె ఆదివారం తల్లి శ్రీలతా రెడ్డితో కలసి 'సాక్షి'తో మాట్లాడారు.

సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటా

'నాకు చిన్న వయసు నుంచి వ్యోమగామి కావాలని కోరిక ఉంది. అందుకు సంబంధించిన వీడియోలు, ఆర్టికల్స్ చదువుతూ ఉండేదాన్ని. యూఎస్ స్పేస్ సెంటర్, నాసా ఏటా ప్రపంచవ్యాప్తంగా 50 మందిని ఐఏఎస్‌పీ ప్రోగ్రామ్‌కు ఎంపిక చేస్తుందని తెలియడంతో దరఖాస్తు చేశాను. అన్ని ఇంటర్వ్యూల్లో సెలెక్ట్ అయ్యాను. కానీ తగినంత ఆర్థిక స్థోమత లేకపోవడంతో అమ్మతో పాటు స్థానిక నాయకుడు ప్రతాప్‌రెడ్డి సహకారంతో ఎంపీ మిథున్ రెడ్డి దృష్టికి నా సమస్య తీసుకెళ్లాను. ఆ తర్వాత నాకు సీఎం జగన్ రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించారు. దీంతో అమెరికా స్పేస్ సెంటర్‌లో శిక్షణ పూర్తి చేశాను. శిక్షణ పూర్తిగా వ్యోమగాములు, శాస్త్రవేత్తల పర్యవేక్షణలో జరిగింది. ఇందులో ముఖ్యంగా పైలెట్ డ్రైవింగ్, మూన్ గ్రావిటీ, స్కూబా డైవింగ్, మల్టీయాక్సిస్ చైర్, స్పేస్ రిలేటెడ్ వర్క్‌షాప్ తదితరాలపై శిక్షణలిచ్చారు. ఈ అరుదైన అవకాశం కల్పించిన జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటా. భవిష్యత్‌లో వ్యోమగామిగా ప్రపంచానికి సేవలందించాలని ఉంది' అని జోషిత చెప్పారు.

ప్రభుత్వ సాయం మరువలేనిది..

జోషితా తల్లి శ్రీలతారెడ్డి మాట్లాడుతూ.. 'మా స్వస్థలం అన్నమయ్య జిల్లా కలికిరి. భర్త లేకున్నా.. పిల్లల చదువు కోసం తిరుపతిలో ఉంటున్నాం. చిన్నప్పటి నుంచి జోషితకు స్పేస్‌పై ఆసక్తిగా ఉండడంతో ప్రోత్సహించాను. నాసా ఐఏఎస్‌పీ ప్రోగ్రామ్‌కు పాప ఎంపికైన విషయం తెలియగానే.. ఖర్చు విషయాన్ని ఎంపీ మిథున్‌రెడ్డి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశాం. ఆ వెంటనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మనస్సుతో రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఆయన అందించిన సాయం మరువలేనిది. చదువులను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం' అని చెప్పారు.

రక్షణ రంగంలో తిరుగులేని శక్తిగా భారత్

- 2047 నాటికి ప్రపంచంలో మనమే నంబర్‌వన్
- స్టార్టప్స్, పరిశ్రమల స్థాపనలో ముందున్న యువత
- రక్షణ శాఖ శాస్త్ర, సాంకేతిక సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రక్షణ రంగంలో తిరుగులేని శక్తిగా భారత్ ఎదిగిందని డీఆర్‌డీవో మాజీ చైర్మన్, రక్షణ శాఖ శాస్త్ర, సాంకేతిక సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి చెప్పారు. అంతరిక్ష, రక్షణ రంగాల్లో అవసరమైన యంత్రాలు, పరికరాలను 90 శాతానికి పైగా దేశీయంగానే తయారు చేసుకుంటున్నామని చెప్పారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆంధ్రప్రదేశ్ శాఖ, మాలక్ష్మి గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో యార్లగడ్డ శ్రీరాములు స్మారక ఉపన్యాస సదస్సు సోమవారం విజయవాడలో జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఒకేసారి ఐదు మిస్సైళ్ల రూపకల్పనకు నాంది పలికితే.. చాలా దేశాలు భారత్‌ను తక్కువగా చూశాయని చెప్పారు. కానీ తక్కువ సమయంలోనే మిస్సైళ్లను విజయవంతంగా ప్రయోగించడంతో ప్రపంచ దేశాలు నివ్వెరపోయాయన్నారు. ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలకు సైతం రక్షణ పరికరాలను సరఫరా చేయడంతో పాటు సాంకేతిక సహకారం అందించే స్థాయికి భారత్ ఎదిగిందన్నారు. గతంలో రక్షణ రంగం కోసం పనిచేసే పరిశ్రమలు దేశంలో 100కు మించి లేవన్నారు. పరిశోధనలు చేసే విద్యా సంస్థలు కూడా మూడే ఉండేవన్నారు. కానీ మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వల్ల ఇప్పుడు దాదాపు 18 వేల పరిశ్రమలు సహకారం అందిస్తున్నాయని.. 500కుపైగా విద్యా సంస్థలు ప్రయోగాలు చేస్తున్నాయని తెలిపారు. రక్షణ దిగుమతులు పూర్తిగా తగ్గిపోయాయని, గతేడాది రూ.16 వేల కోట్ల ఎగుమతులు చేసినట్టు వివరించారు. జలాంతర్గాములు, తుపాకులు, యుద్ధ విమానాలు, విమాన వాహక నౌకలు, రాడార్ల తయారీలో ప్రపంచంలోనే నాలుగో దేశంగా భారత్ నిలిచిందని.. 2047 నాటికి మొదటి స్థానంలో నిలవడం ఖాయమన్నారు.

చిన్న వయసులోనే పరిశ్రమలకు అధిపతులు..

అంతర్జాతీయ రక్షణ విపణిలో భారత్ ప్రధాన శక్తిగా ఎదిగేందుకు నిరంతర పరిశోధన, అభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషిస్తోందని డాక్టర్ సతీష్‌రెడ్డి చెప్పారు. ఒకప్పుడు దేశంలోని ప్రతిభావంతులు, ఐఐటీ విద్యార్థులు 85 శాతం మంది విదేశాలకు వలసపోతే, ఇప్పుడు 80 శాతం మంది దేశీయంగానే పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రతిభావంతుల సగటు వయసు 28 సంవత్సరాలుగా ఉందన్నారు. అంతకంటే తక్కువ వయసులోనే స్టార్టప్స్ పెట్టి.. రూ.వందల కోట్ల పరిశ్రమలకు అధిపతులైన వారున్నారని వివరించారు. 2016 నాటికి దేశంలో 416 స్టార్టప్ కంపెనీలుంటే, ఇప్పుడు ఆ సంఖ్య లక్షకు పెరిగిందన్నారు. కోవిడ్ ప్రతికూల పరిస్థితుల్లో కేవలం 4 నెలల్లో 30 వేలకు పైగా ఆధునిక వెంటిలేటర్లు తయారు చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ సీపీ శ్రీరామ్, కార్యదర్శి డాక్టర్ ఎం.ఎల్.ఎస్.దేవకుమార్, మాలక్ష్మి గ్రూప్ అధినేత యార్లగడ్డ హరిశ్చంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో డాక్టర్ సతీష్‌రెడ్డి



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): కేంద్ర రక్షణ శాఖ శాస్త్ర, సాంకేతిక సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి సోమవారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనమివ్వగా.. ఆలయ ఈవో కెఎస్.రామారావు ప్రసాదాలను అందజేశారు.

డి–ఫార్మసీ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

- రేపటి నుంచి ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు
- 30 నుంచి ఆప్షన్ల ఎంపిక
- డిసెంబర్ 4న తుది సీట్లు కేటాయింపు
- సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో డి–ఫార్మసీ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను సాంకేతిక విద్యా శాఖ కమిషనర్, అడ్మిషన్ల కన్వీనర్ చదలవాడ నాగరాణి సోమవారం విడుదల చేశారు. ఇంటర్మీడియెట్ అర్హతతో రెండేళ్ల డిప్లొమా ఇన్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థులు ఈ నెల 29 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి, ధ్రువీకరణపత్రాల పరిశీలనకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ నెల 30 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు ఆప్షన్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. డిసెంబర్ 4న తుది సీట్లు కేటాయిస్తామని వివరించారు. సీట్లు పొందిన విద్యార్థులు 5 నుంచి 7వ తేదీలోపు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. సాంకేతిక కారణాల రీత్యా ఈ విద్యా సంవత్సరం ఆలస్యమైందని, 5వ తేదీ నుంచే తరగతులు ప్రారంభిస్తున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలను https://apdpharm.nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు.

'ఏపీఈఏపీసెట్' ఫార్మా కోర్సుల్లో తుది సీట్లు కేటాయింపు

ఏపీఈఏపీసెట్–2023లో భాగంగా ఫార్మసీ కోర్సుల్లో ఇంటర్మీడియెట్ బైపీసీ విభాగం నుంచి నిర్దేశించిన ప్రవేశాలకు అనుగుణంగా తుది దశ సీట్లు కేటాయించినట్లు నాగరాణి తెలిపారు. బి–ఫార్మసీ, ఫార్మా–డి, ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో 9,951 మంది ఆప్షన్లు నమోదు చేసుకోగా, 3,345 మంది కొత్తగా సీట్లు పొందారని వివరించారు. ఇప్పటికే తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు తక్షణమే కళాశాలల్లో రిపోర్టు చేయాలని సూచించారు.

క్వాడ్రాంగ్యులర్ సిరీస్ చాంపియన్ భారత్– ఏ

ఫైనల్‌లో భారత్–బి జట్టుపై 66 పరుగులతో విజయం



ఇబ్రహీంపట్నం: అంతర్జాతీయ అండర్–19 క్వాడ్రాంగ్యులర్ క్రికెట్ సిరీస్‌లో భారత్–ఏ జట్టు చాంపియన్‌గా అవతరించింది. ఎన్టీఆర్ జిల్లా మూలపాడులోని డీవీఆర్ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్‌లో భారత్–బి జట్టుపై 66 పరుగుల తేడాతో విజయం సాధించింది. లీగ్ దశలో భారత్–ఏ, భారత్–బి, ఇంగ్లండ్, బంగ్లాదేశ్ జట్లు ఒక్కొక్కటి 6 మ్యాచ్‌లు ఆడగా.. భారత్–ఏ 5, భారత్–బి 3, ఇంగ్లండ్ 3 మ్యాచ్‌లు, బంగ్లాదేశ్ ఒక మ్యాచ్ గెలిచాయి. భారత్–ఏ నేరుగా ఫైనల్‌కు చేరగా.. భారత్–బి జట్టు రన్‌రేట్‌తో ఫైనల్‌కు చేరింది. సోమవారం డీవీఆర్ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్–ఏ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసింది. ముషీర్‌ఖాన్ 47 బంతుల్లో 127 పరుగులు, అర్షిన్ కులకర్ణి 112 బంతుల్లో 100 పరుగులు, ఉదయ్ సహ్రాన్ 87 బంతుల్లో 62 పరుగులతో వీరవిహారం చేయడంతో భారత్–ఏ జట్టు 50 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 359 పరుగులు చేసింది. భారత్–బి బౌలర్ ధనుష్ గౌడ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్–బి జట్టు 48.1 ఓవర్లలోనే 293 పరుగులకు ఆలౌట్ అయ్యి.. 66 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ముషీర్‌ఖాన్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. కాగా, తృతీయ స్థానం కోసం ఇంగ్లండ్, బంగ్లాదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో.. బంగ్లాదేశ్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. భారత్–ఏ జట్టు కెప్టెన్ ఉదయ్ సహ్రాన్‌కు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఏ.రాకేష్, అపెక్స్ కౌన్సిల్ సభ్యులు గీత, జితేంద్రనాథ్ శర్మ క్వాడ్రాంగ్యులర్ సిరీస్ ట్రోఫీ అందజేశారు.

7,442 బీఎస్సీ నర్సింగ్ సీట్ల భర్తీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2023–24 విద్యా సంవత్సరానికి బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్ల భర్తీ ప్రక్రియలో భాగంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సోమవారం మూడో/చివరి విడత కౌన్సెలింగ్ కింద సీట్లను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 7,908 సీట్లకు గాను 7,442 సీట్లు భర్తీ కాగా, 466 సీట్లు మిగిలిపోయాయి. https://ugnursing.ysruhs.com/ వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు సీట్ అలాట్‌మెంట్ లెటర్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇక తమకు సీట్లు కేటాయించిన కళాశాలల్లో విద్యార్థులు ఈ నెల 30వ తేదీ సాయంత్రం నాలుగు గంటల్లోగా రిపోర్ట్ చేయాల్సిందిగా రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి స్పష్టం చేశారు. ఇతర వివరాల కోసం https://drysr.uhsap.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

తెలంగాణ

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ

- పూర్తి స్థాయిలో సన్నద్ధమైన పోలీసు శాఖ
- స్థానిక పోలీసులతోపాటు కేంద్ర బలగాల మోహరింపు
- వివిధ రాష్ట్రాలనుంచి 23,500 మంది హోంగార్డుల రాక

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేలా పోలీసుశాఖ పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. స్థానిక పోలీసులతోపాటు రాష్ట్ర, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ఎన్నికల బందోబస్తు విధుల్లో మోహరించాయి. రాష్ట్ర పోలీసు శాఖ నుంచి 45 వేల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నట్టు పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఎన్నికల బందోబస్తు కోసం రాష్ట్ర పోలీసు శాఖ ప్రతిపాదనలు పంపిన విధంగానే బందోబస్తు విధుల కోసం రెండు విడతల్లో 375 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలను కేటాయించినట్టు ఆయన తెలిపారు. అంతేకాక కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర నుంచి ఐదు వేల మంది చొప్పున, మధ్యప్రదేశ్, తమిళనాడుల నుంచి రెండువేల మంది చొప్పున, ఛత్తీస్‌గఢ్ నుంచి 2,500 మంది కలిపి మొత్తంగా 23,500 మంది హోంగార్డులు రాష్ట్ర ఎన్నికల బందోబస్తు విధుల్లో పాల్గొననున్నారు. ఇప్పటికే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన సిబ్బంది వారికి కేటాయించిన ప్రాంతాలకు చేరుకున్నట్టు ఆ అధికారి వెల్లడించారు. ఇతర రాష్ట్రాల పోలీసులు, హోంగార్డులు పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఉంటుందని, ఇందులో కేంద్ర సాయుధ పోలీసు బలగాలు కీలక విధుల్లో ఉంటాయని ఆయన వివరించారు.

ముమ్మరంగా తనిఖీలు..

రాష్ట్రవ్యాప్తంగా 119 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సాయుధ పోలీసు బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాయి. పోలింగ్‌కు రెండు రోజులే గడువు ఉండటంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు నాయకులు ప్రలోభాల పర్వానికి తెరతీశారని పరిశీలకులు చెపుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా నగదు, మద్యం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ కుట్రలను భగ్నం చేసేందుకు అధికారులు సైతం అదే రీతిన ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారు. స్థానిక పోలీసులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 373 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 374 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు నిఘా పెట్టాయి. 95 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులలో తనిఖీలు ముమ్మరం చేశారు. మరోవైపు సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉండే వ్యాఖ్యలు, ఫొటోలు, వీడియోలపైనా పోలీసులు నిఘా పెడుతున్నారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం మొదలు అన్ని పోలీసు కమిషనరేట్లలో, జిల్లాల ఎస్పీ కార్యాలయాల్లో ఇప్పటికే ప్రారంభించిన సోషల్ మీడియా మానిటరింగ్ సెల్స్ పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయి.

నారాయణప్ప, జయరామ్‌కు కర్మవీర్ చక్ర అవార్డు ప్రదానం



కర్మవీర్ చక్ర అవార్డు అందుకుంటున్న పోలాకి జయరామ్

సాక్షి, అమరావతి/సంతబొమ్మాళి: అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం మల్లాపురానికి చెందిన రైతు ఎం.నారాయణప్ప, శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం రుంకుహనుమంతుపురం గ్రామానికి చెందిన పోలాకి జయరామ్ సోమవారం గ్లోబల్ స్థాయి కర్మవీర్ చక్ర అవార్డులను అందుకున్నారు. నారాయణప్ప ఏటీఎం మోడల్ ద్వారా ఏడాది పొడవునా పంటలు సాగు చేస్తూ ఆదాయం పొందుతూ రైతులకు ఆదర్శంగా నిలిచినందుకు ఈ అవార్డు వరించింది. జయరామ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో లక్షలాది మంది విద్యార్థుల జీవన ప్రమాణాల అభివృద్ధికి కృషి చేసినందుకు గాను అవార్డును సొంతం చేసుకున్నారు. అలాగే కర్మవీర్ చక్ర గ్లోబల్ యూత్ లీడర్స్ ఫెలోగా గుర్తింపు కూడా ఇచ్చారు. న్యూఢిల్లీలోని ఫరీదాబాద్‌లోని శివనాడార్ పాఠశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఐకాంగో (ఇంటర్నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఎన్‌జీవో) వ్యవస్థాపకులు ఈతూ విజ్ చోప్రా చేతుల మీదుగా ఈ అవార్డులను వీరిద్దరు అందుకున్నారు. జయరాం ప్రస్తుతం హైదరాబాద్‌లో ఒక ప్రముఖ ఐటీ కంపెనీలో పనిచేస్తున్నారు.

ఇండియా స్కిల్ కాంపిటీషన్‌కు దరఖాస్తులు

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ స్థాయిలో మీ నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్‌ఎస్‌డీసీ) చక్కటి అవకాశాన్ని కల్పిస్తోంది. ఏపీ ఎస్‌ఎస్‌డీసీ, జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థతో కలిసి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే ఇండియా స్కిల్ కాంపిటీషన్‌లో పాల్గొనడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ ఏడాది 40 విభాగాల్లో నైపుణ్య ప్రదర్శనకు ఏపీఎస్‌ఎస్‌డీసీ అవకాశాన్ని కల్పిస్తోంది. జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో విజేతలు జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు. జాతీయ స్థాయిలో గెలిచినవారు ఫ్రాన్స్‌లోని లియోన్‌లో 2024లో జరిగే అంతర్జాతీయ వేదికలో పాల్గొనే అవకాశం లభిస్తుంది. 2021లో జాతీయ స్థాయిలో 17 పతకాలు సాధించి అయిదవ స్థానంలో నిలిచిన ఏపీ ఈ ఏడాది అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆసక్తిగల యువత డిసెంబర్ 15లోగా https://skilluniverse.apssdc.in/world-skill-registration అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాల్సిందిగా ఏపీఎస్‌ఎస్‌డీసీ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఈ పోటీకి సంబంధించిన పూర్తి వివరాల కోసం ఏపీ ఎస్‌ఎస్‌డీసీ వెబ్‌సైట్‌ను సందర్శించాల్సిందిగా విజ్ఞప్తి చేసింది.

చికెన్ ధర ఢమాల్

- లైవ్ బ్రాయిలర్ కోడి కేజీ రూ.72 మాత్రమే
- స్కిన్ రూ.150, స్కిన్‌లెస్ ధర రూ.175
- కార్తికమాసం ప్రభావం



ఆలమూరు: కార్తిక మాసం, అయ్యప్ప స్వాముల దీక్షల ప్రభావంతో నెల రోజులుగా చికెన్ విక్రయాలు తగ్గిపోయాయి. దీంతో బహిరంగ మార్కెట్‌లో బ్రాయిలర్ చికెన్ ధర గణనీయంగా పడిపోయింది. లైవ్ కోడి ధర రికార్డు స్థాయిలో మూడేళ్ల కనిష్టానికి చేరుకుంది. ఈ పరిణామం కోళ్ల ఉత్పత్తి కంపెనీలు, కోళ్ల రైతులు, వ్యాపారులను తీవ్ర నిరాశకు గురి చేస్తుండగా.. మాంసాహార ప్రియులు మాత్రం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా కోళ్ల ఉత్పత్తిలో రాష్ట్రవ్యాప్తంగా పేరొందిన వివిధ కంపెనీల నుంచి సాధారణంగా ప్రతి రోజూ సుమారు 350 టన్నుల బ్రాయిలర్, లేయర్ కోళ్ల ఎగుమతులు జరుగుతున్నాయి. వాతావరణం సానుకూలంగా ఉండటంతో ఇటీవల కోళ్ల ఉత్పత్తి పెరిగింది. సరిగ్గా ఇదే సమయంలో కార్తిక మాసం ప్రభావంతో చికెన్‌కు ఒక్కసారిగా డిమాండు పడిపోయింది. దీంతో ప్రస్తుతం రోజుకు 200 టన్నుల వరకూ మాత్రమే ఎగుమతులు జరుగుతున్నాయి. సరఫరా తగ్గినా విక్రయాలు లేకపోవడం ధరలు మరింతగా పడిపోవడానికి కారణమైంది. ఫలితంగా చికెన్ దుకాణాలపై ఆధారపడిన చిరు వ్యాపారులు ఆదాయం పడిపోతోందంటూ గగ్గోలు పెడుతున్నారు.

ధర తగ్గినా..

బహిరంగ మార్కెట్‌లో చికెన్ ధరలు భారీగా తగ్గినా ఆ మేరకు విక్రయాలు మాత్రం పెరగడం లేదు. దీనివల్ల హోల్‌సేల్ వ్యాపారులు నెల రోజుల క్రితం కిలో కోడి లైవ్ రూ.132కు విక్రయించగా.. ప్రస్తుతం అది కాస్తా ఏకంగా రూ.62కు పడిపోయింది. రెండు కేజీల బరువు వచ్చే వరకూ కోడిని పెంచితే సరాసరి రూ.210 వరకూ ఖర్చవుతుందని, ప్రస్తుతం ఆ బరువు కలిగిన కోడిని అమ్మితే రూ.84 వరకూ నష్టం వస్తోందని రైతులు వాపోతున్నారు. బహిరంగ మార్కెట్‌లో బ్రాయిలర్ కోడి కేజీ హోల్‌సేల్ ధర రూ.72గా ఉండగా.. చికెన్ కేజీ స్కిన్‌తో రూ.150, స్కిన్‌లెస్ రూ.175 వరకూ విక్రయాలు జరుగుతున్నాయి. ఇదే పరిస్థితి మరో నెల రోజులు కొనసాగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో దాణా ఖర్చు భరించలేక కంపెనీదారులు, రైతులు ఉత్పత్తి అయిన కోళ్లను నష్టమే అయినప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో మార్కెట్‌కు తరలిస్తున్నారు.

డిమాండు తగ్గిపోయింది



బహిరంగ మార్కెట్‌లో మునుపెన్నడూ లేని విధంగా చికెన్‌కు డిమాండు తగ్గిపోయింది. దీనివల్ల మూడేళ్ల కనిష్ట స్థాయికి చికెన్ ధర పడిపోయింది. దీంతో దిగుమతులు తగ్గించుకోవడంతో వ్యాపార లావాదేవీలు సక్రమంగా జరగడం లేదు. కోళ్ల ధర తగ్గడంతో రైతులు, సరఫరాదారులతో పాటు గ్రామీణ చిరు వ్యాపారులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కోళ్ల రైతులు ఏడాది పాటు పడిన కష్టమంతా ఒక్క ఈ నెలలోనే నీరుగారిపోతోంది.

– బొబ్బా వెంకన్న, హోల్‌సేల్ కోళ్ల వ్యాపారి, పెదపళ్ల

పట్టుబడిన లంచావతారాలు

- పాస్ పుస్తకానికి రూ.26 వేల డిమాండ్

కిర్లంపూడి: ఓ రైతు నుంచి లంచం తీసుకుంటూ ఓ వీఆర్‌ఓ ఏసీబీకి పట్టుబడ్డారు. ఆమెతో పాటు కిర్లంపూడి డిప్యూటీ తహసీల్దార్‌ను కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ అడిషనల్ ఎస్పీ సౌజన్య మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. కిర్లంపూడి మండలం సోమరాయణంపేట గ్రామానికి చెందిన బుద్ధ జయ ఆదినారాయణకు పాలెం గ్రామంలో 1.38 సెంట్ల భూమి ఉంది. దీనిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పాస్ పుస్తకం ఇచ్చేందుకు వీఆర్‌ఓ లక్ష్మీదేవి, డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) ఎం.శ్రీనివాసరావు రూ.26 వేల లంచం అడిగారు. తాను అంత మొత్తం చెల్లించుకోలేనని ఆదినారాయణ చెప్పాడు. అయినప్పటికీ ఇవ్వాల్సిందేనని డీటీ, వీఆర్‌ఓ డిమాండ్ చేశారు. దీంతో బాధిత రైతు స్పందన కాల్ సెంటర్ ద్వారా రాజమహేంద్రవరం ఏసీబీ అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లాడు. వారి సూచన మేరకు పాలెం సచివాలయంలో వీఆర్‌ఓ లక్ష్మీదేవికి ఆదినారాయణ సోమవారం డబ్బులు అందజేశాడు. అదే సమయంలో ఏసీబీ అధికారులు ఒక్కసారిగా దాడి చేసి, వీఆర్‌ఓను డబ్బులతో సహా అదుపులోకి తీసుకున్నారు.

లైంగిక దాడి కేసులో జీవిత ఖైదు

మరో సెక్షన్‌లో 20 ఏళ్ల జైలు శిక్ష

కాకినాడ లీగల్: ఐదున్నరేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి జైలుశిక్ష, రూ.3,500 జరిమానా విధిస్తూ కాకినాడ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కాకినాడ జగన్నాథపురం ముత్తా నగర్‌కు చెందిన యువకుడు తాడి ప్రభు అలియాస్ చిన్న అలియాస్ దొంగ చిన్న 2020 నవంబర్ 25వ తేదీ రాత్రి మద్యం తాగి, గోలీలపేటలోని ఓ ఇంట్లోకి దొంగతనానికి వెళ్లాడు. ఆ ఇంట్లో సెల్‌ఫోన్ దొంగిలించి, అక్కడ నిద్రిస్తున్న బాలికను యాళ్లవారిగరువు బరియల్ గ్రౌండ్‌కు తీసుకువెళ్లి, లైంగిక దాడికి ఒడిగట్టాడు. దీనిపై బాలిక తల్లి కె.కాంతమ్మ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోర్టు విచారణలో తాడి ప్రభుపై నేరం రుజువు కావడంతో లైంగిక దాడికి పాల్పడినందుకు పోక్సో చట్టం ప్రకారం జీవిత ఖైదు, రూ.1,000 జరిమానా, లైంగిక దాడిలో గాయపరచినందుకు 20 ఏళ్ల జైలు, రూ.1,000 జరిమానా, బాలికను కిడ్నాప్ చేసినందుకు ఐపీసీ 366 ప్రకారం పదేళ్ల జైలు, రూ.500 జరిమానా, సాక్ష్యాధారాలు తారుమారు చేసినందుకు మూడేళ్ల జైలు, రూ.500 జరిమానా, సెల్‌ఫోన్ దొంగిలించినందుకు ఏడాది జైలు, రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఐదు సెక్షన్లకు ఏకకాలంలో జైలుశిక్ష అమలు చేయాలని పేర్కొన్నారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పితాని శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh- 201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943